# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక మార్చి, 2015 ₹ 25



దిల్వారా ఆలయం
గంధర్వులు

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

***- Dammapada.***

**సంపుటి 25 మార్చి 2015 సంచిక 3**

*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*

కాండ్రేగుల నాగేశ్వరరావు

*సాంకేతిక సహాయకులు*

పడవల ఉమాశంకర్, చేపూరి రమేష్,

మహమ్మద్ కుద్రాముద్దీన్ జీ షాన్, వెల్దండ రమేష్,

వేముల రాణి, సారిక నిర్మల,

నీలకంఠం నరసరాజు

*సంస్థాపక సంపాదకులు*

**రవీంద్రనాథ్ ఆలపాటి**

*Printed & Published by*

**Bapanna Alapati**

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in

www.misimimonthly.com

e-magazine : www.kinige.com/misimi

| | |
|---|---|
| ప్రతి : ₹ 25 | సంవత్సరానికి : ₹300 |
| విదేశాలకు ప్రతి : $ 2.50 | సంవత్సరానికి : $ 25 |

(Library of Congress Control Number)

LCCN 91-903060


# ఈ నెల...


కమ్మతెమ్మెరలు ............ 5

త్యాగరాజ స్వామి ............ 7
- *మోదుగుల రవికృష్ణ*

హరప్పా – యుగం ............ 14
- *సాయి పాపినేని, జయశ్రీ నాయని*

కాత్యాయనీ విద్మహే ............ 20
- *ప్రొ. రావినూతల సత్యనారాయణ*

నృత్యకళ ............ 28
- *డా॥ పోణంగి శ్రీరామ అప్పారావు*

జపాకుసుమం – జపాన్ ............ 32
- *గొల్లపూడి మారుతీరావు*

రమణీయ విషాద హృదయం దిలీప్ కుమార్ ............ 37
- ఎన్నార్కె

సామెతల్లో వ్యవసాయం ............ 43
- *ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు*

తిలక్ పద్యకావ్యం : మండోదరి ............ 49
- *శ్రీపాద కృష్ణమూర్తి*

వెన్నపూస వంటి కన్నెగంటి కథలు ............ 52
- *డాక్టర్ దిలావర్*

అన్నీ కాదన్న జ్ఞాని ............ 58
- *మిసిమి పాఠకుడు*

తెలుగులో 'కాలమ్'లు ............ 63
- *వంకాయల లావణ్య*

తమంత తామయి వలచి వచ్చిన... ............ 69
- *శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి*

*ఇందూరు* సీమ చారిత్రక వైభవం ............ 73
- *కొసరాజు వెంకటేశ్వర రావు*

తూర్పు యూరప్ కవిత్వం ............ 78
- *ముకుంద రామారావు*

సూఫీ బాబా సైకిల్ యాత్ర ............ 88
- *కొల్లూరి సోమ శంకర్*

యోగ విద్యా రహస్య వేది – రాళ్ళపల్లి ............ 91
- *నందవరం కేశవరెడ్డి*

నెత్తుటి జల్లు రంగవల్లి ............ 94
- *రమణ వెన్నకంటి*

అరసం వారి కథాస్రవంతి ............ 95
- *ఎన్నార్కె*

పుస్తక పరిచయం ............ 96


*ముఖచిత్రం* : వయసు బరువు చిత్రకారుడు – చలసాని రవీంద్ర

*రెండవ అట్ట* : దిల్వారా గంధర్వులు | అబూ పర్వతంపై

*మూడవ అట్ట* : దిల్వారా గుమ్మటం | దిల్వారా జైనాలయం

*నాల్గవ అట్ట* : మనసు తేలిక చిత్రకారుడు – చలసాని రవీంద్ర


*వివరాలు 50వ పుటలో...*

ఆకెళ్ల మల్లిఖార్జున శర్మ గారు ఒక కథ చెప్తుంటారు. త్యాగరాజస్వామి ఉత్సవాలు ఉధృతంగా జరుగుతాయి, తంజావూరుకు దగ్గర్లో ప్రతి సంవత్సరం. సంగీత ప్రియులను చేరవేయటానికి పబ్లిక్, ప్రైవేట్ బస్సులు బారులు కట్టి వెళ్తుంటాయి. అందరినీ దింపి తిరిగి వచ్చే బస్సులు పూర్తిగా ఖాళీగా వుంటాయి. అలాంటి సమయంలో ఒక బస్సులో ఒక వ్యక్తి వుంటారు. ఆ బస్సు చోదకుడు అందరూ త్యాగరాజస్వామి ఉత్సవాలకు వెళ్తుంటే, మీరేమిటి ఉండకుండా వెళ్ళిపోతున్నారు? అని సందేహం వెలిబుచ్చాడు. 'ఆ త్యాగ రాజును నేనేనయ్యా' అంటారాయన – అలా వుంటుంది సంగీతం తిరునాళ్ళు.

మాలాంటి వాళ్లు ఈ కథ వినక ముందు – ఈ శాస్త్రీయ సంగీతం మనకు తెలియదు – అది మన అజ్ఞానం అనుకుని సరిపుచ్చుకునే వాళ్ళం– స్వర జ్ఞానం మనకు అబ్బదులే అని బాధపడేవాళ్లం. కాని శ్రావ్యమైన సంగీతం వినటానికి ఏలాంటి జ్ఞానం అవసరం లేదని – కోయిల స్వరమే సాక్షి– (మిసిమి, జూన్ 1998) అంతేనా – మేము ఎన్నో, సింఫనీలు – వయోలినీ కన్సర్టులూ, జూబిన్ మెహతా కచ్చేరీలు విన్నాం. చూశాం. (సి.డి.లు, యూట్యూబ్, టి.వి లో) ఎంతో ఆస్వాదించాం. అందులో మొజార్ట్, బిథోవెన్ సింఫనీలు, సారా చాంగ్ వయొలిన్ సోలోలు మమ్మల్ని మరింతగా ఆకర్షించి, ఆనందపరిచాయి. అలాగే అర్థం కాకపోయినా – ఒపేరా సంగీతం – పావరొటి (ఇటాలియన్) విషాదం కదిలించి వేసింది. అంతేనా, మంగళంపల్లి వారు ఆలపించిన జయదేవుని అష్టపది "...తవవిరహే... రాధికా... కృష్ణా..." ఆ కంఠస్వరంలో ఆర్తి హృదయాన్ని ద్రవింప జేసింది కదా!

మరి మన శాస్త్రీయ సంగీతం సామాన్యులకు చేరదా? అదే మొదలు – అదే మధ్యమం – అదే మంగళం – ముఖ్యంగా పురుషుల కర్ణకఠోర కంఠస్వరాలు ఎలా వినాలి? ఇదీ మా అజ్ఞానానికి శిక్షా? త్యాగరాజస్వామి ఏమంటారు?

ఇదికాక – మన దురదృష్టం, మనకు సంగీతం అంటే – సినిమా సంగీతమే స్థిరపడిపోయింది. ఇప్పుడు టి.వి. ఛానళ్ళు పుణ్యమా అని అరిగిపోయిన రికార్డులనే తిరిగి తిరిగి పాడుతున్నారు తియ్యగా – ఇదేమి సంగీతం, ఇదేమి సాహిత్యం? (ఇదే అంటున్నారు జడ్జీలు) ఒక్కరి కంఠస్వరం గుర్తుపట్టలేము. రఫీ, ముఖేష్, సైగల్, హేమంత్, ఘంటసాల, ఏ.ఎమ్. రాజా, ఎందరి పేర్లయినా చెప్పండి – ఎప్పుడు విన్నా ఎవరి గొంతో చెప్పగలం కదా! మరి ఆ 'వ్యక్తిత్వం', ఆ 'ఉద్వేగం' ఇప్పటి కుర్రాళ్ల స్వరాల్లో లేక పోవటమేమిటి? అంటే వీరు కేవలం మిమిక్రీ చేస్తున్నారా?



మరి త్యాగరాజస్వామి ఊరువదిలి వెళ్ళిపోడా...? వేల వీణలు వినలేక!

**– సంపాదకులు**

# కమ్మతెమ్మెరలు

✶ "... శ్రమించి సేకరించి ప్రయోజనాత్మక సమాచారాన్ని పాఠకలోకానికి అందించడం మాన్యుల మహోన్నత సేవలు మననకు తెచ్చుకోడం, పదుగురుకు పంచడం ఓ అనుభూతి, ఒక గొప్ప కర్తవ్య బాధ్యత కూడ...
... అవంత్స సోమసుందరంగారు తమ సాహితీ జీవితానికి చుక్కానిగాను, తమకు చిరస్మరణీయులుగాను, తమ దశాబ్దాల విజయపరంపరకు మూలకారకులుగాను మహనీయులు ఆలపాటి రవీంద్రనాథ్‌గారేయని చాటుకున్నారు. రవీంద్రనాథ్‌గారు ఎన్నో జీవితాలను వెలిగించారు. మరెన్నో జీవితాలను అద్దరికి చేర్చిన నౌక...
... ఆచార్య ఎండ్లూరి సుధాకర్‌గారు తమ స్మృతిపథంలో నుండి ఆళ్వారు స్వామిగారి రూపచిత్రాన్ని, సేవాహృదయాన్ని సాహిత్య సేవ, వ్యక్తిత్వము మహోపకారాలు, స్నేహబంధాలు, ఆత్మీయ పరిచయాలు, మరెన్నో సంక్షిప్తతతో సమగ్రంగా ఆవిష్కరించడంలో కృతకృత్యులయ్యారు... సమయానుకూలంగా వెలువరించిన రావిపూడి వెంకటాద్రిగారి వ్యాసంపై దృష్టి సారించవలసిన అవసరం కనబడుతుంది... ప్రముఖ చిత్రకారులు వాసుదేవ కామత్‌గారి పలుకులు విన్నాం, వారి దివ్య కుంచె నుండి జాలువారిని అద్భుత అపురూప చిత్రకళా ఖండాలు చూశాం. అవి కళాజ్యోతి సుపుత్రిక ***మిసిమి***కి 2015 సంవత్సరపు చిత్రకళా సుమాంజలులు, శుభాకాంక్షలు కాగలవు..."

**– బండి ప్రసాదరావు,** పొడగట్లపల్లి.

✶ "... ***మిసిమి*** జనవరి 2015 సంచిక చదివి ఆనందించాను. *ఉన్నత విద్యారంగంలో నాటకరంగ శిక్షణ* చాట్ల శ్రీరాములుగారి వ్యాసం బావుంది. బళ్ళారి రాఘవ, కె.వి. గోపాలస్వామి, ఎ.ఆర్. కృష్ణ నాటక రంగ నిష్ణాతుల కృషిని తెలుగు నాటకాభిమానులందరూ తప్పక గుర్తుంచుకోవాలి... ఉన్నత విద్యారంగంలో థియేటర్ ఆర్ట్స్ పక్షాన జరిగిన కృషిని సమీక్షించారు, చాల సంతోషం... గొప్ప నాటక దర్శకులు ఉద్యోగ విరమణ తర్వాత నాలుగు విశ్వవిద్యాలయాలు బోసిపోయి, చైతన్య రహితంగా వున్నాయి... చాట్ల శ్రీరాములు, మొదలి నాగభూషణం శర్మ మొదలైన అనుభవజ్ఞులతో ఒక సలహా మండలిని ఏర్పరచి, విశ్వవిద్యాలయాల థియేటర్ ఆర్ట్స్ విభాగాలకు జీవం కల్పించాలి... చాట్ల శ్రీరాములు, మొదలి నాగభూషణ శర్మలను పద్మభూషణ్ పుస్కారాలతో గౌరవిస్తే బాగుంటుందని నాటకాభిమానిగా నా కోరిక... నవ్యాంధ్ర ప్రదేశ్‌లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో తప్ప మరెక్కడా థియేటర్ ఆర్ట్స్ విభాగం లేదు... ఆచార్య నాగార్జున, శ్రీ వెంకటేశ్వర యోగి వేమన, శ్రీ కృష్ణదేవరాయ విశ్వ విద్యాలయాల్లో థియేటర్ ఆర్ట్స్ విభాగాలను ఏర్పరచాలి. ఇది నవ్యాంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ బాధ్యత..."



**– కడియాల రామమోహన రాయ్,** గుంటూరు.

✶ "...పురస్కార సాహిత్యం, బాలసాహిత్య పురస్కారాలు, ***మిసిమి*** ఫిబ్రవరి 2015 సంచికలో ప్రొ॥ రావినూతల సత్యనారాయణగారి రచన చాలా వివరంగా చాల సాహిత్యం గూర్చి, పురస్కారాలు పొందిన వారి గురించి, సాహిత్యంలో అందెవేసిన చింతా దీక్షితులు గూర్చి వ్రాశారు. కాని ఎందువలననో 1947–1948లో రేపల్లె హైస్కూలులో నాతోటి విద్యార్థి బాలసాహిత్యంలో బాగా కృషి చేసిన కవులూరి వెంకటేశ్వరరావు గారిని (కవిరావు) గూర్చి వ్రాయలేదు. ఆయన ఎస్.యల్.సి. లో 1947 –48లో నాతో పాటు రేపల్లె బోర్డు హైస్కూల్లో చదివారు. *చందమామ* పత్రికలో బాలురకు చాలా చక్కటి సాహిత్యం వ్రాశారు. అపుడు మా తెలుగు పంతులుగారు బోడే పూడి వెంకట్రావు ఆయన్ని తెగమెచ్చుకొనే వారు. ఆయనతో పాటుగా వేజెండ్ల సాంబశివరావు, గుంటూరు జిల్లా చిన మట్లపూడి గ్రామ వాస్తవ్యులు. వారిద్దరూ కాకుండా ఉత్పల సత్యనారాయణ (గుంటూరు జిల్లా యాజలి గ్రామవాస్తవ్యులు) చివరకు సికింద్రాబాదులో నివసించారు. వారు కూడా చాలా గేయాలు *బొమ్మరిల్లు, చందమామ*లో బాల సాహిత్యం సృష్టించారు. ఇంత మందిని స్పృశించిన వారు వీరిని గూర్చి రాయలేదు. కారణం తెలియదు. బహుశా వారిని గూర్చిన వివరాలు అందలేదేమో వారికి అని అనుకుంటున్నాను... *ప్రవాసం, చత్తీస్‌గఢ్‌లో తెలుగువారు* – ఎల్ రుద్రమూర్తి గారి రచన, భిలాయి గూర్చి విపులంగా వ్రాశారు. ఒక మాజీ భిలాయి ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యోగిగా చాలా సంతోషం. అయితే వారు 1958 నుంచి 1962 ఆఖరు వరకు జరిగిన తెలుగు భాషా ఉద్యమం గూర్చి వివరంగా రాయనందువల్ల నాకు తెలిసిన విషయాలు తెలియపరుస్తున్నాను. 1958 మొదట నుంచి అక్కడ నేను పనిచేశాను. సెక్షన్ 1లో స్ట్రీట్ నెం. 5, 9–ఎ లో వుండేవాడిని. మొదట బ్లాస్ట్ పర్నెస్ పనిచేసేవాడిని. మేమున్న 9–ఎ ని, తెలుగు వారి సత్రమనేవారు. ఆరోజుల్లో

తెలుగు *సాహితీసమితి* అని ప్రారంభించాము. పీశుపాటి నరసింహామూర్తిగారితో తెలుగు సాహితీ సమితి కోసం పుస్తకాలు కొందామని 4 నాటకాలు వేయించాము. ఆ రోజుల్లో 10 వేల రూపాయలు సంపాదించి ఒక గ్రంథాలయం స్థాపించాము. పి.యస్. రావుగారు భిలాయి ఉక్కు ఫ్యాక్టరీలో ఎఫ్.ఏ.సి.ఏ.ఒ గా వుండేవారు. వారు ఎంతో సహాయం చేశారు. వేణుగోపాలరావుగారు సెక్రటరీగా వుండేవారు. తర్వాత వారు హైద్రాబాదులో ఎ.పి.ఆర్.టి.సి కి ఛీఫ్ ఇంజనీర్‌గా వచ్చారు. తిలక్ గారిని సర్వేలో పని చేసేవారు. వారు కాకుండా చిత్తరంజన్ గారు కె.ఆర్.కె. మూర్తిగారు, వారు రాసిన తాతా అప్పారావుగారు, జి.వి. కామేశ్వరరావుగారు కృష్ణా జిల్లా వుయ్యూరు వాస్తవ్యులు. చెన్నై గిండీలో బి.ఇ. చదివిన డేవిడ్ రాజు గారు. ఇలా పలువురు *ఆంధ్ర సాహితీ సమితి* స్థాపనకు కృషి చేశారు. ఆరోజుల్లో అప్పారావుగారని విజయనగరంలో వుండేవారు. నేను, శాస్త్రిగారు, శర్మగారు, మహా బీర్ సింగ్ పి.వి. రావు గారు కలిసి దొంగ వీరడు అనే నాటకాన్ని ప్రదర్శించి బాగా రక్తి కట్టించాము... జి.వి. కామేశ్వరరావుగారు విశాఖ ఉక్కు కర్మాగారానికి వచ్చి అక్కడ రిటైర్ అయినారు. విజయనగరం, శ్రీకాకుళం నుంచి వచ్చిన వారు భిలాయ్ రైల్వేలో చాలా మంది పనిచేసేవారు. బహుశా రుద్రమూర్తిగారికి 1958 విషయం తెలియక రాయలేదమోనని వ్రాసిపంపుతున్నాను. రుద్రమూర్తిగారికి నా నమస్సులు. ఇంత విపులంగా భిలాయి గూర్చి వ్రాసినందుకు..."

**– పెన్మెత్స హరిశ్చంద్ర రాజు,** హైదరాబాదు.

✶ "... ఫిబ్రవరి నెల ***మిసిమి*** మాసపత్రిక అట్టమీది బొమ్మ ఛాయా చిత్రంగా భ్రమింప చేసింది. అంత సహజ సిద్ధంగా అందంగా వుంది. చిత్రించిన బొమ్మ అంటే నమ్మశక్యంగా లేదు... ఉత్తరాలలో చాట్ల శ్రీరాములుగారి ఎమ్.ఆర్. అప్పారావుగారి విషయంలో దొర్లిన తప్పును వి.ఎ.కె. రంగారావు సాధికార వివరణ, సవరణ సహృదయంతో ఎత్తి చూపారు. రంగారావుగారు బహుముఖ ప్రజ్ఞావంతులు. సాహిత్యం, సంగీతం, సినీ రంగాలకు సంబంధించిన విషయాలలో తప్పులను సవరణలను చేయడంలో వారికి అమిత శ్రద్ధ... *చరిత్రలో మహాభారతం* వ్యాసంలో భారతం కాల నిర్ణయం పై వ్యాసం, *బాల సాహిత్య పురస్కారాలు,* బాలల పత్రికల వివరాలు, బాల సాహిత్యం, అవసరాన్ని గుర్తు చేస్తూ వచ్చిన వ్యాసం, *సినిమాలో స్త్రీ, తెలుగు సాంఘిక సినిమాలో స్త్రీ* వ్యాసం పరిశోధనా వ్యాసాల స్థాయిలో ఉన్నవి. ఆయా రచయితలు శ్రమించి పొందుపరిచారు... *ఎరుకల జానపద వైద్యం* వ్యాసంలో గృహ చికిత్సకు ఉపకరించే ఎన్నో చిట్కాలు ఎన్నో ఉన్నాయి... గొల్లపూడి వారి వ్యాసంలో రచనలపై సమీక్ష, విమర్శ సద్విమర్శ, దుర్విమర్శలను స్వీయ అనుభవంతో సోదాహరణంగా వివరించారు... ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలో తెలుగు జనాభా చెప్పుకో దగ్గంత ఉన్నప్పటికి ఒకప్పుడు తెలుగు మాధ్యమ పాఠశాలలు సంఖ్య ఆ ప్రభుత్వం నిర్లక్ష్యంతో క్రమేపి తగ్గిపోవడం, ఆంధ్ర ప్రభుత్వం పట్టించుకొనక పోవడం ఒక హెచ్చరిక, దురదృష్టం... *సి.యస్.రావు* గారి సినిమా రంగ అనుభవాలు, తెరవెనుక విశేషాలు ఒక ఆసక్తికర వ్యాసం..."



**– బొల్లోజు బసవరాజు,** కాకినాడ.

✶ "... ఫిబ్రవరి, 2015 సంచికలో కొన్ని అమూల్యమైన వ్యాసాలు నన్ను మరింతగా ఆకట్టుకున్నాయి. *సాహిత్యంలో విమర్శ* పాత్ర గురించి గొల్లపూడి మారుతీరావు గారి వ్యాసం ఎంతో విజ్ఞాన దాయకంగా ఉంది. ఎందరో సమీక్షకులకూ, విమర్శకులకూ, పుస్తకాలకు ముందు మాటలు రాసేవారికీ, పుస్తకావిష్కరణ సభల్లో వేదిక మీద నుంచి ఆ పుస్తకాలను పరిచయం చేసే వారికీ ఎంతో మార్గదర్శకంగా ఉంది. కొందరిని మేల్కొల్పేటట్లుగా, కొందరు భుజాలు తడుముకునేటట్లుగా స్పష్టంగా రాయడం బావుంది... ఆంగ్ల, ఆంధ్ర భాషల్లో నిష్ణాతులైన, మృదుస్వభావులైన సి.సుబ్బారావుగారిని ఆయన అభిమానులు ఎప్పుడూ స్మరించుకునేటట్లుగా ఉన్నాయి. కీ.శే. వెలగా వెంకటప్పయ్య గారికి నా జోహార్లు. పుస్తక పఠనం విలువని అన్ని తరాల వారూ గ్రహించి గౌరవిస్తారనీ, *గ్రంథాలయ దీపిక* ఎన్నటికీ ఆరిపోకూడదనీ ఆశిస్తున్నాను. స్మృత్యంజలి ఘటించిన గుడిపూడి సుబ్బారావుగారికి కృతజ్ఞతలు...

... *పూషా* పేరుతో రజనిగారు 1940ల్లో రచించిన వచన కవితల సంపుటి *ఏటికి ఎదురీత* 1999లో మొదటిసారి ప్రచురించే అవకాశం *అబ్బూరి ట్రస్ట్‌*కి లభించడం ఒక అదృష్టం. (అబ్బూరి ట్రస్ట్ ఇప్పుడు లేదు.) *శతవసంతాల రజని* గారికి హృదయపూర్వక అభినందనలు. కళాప్రపూర్ణ బాలాంత్రపు రజనీకాంతరావుగారి బహుముఖ వికాసాన్ని ఆవిష్కరించిన ఇంద్రగంటి శ్రీకాంతశర్మ గారికి అభినందనలు! ***మిసిమి*** కి కృతజ్ఞతలు!..."

**– అబ్బూరి ఛాయాదేవి,** హైదరాబాదు.



# త్యాగరాజస్వామి

*- మోదుగుల రవికృష్ణ*

**త్యా**గరాజస్వామి వారు తిథులప్రకారం సర్వజిత్ నామ సంవత్సర పుష్యమీ నక్షత్ర యుక్త వైశాఖశుద్ధ షష్ఠి సోమవారంనాడు జననమొంది (భావరాజు వేంకట కృష్ణారావు పంతులు, వ్యయనామ సంవత్సర ఆంధ్రపత్రిక ఉగాది సంచిక) పరాభవనామ సంవత్సర పుష్య బహుళ పంచమినాడు కైవల్యం పొందారు.

త్యాగరాజస్వామి వారిని సంగీత ప్రపంచం ఎంతో గౌరవ ప్రపత్తులతో 'అయ్యవారు' అని సంబోధిస్తున్నది. అయ్యవారి పూర్వులు కాకర్ల గ్రామవాసులు. కాకర్ల నేటి ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలంలోని గ్రామం. కంభంనుండి 8 కిలోమీటర్ల దూరం. (మరి కొన్నాళ్లకు ఈ గ్రామం కనుమరుగు కానున్నది. సమీపంలో నిర్మిస్తున్న వెలిగొండ రిజర్వాయరు కారణంగా సీపేజి వాటర్ వచ్చి గ్రామం నివాసయోగ్యం కాకుండా పోతుంది. అందువలన గ్రామస్థులు ప్రస్తుత గ్రామానికి రెండు కిలోమీటర్ల ముందుకు జరుగనున్నారు.) ఆ గ్రామంలోగల ఒక పాటిమట్టి దిబ్బ స్థలాన్ని అయ్యవారి పూర్వీకుల గృహం ఉన్న ప్రాంతంగా గ్రామస్థులు చెబుతుంటారు. 1600 ప్రాంతంలో అయ్యవారి ముత్తాత పంచనద బ్రహ్మం తంజావూరు మండలంలోని తిరువారూరికి వలస వచ్చారని పరంపరగా వినవస్తున్న కథనం. తిరువారూరికి మూలాధార క్షేత్రమని మరొక పేరు కూడా ఉంది. ఈ క్షేత్రంలో వెలసిన స్వామివారి పేరు శ్రీ త్యాగరాజస్వామి. ఈ క్షేత్రానికి సమీప ప్రాంతంలోని మరొక క్షేత్రం తిరువయ్యారు లేదా తిరువైయారు. దీనికే పంచనద పురమని సంస్కృతంలో పేరు. ఈ క్షేత్రంలో కొల్లడం (వడవాఱు అని కూడా వాడుక) కావేరి, కొడమురుట్టి, వెట్టారు, వెణ్ణారు అనే అయిదు నదులు ప్రవహిస్తుండటం వలన అయిదు ఏరులు అనే అర్థం వచ్చే విధంగా ద్రావిడంలో 'ఐయ్యారు' అనే పేరు కలిగి అదే క్రమంగా 'అయ్యారు' అయింది. పవిత్ర క్షేత్రాలను 'తిరు' గౌరవ వాచకంతో పిలిచే ద్రావిడ సంప్రదాయం ప్రకారం తిరువైయారు అయినది. ఈ క్షేత్రంలో వెలసిన స్వామి పంచనదీశ్వరుడు. కాకర్ల ప్రాంతంలో ఉండే పంచనద బ్రహ్మం తండ్రి తన కుమారునికి ఆ పేరు పెట్టే అవకాశం అట్టే ఉండదు. అందువలన అనుశ్రుతంగా వినవస్తున్నట్లు పంచనదబ్రహ్మంగారే కాక వారి తండ్రిగారో లేక తాతగారో తిరువారూరు వలస వచ్చి ఉండాలి.

అయ్యవారు ఆరువేల నియోగులు. వారి పూర్వీకులు తంజ మండలానికి వలస వచ్చిన తరువాత ములికినాటి శాఖ వారితో సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకొని ఈ శాఖీయులుగానే తదనంతర కాలంలో స్థిరపడ్డారు. భారద్వాజస గోత్రీయులు. ఆపస్తంభ సూత్రులు. పాత చరిత్రను కొంత పరిశీలించి చూస్తే ఒంగోలు చుట్టు ప్రక్కల కొన్ని ప్రాంతాలు సంగీత కళకు రామభక్తికి ఆలవాలాలు. కాకర్లకు రాక పూర్వం అయ్యవారి పూర్వీకులది ధేనువకొండ ప్రాంతం. ధేనువకొండ నుండి కాకర్లకు వలస వచ్చినపుడు సంగీతాన్ని, రామభక్తిని కూడా తీసుకువచ్చారు.

రామబ్రహ్మంకు అయ్యవారికి ముందే ఇద్దరు కుమారులు కలిగారు. వారి పేర్లు జపేశయ్య, రామనాథం. వీరి వలన తండ్రికి "పుత్రోత్సాహం" ఏమీ కలుగలేదు. వారి చేతలతో ఖేద మనస్కుడైన తండ్రి త్యాగరాజస్వామి వారిని ప్రార్థించి వరప్రభావంతో పుత్రుని పొందారు. అన్నలవలే కాక తమ్ముడు త్యాగబ్రహ్మం సద్గుణపుంజమై భాసిల్లారు.

అయ్యవారి పూర్వీకులు రాజాస్థానంతో దగ్గరి సంబంధాలు కలవారని ఒక ప్రతీతి ఉన్నది. అయ్యవారి తాతగారు గిరిరాజ బ్రహ్మం శాహజీ ఆస్థానకవి అని అయ్యవారి చరిత్ర రాసేవారు పలు సందర్భాలలో ఉటంకించారు.

కాని గిరిరాజ బ్రహ్మం శాహాజీ ఆస్థాన కవి కాదని, శాహాజీ ఆస్థానకవి లోహితస గోత్రీయుడైన దర్భా గిరిరాజ

కవి అని, నామసామ్యం చేత దర్భా గిరిరాజకవినే అయ్యవారి పితామహునిగా తదనంతర విమర్శకులు, పరిశోధకులు పొరబడ్డారని ఆరుద్రగారు గ్రంథస్థం చేశారు.

సుబ్బరామ దీక్షితులవారి సంగీత సంప్రదాయ ప్రదర్శనిలో అయ్యవారి తాతగారి గురించి "సంస్కృతాంధ్ర భాషలలో మిక్కిలి ప్రజ్ఞ కలవాడు. సంగీత విద్యాసంపన్నుడు. తెలుగున భక్తి ప్రధానముగాను వేదాంత విషయముగాను బహు కీర్తనముల జేసి ప్రఖ్యాతిని బొందినవాడు" అని రాశారు. "మాయా నీ వంచన నడువదు! మాటాడక పోవే" అనే కాంభోజి రాగ వేదాంత కీర్తనను స్వరంతో కూడ ప్రకటించాడు. అంతేకాని రాజాశ్రయం గురించి ఏమీ చెప్పలేదు. అయ్యవారి శిష్యులు రాసిన అయ్యవారి జీవిత చరిత్రలో సుబ్బరామదీక్షితుల మాదిరిగానే గిరిరాజకవి ప్రసక్తి ఉందికాని, అందులోనూ రాజాశ్రయ ప్రస్తావన లేదు. పరిశోధకులు ప్రకటించిన పదకవుల, యక్షగాన కవుల చిట్టాలలో కూడా దర్భా గిరిరాజకవే కనబడుతున్నారు. కానీ కాకర్ల గిరిరాజకవి కనబడటంలేదు. అందువలన అనేక విషయాల వలే గిరిరాజకవి ఆస్థాని అవునా? కాదా? అన్న విషయం కూడా సంశయగ్రస్తమే.

గిరిరాజ బ్రహ్మం గారి కుమారుడు రామబ్రహ్మం మాత్రం రాజాదరణ పొందినవారే. ఆయన వినయశీలుడైన చిన్న కొడుకునే తన వెంట పెట్టుకొని పెద్దల వద్దకు, రాజాస్థానానికి వెళ్లేవారు. బాల్యదశలో అయ్యవారిని తండ్రిగారి సంగీత సుధాభరితమైన వాల్మీకి రామాయణ పఠనము, ఆస్థాన విద్వాంసుల గానకళా వైదుష్యం అమితంగా ఆకర్షించాయి. సాహిత్య చరిత్రకారుల ప్రకారం తంజావూరి నాయక రాజుల కాలం, మహారాష్ట్ర ప్రభువుల కాలం సాహిత్యానికి క్షీణయుగం. కానీ సంగీతానికి స్వర్ణ యుగం. తంజావూరు వూరువూరంతా సంగీత విద్వాంసుల మయంగా ఉండేది. రెండవ తులజాజీ ఆస్థానంలో 360 మంది సంగీత విద్వాంసులు ఆస్థాన గాయకులుగా ఉండే వారట. ఈ పరిస్థితులలో మెలిగిన అయ్యవారికి రామభక్తి, సంగీతమూ తప్ప అన్యం తెలియలేదంటే ఆశ్చర్యమేమీ లేదు.

అయ్యవారు వాల్మీకి రామాయణంలోగల 24,000 శ్లోకాలకు సమానంగా 24,000 కీర్తనలు చెప్పారని వాడుకలో ఉంది కానీ దొరుకుతున్నది 800 లోపు కీర్తనలే. శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు త్యాగరాజ *గేయార్థ కుంచిక* అనే పేరుతో, మహామహోపాధ్యాయ డాక్టర్ నూకల చిన్న సత్యనారాయణ *త్యాగరాజు సారస్వత సర్వస్వం* పేరుతో అయ్యవారి కృతులన్నింటిని భావార్థ వివరణలతో ప్రచురించారు. అయ్యవారి కృతుల సంఖ్యను విద్వాంసులు వివిధ రకాలుగా ఇచ్చారు.

| | | |
|---|---|---|
| **మంచాళ జగన్నాథరావు** | **-** | **711** |
| **కృష్ణమాచార్యులు** | **-** | **655** |
| **నూకల చిన్న సత్యనారాయణ** | **-** | **692** |
| **గోటేటి గౌరీ సరస్వతి** | **-** | **712** |

నారద పంచరత్నాలలో ఒకటైన కానడ రాగంలోని "శ్రీ నారదనాద సరసీరుహ భృంగ" అనే కీర్తన, ఎంతో ప్రచారంలో గల 'విడెము సేయవే' అనే ఖరహరప్రియ రాగ కృతి కృష్ణమాచార్యులవారి గ్రంథంలో చోటుచేసుకోక పోవడం ఆశ్చర్యకరం.

అయ్యవారి బాణీలోనే కొందరు కృతులు రాసి, అయ్యవారి ముద్రతో వారివిగానే 20 పైగా కీర్తనలు ప్రచారంలోకి తెచ్చారు. వారిలో ప్రసిద్ధ గాయకుడు టైగర్ వరదాచారి తమ్ముడు శ్రీనివాసాచారి ఒకరు. గానమూర్తి రాగంలోని ''గానమూర్తే'', కనకాంగి రాగంలోని "శ్రీగణనాథం భజామ్యహం", హరికాంభోజి రాగంలోని "రారా ఫణిశయన", "వినతాసుత వాహనుడై", సురటి రాగంలోని "పరాజ్ముఖమేలరా" ఆ 20 కీర్తనలలో కొన్ని. అయ్యగారు కూర్చుకొన్న వర్ణమెట్టుకు సాహిత్యం మాత్రమే తదనంతర కాలంలో సమకూర్చారని, అందువలనే అవి అచ్చు అయ్యవారి బాణిలోనే ఉన్నాయని కొందరు సంగీత వేత్తల అభిప్రాయం. మంచాళ జగన్నాథరావు లెక్క ప్రకారం చూస్తే అయ్యవారు 53 మేళకర్తలకు సంబంధించిన 205 రాగాలలో కృతులు చెప్పారు. ఎక్కువ కృతులు చెప్పినది తోడిరాగంలో (32 కృతులు). అయ్యవారికి పూర్వం ఖరహరప్రియ, హరికాంభోజి మేళకర్తలుగా కేవలం గ్రంథాలలోనే ఉండేవి. వాటిలో కీర్తనలు ప్రచారంలో ఉండేవి కావు. ఖరహరప్రియలో 15, హరికాంభోజిలో 12 కృతులు చెప్పి వాటికి రాగరూపాలను కల్పించారు అయ్యవారు. మదురై సౌరాష్ట్ర సభవారి రాతప్రతులలో ఉండి అచ్చులోగానీ, ప్రచారంలోగాని లేని 15 కీర్తనలను శ్రీ వేటూరి ఆనందమూర్తి పరిష్కరించి విపుల వ్యాసంతో ప్రకటించారు.

అయ్యవారి భావాన్ని గుర్తెరుగక, నాటి వ్యవహారంలో ఉన్న భాషా ప్రయోగాలు తెలియక సందర్భ శుద్ధిలేని తప్పులతో పాడుతున్నారని ఉదాహరణలతో శ్రీ తాత సత్యనారాయణ రసమయి సాంస్కృతిక మాసపత్రికలో వ్యాసాలు ప్రచురించారు.

అయ్యవారు ఆనందభైరవి రాగంలో ఎక్కువ కీర్తనలు చెప్పకపోవడానికి కారణంగా ఒక సంఘటనని చెబుతారు. కూచిపూడి భాగవతులు వారి భాగవత ప్రదర్శనకు అయ్యవారిని ఆహ్వానించి భాగవతంలో భాగంగా ''మధురానగరిలో'' అనే పదాన్ని ఆనందభైరవిలో అద్భుతంగా పాడి, ఆడారు. సంతోషించిన అయ్యవారితో భాగవతులు "ఇక ఆనందభైరవిలో అయ్యవారు కీర్తనలు చెప్పరాదనే వరం కోరారని, సంగీత సార్వభౌముడైన అయ్యవారు ఎందుకు ఆనందభైరవిలో ఎక్కువ కృతులు చెప్పలేదని ప్రశ్న వస్తే కూచిపూడి భాగవతుల ప్రశంస వచ్చి వారి పేరు చిరకాలం అయ్యవారితోపాటు నిలిచి ఉంటుందని వారు ఆ కోరిక కోరా"రని చెబుతారు.

వాస్తవానికి ఈ కోరిక కోరింది కూచిపూడి భాగవతులు కారు. తంజావూరు చుట్టుప్రక్కల గ్రామాలలో నాయకరాజుల కాలంలో వారి ఆదరణ కారణంగా ఆంధ్రదేశం నుంచి వలసవెళ్లిన ఎన్నో నాటక కుటుంబాలు పాదుకొని ఉన్నాయి. అటువంటి గ్రామాలలో కుంభకోణం సమీపాన గల **త్రిభువనం** అనే గ్రామం ఒకటి. ఆ గ్రామంలో **త్రిభువనం స్వామినాథ అయ్యర్** నాటి కాలపు ప్రసిద్ధ భాగవత మేళం సూత్రధారి. ఆయన తన **ఆనంద భైరవి**తో అయ్యవారిని మెప్పించి ఆ రాగంలో కృతులు చెప్పవద్దని వరం కోరాడు. ఆ స్వామినాథ అయ్యర్ పాడింది ''మధురానగరిలో'' కూడా కాదు. ఆ పదాన్ని వాగ్గేయకారుడైన **చిత్తూరు సుబ్రహ్మణ్య పిళ్లె** 1930 – 35 ప్రాంతాలలో రాసారు. (పిళ్లెగారు కూడా ఒక పాత పాటకు కొంత సంస్కరణ జరిపి, అనగా కొంత సాహిత్యం జతచేసి ఈ పాటను రూపొందించారు.) ఈ అపోహకు కారణం 1946లో వచ్చిన నాగయ్య **త్యాగయ్య చలనచిత్రం** కావచ్చు. అందులో కూచిపూడి భాగవతులు ప్రదర్శించిన ''మధురానగరిలో'' విని వారికి అయ్యవారు మాట ఇచ్చినట్లుగా చిత్రీకరించారు. ఆ తదుపరి అయ్యవారు లోగడ చెప్పిన "రామ నీ వారము", "క్షీరసాగర విహార", "నీకే తెలియకపోతే" అనే మూడు ఆనందభైరవి కృతులను కూడా శిష్యులకు నేర్పకుండా వదలివేశారు.

అయ్యవారు సంగీత శిక్షణ వేళలో తీవ్రకోపులుగా ఉండేవారట. సహజంగా కూడా కోప స్వభావం కలవారని కూడా తెలుస్తున్నది. దైవానుగ్రహం కోసం ఎడతెరిపి లేకుండా చిత్తాన్ని లగ్నం చేసి సంగీతంతో అర్చన చేస్తూ, లౌకిక విషయాలను కూడా పట్టించుకోవలసి వచ్చేటప్పటికి ఆ కోపం సంక్రమించిందేమో. ఒక సందర్భంలో శిష్యుడొకడిని తిట్టి, కొట్టబోయారట అయ్యవారు. ఆ శిష్యుడు తప్పించుకొని "నా మొద్దుతనానికి మీతో దెబ్బలు తినడం న్యాయమే. అయితే మాటకు ముందర కోపగించుకొనే మీకు కూడా దెబ్బలు పడాలి" అని పరుగెత్తాడట. శిష్యులు ఇంటిలో శృంగారపరమైన జావళీలు పాడుతుండటం విని వారిపై తీవ్రంగా కోపించి ఇంట్లో నుండి వెళ్లగొట్టడానికి అయ్యవారు సిద్ధమవ్వగా వారి భార్య అడ్డుపడి "గురువులకు మంచిమాట, దయారసము ఉండనవసరం లేదా?" అని ప్రశ్నించారట. అయ్యవారు ''సమయమునకు మంచి మార్గమునకు తిప్పటం దయారసము కాదా?" అన్నారట. ఆప్పుడామె "మంచి మార్గమునకు తిప్పడానికి తాను వశం తప్పడం అవసరమా?'' అని ప్రశ్నించారట. దానికి అయ్యవారు "రోజా పుష్పమునకు చుట్టు ముళ్లు లేవా?" అని అడిగారట. (శ్రీనాథుని కాలానికే గులాబీలు అంధ్రదేశంలో ఉన్నాయి. నాడు వాటిని దేశీయంగా గొజ్జంగి పూలు అని పిలిచేవారు). అందుకు ఆమె "రోజా పుష్పమును మాత్రము గ్రహించి జనులు ముళ్లను పారవేయటం లేదా?" అని హితబోధ చేయగా అయ్యవారికి అకస్మాత్తుగా కోపం ఉపశమించి శాంత చిత్తత పొందారట. అ సందర్భములోనే అయ్యవారు "శాంతము లేక సౌఖ్యము లేదు" అనే సామరాగ కీర్తనను పలికారు, ఈ రెండు సంఘటనలను ఎక్కడ నుండి సంగ్రహించారో గానీ, బెంగుళూరు లక్ష్మీనారాయణరావు గారు తాము రచించిన "శ్రీ త్యాగరాజస్వామి" అనే చిన్న గ్రంథంలో (వావిళ్ల వారి ప్రచురణ : 1952) ఉటంకించారు.

అయ్యవారికి మొదటి నుండి ఐహిక సుఖాలపై, సిరిసంపదలపై మోజులేదు. తీవ్ర భగవద్భక్తే కాక నాటి సాంఘిక పరిస్థితులు కూడా అందుకు కారణం కావచ్చు.

దేశంలో నెమ్మదిగా ఆంగ్లేయుల ప్రాబల్యం స్థిరపడింది. సంస్థానాధిపతులు, జమీందార్లు ఎందరో తమ

హోదాలను పోగొట్టుకొని, కుంపిణీ వారిపై తిరగబడి ప్రాణాలు పోగొట్టుకోవడమో, లొంగిపోయి తమ రాజ్యంనుండి ఎక్కడికో దూరంగా పోయి "ఫించన్"తో బ్రతకడమో చేస్తున్నారు. అయ్యవారిని ఆస్థాన గాయకునిగా చేసుకోవాలని తపించి, కనీసం ఒక్కసారి తన సభలోనైనా పాడించుకోవాలని ప్రయత్నించి విఫలుడైన తంజావూరి ప్రభువు శరభోజి, ఎప్పుడో రాచపదవి నుండి తొలగింపబడి కుంపిణీ నుండి "ఫించన్" పుచ్చుకొంటున్నాడు. శరభోజి తరువాతి రాజు రెండవ ప్రతాపసింహుడు కూడా ఫించన్‌దారుడే. ఇతని మరణానంతరం కుంపిణీ ప్రభుత్వం తంజావూరికి రాజ్యం అన్న గుర్తింపునే రద్దు చేసింది. అయ్యవారికి సుమారు 55 ఏండ్లు వచ్చే నాటికి శరభోజి నామమాత్రుడైన రాజే. బహుశా ఇటువంటి సంఘటనలు కొల్లలుగా విని, చూసి ఉండటం వలన అయ్యవారికి సహజంగానే ఉన్న నిర్లిప్తత మరింత గాఢతరం అయి ఉండవచ్చు.

అయితే రాజాస్థానంలో అయ్యవారు ఒకమారు పాడకపోలేదు. ఒకసారి కొంతమంది విద్వాంసుల సమక్షంలో అయ్యవారు బిలహరి రాగంలో "దొరకునా ఇటువంటి సేవ" అనే కీర్తన పాడగా విని పరవశించి వారు శరభోజి ఆస్థాన గాయకులలో ప్రథముడైన శొంఠి వెంకట సుబ్బయ్య వద్ద పదే పదే ప్రశంసించారు. వెంకట సుబ్బయ్య కూడా అయ్యవారి గానాన్ని వినాలని కోరగా తనకు తండ్రికి కూడా గురువు, నాటి గాయకులలో మేరుపూసగా వెలుగుతున్న వారి మాట తీసివేయలేక తంజాపుర ప్రసిద్ధ గాయకులందరూ సమావేశమై ఉన్న "సంగీత మహల్" అనే ప్రత్యేక భవనమందు అయ్యవారు "మరి మరి నిన్నే మొరలిడ నీ మనసున దయరాదు" అనే కాంభోజి రాగ కీర్తనను 8 గంటలు పాడారు. నాటి నుండే అయ్యవారి యశోలత దశదిశలా పాకడం మొదలుపెట్టింది. అయితే శరభోజి దురదృష్టం కొలదీ ఆ సభకు ఇతర కారణాల వలన రాలేకపోయాడు. అందువలన అయ్యవారు రాజ సమక్షంలో కాక తోటి విద్వాంసుల ముందర పాడినట్లయింది.

అయ్యవారి పూజా విగ్రహాలను అన్న జపేశం అకారణ మాత్సర్యంతో కావేరి నదిలోకి విసరివేయగా, అయ్యవారు ఆ విగ్రహాలను వెదుకుతూ తీర్థయాత్రలు చేశారని చెప్తుంటారు. నిజానికి అయ్యవారికి తీర్థయాత్రల పట్ల ప్రమాణ బుద్ధి ఉన్నట్లు గోచరించదు. "కోటి నదులు ధనుష్కోటిలో నుండగా ఏటికి తిరిగేవో మనసా'' అనే తోడిరాగ కీర్తనను పురస్కరించుకొని అయ్యవారు ధనుష్కోటి క్షేత్రానికి కూడా వెళ్లారని చెబుతారు. ధనుష్కోటి అనే పదానికి యోగశాస్త్రపరమైన అర్థమే కాని (ధనుః = వెన్నెముక, కోటి = కొన) రామేశ్వరానికి పైన గల ధనుష్కోటి క్షేత్రం గురించి చెప్పడం లేదు. కీర్తన చివరిలో "సూటిగ శ్యామ సుందరమూర్తిని మాటిమాటికి జూచే మహరాజులకు" కోటినదులు వారిలోనే ఉన్నాయి. అని అయ్యవారు అంటున్నారు. ఒకే కీర్తనలో కోటి నదులు ధనుష్కోటిలోను, దైవంపై మనస్సును లగ్నం చేసిన వారిలోను ఉన్నాయిని చెప్పడాన్ని ఎలా సమర్థిస్తాము. కనుకనే "ధనుష్కోటి" యోగశాస్త్ర పరమైన సంకేతపదం మాత్రమే.

అన్న పారవేసిన పూజా విగ్రహాల కోసం అయ్యవారు అన్నపానాదులు వర్జించి దుఃఖిస్తుండగా రెండు మూడు రోజుల తరువాత ఆ స్వామివారే అయ్యవారి కలలో కనబడి కావేరిలో ఫలానా ఘట్టంలో ఉన్నానని తెల్పగా అయ్య వారు మహదానందంతో తిరిగి ఇంటికి తెచ్చు కొన్నట్లు అయ్యవారి శిష్యులు వాలాజీపేట వేంకట రమణ భాగవతారు రచించిన అయ్యవారి జీవిత చరిత్ర ద్వారా తెలుస్తుంది.

కంచిలో ఉపనిషద్బ్రహ్మ స్వామి అనే మఠాధిపతి ఉన్నారు. వీరు ఉపనిషత్తుల వ్యాఖ్యాతలు. అయ్యవారి తండ్రికి స్నేహితులు. వయోవృద్ధులు. వీరు అయ్యవారి గానామృతము సేవించే అభిలాషతో ఆహ్వానించగా, రాజుల ఆహ్వానాన్ని తిరస్కరించిన అయ్యవారు, సర్వసంగ పరిత్యాగి వాత్సల్యపూర్వక ఆహ్వానాన్ని తోసిపుచ్చలేక కంచికి బయలుదేరారు. ఎన్నడు ఇల్లు వీడని అయ్యవారు బయలుదేరేటప్పటికి కొందరు శిష్యులు, సంగీత రసికులు పదే పదే బ్రతిమలాడగా వారి వారి గృహాలను పావనం చేస్తూ కంచి వెళ్ళి తిరిగి తిరువైయారుకి చేరారు తప్ప ప్రత్యేకంగా కోరి తీర్థయాత్రలు చేయలేదు. అయ్యవారు బహుశా తిరువైయారు నుండి లాల్‌గుడి, తిరువొత్తియారు, చెన్నపట్టణం, కోవూరు, నాగలాపురము, పుత్తూరు, తిరుపతి, షోలింగాపురం. కంచి, శ్రీరంగం, వాలాజీపేటల మీదుగా తిరిగి తిరువైయారుకు చేరి ఉండవచ్చు. విస్సా అప్పారావు గారు–

**మనసు నిలప లేకపోతే / మధుర ఘంటా విరుల పూజేమి సేయును**

అనే ఆభోగిరాగ కీర్తనను ఉదహరించి అయ్యవారు మధురను కూడా సందర్శించారని అంటున్నారు. కీర్తనలలో ఉన్నది ఘంటకు సంబంధించిన నాద మాధుర్యం ప్రస్తావనే కానీ, "మధుర" క్షేత్ర ప్రస్తావన కాదు.

**పంచరత్న కీర్తనలు :**

పంచరత్న కీర్తనలనగానే సాధారణంగా గుర్తుకువచ్చేవి ఘనరాగ పంచరత్న కీర్తనలే. ఇవి కాక అయ్యవారు వివిధ సందర్భాలలో పంచరత్న కృతులను చెప్పారు.

**1. ఘనరాగ పంచరత్న కీర్తనలు :**

| | | |
|---|---|---|
| 1. జగదానందకారకా | - | నాట రాగం |
| 2. దుడుకు గల | - | గౌళ రాగం |
| 3. సాధించెనే | - | ఆరభి రాగం |
| 4. కనకన రుచిరా | - | వరాళి రాగం |
| 5. ఎందరో మహానుభావులు | - | శ్రీ రాగం |

**2. తిరువత్తియూరు పంచరత్నాలు :**

ఒకప్పుడు ప్రత్యేక గ్రామం, ఇప్పుడు చెన్నైలో ఒక భాగంగా మారిపోయిన ఊరు తిరువొత్తియూరు. దీనికే ఆదిపురమని కూడా పేరు. ఈ గ్రామంలో వెలిసి ఉన్న "త్రిపుర సుందరి"పై అయ్యవారు పంచరత్న కీర్తనలు చేశారు.

| | | |
|---|---|---|
| 1. కన్నతల్లి నీవు నా పాలి కలుగ | - | సావేరి రాగం |
| 2. సుందరి నిన్ను వర్ణింప | - | ఆరభి రాగం |
| 3. సుందరి నన్నందరిలో చూచి | - | బేగడ రాగం |
| 4. సుందరి నీ దివ్యరూపమును | - | కళ్యాణి రాగం |
| 5. దరిని తెలిసికొంటి త్రిపుర | - | శుద్ధసావేరి రాగం |

**3. కోవూరు పంచరత్నాలు :**

చెన్నైకు పశ్చిమంగా 22 కిలో మీటర్ల దూరంలో సుందరేశ్వరుడు వెలసిన కోవూరు గ్రామాన్ని సందర్శించి స్వామిపై పంచరత్న కీర్తనలను వెలయించారు.

| | | |
|---|---|---|
| 1. ఈ వసుధ నీ వంటి దైవము | - | శహన రాగం |
| 2. కోరి సేవింపరే కోర్కులీడేర | - | ఖరహరప్రియ రాగం |
| 3. శంభ మహాదేవా శంకర గిరిజా | - | పంతువరాళి రాగం |
| 4. నమ్మివచ్చిన నన్ను | - | కళ్యాణి రాగం |
| 5. సుందరేశ్వరుని జూచి సురల | - | శంకరాభరణ రాగం |

**4. శ్రీరంగం పంచరత్నాలు :**

కావేరి నదీ తీరాన శ్రీరంగంలో నెలకొన్న శ్రీరంగనాథ స్వామిపై చెప్పిన పంచరత్నాలు.

| | | |
|---|---|---|
| 1. రాజు వెడలె చూతము రారె | - | దేశిక తోడి రాగం |
| 2. ఓ రంగశాయి పిలిచితే ఓయనుచు | - | కాంభోజిరాగం |
| 3. చూతము రారే సుదతులారా | - | అరభిరాగం |
| 4. కరుణ జూడవయ్య మాయయ్య | - | సారంగరాగం |
| 5. వినరాదా నా మనవి | - | దేవగాంధారి రాగం |

**5. లాల్‌గుడి పంచరత్నాలు :**

లాల్‌గుడికే తపస్తీర్థమని, తీర్థపురమని కూడా పేర్లు. ఇక్కడ వెలసిన అమ్మవారు ప్రవృద్ధ శ్రీమతిదేవి పేర కూడ అయ్యవారు పంచరత్నాలు సమర్పించారు.

| | | |
|---|---|---|
| 1. గతి నీవని | - | తోడిరాగం |
| 2. లలితేశ్రీ | - | భైరవి రాగం |
| 3. దేవీశ్రీ తపస్తీర్థ | - | మధ్యమావతి రాగం |
| 4. మహిత ప్రవృద్ధ శ్రీమతి | - | కాంభోజి రాగం |
| 5. ఈశపాహిమాం | - | కళ్యాణి రాగం |

**6. నారద పంచరత్నాలు :**

సంగీతాన్ని గురించి పెక్కు సందేహాలతో కొట్టు మిట్టాడుతున్న అయ్యవారికి నారదులవారు మారువేషంలో వచ్చి *స్వరార్ణవం* అనే సంగీత గ్రంథాన్నిచ్చారని ప్రతీతి. కరుణించిన నారదుని గురువుగా ప్రస్తుతిస్తూ అయ్యవారు గురుదక్షిణగా పంచరత్నాల నిచ్చారు.

| | | |
|---|---|---|
| 1. శ్రీనారదమౌనీ, గురురాయ కంటి | - | భైరవి రాగం |
| 2. నారద నాద సరసీరుహభృంగ | - | కన్నడ రాగం |
| 3. వరనారద నారాయణ | - | విజయశ్రీ రాగం |
| 4. నారద గురుస్వామీ | - | దర్బారు రాగం |
| 5. నారద ముని వెడలిన | - | పంతువరాళి రాగం |

**అయ్యవారి రచనల తొలిముద్రణ :**

*సీతారామ విజయం*ను 1863లో మొదటిసారిగా వాలాజీపేట లోకనారాయణశాస్త్రి, *నౌకాచరిత్ర*ను మొదటిసారిగా 1873లో ముంజుర పట్టు రామచంద్ర శాస్త్రి అచ్చువేశారు. తమిళంలో అయ్యవారిపై ప్రొఫెసర్ సాంబమూర్తి *త్యాగరాజర్ వాగ్గేయ కారర్గళిన్ చరిత్తరం* అనే ప్రామాణిక గ్రంథాన్ని రాశారు.

**అయ్యవారిని సందర్శించిన సమకాలీనులు :**

అయ్యవారు ఇల్లు కదలకపోయినా వారి కీర్తికాంత దేశదేశాలా పర్యటించడం వలన ఎందరో గానకళావేత్తలు వీరిని దర్శించడానికి తిరువైయారుకి వచ్చేవారు. కాశీ నివాసి గోపీనాథ భట్టాచార్యులు అనే హిందుస్థానీ సంగీత విద్వాంసుడు, మహారాష్ట్రుడైన గణేశ భావే, తంజావూరు చతుష్టయంలోని వడివేలు, నందనార్ చరిత్ర రాసిన గోపాల కృష్ణ భారతి, షట్కాల గోవింద మారార్ (1842లో దర్శించారు) ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, గుంటూరు నుండి తూము నరసింహదాసు మొదలగువారు అయ్యవారిని దర్శించారు. తూము నరసింహదాసు గారు అయ్యవారిని 1821లో దర్శించి ఆ ఆనందాన్ని పద్యరూపంలో వెల్లడించారు.

**కేవలానంద సంకీర్తనావళి వింటి**
**భావసిద్ధియు శుద్ధ భక్తి గంటి**
**భక్తులు శిష్యులు బహుచేరగా గంటి**
**వాఙ్మాధురీ వైభవంబు గంటి**
**వినయ సత్సంపద్వివేకముల్ కనుగొంటి**
**శ్రీరామ పదభక్తి చెల్వుగంటి**
**అజున కందక రాని యనుభవంబును గంటి**
**తన్మయత్వం బాత్మదనర గంటి**
**అరసి కనుగొంటి త్యాగరాయార్యునందు**
**నెసగు సద్గుణ పుంజమింకెన్నిమైన**
**దివ్య మహిమాతి శయములు తేజరిలుట**
**గంటి హర్షాబ్ధి నోలాడుచుండ మతిని**

మరొక ప్రముఖ వాగ్గేయకారుడు తిరువాన్కూర్ మహారాజు స్వాతి తిరునాళ్ ఎంతో ప్రయత్నించి కూడా రాజకీయ పరిస్థితుల కారణంగా అయ్యవారిని దర్శించలేక పోయారు.

**అయ్యవారి శిష్యులు :**

వాలాజీపేట వెంకట రమణ భాగవతులు (అయ్యవారి చరిత్రను రాశారు) వారి కుమారుడు కృష్ణస్వామి భాగవతార్, ఉమయాల్పురం కృష్ణ భాగవతార్, తంజావూరు రామారావు, వీణకుప్పయ్య ముఖ్యులు. వీరిలో తంజావూరి రామారావు అయ్యవారికి నర్మసచివుని వంటి శిష్యుడు. అయ్యవారు భక్త్యావేశంతో ఆశువుగా చెప్పిన అనేక కీర్తనలు మనకు దక్కాయంటే కారణం వేంకట రమణ భాగవతులు. పొట్టిగా, లావుగా ఉండటం వలన వారి "గణపతి" అనే ముద్దు పేరు కూడా ఉంది.

తిల్లస్థానం రామయ్యంగారు, లాల్గుడి రామయ్యరు, నైకారపట్టి సుబ్బయ్యరు, సుందర భాగవతారు, సోజిరి సీతారామయ్యరు, వంగరము నీలకంఠయ్యరు, గణేశయ్యరు, వేంకటాచలపతి అయ్యరు వంటి అనేకులు గురుకుల వాసపద్ధతిలో అయ్యవారి ఇంట్లోనే ఉండి సంగీత విద్యను నేర్చారు. అయ్యవారు జ్యోతిష మంత్రశాస్త్రాలలో కూడా ప్రవీణులు. అందువలన వాలాజీపేట పొట్టి జోస్యులు, కుంభకోణం ఆరావముద అయ్యంగార్ అయ్యవారిని ఆశ్రయించి ఆ విద్యలు నేర్చారు. పొట్టి జోస్యులు అయ్యవారి జాతకాన్ని సేకరించుకొని భద్రపరుచుకొన్నారు. అదే తదనంతర కాలంలో అయ్యవారి జనన కాలానికి ముఖ్యాధారంగా నిలిచింది.

**సంగీతోత్సవాలు :**

అయ్యవారు సిద్ధి పొందిన తరువాత శిష్యులు ప్రతిఏటా వారి తిథి నాడు స్వల్పంగా పూజ చేసేవారు. 1907 నుండి వైభవంగా పూజ జరగడం ప్రారంభం అయ్యింది. తిల్లస్థానం నరసింహ భాగవతార్, పంజు భగవతార్, తిరుచ్చి గోవింద స్వామి పిళ్లెలు పూనుకొని భారీఎత్తున అయ్యవారి వర్ధంతిని గానసభల రూపేణా ప్రారంభించారు. 1925లో "విద్యాసుందరి" బెంగళూరు నాగరత్నమ్మ తన సర్వస్వం వెచ్చించి అయ్యవారి సమాధిపై మందిర నిర్మాణం జరిపారు. 1940 నుండి ఒక క్రమపద్ధతిలో ఎంతో వైభవంగా అయ్యవారి ఆరాధన మహోత్సవ సభ వారు సంగీతోత్సవాల ద్వారా అయ్యవారిని ఆరాధిస్తున్నారు.

**అయ్యవారి వంశీకులు :**

అయ్యవారికి సీతాలక్ష్మి అనే కుమార్తె కలిగింది. ఆమెను అఖిలాండపురం కుప్పుస్వామి అయ్యర్ గారికిచ్చి వివాహం చేశారు. వారికి పంచాప కేశయ్య అనే కుమారుడు పుట్టాడు. నిస్సంతుగా మరణించాడు. అతని భార్య గురవమ్మ తంజావూరిలోని పుట్టినింటికి వెళుతూ అయ్యవారు పూజించే శ్రీరామ పంచాయతనాన్ని కూడా తీసుకువెళ్ళింది. వరాహ అయ్యర్ వీధిలో ఇప్పటికీ మనం వాటిని దర్శించవచ్చు. ప్రస్తుతం ఆ ఇంటిలో అయ్యవారి అన్నగారు జపేశయ్య వంశీకులు ఉంటూ పంచాయతనాన్ని పూజిస్తున్నారు. జపేశయ్యగారి మనుమని మనుమడైన కుప్పుస్వామిగారు అయ్యవారి వలెనె నిర్లిప్తునిగా జీవించి 1935-40 మధ్యలో మరణించారు.

**అయ్యవారిపై కీర్తనలు :**

అయ్యవారి శిష్య ప్రశిష్యులు వారిపై భక్తితో కీర్తనలు రచించారు. అందులో కొన్ని -

1. **స్వామికి సరియెవ్వరనవచ్చు**
2. **త్యాగరాజ గురుదేవా**
3. **త్యాగరాజ స్వామి గురుని**
4. **శ్రీమదాది త్యాగరాజ గురువరం**
5. **సద్గురు స్వామికి సాటియు లేదని**
6. **భజరే మానస త్యాగరాజ గురు**
7. **త్యాగరాజ స్వామి వెడలిన (మైసూరు సదాశివయ్య)**

ఇవి కాక శిష్యులు సంస్కృతంలోను, తెలుగులోను గురుస్తుతి రూపకంగా చెప్పిన శ్లోకాలు, పద్యాలు చాలా ఉన్నాయి. అయ్యవారి వద్ద సంగీతాభ్యాసం కొరకే కాదు మంత్ర శాస్త్రాధ్యయనం కొరకు కూడా శిష్యులు చేరేవారు.

నిరంతర సంగీతోపాసకుడైన అయ్యవారు మంత్రశాస్త్రం ఎప్పుడు నేర్చి ఉంటారు అనే సందేహం కాకర్ల గ్రామ సందర్శనతో తీరింది. స్థానికుల కథనం ప్రకారం కాకర్ల బ్రాహ్మణులు వంశ పారంపర్యంగా మంత్రశాస్త్రం అధ్యయనం చేసేవారు. దానికి సంబంధించిన కథలు కొన్ని గ్రామస్థులు చెప్పారు. చాదస్తంగా ఉన్నాయని, చెబితే నమ్మరేమోనని ఆ కథలను ఇక్కడ ప్రస్తావించడం లేదు. ఈ కథనం నిజమే అయితే అయ్యవారికి తండ్రి నుండే కులవిద్యలాగా మంత్రశాస్త్రం సంక్రమించి ఉండాలి.

**తెలిసినంత వరకు అయ్యవారి జీవిత ఘట్టాలు :**

1. 6-7 ఏళ్ల వయస్సులో తిరువారూరు నుండి తిరువైయారుకి తరలి వచ్చారు.
2. 14-15 ఏళ్ల వయస్సులో చిన్నన్న రామనాథం మరణించారు.
3. 18 ఏళ్ల వయస్సులో పార్వతితో వివాహం జరిగింది.
4. 20 ఏళ్ల వయస్సులో తండ్రిగారు గతించారు.
5. 23వ ఏట భార్య వియోగం.
6. 25-26 ఏళ్ల వయసులో పార్వతి చెల్లెలు కమలాంబతో పునర్వివాహం.
7. 28 ఏళ్లప్పుడు మాతృ వియోగం.
8. 29వ ఏట శ్రీరామకృష్ణానందస్వామివారి ఆజ్ఞతో 96 కోట్ల రామతారక మంత్ర జపాన్ని ప్రారంభించారు. రోజుకు 1,25,000 వేల జపం జరిగేది.
9. 50వ సం॥లో 96 కోట్ల రామతారక మంత్ర జపం పరిపూర్తి అయినది. రామదర్శనం లభించింది.
10. 79 సంవత్సరాల, 8 మాసాల, 15 రోజులు జీవించి సిద్ధి పొందారు.
11. సిద్ధి పొందటానికి 2 సం. ముందు కమలాంబ మరణించారు.
12. సిద్ధి పొందటానికి 10 రోజుల ముందు "నాదబ్రహ్మానంద" దీక్షా నామంతో సన్యాసాశ్రమం స్వీకరించారు. కొంతమంది ఒక్కరోజు ముందే స్వీకరించారని అంటున్నారు.
13. సిద్ధిపొందేనాటికి ఉదయం కూడా లోకానికి ఆఖరి కానుకగా 'శ్యామ సుందరాంగ' అనే ధన్యాసిరాగ కీర్తనను చెప్పారు.

**చలనచిత్రాలు - అయ్యవారు :**

1937లో తమిళంలో మాదిరి మంగళం నటేశ అయ్యర్, 1946లో తెలుగులో చిత్తూరు నాగయ్య, 1981లో జె.వి. సోమయాజులు అయ్యవారి పాత్ర పోషించగా చలనచిత్రాలు నిర్మించారు. వీటిలో మొదటి రెండు ఎంతో ప్రజాదరణ పొందాయి. సామాన్యులకు కూడా అయ్యవారు పరిచితులయ్యారంటే ఈ చిత్రాలే కారణమంటే అసంబద్ధంకాదు. ఎన్నో చిత్రాలలో కూడా అయ్యవారి కీర్తనలు శ్రోతలకు ఆనందం కలిగించాయి.

| కీర్తన | చిత్రం |
|---|---|
| 1.రాగసుధా రసపానము చేసి | మిస్సమ్మ |
| 2.మరి మరి నిన్నే మొరలిడగా | సింధుభైరవి |
| 3.ఏతావునరా నిలకడ నీకు | వివాహబంధం |
| 4.నగుమోము గనలేని | అల్లుడుగారు/ వివాహబంధం/ సోపానం |
| 5.జగదానందకారకా | పెళ్లి పుస్తకం |
| 6.బాలకనకమయచేల | సాగరసంగమం |
| 7.ప్రక్కల నిలబడి | చక్రపాణి |
| 8.తులసీ దళములచే | రుద్రవీణ |
| 9.శాంతములేక సౌఖ్యము లేదు | అమ్మాయిపెళ్లి |
| 10. తెరతీయగ రాదా | భాగ్యలక్ష్మి |
| 11.ఉయ్యాల లూగవయ్య | భాగ్యలక్ష్మి |
| 12.గంధము పుయ్యరుగా | శుభోదయం |
| 13. నీ దయరాదా | పూజ/సింధుభైరవి |
| 14.మరుగేలరా ఓ రాఘవా | సప్తపది/శుభలేఖ/బాలయోగిని |
| 15.వందనము రఘునందనా | అమ్మాయి పెళ్లి |
| 16.పలుకవేమి నా దైవమా | వరవిక్రయము |
| 17.రామ నన్ను బ్రోవరా | ఆప్తమిత్రులు |
| 18.క్షీరసాగర శయన | సోపానం |
| 19.సాధించెనె మనసా | సోపానం |
| 20.సొగసుగా మృదంగతాళము | సోపానం |
| 21.ఎపుడు కృపగలుగునో | లంకాదహనం |

దొరకునా ఇటువంటి సేవ (శంకరాభరణం), సొగసు చూడతరమా, వెడలెను కోదండపాణి, జగదానందకారక, మా జానకి చెట్టబట్టగా, ఎందరో మహానుభావులు, సాధించెనే మనసా, సామజ వరగమనా, ఎంతగల్గినా ఎంత చూచినా, మనసులోని మర్మమును తెలుసుకో, ఓడను జరిపే ముచ్చటగనరే, ననుపాలింపగ నడచి వచ్చితివా, వంటి ఎన్నో కీర్తనల పల్లవులను తీసుకొని కూడా చలనచిత్ర గీతాలు రాశారు.



*- మోదుగుల రవికృష్ణ*

# హరప్పా - యుగం

*- సాయి పాపినేని & జయశ్రీ నాయని*

ఇంతకు ముందు సంచికలో మహాభారతయుద్ధకాలం తుది హరప్పా నాగరకత స్తరాలకి (క్రీపూ. 1460) చెందినది అని ప్రతిపాదించాము. మన ఇతిహాసపౌరాణిక సంప్రదాయంలో భారతయుద్ధం ద్వాపరయుగం చివరలో సంభవించింది.

క్షత్రియ వంశావళుల్లో, ఆ యుద్ధంలో పాల్గొన్న రాజులకి పూర్వులైన దాదాపు 95 తరాలు కనిపిస్తాయి. ఒక్కొక్క తరానికీ 18 యేళ్లనుకుంటే, సూర్య చంద్రవంశాల మూలపురుషుడైన మనువు, క్రీపూ. ముప్ఫై రెండవ శతాబ్ది మధ్యకాలానికి చెందుతాడు (1460+(94 X 18) = 3152) ఈ తేదీ హరప్పా యుగం ఆరంభదశకి సరిగ్గా సరిపోతుంది.

కనుక వంశావళుల క్రమం, వివిధ రాజుల మధ్య సమకాలీనతలు, సంబంధిత గాథల్లోని నిజానిజాలు శోధించే ముందు, హరప్పా నాగరికతపై ఇప్పటి వరకూ పురాతత్వ శాస్త్రజ్ఞులు వెలుగులోకి తెచ్చిన అంశాలను ఒకసారి పునఃపరిశీలించడం అవసరం.

**హరప్పా నాగరికత :**

1920లో దయారామ్ సాహ్నీ హరప్పాలో, 1921లో రఖల్‌దాస్ బెనర్జీ మొహెంజొదారోలో, జరిపిన తవ్వకాల ఆధారంగా, 1924లో అప్పటి పురాతత్వ సర్వే డైరెక్టర్, జాన్ మార్షల్ సింధులోయలో కనుగొన్న పురాచారిత్రక నాగరికత గురించి అధికారికంగా ప్రకటించారు.

మొట్టమొదటి స్థావరాలు సింధునది పరివాహక క్షేత్రంలోవి కనుక ఆ నాగరికత *ఇండస్ వ్యాలీ సివిలిజేషన్* అనే పేరుతో ప్రపంచానికి పరిచయమయింది.

గత 90యేళ్లలో ఆ నాగరికతకి చెందిన 1022కి పైగా స్థావరాలు పురాతత్వవేత్తలు గుర్తించారు. వీటిలో దాదాపు 400 నేటి పాకిస్తాన్‌లో ఉంటే, 600 పైగా భారతదేశంలో ఉన్నాయి.

ఉత్తరాన ఆఫ్ఘనిస్తాన్ తజకిస్తాన్ సరిహద్దులోని షోర్తుగాయ్ నుండి, దక్షిణాన ఎగువ గోదావరి తీరంలోని దైమాబాద్ వరకూ, పశ్చిమాన బలుచిస్తాన్ ఇరాన్ సరిహద్దులోని సుక్తజెన్‌డోర్ నుండి, తూర్పున గంగా మైదానంలోని ఆలంగిర్‌పూర్ వరకూ 9 లక్షల చదరపు కిలోమీటర్లు విస్తరించి, ప్రపంచంలోనే అతిపెద్ద, అతి పురాతనమైన కాంశ్యయుగ సంస్కృతిగా వెలుగులోకి వచ్చింది.

వాటిలో అధిక సంఖ్యలో స్థావరాలు, గగ్గర్, హక్రా లోయలో ఉన్నాయి. గగ్గర్ నదే ఒకప్పటి సరస్వతీ నది అని శాస్త్రజ్ఞులు అంగీకరించారు. కాబట్టి సింధులోయ నాగరికతకి సరస్వతీ సంస్కృతి లేదా సింధుసరస్వతీ నాగరికతగా పేరుమార్చాలని కొందరు ప్రతిపాదించారు. కానీ ఈ నాగరికత సింధు సరస్వతి ప్రాంతాలకే పరిమితం కాదు.

అత్యధిక సంఖ్యలో గుజరాత్‌లో బయటపడ్డ స్థావరాలకీ సింధు సరస్వతులకీ సంబంధం లేదు. పురాతత్వశాస్త్రంలో మొట్టమొదట వెలుగులోకి వచ్చిన స్థావరం పేరు ఆ సంస్కృతికి పెట్టడం ఆనవాయితీ. కాబట్టి ఆ నాగరికతని *హరప్పా నాగరికత* అనడమే సమంజసం.

క్రీపూ. 3200 నుంచీ 1400 వరకూ కనిపించే ఈ సంస్కృతిని పురాతత్వవేత్తలు మూడు కాలవిభాగాలు చేసారు.

| | | |
|---|---|---|
| క్రీపూ 3200 – 2600 | తొలి హరప్పాయుగం | ప్రాంతీయ సంస్కృతుల యుగం |
| క్రీపూ. 2600 – 2000 | పరిణత హరప్పాయుగం | ఏకీకరణ యుగం |
| క్రీపూ. 2000 – 1400 | తుది హరప్పాయుగం | వికేంద్రీకృత సంస్కృతుల యుగం |

ఒక్కొక్క కాలవిభాగం దాదాపు ఆరొందల ఏళ్లు కొనసాగింది. తొలి యుగం ఈ నాగరికతా క్షేత్రంలో పట్టణీకరణ ఆరంభదశ. దీనిలో ముఖ్యంగా మూడు భిన్న సంస్కృతులు కనిపిస్తాయి. ఆ వైవిధ్యం పరిణత హరప్పా యుగంలో కనిపించదు. పట్టణాలు మహానగరాలుగా అభివృద్ధి చెందటం, లిపి, వస్తు సంస్కృతిలో సామ్యత కానవస్తుంది. మూడవ దశలో హరప్పా మూలప్రాంతంలో పట్టణీకరణ క్షీణించి పరిధుల్లో కొనసాగడమేగాక ఆయా ప్రాంతాల్లో కొత్తపట్టణాల ఆవిర్భావం కూడా జరిగింది. క్రీపూ 1400 తరువాత ఈ సంస్కృతి పూర్తిగా పతనమైంది. మరో ఆరొందల యేళ్లవరకూ ఉత్తరభారతదేశంలో ఏమాత్రమూ ప్రగతి కనిపించదు.

క్రీపూ. 1400 మహాభారత యుద్ధాంతర కాలానికి సరిపోతుందని కొన్ని ఋజువులతో క్రిందటి వ్యాసంలో చూపించాము. భారతయుద్ధానికి ముందుకాలాన్ని ఇతిహాస పురాణ సంప్రదాయం మూడు యుగాలుగా విభజిస్తుంది. అవి కృత, త్రేతా, ద్వాపర యుగాలు. వంశావళుల్లో మనువు నుంచి కార్తవీర్యార్జునుని (పరశురాముడి) వరకూ కృతయుగం, హరిశ్చంద్రుని నుండి శ్రీరాముని వరకూ త్రేతాయుగం, భీమసాత్వతుని నుంచీ బలరాముని వరకూ ద్వాపరయుగం అని పురాణాలు ముక్తకంఠంతో చెప్తాయి.

క్షత్రియ వంశావళుల్లో అయోధ్యకి చెందిన సూర్యవంశపు 94వ రాజు బృహద్బలుడు. ఇతడు భారతయుద్ధంలో అభిమన్యుడిచే చంపబడ్డాడని సంప్రదాయం. కనుక అతడు క్రీపూ. 1460కి చెందుతాడు. అతడికీ శ్రీరాముడికీ మధ్య 29 తరాల అంతరం ఉంది. తరానికి 18 యేళ్ల వంతున శ్రీరాముడు క్రీపూ. 2000 కి చెందాలి. అంటే పురాణల్లోని ద్వాపరయుగం పురాతత్వవేత్తల తుది హరప్పా యుగానికి సరిపోతుంది. ఇక శ్రీరాముడికీ హరిశ్చంద్రునికీ మధ్య 29 తరాల అంతరం ఉంది. అంటే పురాణల్లోని త్రేతాయుగం క్రీపూ. 2600 నుండి 2000వరకూ అంటే పరిణత హరప్పా యుగానికి సరితూగుతుంది. రామరాజ్యంగా ఈనాటికీ మనం చెప్పుకొనే త్రేతాయుగం, పురాతత్వ ప్రమాణాల రీత్యా, అసమానమైన ప్రగతికి అద్దంపట్టే పరిణత హరప్పాయుగంతో సరితూగడం మన ఇతిహాసపురాణ సంప్రదాయంలోని వాస్తవికతని ఋజువుచేస్తుంది.

భారతీయ చారిత్రక సంప్రదాయంలోని రాజుల సమకాలీనతల ఆధారంగా పర్జిటర్ నిర్మించిన వివిధ వంశాల క్రమాన్ని ఈ వ్యాసానికి అనుబంధంగా అందిస్తున్నాం. ఏ. ఎల్. భాషం తదితరులు పరిశోధనల ద్వారా నిరూపించిన రాజ్యకాలాల సరాసరి పరిమితులని జోడించడం ద్వారా, వంశావళుల్లోని వ్యక్తుల రాజ్యకాలాలని రమారమిగా సూచించడం జరిగింది. ఈ తేదీలకి ఎటువంటి శాసనాధారాలు లేవు. కానీ కొన్ని భౌగోళిక అంశాలు, సమకాలీన సమాజాల్లో దొరికిన ఆధారాలు, హరప్పా నేపథ్యంలో కాలానుగుణంగా వచ్చిన మార్పులు, పురాణ సంప్రదాయంలోని గాథల సంఘటనల తేదీలను బలపరుస్తాయి. (ఈ శీర్షికలో రానున్న సంచికల్లోని వ్యాసాలకు కూడా ఈ వంశావళుల పట్టిక సహకరిస్తుంది. కనుక ఈ పట్టికను భద్రపరుచుకోగలరు.)

ముందుగా పట్టికలో ఇచ్చిన తేదీలను సమకాలీన సమాజాల్లో దొరికిన చారిత్రక ఆధారాలతో బేరీజు వేద్దాం.

**మెసోపొటేమియా :**

క్రీపూ. 3200 నాటికి, ఇరాక్‌లోని యూఫ్రేటస్, టైగ్రిస్ నదుల లోతట్టు ప్రాంతంలో సుమేరియన్ నాగరికత, ఎగువ టైగ్రిస్ ప్రాంతంలో వికసించిన అక్కడియన్ సంస్కృతుల్లో, అభివృద్ధి చెందిన పట్టణాలు, విదేశ వాణిజ్యం, పరిణతి చెందిన మతవిశ్వాసాలు కనిపిస్తాయి. ఆనాటి పరిస్థితులని గ్రహించేందుకు దోహదపడే ముద్రికలూ, ప్రాచీన

# పర్గిటార్ పొందుపర్చిన పౌరాణిక క్షత్రీయ వంశావళులు - I

| తరం | సంవత్సరం | యాదవ | హైహేయ | ద్రుహ్యు | తుర్వస | కన్యాకుబ్జ | పౌరవ | కాశి | ఆనవ (వాయవ్య) | అయోధ్య | విదేహ | వైశాలి | పురాతత్వ యుగాలు | పౌరాణిక యుగాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | కృతయుగం - తొలి హరప్పాయుగం | | | | | | | | | | | | |
| 1 | 3152 | మనువు | మనువు | మనువు | మనువు | మనువు | మనువు | మనువు | మనువు | మనువు | మనువు | మనువు | తొలి హరప్పా యుగం | కృత యుగం |
| 2 | 3134 | ఇలుడు | ఇలుడు | ఇలుడు | ఇలుడు | ఇలుడు | ఇలుడు | ఇలుడు | ఇలుడు | ఇక్ష్వాకుడు | ఇక్ష్వాకుడు | నాభనేదిష్ట | | |
| 3 | 3116 | పురూరవుడు | పురూరవుడు | పురూరవుడు | పురూరవుడు | పురూరవుడు | పురూరవుడు | పురూరవుడు | పురూరవుడు | వికుక్షి | నిమి | | | |
| 4 | 3098 | ఆయు | ఆయు | ఆయు | ఆయు | అమావసువు | ఆయు | ఆయు | ఆయు | కాకుత్స్థుడు | | | | |
| 5 | 3080 | నహుషుడు | నహుషుడు | నహుషుడు | నహుషుడు | | నహుషుడు | నహుషుడు | నహుషుడు | అనేనుడు | మిథి జనకుడు | | | |
| 6 | 3062 | యయాతి | యయాతి | యయాతి | యయాతి | | యయాతి | క్షాత్రవృద్ధుడు | యయాతి | పృథువు | | భలందానుడు | | |
| 7 | 3044 | యదువు | యదువు | ద్రుహ్యుడు | తుర్వసుడు | | పురువు | | అను | విష్టారాశ్వుడు | | | | |
| 8 | 3026 | క్రోష్టువు | సహస్రజిత్తు | భభ్రువు | | | జనమేజయుడు 1 | | సభానరుడు | అర్ద్రుడు | ఉదవసు | వత్సప్రి | | |
| 9 | 3008 | | శతజిత్తు | సేతుడు | | | ప్రాచీన్వతుడు | | కాలనలుడు | యువనాశ్వుడు 1 | | ప్రంశువు | | |
| 10 | 2990 | | | అంగారుడు | | | ప్రవీరుడు | | సృంజయుడు | శ్రవస్తుడు | | ప్రజని | | |
| 11 | 2972 | విరించివతుడు | | గౌధరుడు | | | మనస్యు | | పురంజయుడు | బృహదాశ్వుడు | నందివర్ధనుడు | ఖనిత్రుడు | | |
| 12 | 2954 | | | ధర్ముడు | | | అభయదుడు | | మహాశాలుడు | కువలాశ్వుడు | | క్షుపుడు | | |
| 13 | 2936 | | | ధృతుడు | | | ధుంధుడు | | మహామానసుడు | దృఢాశ్వుడు | | | | |
| 14 | 2918 | స్వాహి | హైహయుడు | | వహ్ని | | బహుగవుడు | సునహోత్రుడు | ఉశీనరుడు అహి | ప్రమోదుడు | సుకేతువు | | | |
| 15 | 2900 | | ధర్మనేత్రుడు | | | | సంయాతి | కశ | శిబి | హర్యశ్వుడు | | | | |
| 16 | 2882 | | కుంతి | | | | అహంయాతి | రాష్ట్రుడు | బలి | నికుంభుడు | | | | |
| 17 | 2864 | ఋషద్గువు | సహజ్జుడు | | | | రుద్రాశ్వుడు | దీర్ఘతపసుడు | | సమహతాశ్వుడు | దేవరాట్టు | | | |
| 18 | 2846 | | మహిష్మతుడు | | | | ఋచేయుడు | ధన్వుడు | | అక్రశాశ్వుడు | బృహదుక్థుడు | | | |
| 19 | 2828 | చిత్రరథుడు | | | | | మతినారుడు | ధన్వంతరి | | ప్రసేనజిత్తు | మహావీర్యుడు | | | |
| 20 | 2810 | శశబిందుడు | | | | | తంశువు | కేతుమతుడు 1 | | యువనాశ్వుడు 2 | ధృతిమతుడు | | | |
| 21 | 2792 | పృథుశ్రావసుడు | | | గర్భుడు | భీముడు | | భీమరథుడు | | మాంధాత్ర | సుధృతి | | | |
| 22 | 2774 | అంతరుడు | | | | కాంచనప్రభుడు | | దివోదాసుడు | | పురుకుత్సుడు | దృష్టకేతువు | | | |
| 23 | 2756 | | భద్రశ్రేణ్యుడు | | | జహ్నువు | | అష్టరథుడు | | త్రాసదశ్వుడు | హర్యాశ్వుడు | | | |
| 24 | 2738 | సుయజ్ఞుడు | దుర్దముడు | | | సుహనుడు | | | | సంభూతుడు | | | | |
| 25 | 2720 | | క్షేమకుడు పుణ్యజన రాక్షసులు | | | అజకుడు | | | ఆనవ (తూర్పు) | అనారణ్యుడు | | | | |
| 26 | 2702 | ఉశానుడు | | | | బాలకాశ్వుడు | | | తితిక్షువు | త్రాసదశ్వుడు | | | | |
| 27 | 2684 | | | | | | | | | హర్యాశ్వుడు | | | | |
| 28 | 2666 | సీనేయుడు | | | గోభానువు | కుశుడు | | | | వసుమతుడు | | వింశుడు | | |
| 29 | 2648 | | కనకుడు | | | కుశాశ్వుడు | | | కేకేయుడు | త్రిధన్వానుడు | | | | |
| 30 | 2630 | మరుత్తుడు | కృతవీర్యుడు | | | గాధి | | | | త్రయ్యారుణుడు | | | | |
| 31 | 2612 | | అర్జునుడు | | | | | | | | | | | |
| 32 | 2594 | కంబలబర్హి | | | | విశ్వామిత్రుడు | | హైహేయుల ఆధిపత్యం | | త్రిశంకుడు | | వివింశుడు | | |
| 33 | 2576 | | జయధ్వజుడు | | | | | | | హరిశ్చంద్రుడు | | | | |
| 34 | 2558 | రుక్మకవచుడు | తాళజంఘులు | | త్రిశానుడు | అష్టకుడు | | | | రోహితుడు | | | | |
| 35 | 2540 | | | | | | | | | హరిత, కంచు | | | | |
| 36 | 2522 | పారావ్రితుడు | వీతిహోత్రుడు | | | లౌహి | | | | విజయుడు | | | | |

# పర్జిటార్ పొందుపర్చిన పౌరాణిక క్షత్రీయ వంశావళులు II

| త్రేతాయుగం - పరిణత హరప్పాయుగం | | | | | | | | | | | | | పురాతత్వ యుగాలు | పౌరాణిక యుగాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| తరం | సంవత్సరం | యాదవ | హైహయ | ద్రుహ్యు | తుర్వస | కన్యాకుబ్జ | పౌరవ | కాశి | ఆనవ (వాయవ్య) | అయోధ్య | విదేహ | వైశాలి | | |
| 29 | 2648 | | కనకుడు | | | కుశాశ్వుడు | | | కేకేయుడు | త్రిధన్వానుడు | | | | |
| 30 | 2630 | మరుత్తుడు | కృతవీర్యుడు | | | గాధి | | | | త్రయ్యారుణుడు | | | | |
| 31 | 2612 | | అర్జునుడు | | | | | | | | | | | |
| 32 | 2594 | కంబలబర్హి | | | | విశ్వామిత్రుడు | | హైహయుల ఆధిపత్యం | | త్రిశంకుడు | | వివింశుడు | పరిణిత హరప్పా యుగం | త్రేతాయుగం |
| 33 | 2576 | | జయధ్వజుడు | | | | | | | హరిశ్చంద్రుడు | | | | |
| 34 | 2558 | రుక్మకవచుడు | తాళజంఘులు | | త్రిశానుడు | అష్టకుడు | | | | రోహితుడు | | | | |
| 35 | 2540 | | | | | | | | | హరిత, కంచు | | | | |
| 36 | 2522 | పారావ్రితుడు | వీతిహోత్రుడు | | | లౌహి | | | | విజయుడు | | | | |
| 37 | 2504 | | | | | | | | | రురుకుడు | | | | |
| 38 | 2486 | జయమఘుడు | అనంతుడు | | కరంధముడు | | | హర్యాశ్వుడు | | వృకుడు | | | | |
| 39 | 2468 | | దుర్జయుడు | | | | | సుదేవుడు | | బాహుకుడు | | | | |
| 40 | 2450 | విదర్భుడు | సుప్రతీకుడు | | మరుత్తుడు | | | దివోదాసుడు 2 | | | | ఖనినేత్రుడు | | |
| 41 | 2432 | క్రతభీముడు | | దుర్దముడు | వైశాలికి వలస | | | ప్రతర్దనుడు | | సగరుడు | | కరంధముడు | | |
| 42 | 2414 | | చిది | ప్రచేతుడు | | భారద్వాజుల నేతృత్వం | | వత్సుడు | | అసమంజసుడు | | అవీక్షితుడు | | |
| 43 | 2396 | కుంతి | | సుచేతుడు | | | దుష్యంతుడు | అలార్కుడు | | అంశుమనుడు | | మరుత్తుడు | | |
| 44 | 2378 | ధ్రిష్టుడు | | | | | భరతుడు | సన్నతి | అంగుడు | దిలీపుడు 1 | | నరిశ్యంతుడు | | |
| 45 | 2360 | నివృత్తి | | | | | వితాథ | సునీతుడు | దధివాహనుడు | భగీరథుడు | | దముడు | | |
| 46 | 2342 | విదూరథుడు | | | | | భువమన్యుడు | క్షేముడు | దివిరథుడు | శ్రుతుడు | | సుధృతి | | |
| 47 | 2324 | దశార్హుడు | | | | | బృహత్‌క్షాత్రుడు | కేతుమంతుడు 2 | ధర్మరథుడు | నాభాగు | | నరుడు | | |
| 48 | 2306 | వ్యోమనుడు | | | | | సుహోత్రుడు | ధర్మకేతువు | చిత్రరథుడు | అంబరీషుడు | | కేవలుడు | | |
| 49 | 2288 | జీమూతుడు | | | | | | సత్యకేతువు | సత్యరథుడు | సింధుద్వీపుడు | | బంధుమంతుడు | | |
| 50 | 2270 | వికృతి | | | | | | విభుడు | రుద్రరథుడు | అయుతాయువు | | వేగవంతుడు | | |
| 51 | 2252 | | | | | | హస్తి | సువిభుడు | | ఋతుపర్ణుడు | | బుధుడు | | |
| 52 | 2234 | భీమరథుడు | | | ఉత్తర పాంచాలులు | దక్షిణ పాంచాలులు | | సుకుమారుడు | | సర్వకాముడు | | తృణబిందుడు | | |
| 53 | 2216 | రథవరుడు | | ద్విమీఢుడు | | | అజామీఢుడు | దృష్టకేతువు | | సుదాసుడు | | విశ్రవసువు | | |
| 54 | 2198 | దశరథుడు | | | భారద్వాజుల ప్రాభవం | | | వేణుహోత్రుడు | | కల్మషపాదుడు | | | | |
| 55 | 2180 | ఏకాదశరథుడు | | | నీలుడు | బృహద్వసువు | ఋక్షుడు | భర్గుడు | | అశ్మకుడు | మారు | విశాలుడు | | |
| 56 | 2162 | శకుని | | | సుశాంతి | బృహదిశుడు | | | | ములకుడు | ప్రతింధకుడు | హేమచంద్రుడు | | |
| 57 | 2144 | కరంభుడు | | ధృతిమతుడు | పురంజనుడు | బృహద్ధనుస్సు | | సంవరణుడు | | శతరథుడు | దేవమీఢుడు | సుచంద్రుడు | | |
| 58 | 2126 | | | | ఋక్షుడు | బృహత్కర్ముడు | | | | ఐడవిలుడు | విబుధుడు | ధూమ్రాశ్వుడు | | |
| 59 | 2108 | దేవరాటుడు | | సత్యధృతి | భర్మ్యాశ్వుడు | జయద్రథుడు | | | | విశ్వసహుడు 1 | మహాధృతి | శ్రింజయుడు | | |
| 60 | 2090 | దేవక్షత్రుడు | | దృఢనేమి | ముద్గలుడు | విశ్వజిత్తు | | | | దిలీపుడు 2 | కీర్తిరథుడు | సహదేవుడు | | |
| 61 | 2072 | దేవనుడు | | | బ్రహ్మిష్టుడు | | | | | దీర్ఘబాహుడు | మహారోముడు | కృశాశ్వుడు | | |
| 62 | 2054 | | | సువర్మ | వధ్ర్యాశ్వుడు | సేనాజిత్తు | | | | రఘువు | స్వర్ణరోముడు | సోమదత్తుడు | | |
| 63 | 2036 | సత్వంతుడు | | సార్వభౌముడు | దివోదాసుడు | రుచిరాశ్వుడు | | | | అజుడు | హ్రస్వరోముడు | జనమేజయుడు | | |
| 64 | 2018 | భీమ సాత్వతుడు | | | మిత్రాయుడు | పృథుసేనుడు | | | | దశరథుడు | సీరధ్వజుడు | ప్రమతి | | |
| 65 | 2000 | | మధు | పౌరవమహంతుడు | సోమమైత్రేయుడు | పారుడు | | | | రాముడు | బానుమంతుడు | | | |
| 66 | 1982 | అంధకాసురుడు | పురువసుడు | | శ్రింజయుడు | నిపుడు | | | | | శతద్యుమ్నుడు | | | |
| 67 | 1964 | వృష్ణి | పురుద్వంతుడు | | చ్యవనుడు | | | | | కుశుడు | ముని | | | |

# పర్గిటార్ పొందుపర్చిన పౌరాణిక క్షత్రీయ వంశావళులు III

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | ద్వాపరయుగం - తుది హరప్పాయుగం | | | | | | | | | | | పురాతత్వ యుగాలు | పౌరాణిక యుగాలు |
| తరం | సంవత్సరం | యాదవ | చేదియ | ద్విమీఢులు | ఉ.పాంచాల | ద.పాంచాల | | పౌరవ | | అయోధ్య | విదేహ | అంగ | | |
| 64 | 2018 | భీమ సాత్వతుడు | | | మిత్రాయుడు | పృథుసేనుడు | | | | దశరథుడు | సీరధ్వజుడు | | | |
| 65 | 2000 | | మధు | పౌరవమహంతుడు | సోమమైత్రేయుడు | పారుడు | | | | రాముడు | భానుమంతుడు | | | |
| 66 | 1982 | అంధకాసురుడు | పురువసుడు | | శ్రింజయుడు | నిపుడు | | | | | శతద్యుమ్నుడు | | తుది హరప్పా యుగం | ద్వాపర యుగం |
| 67 | 1964 | వృష్ణి | పురుద్వంతుడు | | చ్యవనుడు | | | | | కుశుడు | ముని | | | |
| 68 | 1946 | సుధాజిత్తు | జంతు | | సుదాసుడు | | | | | అతిథి | ఊర్జవాహుడు | | | |
| 69 | 1928 | శిని | | | సహదేవుడు | | | సంవరణుడు | | నిషాదుడు | సనద్వజుడు | | | |
| 70 | 1910 | సత్యకుడు | | | సోమకుడు | | | పౌరవులు | | నలుడు | శకుని | | | |
| 71 | 1892 | సాత్యకి | | | జంతు | | కురు | | | నభుడు | అంజనుడు | | | |
| 72 | 1874 | | | | | | | | | పుండరీకుడు | ఋతుజిత్తు | | | |
| 73 | 1856 | జయుడు | | | | | పరిక్షిత్తు 1 | జహ్నువు | సుధన్వుడు | క్షేమధన్వుడు | అరిష్టనేమి | | | |
| 74 | 1838 | కుంతి | | | | | జనమేజయుడు 2 | | సుహోత్రుడు | దేవానికుడు | శ్రుతాయువు | | | |
| 75 | 1820 | అనమిత్రుడు | | | | | భీమసేనుడు + | సురథుడు | చ్యవనుడు | అహీనాగు | సుపార్శ్వుడు | | | |
| 76 | 1802 | వృష్ణి | | రుక్మనాథుడు | | సమరుడు | విదురథుడు | | కృతుడు | పరిపాత్రుడు | సంజయుడు | | | |
| 77 | 1784 | చిత్రరథుడు | | | | | సార్వభౌముడు | మగధ | చేది | దళ బలులు | క్షేమారి | | | |
| 78 | 1766 | విదూరథుడు | కుకురుడు | సుపార్శ్వుడు | | పారుడు 2 | జయత్సేనుడు | | వసు చైద్యుడు | ఉక్థుడు | అనేనుడు | | | |
| 79 | 1748 | శూరుడు | వహ్ని | సుమతి | | | అరథి | బృహద్రథుడు | ప్రత్యగ్రహుడు | వజ్రనాభుడు | మీనరథుడు | | | |
| 80 | 1730 | శిని | విలోముడు | | | పృదువు | మహాభౌముడు | కుశాగ్రుడు | | శంఖనుడు | సత్యరథుడు | | | |
| 81 | 1712 | భోజుడు | కపోతరోముడు | సన్నతి | | | అయుతాయుషుడు | | | వ్యుషితాశ్వుడు | ఉపగురు | | | |
| 82 | 1694 | హృదికుడు | | | | | అక్రోధనుడు | ఋషభుడు | | విశ్వసహుడు | ఉపగుప్తుడు | | | |
| 83 | 1676 | శూరుడు | తుంబురుడు | | | | దేవాతిథి | పుష్పవంతుడు | | హిరణ్యనాభుడు | స్వగతుడు | | | |
| 84 | 1658 | వసువు | | కృతుడు | | విభ్రాజుడు | ఋక్షుడు 2 | | | పుష్యుడు | సువర్చస్సు | | | |
| 85 | 1640 | దేవభాగుడు | | | | | భీమసేనుడు | సత్యహితుడు | | ధ్రువసంధి | శ్రుతుడు | | | |
| 86 | 1622 | దేవశ్రవనుడు | దుందుభి | | | అనూహుడు | దిలీపుడు | సుధన్వానుడు | | సుదర్శనుడు | సుశ్రుతుడు | | | |
| 87 | 1604 | అనకుడు | | | | బ్రహ్మదత్తుడు | ప్రతీపుడు | | | అగ్నివర్ణుడు | జయుడు | | | |
| 88 | 1586 | సృంజయుడు | దరిద్రుడు | | | విష్వక్సేనుడు | | ఊర్జుడు | | శీఘ్రుడు | విజయుడు | | | |
| 89 | 1568 | కాకానికుడు | వసువు | | | ఉదక్సేనుడు | ఋష్టిసేనుడు | | | మారుడు | ఋతుడు | | | |
| 90 | 1550 | శ్యామకుడు | నాహుకుడు | ఉగ్రాయుధుడు | | బల్లాటుడు | శంతనుడు | సంభవుడు | | ప్రసుశ్రుతుడు | సునయుడు | | | |
| 91 | 1532 | వత్సుడు | ఆహుకుడు | క్షేమ్యుడు | పృషతుడు | జనమేజయుడు | భీష్ముడు | | | సుసంధి | వీతహవ్యుడు | | | |
| 92 | 1514 | కవూకుడు | ఉగ్రసేనుడు | సువీరుడు | భారద్వాజులు | | విచిత్రవీర్యుడు | జరాసంధుడు | దామఘోషుడు | అమర్షుడు | ధృతి | | | |
| 93 | 1496 | వసుదేవుడు | కంసుడు | నృపంజయుడు | ద్రోణుడు | ద్రుపదుడు | ధృతరాష్ట్రుడు | | | విశ్రుతవంతుడు | బహులాశ్వుడు | అంగ | | |
| 94 | 1478 | బలరాముడు | | బహురథుడు | అశ్వత్థామ | ధృష్టద్యుమ్నుడు | యుధిష్ఠిరుడు | సహదేవుడు | శిశుపాలుడు | బృహద్బలుడు | కృతక్షణుడు | కర్ణుడు | | |
| 95 | 1460 | సాంబుడు | | | | దృష్టకేతు | అభిమన్యుడు | సోమధి | దృష్టకేతు | బృహత్క్షయుడు | | వృషసేనుడు | | |

మహాభారతయుద్ధం

లిపిలో రచించిన మృణ్మయ ఫలకాలు దొరికాయి. హరప్పా నాగరికతా క్షేత్రంతో ఆ సంస్కృతులకి వాణిజ్య సంబంధాలు కొనసాగాయనడానికి ఈ రెండు ప్రాంతాల్లో దొరికిన ముద్రలే సాక్షం.

సుమేరియాలో తుది గ్రామీణ సంస్కృతుల కాలాన్ని *ఉరుక్* యుగంగా వ్యవహరిస్తారు. ఈ యుగం క్రీపూ. 3100 ప్రాంతంలో అంతమై తొలి రాచరిక వ్యవస్థకి (జందెట్ నసర్) శ్రీకారం చుట్టబడింది. అదే కాలంలో సంభవించిన పెద్ద జలప్రళయాన్ని గురించి ఆ సంస్కృతిలో కథలు ఉన్నాయి. శురుప్పాక్ అనే ప్రదేశంలో పురాతత్వ శాస్త్రజ్ఞులు జరిపిన తవ్వకాల్లో క్రీపూ. 3100 నాడు ఆ ప్రాంతం గొప్ప ముంపుకు గురియైన ఆనవాళ్ళు కనుగొన్నారు. ఆ వరద స్తరానికి ముందు ఉరుక్ సంస్కృతి, తరువాతి స్తరాలు తొలిరాచరికపు సంస్కృతిని సూచిస్తాయి. మన పురాణాల్లో మనువు కథ (మత్స్యావతారం) కూడా అలాంటి జలప్రళయాన్ని గురించి చెబుతుంది. మన పట్టికలోని మనువు కాలం శురుప్పాక్ జలప్రళయానికి సరితూగుతుంది. మనువు సంతతితో ఆరంభమైన సంప్రదాయక రాచరికం, తొలి హరప్పా సంస్కృతిలో మొదలైన ప్రగతికి సరిపోతుంది.

అక్కడియన్ మృణ్ఫలకాల్లోని *ఎన్‌మెర్కర్* అనే సుమేరియా రాజు కథలో *అరట్ట* అనే తూర్పు దేశపు ప్రసక్తి ఉంది. అరట్ట సింధునది ప్రాంతానికి చెందినదని భౌగోళిక ఆధారాలే కాక మహాభారతంలోని ప్రస్తావనలు కూడా సూచిస్తాయి. *ఎన్‌మెర్కర్ ఉరుక్* రాజవంశానికి చెందినవాడు. అతడి రాజ్యకాలంలో అరట్ట దేశంలో నదీదేవత ఆగ్రహం వల్ల గొప్ప కరువు చోటుచేసుకుందట. అరట్ట దేశానికి రాజైన *అల్ సగ్యుర్* అన్న ఎన్‌మెర్కర్‌కి ధాన్యం రూపేణా కప్పం చెల్లించమని వర్తమానం పంపాడని కథనం. మన పురాణాల్లో సగర చక్రవర్తి కాలంలో వచ్చిన క్షామం, అతడి నూర్గురు లేదా 65వేలమంది కుమారులు శాపగ్రస్తులు కావడం, సగరుని మునిమనవడు భగీరథుడు గంగని భువికి దించి వారికి శాపవిముక్తి కలిగించడం చదువుకున్నాం. క్రీపూ. 2500–2400 ప్రాంతంలో సత్లూజ్ నది పశ్చిమానికి మళ్ళి సింధునదిలో కలవడం వల్ల సరస్వతీ పరివాహక క్షేత్రంలో కరువు వచ్చినట్లు ప్రముఖ పురాతత్వవేత్త *రైక్స్* కూడా సూచించాడు. అదే సమయంలో మొహెంజొదారో ప్రాంతంలో వరదల కారణంగా మట్టి మేటవేసిన సూచనలు కూడా కనిపిస్తాయి. ఈ రెండు పరిణామాలకీ కారణం నదీ ప్రవాహ దిశలో వచ్చిన పెనుమార్పే. కాబట్టి ఎన్‌మెర్కర్ కథలోని అల్ సగ్యుర్ అన్న, మన పురాణ వంశావళుల్లోని సగరుడు ఒకరే అనుకోవచ్చు. మన పట్టికలో సగరుని రాజ్యకాలం క్రీపూ. 2432 - 2414. సుమేరియాపై అక్కడియన్ రాజు సార్గన్ దాడి క్రీపూ. 2250 ప్రాంతంలో జరిగిందని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. దానికి ఏడు తరాల ముందువాడు ఎన్‌మెర్కర్. అంటే అతడు కూడా 25వ శతాబ్దం చివరి దశకి చెందుతాడు. సగరుని కాలం ఎన్‌మెర్కర్ కాలానికి సరిపోతుంది.

కనుక మెసోపొటేమియాకి చెందిన పై రెండు ఆధారాలు మన పట్టికలోని కాలక్రమాన్ని, ఇతిహాసపురాణ సంప్రదాయంలోని క్షత్రియ వంశావళులు హరప్పా నాగరికత నేపథ్యానికి చెందినవనే ప్రతిపాదనని సమర్థిస్తాయి.

**ముగింపు :**

క్షత్రియ వంశావళులు హరప్పా నాగరికత నేపథ్యానికి చెందినవి అనే ఈ వాదంతో ముందుకెళ్లాలంటే, ముందుగా ఆర్యుల వలస సిద్ధాంతానికి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలని పరిశీలించడం ఆవశ్యకం. హరప్పా నాగరికత మొగ్గతొడగక ముందే వాయవ్య భారత ఉపఖండంలో స్థానిక వ్యావసాయక పశుపాలక సంస్కృతులు కనిపిస్తాయి. ఆ భిన్న సంస్కృతుల కలయిక, సమకాలీన బాహ్య సమాజాలతో సంబంధాలు, హరప్పా నాగరికతగా రూపొందేందుకు దోహదం చేసాయి. వంశావళుల్లోని క్షత్రియ సంప్రదాయాన్ని పక్కన పెడితే, వేదవాఙ్మయంలో, పురాణ ఐతిహ్యాలలో, ఆ వ్యవస్థలకీ పరిణామాలకీ చెందిన కొన్ని సూచనలు కనిపిస్తాయి. హరప్పా యుగానికి చెందిన చరిత్ర విశ్లేషించే ముందు ఆ నాగరికతకి పునాదిగా పనిచేసిన ప్రాగ్‌హరప్పా సంస్కృతులని, అప్పటి భౌగోళిక నేపథ్యాన్ని వచ్చే సంచికలో పరిశీలిద్దాం.



సాయి పాపినేని

సాయి పాపినేని
బెంగుళూరు

కాత్యాయనీ విద్మహే

# సాహిత్యాకాశంలో సగం

– ప్రొ. రావినూతల సత్యనారాయణ

సమాజానికి, సాహిత్యానికి, రాజకీయాలకి, అవినాభావ సంబంధం ఉంది. తెలుగు సాహిత్యం పై వివిధ ఉద్యమాల ప్రభావం కనిపిస్తుంది. ముఖ్యంగా కవిత్వంపై ఉద్యమాల ప్రభావం ఎక్కువగానే స్ఫురిస్తుంది. ఉద్యమం అంటే ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించటంకోసం జనం సామాజికంగా చేసే ప్రయత్నం. ఏ ఉద్యమమైనా మార్పుకోసం వస్తుంది. పాత పై తిరుగుబాటుజేసి, నిరసించి కొత్త కోసం ఆవిర్భవిస్తుంది. సామాన్యంగా చాలామంది ఉద్యమాలను వాదాలుగా కూడా పరిగణిస్తారు.

తెలుగు సాహిత్యంలో అనేక ఉద్యమాలు వచ్చాయి. అయితే, స్త్రీలను గురించి పట్టించుకొన్న ఉద్యమాలు తక్కువ. శ్రీ కందుకూరి వీరేశలింగం, చలం స్త్రీల కోసం ఉద్యమ స్థాయిలో ప్రయత్నం చేశారు. ముఖ్యంగా చలం మొదటిసారి 1928 లో విడాకుల బిల్లు అసెంబ్లీలో చర్చకు వచ్చేనాటికే శశిరేఖ, స్త్రీ వంటి రచనలు చేశాడు. సమాజంలో స్త్రీ స్థానాన్ని నిర్ణయించే అంశాలైన లైంగికత్వం, మాతృత్వం, శ్రమల గురించి తన నవలల్లో ఆధునికమైన ఆలోచనలు, అభ్యుదయ భావాలు వ్యక్తపరచాడు. స్త్రీ పురుష సంబంధాలను గురించి పైపై విషయాలను కాకుండా, ప్రతి విషయాన్ని పునాదులతోసహా కదిలించి ప్రశ్నించాడు. స్త్రీలలో ప్రేమా, సెక్సు, వ్యక్తిత్వం – ఈ మూడింటినీ అణచి వేస్తున్న వివాహ వ్యవస్థలోని పురుషాధిపత్యాన్ని, కపటత్వాన్ని తన నవలల్లో ఖండించాడు. వివాహ బంధం నుండి బయటికి నడచిన స్త్రీలకి పతనంతప్ప మరో దారి లేదని రచయితలు వ్రాస్తున్న రోజుల్లో చలం స్వేచ్ఛ కోసం అన్వేషించి, జీవించి పోరాడిన స్త్రీలను వీరవనితలుగా పేర్కొని కీర్తించాడు!



కాత్యాయనీ విద్మహే

వివాహ బంధంలో స్త్రీ పురుషుల మధ్య జరిగిన శ్రమ విభజనలోని అన్యాయాన్ని ఎత్తిచూపించాడు. ఇంటి పని మొత్తం స్త్రీ చెయ్యవలసి రావటం, ఇంటిపని అంటే గౌరవం లేకుండా పోవటం గుర్తించి, తన రచనల ద్వారా ఈ విషయాలను చర్చనీయాంశాలుగా మార్చాడు.

అలాగే, వైవాహిక సంబంధాలను వివిధ కోణాల నుండి పరిశీలించి చర్చించిన మరో రచయిత కొడవటిగంటి కుటుంబరావు. ప్రేమ, పెళ్ళి – వీటిలో స్త్రీల స్థితిగతులులాంటి అనేక విషయాలమీద కేంద్రీకరించి, ఆర్థిక స్వాతంత్ర్యం, స్వేచ్ఛ గల స్త్రీపురుషుల మధ్య ముందు తరాలలో ఉన్నతమైన ప్రేమ సాధ్యపడవచ్చుననే అశాభావాన్ని తన రచనలలో వ్యక్తపరచాడు.

ఇక 60వ దశాబ్దము నుండి వెలువడిన రచనల్లో స్త్రీల ప్రతిపత్తిని గురించి సమాజంలో ఉన్న భిన్నాభిప్రాయ, వాదోపవాదాలు, గందరగోళం చాలామంది రచయిత్రులు తమ రచనల ద్వారా అభివ్యక్తపరచారు. 1970లో అమెరికాలో ఒక తీవ్రమైన ధోరణి తలెత్తింది. Second sex, A Room of one's own, Sexual Politics, The Feminine వంటి పుస్తకాలు ప్రచురితమయ్యాయి. దానికితోడు ఐక్యరాజ్య సమితి 1975–85 దశకాన్ని మహిళా దశాబ్దంగా ప్రకటించింది. ఈ సంఘటన పాశ్చాత్య దేశాలలో స్త్రీ విముక్తి పోరాటాలకు ఊపునిచ్చింది. ఆంగ్లంలో Feminism అనే పదానికి పర్యాయపదంగా తెలుగులో స్త్రీ వాదం అనే పదం వాడకంలోనికి వచ్చింది. స్త్రీవాదం అనే పదానికి చాలామంది నిర్వచనాలు వివరణలు ఇచ్చారు. ఉదాహరణకు ఈ క్రింది నిర్వచనాన్ని గమనించండి.

"సమాజంలో అన్ని రంగాలలోను స్త్రీకి సమాన భాగస్వామ్యం ఉండాలనీ, ఆడవాళ్ళ వ్యక్తిత్వమూ, జీవితమూ, కొందరి చెప్పుచేతలకి లోబడి తీర్చిదిద్దబడే పరిస్థితి మారాలనీ, ముఖ్యంగా ఆడది (స్త్రీ), తల్లిగా, భార్యగా మాత్రమే ముద్రవేయబడే ఒక Label నుంచి మనిషిగా గుర్తింపబడే స్థితికి, రావాలని – దానికోసం సాంస్కృతికంగాను, సామాజికంగాను, సాహిత్యపరంగానూ, మర్రి ఊడలై విస్తరించి ఉన్న పురుష స్వామ్యపు భావజాలం పోవాలనీ, ఈ భావాలతో

సాగుతున్న ఉద్యమమే Feminism అని చాలామంది భావం. స్త్రీల ఆత్మ చైతన్యానికై, అభిమానానికై రూపొందించబడిన ఆలోచనా ధోరణే స్త్రీవాదం".

స్త్రీవాద దృక్పథం అంటే స్త్రీల జీవితాల్లోని సాంఘిక, ఆర్థిక, రాజకీయ అంశాలను పురోగామి దిశగా మలుపు తిప్పగల ఒకానొక మార్గం. ఈరోజు అన్ని రంగాలలోను స్త్రీ పురుషుల మధ్య ఉన్నవి ముఖ్యంగా అధికార, బానిస సంబంధాలే! ఈ తత్వాన్ని స్త్రీవాదం ప్రశ్నిస్తుంది, సరిచేస్తుంది. సామాజికంగా, ఆర్థికంగా, లైంగికంగా స్త్రీలను దోపిడి నుంచి విముక్తి చేసే సిద్ధాంతమే స్త్రీవాదం.

పైన పేర్కొనిన ఆశయాలతో స్త్రీవాదం మొదలై 1980 నుండి బలమైన వాదంగా స్థిరపడింది. స్త్రీవాదుల్లో అతివాదులు, మితవాదులు అనే వర్గాలు సహితం బయలుదేరాయి! పితృస్వామ్య వ్యవస్థకూ, సాహిత్యానికి వున్న సంబంధాన్ని గుర్తించి, దానిని ధిక్కరించే క్రమంలో స్త్రీవాదం పుట్టింది. స్త్రీల అస్తిత్వానికీ, దాని ప్రయోజనానికి, అంతకు పూర్వం ఉన్న నిర్వచనాలను తుడిపివేసి, కొత్తవి సృష్టించుకొనే ప్రయత్నంలో స్త్రీవాదం పుట్టింది. 1975 తర్వాత స్త్రీవాదం ఒక నిర్దిష్ట రూపం దాల్చింది.

**సాహిత్యాకాశంలో సగం :**

గత వంద సంవత్సరాలలో తెలుగు సాహిత్యంలో భాగమైన స్త్రీల సమస్యలు, వానిలో వచ్చిన మార్పులు, ఆ సాహిత్య ప్రపంచంలో స్త్రీలు తమ సమస్యలను చైతన్యవంతంగా తమ రచనలలో వ్యక్తపరచిన విధానం లోతుగా అధ్యయనం చేసి, సాహిత్యాకాశంలో సగం అనే పుస్తక రూపంలో మనముందు ఉంచారు. ఈ గ్రంథం కాత్యాయనీ విద్మహే గారి పాతిక సంవత్సరాల పరిశోధనా పరిశ్రమకు ప్రతిరూపం.

*సాహిత్యాకాశంలో సగం* అనే రచన 2013వ సంవత్సరంలో తెలుగులో ప్రచురితమైన పుస్తకాలలో ఉత్తమ గ్రంథంగా కేంద్ర సాహిత్య అకాడమీ వారిచే ఎంపిక చేయబడి, 2013వ సంవత్సరపు జాతీయ పురస్కారాన్ని అందుకొన్నది. దీనిని తెలుగులో స్త్రీల సాహిత్యానికి లభించిన గుర్తింపుగాను, గౌరవంగాను పరిగణించవచ్చు. ఇది ముదావహం.

శ్రీమతి కాత్యాయనీ విద్మహే గారు 1955వ ప్రాంతంలో జన్మించారు. వారి తండ్రి కేతవరపు రామకోటి శాస్త్రి గారు, తల్లి శ్రీమతి ఇందిరాదేవి గారు. విద్మహే గారి ఉన్నత విద్యాభ్యాసం, ఉద్యమ వాతావరణం, అభ్యుదయ భావాలకు ఆలవాలమైన కాకతీయ విశ్వవిద్యాలయంలో జరిగింది. తెలుగులో ఎం.ఎ. పట్టా పుచ్చుకొని, నవలా పరిశోధనాంశం పి.హెచ్.డి.కి అన్వేషణాంశంగా స్వీకరించి, ఆ విషయంపై కాకతీయ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేటు డిగ్రీ పుచ్చుకున్నారు. శ్రీమతి కాత్యాయనీ విద్మహే గారి సాహిత్య గమనాన్ని నిర్దేశించిన శక్తులు ఆమె తండ్రిగారు రామకోటి శాస్త్రి గారు, ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి గారు, ఆచార్య చేకూరి రామారావు గారు. వీరేకాక, ఇంకా చాలామంది సాహిత్య వేత్తల సహాయ, సహకార, ప్రోత్సాహాలు విద్మహే గారికి లభించాయి.

కాత్యాయనీ విద్మహే గారి సాహిత్య ప్రస్థానం ఆమె చిన్ననాటి నుండే మొదలైందని చెప్పవచ్చు. 1982లో ఆమె స్త్రీ జనాభ్యుదయ సంస్థను ఏర్పరచుకొని, అటు సామాజిక రంగంలోను, ఇటు సాహిత్య అధ్యయన రంగంలోను పనిచేయనారంభించారు. తెలుగు సాహిత్యంలో స్త్రీ, స్త్రీల సాహిత్యం ఈ రెండు విషయాలపై ఆమె అధ్యయనం కేంద్రీకృతమైంది. 1988లో *సాంప్రదాయ సాహిత్యం – స్త్రీవాద దృక్పథం* అనే పుస్తకం, 2006లో *ఆధునిక తెలుగు సాహిత్యం – స్త్రీవాద భూమిక,* 2010లో *సాహిత్యాకాశంలో* సగం అనే పుస్తకాలు ప్రచురించారు. *సాహిత్యాకాశంలో సగం* అనే పుస్తకం రెండవ ముద్రణ 2013లో జరిగింది. అదే సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ వారి జాతీయ పురస్కారం ఆ పుస్తకానికి లభించింది. ఆ పుస్తకం యొక్క వివరణాత్మక విశ్లేషణమే ఈ వ్యాసం యొక్క ముఖ్యోద్దేశం.

కాత్యాయనీ గారు స్త్రీ సాహిత్యంపై చదివిన ప్రసంగ పాఠాలు, సమీక్షల కలయికగా ఈ సంపుటిని వెలువరించారు. ఈ పుస్తకంలో మొత్తం 28 వ్యాసాలు ఉన్నవి. ఈ పుస్తకానికి ఇద్దరు ప్రముఖ రచయిత్రులు – డా. నళిని, ముదునూరి భారతి ముందుమాట విడివిడిగా వ్రాశారు. నళినీ గారు *స్త్రీవాద సాహిత్య విమర్శలో* అవిరళ కృషి అనే అంశంపై వ్రాస్తే, భారతి గారు *స్త్రీ సాహిత్య దశలను* గురించి వివరించారు.

ఈ సంపుటిలోని వ్యాసాలు వేరువేరు సందర్భాలలో అప్పటి అవసరాలరీత్యా వ్రాసినవి. అందుచేత వస్తు ఐక్యత లోపించింది. అంతేకాక, కొంతమేరకు పునరుక్తులు కూడా

కనిపిస్తాయి. ఈ పుస్తకంలో సమూహంగా మహిళా కవులను, కథారచయితలను కొంతమందిని ప్రస్తావిస్తూ వ్రాసిన వ్యాసాలతో పాటు, సమకాలీన కవులు పదిమంది మీద, కథారచయితలు ఏడుగురి మీద వ్రాసిన ప్రత్యేక వ్యాసాలు పొందుపరుచ బడ్డాయి. విద్మహే గారు ఈ వ్యాస సంపుటిలో రెండు విషయాలను గూర్చి విపులంగా చర్చించారు. ఒకటి *స్త్రీల కవిత్వం*, రెండవది *తెలుగు కథా – స్త్రీవాదం*. స్త్రీల కవిత్వాన్ని గురించి రెండు భాగాలలో వివరించారు. తొలిభాగంలో స్వాతంత్ర్య పూర్వ రంగానికి చెందిన కవయిత్రులను గూర్చి ముచ్చటించారు. స్వాతంత్ర్యానంతరం వ్రాసిన వారిని గురించి కూడా కొంత చర్చ ఇందులో కనిపిస్తుంది. అయితే, ఎక్కువ భాగం ఆధునిక రచయిత్రులను గురించిన విశ్లేషణాత్మక వ్యాసాలే సంకలనంలో చోటుచేసుకున్నాయి.

**స్త్రీల కవిత్వం :**

తెలుగులో ప్రాచీన కాలంలోనేకాక, ఆధునిక కాలంలో సహితం కవయిత్రుల సంఖ్య చాలా తక్కువ. దానికి కారణం కవితా రచనకు ప్రతిభా వ్యుత్పత్తులు కావాలి. ప్రతిభా వ్యుత్పత్తుల ఆర్జనకు, అవకాశాలు, సదుపాయాలు మన సమాజంలో పురుషులతో పోలిస్తే స్త్రీలకు అతి తక్కువ. బ్రిటీషు పరిపాలన వలన వచ్చిన ఆధునిక ప్రజాసామ్య వ్యవస్థలు, విద్యాసంస్థలు, తదితర ఉద్యమాలు స్త్రీ రచయితలను కవిత్వంవైపు ఆకర్షింపలేకపోయాయి.

శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ 1951లో ఆంధ్ర కవయిత్రులు అనే గ్రంథాన్ని రచించారు. అందులో ఉల్లేఖించిన వారిలోఎక్కువ మంది స్వాతంత్ర్యానికి పూర్వపు వారే! తర్వాత కాలపు కవయిత్రులను గూర్చిన వివరాలు ఎవ్వరూ సమీకరించి ప్రచురించలేదు. స్వాతంత్ర్యం పూర్వ కవయిత్రులు, ప్రధానంగా పద్యాలు వ్రాయుటలో ఎక్కువ ఉత్సాహం చూపించారు. తాళ్ళపాక తిమ్మక్క, మొల్ల, ముద్దుపళని వంటివారు కావ్యరచనలు చేశారు.

ఆధునిక తెలుగు కవిత్వ పుచరిత్రలో భావకవిత్వ శాఖకు ప్రతినిధులుగా చావలి బంగారమ్మ, తల్లాప్రగడ విశ్వసుందరమ్మ, బసవరాజు రాజ్యలక్ష్మమ్మ (సౌదామిని), అనే ముగ్గురు పేరుప్రఖ్యాతులు ఆర్జించారు. అలాగే, జాతీయోద్యమ కవిత్వ శాఖలో కాంచనపల్లి కనకాంబ, న్యాయపతి వెంకట విజయలక్ష్మమ్మ, వీరపనేని సరోజిని, కనుపర్తి వరలక్ష్మమ్మ, వక్కలెంక రమాబాయి మొదలైన కొద్దిమంది పేర్లూ, అభ్యుదయ కవిత్వ శాఖలో వట్టికొండ విశాలాక్షి వంటి ఒకరిద్దరి పేర్లే తరచుగా ప్రస్తావింప బడుతాయి. వీళ్ళ కవిత్వమైనా, సమగ్రంగా ఒకచోట సంపుటీకరింపబడలేదు. ఈ మూడు ధోరణులలో కాక, ఇతర విషయాలలో స్త్రీలు వ్రాసిన కవిత్వం అసలు లెక్కలోకి రాకుండానే పోయింది! మరుగు పడిన స్త్రీల కవిత్వంపై సమగ్రమైన పరిశోధన జరిగితే అనేక కవితా విశేషాలు వెలుగులోనికి రావచ్చు.

స్వాతంత్ర్యానికి పూర్వం స్త్రీల కవిత్వం అనే వ్యాసంలో కాత్యాయనీ విద్మహే అనేక విషయాలను ఆవిష్కరించారు. తదుపరి వ్యాసాలు (6–14) స్త్రీవాద కవిత్వ విశ్లేషణకు సంబంధించినవి. అందుచేత స్త్రీవాద కవిత్వాన్ని గురించి, అలాంటి కవిత వ్రాయు కవయిత్రులను గూర్చి తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

**స్త్రీవాద కవిత్వం :**

1975కు పూర్వం రచన చేసిన రచయిత్రులు స్త్రీల సమస్యలలోని రాజకీయ స్వభావాన్ని కానీ, దాని వెనుకనున్న పితృస్వామ్య భావజ్వాల మూలాలను కానీ, జండరు రాజకీయాలు గానీ, లోతుగా పరిశీలించలేదని భావించాలి. ఒక సమస్య ఎదురైనప్పుడు దానిని సాహసంతో, ఆత్మవిశ్వాసంతో, పరిష్కరించుకోవాలన్న సందేశాన్ని మాత్రం వీరు స్త్రీలకు అందించారు. ఒక సమస్యని అర్థం చేసుకోవలసిన వైనాన్ని, చిరకాలంగా స్త్రీలు సమస్యలుగా గుర్తించని సన్నివేశాలను స్త్రీవాద సాహిత్యం ఎత్తిచూపింది. స్త్రీలు తమ సమస్యలను వ్యక్తిగత సమస్యలుగా కాక, సామాజిక సమస్యలుగా పరిగణించడం, ఉత్పత్తి సంబంధాలతోపాటు పునరుత్పత్తి సంబంధాలను కూడా అర్థం చేసుకోవడం, తమ జీవితంలోని వ్యక్తిగతమంతా రాజకీయమేనని గుర్తించడం, స్త్రీవాద కవిత్వానికి ప్రేరణ యిచ్చిన అంశాలు. కొన్ని శతాబ్దాలుగా తమను గురించి సమాజంలో పాతుకుపోయిన Mythలను బద్దలుకొట్టడం, తమకు ఆపాదించిన శక్తినీ, అశక్తతనీ, సహేతుకంగా విశ్లేషించడం స్త్రీవాద కవిత్వం నిర్వహించిన ముఖ్య కర్తవ్యాలు. గత రెండు మూడు దశాబ్దాలుగా సాహిత్యాన్ని అత్యధికంగా ప్రభావితం చేసి, తెలుగు కవిత్వానికి కొత్త వస్తువునూ, కొత్త రూపాన్నీ, తాత్వికతనూ అందించిన కవిత్వం స్త్రీవాద కవిత్వం. అంతకు

ముందు కాలంలో స్త్రీలు ఆలోచించడానికైనా సాహసించని స్త్రీ జీవితంలోని అనేక విషయాలు, ఇప్పుడు స్త్రీవాద కవిత్వానికి వస్తువులయ్యాయి!

కాత్యాయనీ విద్మహే గారు వ్రాసిన అన్ని వ్యాసాలలోను ఈ విషయం స్పష్టంగా వ్యక్తపరచారు. ఆమె వ్యాసం సావిత్రి సాహిత్య జీవితం, పైన పేర్కొనిన కొన్ని విషయాలు మనం తెలుసుకోవడానికి వుపకరిస్తుంది. శ్రీమతి సావిత్రి స్త్రీ చైతన్యానికీ, అభివృద్ధికీ, కొత్త రూపానిచ్చిన కవయిత్రులలో మొదటి తరానికి చెందినవారు. పితృస్వామ్య వ్యవస్థ స్వభావంపట్ల స్పష్టంగా స్పందించిన కవయిత్రి సావిత్రి. నిత్యజీవితంలో అతి సహజంగా ప్రయోగించే మాటల వెనుక ఎంత స్త్రీ వ్యతిరేక భావజాలం ఇమిడి వుందో, ప్రపంచానికి చూపెట్టిన అసాధారణ కవయిత్రి సావిత్రి. అందుకే ఆమె రచించిన బందిపోట్లు స్త్రీవాద కవిత్వానికి ఒకవిధమైన మేనిఫెష్టో అయింది. సావిత్రి కవితలలో ఎక్కువ భాగం స్త్రీ జీవితంలోని వ్యధనూ, వేదననూ, వ్యక్తం చేస్తాయి. బందిపోట్లు కవిత పెండ్లిని గురించి వున్న కాల్పనిక భ్రమ, బద్దలుకొడుతుంది! సావిత్రి కవితకు సంక్షిప్తత, స్పష్టత, వ్యంగ్య ధ్వని అలంకారాలు అంటారు విద్మహే! *బందిపోట్లు* నుండి కొన్ని పంక్తులు పరిశీలించండి.

**"పాఠం ఒప్పజెప్పకపోతే పెళ్ళి చేస్తా"నని**
**పంతులుగారన్నప్పుడే భయమేసింది**
**"ఆఫీసులో నా మొగుడున్నాడు, అవసరమొచ్చినా**
**సెలవివ్వడ"ని**
**అన్నయ్య అన్నప్పుడే అనుమానమేసింది**
**"వాడికేం, మహారాజ" ని**
**ఆడామగా వాగినప్పుడే అర్థమైపోయింది**
**పెళ్ళంటే "పెద్ద శిక్ష" అని,**
**మొగుడంటే స్వేచ్ఛాభక్షకుడని.**
**మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే**
**మమ్మల్ని విభజించి పాలిస్తోందని"**

చివరి పంక్తుల్లో "పాలిచ్చి ... పాలిస్తోందని" అనడంలో శబ్ద చమత్కారంతో నిజాన్ని చాటిచెప్పడం గమనించాల్సిన విషయం.

1985–1995 దశాబ్దాన్ని, స్త్రీవాద కవిత్వ దశాబ్దంగా స్త్రీలు తమ స్వంతం చేసుకొన్నారనుటలో అతిశయోక్తి లేదు. ఈ దశాబ్ది కవులలో *కొండేపూడి నిర్మల* చెప్పుకోదగిన కవయిత్రి. ఆవిడ ప్రచురించిన కవితా సంపుటాలలో *బాధాశప్తనది,* ప్రత్యేకించి చెప్పుకోదగినది. అందులోని తొలి కవిత *బాధాశప్తనది* అయితే, ఆఖరు కవిత *సముద్ర జ్వరం.* ఈ రెండు కవితలు కూడా గొప్ప కవితలు. పీడిత ముస్లిం స్త్రీల అనుభవ కోణం నుండి వ్రాయబడినవి. అద్వితీయ పదబంధాల కల్పనలో, అలంకారిక రచనలో ప్రతిభ వున్న నిర్మల కవిత్వంలో వస్తు శిల్పాలు పోటీపడుతుంటాయి! "పురుషుడి ప్రేమలో తడిసిన తాజ్‌మహలు రాళ్ళ వెనుక పత్నాలుగో ప్రసూతి నరకాన కన్నుమూసిన పురుటివి *(బాధాశప్తనది)* అంటుంది నిర్మల! తాజ్‌మహల్ అమర ప్రేమనే గుర్తుకు తెచ్చే సాంస్కృతిక నేపథ్యంలో, ముంతాజ్‌మహల్ 14వ కానుపు భరించలేక మరణించిందని మనకు తెలియజేయడం, స్త్రీవాద కవిత్వ ప్రయోజనాన్ని నొక్కివక్కాణించడమే"!

బాధాశప్తనది కవితలు ప్రధానంగా స్త్రీల జీవిత సమస్యలను పలు కోణాల నుండి ఆవిష్కరించినవే. అయినా, అన్ని కవితలు స్త్రీవాద సంబంధితం కాదు. వస్తు వైవిధ్యం కల కవితలు ఈ సంపుటిలో పొందుపరచబడ్డాయి. జీవన్మరణ పోరాటం *బాధాశప్తనది* కవితలకు వస్త్వైక్యత కూర్చే అంశం. అందుచేత ఆ కవితలు మనలని ఉద్వేగానికి లోనుచేస్తాయి, పోరాటానికి సిద్ధం చేస్తాయి. *బాధశప్తనది* చేసిన *యుద్ధరావం* వ్యాసం నిర్మల కవితలకు మంచి వ్యాఖ్యానం.

*ఆకురాలు కాలం* మెహజబీ వ్రాసిన 26 కవితల సంకలనం. ఇందులోని కవితలన్నీ దేనికది ఏకబిగిన చదివించేవే! *చిట్టితల్లి, సరిహద్దు రేఖలు, స్ట్రీట్చిల్డ్రన్, ఎలిజీ,* వేటికవి వ్యక్తుల గురించి, సమూహాల గురించి వ్రాసిన *ఆధునిక మానసిక సిద్ధాంతం* కవితను మినహాయిస్తే, మిగిలిన 21 కవితలు స్త్రీల అనుభవం, ఆలోచనా, అనుభూతి కేంద్రంగా పాటించిన రచనలే. మెహజబీన్ కవిత్వంలో పితృస్వామిక వ్యవస్థల మీద విమర్శ, నిరసన ఎంతగా ఉంటాయో, ఉన్నత మానవీయ సంబంధాలపట్ల ఆకాంక్ష అంతగా ఉంటుంది. ఆమె కవిత్వం వేడి వెలుగుల సమ్మేళనంగా ఉంటుంది. ఉదాహరణకి

జీవిత బంధం తెగిపోయాక – బంధాలన్నీ బంధనాలే అని మొదలవుతుంది. *అమ్మకళ్ళు, శృంగారం* మెహజబీన్ కవిత్వ ప్రధానాంశం. అనుభవాల, అనుభూతుల అభివ్యక్తికి పరిపూర్ణ రూపంగా నిలచిన ఆ శృంగారమే స్త్రీ పురుష సంబంధాల గురించి మెహజబీన్ భావాలను, అభిప్రాయాలను,

ఆలోచనలను సునిశితంగాను, సూక్ష్మంగా వ్యక్తం చేస్తుంది.

*భవానీదేవి కవిత్వ శక్తి* అనే వ్యాసంలో కాత్యాయనీ విద్మహే భవానీదేవి. కవితా సంపుటి *వరనిశి*లోని కవితలను గురించి వివరించారు. చీకటిపై యుద్ధం ప్రకటించటం *వరనిశి* కవితల సారాంశం. చీకటి శాశ్వతం కాదన్న విశ్వాసం, చీకటి తరువాత వచ్చే వేకువ నిరీక్షణ, వెలుగు పట్ల ఆకాంక్ష, భవానీదేవి కవిత్వ నైజంగా మనం గ్రహించాలి. ఈ దిగువ పంక్తులు పరిశీలించండి.

**"నిన్నమొన్నటి దాకా చీకటి దారుల్లో**
**నేనొక నిరంతర అన్వేషణా రూపాన్ని!**
**తప్పిపోయిన పసిపాప నైజాన్ని!**
**నేటి వెలుగు వెల్లువల, వేయినితాంతాల మధ్య**
**చైతన్య జ్వలన గోళాన్ని ఆవాహన చేసుకున్న**
**వేకువ ఆశల వేయి రేకుల పూవును"      (వేకువ పువ్వు)**

ముస్లీం స్త్రీల ప్రత్యేక సమస్య అయిన బురఖాను కవితా వస్తువుగా గ్రహించి, *కానుక* అనే కవిత వ్రాయుటలో భవానీదేవి సాధించిన విజయం ప్రశంసనీయం. బురఖా అన్న మాట ఎక్కడా వాచ్యం చేయకుండా, *నల్లత్రాచు* ఉపమానంతో కవితను సమర్థవంతంగా రూపొందించారు.

ఘంటసాల నిర్మల *నిర్వచనం* అనే కవితా సంకలనం ప్రచురించారు. అందులో ఆమె 1978-2000 మధ్య కాలంలో వ్రాసిన 46 కవితా ఖండికలు ఉన్నవి. నిర్మల గారు *ఏకాభిప్రాయంలోగ్, జుగల్‌బంది,* కవితల ద్వారా పేరు ప్రతిష్టలు ఆర్జించారు. నిర్మల గారు జీవితాన్నీ, జీవిత సౌఖ్యాల్ని ప్రేమిస్తారు. అందుచేత, వాటిని ధ్వంసం చేసే యాంత్రికతలను, అసమానతలను, ఆర్థికానర్థాలను, అప్రజాస్వామికతను ఆమె తీవ్రంగా ద్వేషిస్తుంది.

"స్త్రీల కోణం, నిర్మల కవిత్వంలో కీలకాంశం. దాంపత్య సంబంధాలను వ్యాఖ్యానిస్తూ, ఆమె వ్రాసిన కవితలు శక్తివంతమైనవి. జీవితంలో తనకు కనిపించిన, కదిలించి వెన్నాడే ఏ విషయమునైనా ఆమె కవిత్వంగా రూపొందించ గలరు" అంటారు విద్మహే గారు తమ వ్యాసంలో.

*సాహిత్యాకాశంలో సగం* అనే వ్యాస సంపుటిలోని మరో వ్యాసం *అనురాగ దగ్ధ సమాధి.* రేవతీదేవి రచించిన ఒక అనుభూతి కవిత ఈ *అనురాగ దగ్ధ సమాధి.* ఇది 1981లో అచ్చయిన రేవతీదేవి కవితా సంపుటి *శిలాలోలిత* లోనిది. *అనురాగ దగ్ధ సమాధి* స్త్రీపురుషుల మధ్య ప్రేమను, అనురాగాన్నీ, ఆకర్షణనూ, వాంఛనూ వ్యక్తీకరించే కవిత. ప్రేమను గురించి, ఆకర్షణ గురించి, ఇదివరలో వ్రాసిన వారందరూ పురుషులే! మన సంప్రదాయ సంస్కృతిలో స్త్రీలు శారీరక స్పందనలను గురించి కవిత్వం వ్రాయటాన్ని ఎవ్వరూ ఊహించలేరు. ఆధునిక యుగం, చైతన్యవంతమవుతున్న కొత్త సాంఘిక వర్గాల ఆకాంక్షలు, అనూహ్యాలను వాస్తవం చేసి చూపాయి. ఆధునిక స్త్రీ చైతన్యానికి ప్రాతినిధ్యం వహించే కవిత *అనురాగ దగ్ధ సమాధి.* ఈ కవితలో మొత్తం పదకొండు (11) భాగాలు వున్నవి. మొదటి మూడింటిని వదిలేసి, నాలుగు దగ్గర నుండి తొమ్మిది వరకు ప్రతి భాగానికి చివరి ముక్తాయింపు *ఈ సెగ చల్లారదు.* ఈ పదబంధం కవయిత్రి కాంక్షా తీవ్రతను, గాఢతను వ్యక్తం చేసేది.

"కాంక్ష తీరటానికి తన వైపునుండి స్పర్శ, ముద్దు, కౌగిలింత, మరి అతని వైపునుండి తాను కోరుకుంటున్న దేమిటి? తనను కదిల్చి జీవచైతన్యాలు నింపే వేళ్ళ భాషణ. తన శరీరం ఒక వీణ, దానిని మ్రోయించే వైణికుడతను. ఇక అక్కడ నుండి తామిద్దరూ వేరువేరు కారు" అంటారు రేవతీదేవి. "స్త్రీ పురుష సంయోగాన్ని మోక్షానికి పర్యాయపదంగా చేసి కామమోక్షాల మధ్య సరిహద్దులు లేవని నిర్ధారించటం, ఆ రెండింటికి అభేధాన్ని ప్రతిపాదించటం, ఈ సరిహద్దులు లేని ప్రాంతాల విహారంలో స్త్రీ పురుషుల స్నేహం, సాన్నిధ్యం శాంతికి కారణమవుతాయని సూచించడం *అనురాగ దగ్ధ సమాధి* అన్న పేరు ఈ కవితకు చక్కగా కుదిరింది అంటారు కాత్యాయనీ విద్మహే. *అనురాగ దగ్ధ సమాధి* కవితలోని కొన్ని పంక్తులు ఆస్వాదించండి.

**నేనెవరినో మీకెవరికి తెలియదు.**
**ఆర్తి సెగతో ఎర్రగా జ్వలించే నిప్పు పువ్వును.**
**...**
**వేడి నెత్తుటి తీగలై సాగిన యీ చేతుల బిగింపు**
**ఆ మెత్తని నున్నటి గట్టి శరీరం చిదకనిదే – ఈ సెగ చల్లారదు.**
**...**
**ఈ శరీరం మూగపోయిన శతతంత్రుల రసవీణ**
**ఆ శతసహస్ర ప్రకంపనల వేళ్ళు మీటనిదే – ఈ సెగ చల్లారదు.**
**...**
**ఈ కామ మోక్ష మోక్ష కామ అశాంతుల అగ్ని గోళ**
**మహారణ్యాల కాంక్ష సౌందర్య తాండవకేళిల్లో**
**దగ్ధమై ప్రభవించి ప్రభవించి దగ్ధమై**
**రమిస్తే శమిస్తే దమిస్తే శాంతి శాంతి శాంతి.**

కాత్యాయనీ వ్యాస సంపుటిలో మరో ప్రశంసనీయ

రచన *విమల వంటిల్లు*. మనం ప్రతి రోజూ చూచే వంటింటిని నూతన దృష్టితో పరికించి మానవ జీవితాల సంబంధాల నుండి విశ్లేషించిన కవిత *విమల వ్రాసిన వంటిల్లు*. ఈ కవితలో వాస్తవ జీవితానుభవాలు, స్త్రీవాద తాత్విక భావాలు, మార్క్సిష్టు దృక్పథం అన్యోన్యంగా ఇమిడిపోయాయి.

కవయిత్రి తమ వంటిల్లు, తన బాల్యం చెప్పటంగా ప్రారంభించి, తనకంటే ముందుతరం స్త్రీల బాధలపట్ల సానుభూతి చూపించి, తన చైతన్యాన్ని స్పష్టపరచి, తన తర్వాత తరం కోసం పనిచేయటానికి తను సంసిద్ధమవుతూ తన తోటివాళ్ళను సంసిద్ధం చేయటంగా ముగిసిన వంటిల్లు కవిత మూడు తరాల స్త్రీల చరిత్ర వ్యక్తీకరించింది. స్త్రీవాదాన్ని విప్లవ చైతన్యంతో వ్యాఖ్యానించ గలగడం ఇది ఒక మంచి కవితగా పేర్కొనబడింది. ఇంటిచాకిరి స్త్రీ జీవితాన్ని యెలా పరిమితం, సంకుచితం చేస్తుందో, ఆమె అస్తిత్వాన్ని ఎలా హరిస్తుందో కవయిత్రి విమల తన వంటిల్లు కవితలో చక్కగా చిత్రించింది. అయితే అమ్మ వంటింట్లో ఒక ప్రేతం అనడం మాత్రం చాలా అన్యాయం, బాధాకరం! అమ్మ తన అనురాగాన్ని వంటలో పంచి వండుతుంది. ఆ కవితలో అమ్మకి బదులు స్త్రీ అని వాడివుంటే సమంజసంగా ఉండేది. వంటిల్లులోని కొన్ని పంక్తులు పాఠకులకోసం.

**తడి కట్టెల పొగ మేఘాల మధ్య**
**మా వంటిల్లు వేలాడుతూ వుంటుంది**
**భయం భయంగా నిశబ్దంగా, నిరాశగా**
**మా అమ్మొక ప్రేతంగా తేలుతూ వుంటుందిక్కడ**
**...**
**ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి**
**అయినా చివరకు వంటింటి గిన్నెలన్నిటిపైనా**
**మా నాన్నపేరే!**

అదృష్టవశాత్తు నేనో మంచి వంటింట్లో పడ్డానన్నారంతా.

పైన గుర్తించిన పంక్తులు పురుషుల్ని ఆలోచింప చేస్తాయి. కవితా ప్రయోజనాన్ని కలిగిస్తాయి. చివరి మూడు వ్యాసాలలో కాత్యాయనీ విద్మహే గారు జయ కవిత్వం, లక్ష్మీ సుహాసిని, శీలా సుభద్రాదేవి కవితా విశేషాలను గురించి హృద్యమంగా వర్ణించారు. వారి కవితా హృదయాలను చక్కగా వెల్లడించారు. ఆయా వ్యాసాలు ఆ ముగ్గురి కవయిత్రుల వ్యక్తిత్వానికి అద్దంపడతాయి.

*సాహిత్యాకాశంలో సగం* అను వ్యాససంపుటి రెండవ భాగం స్త్రీల కథాసాహిత్యానికి సంబంధించిన విశ్లేషణాత్మక విమర్శతో కూడినది. ఈ భాగం మొత్తంలో 13 వ్యాసాలు పొందుపరచబడినవి. వాటిలో ఏడు వ్యాసాలు రంగనాయకమ్మ, పి. సత్యవతి, మొరవల్లి అన్నపూర్ణా రెడ్డి, సి.మృణాలిని, ద్వివేదుల విశాలాక్షి, జలంధర, నల్లూరి రుక్మిణి మొదలైన ఆధునిక రచయిత్రులు వ్రాసిన కథలకు వ్యాఖ్యానంగా పేర్కొనవచ్చు. వారివారి కథలను గురించి విడివిడిగా వ్రాసిన వివరణాత్మక చర్చ ఈ వ్యాసాలలోని సారాంశం.

కవిత్వమే స్త్రీవాదంలో ప్రధానమైనా, కథా, నవలా వంటి ప్రక్రియలకు కూడా ఈ వాదం విస్తరించింది. ఒక్కొక్క రచయిత్రి తమతమ అనుభవాలను, ఆలోచనలను, అనుభూతులను స్త్రీవాద కథల రూపంలో జీవిత పార్శ్వాల రంగులు రుద్ది, శిల్పానికి వ్యంగ్య వైభవాన్ని సమకూర్చి కథలకు తమదైన ప్రత్యేక ముద్రను ప్రసాదించారు. రచయిత్రుల వైవిధ్యాన్ని చక్కగా వెలికితెచ్చారు కాత్యాయనీ విద్మహే తమ వ్యాసాల్లో. విడివిడిగా ఒక్కో రచయిత్రి కథాసాహిత్యాన్ని గూర్చిన విశేషాలు సూచన ప్రాయంగా మాత్రమే ఇచ్చట ఉల్లేఖించబడినవి. స్థలాభావం వల్ల దీర్ఘ చర్చ వీలుబడలేదు. ఆ విషయం విజ్ఞులైన పాఠకులు గ్రహిస్తారని ఆశిస్తాను.

ఇదే భాగంలో పొందుపరచబడ్డ మరో చక్కని వ్యాసం తెలుగుకథ – స్త్రీవాదం అనునది. ఈ వ్యాసంలో స్త్రీల కథను స్త్రీవాద కథగా పరిణమింపజేయుటలో పైన పేర్కొనిన రచయిత్రులే కాక, ఇతర సమకాలీన రచయిత్రులు చేసిన కృషి విశేషించి చర్చించబడ్డది. తెలుగులో స్త్రీల కథ తాత్త్వికార్థంలో స్త్రీవాద కథగా రూపాంతరం చెందడం, అంచెలంచెలుగా ఎదిగి నేటి స్థాయికి పరిణమించిన తీరు విపులంగా చర్చింపబడింది. స్త్రీల కథను స్త్రీవాద కథగా రూపొందించుటలో రంగనాయకమ్మ, పి. సత్యవతి, అబ్బూరి ఛాయాదేవి చేసిన కృషి చెప్పుకోదగినది.

1975 నుండి కథలు వ్రాస్తున్న పి. సత్యవతి జీవితంలో పెళ్ళిపట్ల వుండవలసిన ఆధునిక ఆరోగ్యకర దృక్పథాన్ని స్త్రీలలో అభివృద్ధి చేయటానికి కథను ఒక సాధనంగా మలచారు. స్వీయ వ్యక్తిత్వాలను నిలబెట్టుకొనే అస్తిత్వ చైతన్యాన్ని కీలకాంశంగా కథలు వ్రాశారు. కుటుంబ హింసా స్వభావాన్ని విప్పి చెప్తూ దానిని భరిస్తూ కృశించి, నశించి పోనక్కరలేదన్న చైతన్యాన్ని ప్రబోధిస్తూ ఆమె వ్రాసిన కథ చెప్పుకోదగినది. ఈ కథలో, తల్లి తన సంసారంలో తాను అనునిత్యమూ తననెవరో

వెనకనుండి కనిపెడుతున్నట్లు బెదురుబెదురుగా జీవించటాన్ని గురించి గుర్తు చేసుకుంటుంది. సంసారంలో స్త్రీలపై తెలియకుండానే, కనబడకుండానే, అమలవుతున్న నిత్య నిఘాను గుర్తించి చెప్పటం ఈ కథలోని ప్రత్యేకత. తెలుగులో స్త్రీలకథ తాత్త్వికార్థంలో స్త్రీవాద కథగా మార్పు చెందుట సావిత్రి వ్రాసిన *ఇదోవర్గం* అనే కథతో పూర్తి అయిందని చెప్పవచ్చు. భార్య మీద పెత్తనం చేసే భర్తల పీడకవర్గ స్వభావాన్ని సులభంగా గుర్తించగలిగింది సావిత్రి. స్త్రీ పురుషులు రక్తసంబంధాలవల్ల, వైవాహిక సంబంధాలవల్ల ఒక కుటుంబంలో భాగంగా, ఒకే ఇంట్లో జీవిస్తున్నప్పటికీ, పితృస్వామిక లైంగిక వివక్షత కారణంగా రెండు వర్గాలుగా విడిపోతున్నారు. స్త్రీలు అణచివేతకు పీడనకు గురవుతున్న వర్గం. పురుషులు అధికారవర్గం. తమ ప్రయోజనాలు తీర్చుకొనేటందుకు, అహాలను సంతృప్తి పరచేందుకు స్త్రీల శ్రమను దోచుకుంటారు. స్త్రీల అహాన్ని గాయపరుస్తారు, అవమానిస్తారు, ఒదిగి ఉండేలా చేస్తారు. అందువల్ల స్త్రీ పురుషులు రెండు ప్రత్యేక వర్గాలు. అందుకే సావిత్రి పురుషులను ఇదో పీడిత వర్గం అంటుంది.

నేను ఎవరినీ అన్న ప్రశ్నతో ప్రారంభించి స్త్రీ తనను తాను తెలుసుకొనటం కోసం చేసే బహుముఖ అన్వేషణ స్త్రీవాదంలో కీలకాంశం. స్త్రీలు స్త్రీలుగా నిర్వహించవలసిన పాత్రలను, జీవించవలసిన విధానాన్ని ఇన్నాళ్ళుగా సమాజమే నిర్వచిస్తున్నది. ఆ నిర్వచనాల పరిధిలో స్త్రీ స్వతంత్ర వ్యక్తిగా నిలబడే అవకాశం లేదు. ఈ పరిస్థితి మారాలి. స్త్రీ స్వతంత్ర వ్యక్తిగా జీవించే వాతావరణం ఏర్పడాలి. అందుకే స్త్రీల అవిరళ కృషి. స్త్రీ జీవితంలో వివక్షతను అణచివేతను అమలుపరచే అత్యంత ప్రాథమిక వ్యవస్థ కుటుంబం. ఈ కుటుంబ అధికార స్వభావాన్ని విమర్శిస్తూ స్త్రీలు అనేక కథలు వ్రాశారు.

పెళ్ళి, సంసారం, సంతానం వీటిచుట్టూ అల్లబడిన మాయాజాలాన్ని విప్పి చెప్పటంలో స్త్రీవాద కథ గొప్ప విజయం సాధించింది. ఏడు జన్మల బంధాన్ని ఒక జన్మలో ముడిపెట్టి స్త్రీ పురుషుల దాంపత్య జీవితానికి సామాజిక ఆమోదాన్ని సమకూర్చే సాంస్కృతిక కార్యరూపం పెళ్ళి! అందం, ఆస్తులు, కట్నకానుకలు, వేడుకలు, ఆనవాయితీలు అన్నీ కలిసి పెళ్ళంటే శిక్ష అని ఆడపిల్ల, పిల్లవైపు వాళ్ళు అనుకొనే పరిస్థితికి తెచ్చాయి. ఈ పరిస్థితి మారాలి. పెళ్ళంటే ఇద్దరు మనుషుల సంబంధంగా కాక, డబ్బుతో ముడిపడిన వ్యవహారంగా మనుషులు ఆలోచించే పద్ధతి పూర్తిగా సమసిపోవాలి. ఆ ప్రయత్నమే స్త్రీవాద కథల ద్వారా చిత్రితమయింది.

స్త్రీవాద కథ పైనపేర్కొనిన అంశాలలో, చర్చించిన విధంగా స్త్రీల ఆశలను, ఆకాంక్షలను, అస్తిత్వ చైతన్యాన్ని రకరకాల రూపాలలో అమలయ్యే పితృస్వామిక కుటుంబ అధికారంపై విమర్శను విస్తరిస్తూ ఎదిగింది. అయితే, పితృస్వామ్యం కంటికి కనిపించే నిర్మాణం కాదు. అది సామాజిక వ్యవస్థలో, మానవ సంబంధాలలో పెనవేసుకొని ఊడలు దిగి వుంది. అది కనిపించని శత్రువు!

ప్రారంభంలో మధ్యతరగతి వర్గాల స్త్రీల జీవితాలు ఇతివృత్తంగా స్త్రీవాద కథలు వచ్చాయి. కాలక్రమాన పితృస్వామిక పీడనకు గురి అయ్యే స్త్రీలంతా ఒకటే జాతి అన్న భావనతో అన్ని కులాల, మతాల స్త్రీలపై సామాజికంగా హింసాప్రవృత్తిని ఎత్తిచూపే కథలు వ్రాస్తున్నారు ఆధునిక రచయిత్రులు. అందుచేత స్త్రీవాద కథలలో వస్తువైవిధ్యం విస్తరించింది. స్త్రీవాద కథ కొత్తపుంతలు తొక్కడం మొదలెట్టింది. బహుజన దళిత కులాల నుండి, బహుజన దళిత స్త్రీల అనుభవాలను కథావస్తువులుగా చేసుకొని కథలు వ్రాసే కొత్త తరం స్త్రీలు వెలుగులోనికి వచ్చారు.

స్త్రీలు స్త్రీల జీవితాలను మాత్రమేకాక, కులం, మతం, దేశం, జాతీయ, అంతర్జాతీయ, రాజకీయ పరిణామాలు మొదలైన అన్ని విషయాలు స్త్రీల అనుభవకోణం నుండి తర్కించి, నిత్య జీవిత సామాన్య అంశాలనే అసాధారణ కథలుగా మలచగలుగుతున్నారు స్త్రీ కథారచయిత్రులు. ఇది అత్యంత గర్వించదగిన విషయం. ఈ పరివర్తనకు స్త్రీ రచయితలు అభినందనలకు, ప్రశంసలకు అర్హులు.

స్త్రీ పురుష సంబంధాలను, అధీన, అధికార సంబంధాల నుండి విముక్తం చేసి, కుటుంబాలను ప్రజాసామ్యబద్ధం చేయడానికి, తద్వారా సామాజిక సంబంధాలను మానవీయం చేయడానికి అవసరమైన సంస్కారం అభివృద్ధి పరచటంలో స్త్రీవాద కథాప్రక్రియ గొప్ప పాత్రను నిర్వహిస్తున్నది. ఇది ముదావహం.

**ముగింపు :** స్త్రీ పురుష సంబంధాలు, వ్యక్తిత్వం, స్త్రీని న్యూన్యతంగా, అబలగా చిత్రించే భాష, స్త్రీకి మాత్రమే ప్రత్యేకమైన అనుభవాలు, సాహిత్యంలో వాటి ప్రాతినిధ్యం, స్త్రీవాద సాహిత్యములోని ముఖ్యాంశాలు. స్త్రీ శరీర నిర్మాణం, శరీర ధర్మాలు ప్రాకృతికం, స్త్రీ తత్వం సామాజిక కల్పన అన్న మౌలిక అవగాహనంతో ముందుకు వచ్చింది స్త్రీవాద సాహిత్యం. స్త్రీని పునరావృత్తమయ్యే నమూనాగా చూడడాన్ని, చిత్రించడాన్ని ప్రశ్నిస్తుంది స్త్రీవాద సాహిత్యం.

తెలుగు స్త్రీవాద సాహిత్యంలో మనకు ప్రధానంగా కనిపించే విషయాలు రెండు. ఒకటి స్త్రీల అనుభవాలు, సాహిత్యంలో వాటి ప్రాతినిధ్యం. రెండవది భాష. స్త్రీకి సంబంధించిన వివక్షత నిత్య వ్యవహార భాషలో అనేక రకాలుగా అభివ్యక్తం అవుతున్నది. భాషలో నిందను వ్యక్తం చేసే ప్రయోగాలన్నీ స్త్రీపరంగానే కనిపిస్తాయి. అన్నిరకాల సాహిత్యంలోను, సాధారణ వ్యవహారంకంటే అభిన్నంగా స్త్రీని అవమానపరచే, వివక్షతత చూపే భాష, లైంగిక ప్రతీకలు కనిపిస్తాయి! *బందిపోట్లు* కవిత పితృసామ్య భాషపైన బలమైన విమర్శ. పెళ్ళి శిక్షకు పర్యాయపదంగా వాడడం, మగడు అనే మాట అధికారం చెలాయించేవాడు అనే అర్థంలో వ్యవహారంలోకి రావడం, పైన పేర్కొనిన కవితలోని వస్తువు.

స్త్రీలు తమ అనుభవాలను, భౌతిక, మానసిక స్థితులను అభివ్యక్తం చేస్తూ కవిత్వం వ్రాశారు. తర్వాత క్రమంగా కథలూ, నవలలూ, వ్యాసాలు వచ్చాయి. ఈ వ్యాసంలో వివరింపబడిన వ్యాస సంకలనం *సాహిత్యాకాశంలో సగం* అనే సంపుటి స్త్రీవాద కవిత్వం, స్త్రీవాద కథలూ కేంద్రంగా పరిగణించి రూపొందించినది. స్త్రీలు కథలు, నవలలు తప్ప కవిత్వం వ్రాయలేరనే అపవాదాన్ని తప్పుగా నిరూపిస్తుంది కాత్యాయనీ విద్మహే గారి *సాహిత్యాకాశంలో సగం* అనే పుస్తకం.

స్త్రీవాద కవిత్వం ఒక అనూహ్యమైన, అసాధారణమైన స్థాయినీ, విలక్షణత్వాన్ని, తెలుగు కవిత్వానికి అందించింది. ఇది సరదా కోసం, కవితా దాహం తీర్చుకోవడానికి వ్రాసిన కవిత్వం కాదు. ఒక సామాజిక, రాజకీయ సన్నివేశం నుంచి ఆవిర్భవించిన ఆరాటం! శతాబ్దాల నుండి ఒకే కోణం నుంచి కనిపిస్తున్న ప్రపంచాన్ని మరో కోణం నుంచి చూడాలని సూచించే ఉద్యమం. తమ (స్త్రీల) అనుభవాలు కేవలం తమకు మాత్రమే పరిమితం కావనీ, అవి ఒక సామాజిక పరిణతికి, పురోగతికి బాటలువేసే జీవిత శకలాలనీ, చెప్పడం ఈ కవిత్వం యొక్క ముఖ్యోద్దేశం. ఇప్పటివరకు వచ్చిన స్త్రీవాద కవిత్వం స్త్రీ జీవితంలోని అన్ని అనుభవాలనూ తడిమింది. వానిని అద్భుతమైన కవితా శిల్పంలో ఆవిష్కరించింది. కవిత్వ భాషకు పదునుపెట్టింది. అయితే, ఈ కవిత్వం చాలావరకు పితృసామ్య వ్యవస్థపై ఫిర్యాదుగానే కొనసాగింది. అలాకాక, పరిష్కార మార్గాన్ని కూడా నిర్దేశించే కవితలు కూడా వచ్చివుంటే, బాగుండేది! అయితే, ఒకవిషయం చెప్పక తప్పదు. స్త్రీవాద కవిత్వం విశిష్టమైన అభివ్యక్తితో, వినూత్నమైన వస్తువుతో, విలక్షణమైన శైలిలో వెలువడింది. కవిత్వమే, స్త్రీవాదంలో ప్రధానమైనా, కథ, నవలా ప్రక్రియలకు కూడా స్త్రీవాదం విస్తరించింది. సాహిత్యాకాశంలో సగం వ్యాస సంపుటి రెండవభాగం మొత్తం స్త్రీవాద కథల విమర్శకే కేటాయించబడింది. పేరు, ప్రతిష్టలార్జించిన ఏడుగురు కథా రచయిత్రుల కథనాకౌశలం ఇందులో సమగ్రంగా చర్చించబడింది. స్త్రీవాద కథలలోని ముఖ్యాంశాలు ఈ విధంగా వివరించవచ్చు: స్త్రీలకు రోజువారీ జీవితంలో ఎదురయ్యే సమస్యల వివరణ, వాటికి పరిష్కార సూచనలు, స్వేచ్ఛ, సమానతలపట్ల అవగాహన స్త్రీలలో కల్గించటం నిరాశా వాతావరణాన్ని ఎదుర్కొనే ధైర్యస్థైర్యాలను కలిగించడం, పురుషాధిక్యతపై పోరాటానికి ఆలోచింపజేయుట, బానిసగా పడివుండే తత్త్వాన్ని తెలియజేసి, రూపుమాపే ప్రయత్నం చెయ్యాలని పిలుపునివ్వడం ప్రపంచీకరణ నేపథ్యంలో స్త్రీల పాత్ర మొదలైనవి.

ఈ విధంగా విశిష్టమైన అభివ్యక్తితో, వస్తువైవిధ్యంతో, గొప్ప శిల్పంతో స్త్రీవాద సాహిత్యం వెలువడింది. అట్టడుగున చీకట్లో పడివున్న ఎన్నో స్త్రీల సమస్యలు వెలుగు చూచాయి. తరతరాల నిశ్శబ్దాన్ని ఛేదించి, కథ, నవల ప్రక్రియలకి కొత్త ఉత్తేజాన్ని ఇచ్చింది స్త్రీవాదం. స్త్రీవాదంపై పెద్ద దుమారమే రేగింది. అయితే, ఆ విషయాలు కాత్యాయనీ గారు ఈపుస్తకంలో చర్చించలేదు. "స్త్రీవాదుల పోరాటం పురుషులపైన కాదనీ, పురుషాధిక్య సమాజంపైననీ ... స్త్రీ పురుషుల మధ్య ఆధిపత్య అధికార సంబంధాలు పోయి, పరస్పరం గౌరవించుకునే సమస్థాయి సంబంధాలు ఏర్పడాలన్నదే తమ లక్ష్యమని స్త్రీవాదం నిరూపించింది" అనే మాటతో ఈ వ్యాసం ముగించడమైనది.

**కృతజ్ఞతలు:** ఈ వ్యాస రచనలో శ్రీమతి కాత్యాయనీ విద్మహే గారి *సాహిత్యాకాశంలో సగం* అనే సంపుటమే కాక, స్త్రీవాదంపైన, ఫెమినిజం పైన అనేక పుస్తకాలు పరిశీలించవలసి వచ్చింది. ఆయా రచయితలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియపరచడమైనది.



ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యులు, హైద్రాబాదు.

# నృత్యకళ

- డా. పోణంగి శ్రీరామ అప్పారావు

మానవుడు తొలుత నుండియు సంఘజీవి. సుఖదుఃఖసమయములందు సన్నిహితులైనవారందరేకమై గుమికూడి యుండుట సహజము. అట్టి సమయములలో వారు ఆట-పాటలు నిర్వహించుట నేటికిని జరుగుచున్నది. ఆదిమానవుల ఈ ఆట-పాటలోని పాట- అంగ విన్యాసములు - మాటలు నేటి లలితకళలకు బీజములని చెప్పవచ్చును. అనగా తొలిమానవులు తమకు కష్టము కలిగినప్పుడు దానికి తట్టుకొనలేక చేసిన ఆక్రోశమును, ఆ కష్టము తొలగినప్పుడు ఆనందోత్సాహములతో చేసిన ఆలాపములును గాన-నృత్త-కవిత్వ కళలకు తొలిరూపము అన్నమాట. చిన్నపిల్లలు కోరిన వస్తువు చేతికందిన వెంటనే ఆనందోత్సాహములతో కూనరాగములు తీయుచు, జిలిబిలి పలుకులతో అందముగా చిందులు త్రొక్కుచున్నప్పుడు కూడ పై మూడింటిని అనగా గాన-నృత్త-కవిత్వములకు మూలరూపములను గుర్తింపవచ్చును. కావున ఆధునికుల దృష్టిలో తొలిమానవుల చిందులే నృత్తమునకు మూలరూప మన్నమాట.



నాట్యము

భరతముని ప్రణీతమగు నాట్యశాస్త్ర మందలి ప్రథమ- చతుర్థాధ్యాయము లందలి కథనమునుబట్టి నృత్తము అనాది; అది పరమేశ్వర ప్రయుక్తము నాట్యము బ్రహ్మసృష్టి; దేవతలకోర్కె ననుసరించి, దృశ్యమును, శ్రవ్యమును అగునట్లుగా, చతుర్వేదముల సారమును గ్రహించి బ్రహ్మ ఈ నాట్యమును, పంచమవేదముగా, నిర్మించెను. బ్రహ్మ-భరతాదులు పరమేశ్వరుని నృత్తమును చిరకాలముగా ఎరుగుదురు. పిమ్మట బ్రహ్మ సృష్టియును, భరతప్రయుక్తమును అయిన నాట్యమును శివుడు క్రొత్తగా చూచెను. నాట్యమును చూడగానే నృత్త-నాట్యములను సమ్మిళితముచేసిన బాగుండునని శివునకు తోచెను. అనగా తన నృత్తమునకు నాట్యమందలి అభినయములను జోడించినచో గీతములు అర్థవంతములు కాగలవని ఆయన తలంపు. ముందుగా ఆ పని పూర్వ రంగ విధులందు చేయుమని శివుడాదేశించెను. అంతట శివుని ఆదేశముననుసరించి తాండుమహర్షి నృత్తమును భరతమునికి బోధించెను భరతుడా నృత్తమును పూర్వరంగ విధులందు ప్రయోగించెను. ఇట్లు ఈ రెండింటి కలయికతో ఒక క్రొత్త కళ సృష్టింపబడినది; అదియే నృత్యము. కాగా కేవలము అంగవిక్షేపాత్మకమైన నృత్తము, అర్థ ప్రదర్శ సాధనమగు అభినయముతోకలిసి నృత్యకళగా రూపొందిన దన్నమాట. ఇది ఒక క్రొత్త కళయని తండుమహర్షి కాని, భరతమునికాని, బ్రహ్మకాని తలంచినట్లు కన్పట్టదు; అయినను శివుడు నృత్తమునకును, బ్రహ్మనాట్యమునకును ప్రవర్తకులైనట్లే భరతముని నృత్యమునకు ప్రవర్తకుడయ్యెనని చెప్పవచ్చును.

'నృత్' అను ధాతువునుండి 'నృత్తము' అను పదమును (నర్తనము, నర్తకి, నర్తకుడు అను పదములు కూడను), 'నట్' అను ధాతువునుండి 'నాట్యము' అను పదము (నటనము, నటి, నటుడు అను పదములు కూడను) ఉత్పన్నములైనవి. ఈ రెండు ధాతువులలో 'నట్' ప్రాకృతధాతువనియు, 'నృత్' సంస్కృత ధాతువనియు నేటి విమర్శకుల తలంపు. 'నృత్'నకు 'నట్' ప్రాకృతరూపమని కొందరు తలంపగా, 'నట్'నకు 'నృత్' సంస్కృత రూపమని కొందరు తలంచినారు. 'నృత్' అను ధాతువునకు 'క్యప్' ప్రత్యయము చేరినప్పుడు 'నృత్యము' అను పదము నిష్పన్నమగుచున్నది.

నాట్యశాస్త్రమందు నృత్యపదము లేదు; నృత్త-తాండవ-నాట్యపదములు మాత్రమే కలవు. అందున నృత్త-తాండవ పదములు పర్యాయపదములుగానే

ప్రయక్తములైనవి. తండుమహర్షిచేత బోధింపబడినది కాన-'నృత్తము' తాండవ మనబడినదనియు, తాండవవిధి ప్రాయికముగా 'దేవస్తుతి' నాశ్రయించి యుందువనియు, దాని సుకుమార ప్రయోగము పార్వతీ ప్రయుక్తమనియు, ఇది శృంగారప్రయోగమునే అర్వాచీనులు 'లాస్య'మనిరి. కాగా తాండవము ఉద్ధతవృత్తమనియు, లాస్యము సుకుమార నృత్తమనియు రూఢి పొందినది. తాండవమ పూర్వరంగవిధి, పరిమితముకాగా, శృంగారరస సముద్భవమగు లాస్యము రూపకేతివృత్తమునందు ప్రయుక్తము కాజొచ్చినది.

భరతముని 'లాస్య'పవమును వ్యష్టిగా ప్రయోగించక పోయినను, 19వ అధ్యాయమున పదిలాస్యాంగములను పేర్కొనెను. (అర్వాచీనులు కొందరు 12 చెప్పినారు). ఈ లాస్యాంగములు వేర్వేరు సన్నివేశముల నవలంబముగా చేసికొని ప్రత్యేక ప్రత్యేకముగా ప్రదర్శింపబడుటకు సమర్థములు. ఈ అవకాశమును వినియోగించుకొని, తరువాతి కాలములో భరతముని శిష్యుడుగా తలంప బడుచున్న కోహిలుడు నృత్యప్రధానములైన ఉప రూపములను కల్పించియుండును. అటుపిమ్మట నృత్యమొక ప్రత్యేక కళగా రూపొందినప్పుడు, నంది కేశ్వరుడా కళ కొరకు 'అభినయదర్పణము' అను నృత్యశాస్త్ర గ్రంథమును రచించినాడు. నృత్య కళ కొరకు ప్రత్యేకముగా వెలసిన శాస్త్ర గ్రంథమును లభ్యమైన తొలి గ్రంథము నందికేశ్వరుని అభినయరర్పణమే.

భరతాదిమునుల ననుసరించి, చతుర్వి ధాభినయో పేతమైన 'నటనము' నాట్య-నృత్త- నృత్య భేదములచే త్రివిధమని నందికేశ్వరుడు పేర్కొనగా, నాట్య-నృత్య-నృత్త భేదములచే 'నర్తనము' ముప్విధములని శార్ఙ్గదేవుడు పేర్కొనెను (సంగీత రత్నాకరము-1. 3 శ్లో). ఇచ్చట నటన-నర్తన పదములు సమానార్థకములుగా ప్రయుక్తము లైనవని చెప్పవచ్చును. నృత్యోత్పత్తిని వివరించెడి శ్లోకము లేడెనిమిది రెండు గ్రంథములందును ఒకే విధముగా నుండుట ఈ యూహను బలపర్చుచున్నవి. ఈ శ్లోకము లందలి కథనమును బట్టి భరతమునికి, పరమేశ్వరా దేశానుసారముగా తండుమహర్షి తాండవమును, పార్వతీదేవి లాస్యమును ఉపదేశించిరి. తాండవమును భరతముని మహర్షులకు బోధింపగా, అది వారి ద్వారా మర్త్యలోకమున ప్రచార మందినది. ఇంక లాస్యము పార్వతీదేవి మరల బాణాత్మజ యైన ఉషకు నేర్పినదట; ఆమె ద్వారవతిలోని గోపికలకు, ఆగోపికలు సౌరాష్ట్ర యోషితులకు నేర్పిరి. పిమ్మట వారినుండి ఆ యా దేశము (రాష్ట్రము) లందలి యోషితలు లాస్యమును నేర్పిరి.

నృత్త-నాట్య-నృత్య పదములను తులనాత్మకముగా నిర్వచించిన ప్రథముడు నందికేశ్వరుడు.

**"నాట్యం తన్నాటకం చైవ పూజ్యం పూర్వకథాయుతమ్ ।**
**భావాభినయహీనంతు నృత్తమిత్యభిధీయతే ॥**
**రసభావవ్యంజనాదియుక్తం నృత్యమితీర్యతే"**

*(పూర్వ కథాయుతమై, పూజనీయమైన నాటకమే నాట్యము; భావాభినయ హీనమైనది నృత్తము; రసభావవ్యంజనాది యుక్తమైనది నృత్యము).* నందికేశ్వరుని తరువాత దశరూపకర్తయగు ధనంజయుడును, తద్వ్యాఖ్యాతయగు ధనికుడును ఈ మూడింటి స్వరూపమును గూర్చి విపులమగు చర్చచేసి యున్నారు. (చూ. తెలుగు నాటక వికాసము. 1967. పుటలు 11-13). పిమ్మట *సంగీతరత్నాకరమున* శార్ఙ్గదేవుడు *నృత్తరత్నావళిలో* జాయనయు వీటి స్వరూపములను, నందికేశ్వరునివలె, సూక్ష్మముగా వివరించినారు. కాని ఈ నల్వురును నృత్య విషయమున నందికేశ్వరునితో ఏకీభవించినట్లు కన్పట్టదు. నందికేశ్వరుడు నృత్యమును 'రస-భావ వ్యంజనాది యుక్త' మనగా వీరు నల్వురును 'రస' పదమును త్యజించినారు; కాగా వీరి దృష్టిలో నృత్యము రసవ్యంజకము కాదన్నమాట. కాని, పిమ్మట నాట్యతర్పణ కర్తలగు రామచంద్ర-గుణచంద్రులు (క్రీ.శ. 12వ శతాబ్ది) నృత్యమును 'రస- భావ వ్యంజనాది యుక్తము'గానే చెప్పియున్నారు. నాట్యమువలెనే నృత్యము కూడ రసస్ఫోరకమే యనెడి సత్యమును తెలుగు కవియగు నన్నెచోడుడు (క్రీ.శ. 12వ శతాబ్ది) గుర్తించి యుండుటస్మరణీయము (*కుమారసంభవము*-9 ఆ. 38 ప. ఇది రంభానాట్య వర్ణనము).

**"అలఁతులు నిల్పహస్తమున, హస్తవిలాసముతోఁ బెనంగఁ జూ**
**ద్కులు, దెలిచూల్కులందెలమి గూడి రమింపమనంబు, తన్మనో**
**బలమున నుల్లసిల్ల నిజభావము, భావవిశేషసంపదల్**
**వెలయ రసంబులం, దభినవించె రసంబులు సొంగికంబుగాన్."**

కావున నృత్యము కూడ, నాట్యమువలెనే, రసవ్యంజక మనుట స్పష్టము. ఇప్పట్ల గుర్తింపవలసిన విషయ మొకటి కలదు. నృత్తము భావాభినయహీన మగుటచేత గాత్రవిక్షేపమాత్రమై, తాళ-లయాశ్రయ మగుచున్నది. ఈ గాత్రవిక్షేప విషయమున నృత్త-నృత్యములు రెండును సమానములే. కాని నృత్తము భావహీనముకాగా, నృత్యము అభినయాత్మకమైనది (ఈ అర్థమునందే 'నృత్యము'ను కేవలము 'అభినయము' అని కూడ వ్యవహరించుట కద్దు).

నృత్యమున శుష్కాక్షరములు ప్రయుక్తములుకాగా, నృత్యమున సాహిత్యము (గేయాదులు) ప్రయుక్త మగుచున్నది. ఇంక అభినయ విషయమున నృత్య- నాట్యములు తుల్యములు. కాని నృత్యము ఆంగికాభినయ ప్రధానముకాగా, నాట్యము సాత్త్వికాభినయప్రధానమును, కథాత్మకమును అగుచున్నది. నృత్యమున ప్రతిపదమునకును భావము అభినయము చేయబడుచుండగా నాట్యమున వాక్యార్థము సూచనా మాత్రముగ అభినయింపబడును. కావుననే నృత్యము ప్రతిపదార్థాభినయ మనియు, నాట్యము వాక్యార్థాభినయ మనియు శాస్త్రకర్తల నిర్దేశము.

నాట్య-నృత్య-నృత్త భేదములచే నర్తనము త్రివిధమనియు, తాండవ-లాస్య భేదములచే నృత్త-నృత్యములు రెండేసి విధములనియు చెప్పుటయేగాక నృత్తము విషమ-వికట, లఘుభేదములచే ముప్విధములని శార్ఙ్గదేవుడు చెప్పియున్నాడు. కాని సోమేశ్వరుడు (క్రీ.శ. 12వ శతాబ్ది) మానసోల్లాసమున నర్తన మారు విధములని చెప్పుట గమనింపదగినది - నాట్యము, లాస్యము, తాండవము, లాఘవము, విషమము, వికటము (3వ భాగము-శ్లో. 959-60).

నృత్త-నృత్య-నాట్యములకు జాయనచేసిన నిర్వచనములు అర్వాచీనశాస్త్రకర్తల మతసారమని చెప్పవచ్చును. "పాట, వాద్యములు మొదలగువానితోగలిసి, లయను మాత్రము ఆశ్రయించి, అభినయములేక, అంగముల నాడించుట నృత్తమగును" (1-53)

''భావముల నాశ్రయించినది, పదార్థముల నభినయించు స్వరూపముగలది నృత్యమగును" (1-50)

"నాట్యము సాత్త్వికభావములతోనిండి, రసాశ్రయమై, వాక్యార్థము నభిన యించునదై యుండును" (1-25).

ఇంత స్పష్టముగా నృత్త-నృత్య-నాట్యములు నిర్వచింపబడినను, గ్రంథములందు లోకవ్యవహారమున నివి వ్యత్యస్తములుగా ప్రయుక్తములగుచు వచ్చినవి. కాళిదాసు మాళవికాగ్నిమిత్రమందు 'నాట్య' పదమును 'నృత్య'మను నర్థమందేకాక (మాళవిక 'ఛలిత' మనెడి నాట్యమును ప్రదర్శించెనట), నాటక ప్రదర్శనమను నర్థమందు (నాట్యం భిన్నరుచేర్జనస్య బహుధాప్యేకం సమారాధనమ్) కూడ వాడెను. నేటితంజావూరు నృత్యము 'భరతనాట్యము' అను పేర ప్రసిద్ధికెక్కినది. ఇట్టి వ్యత్యస్త ప్రయోగములు సామాన్యులలో దురర్థములను కలిగించుచున్నవి. ఇట్టి అవ్యవస్థ 15వ శతాబ్దినాటికే ఏర్పడినదని విప్రదాసుని సంగీతచంద్రమువలన తెలియుచున్నది - "నాట్యము నృత్యమునకు పర్యాయ పదముగా కన్పట్టుచున్నది; అట్లే నృత్యశబ్దము నృత్తమునకు పర్యాయపదముగా కన్పట్టుచున్నది."

అయినచో జాయన రచించిన 'నృత్తరత్నావళి' నృత్తమునకు శాస్త్రమా? నృత్యమునకు శాస్త్రమా? ఇప్పట్ల శార్ఙ్గదేవుని వాక్యములు స్మరణార్హములు - "నాట్యమందలి చతుర్విధాభినయములలో నృత్తమున కనుపయుక్తములగు వాచిక-సాత్త్విక-ఆహార్యములనెడి త్రివిధాభినయములను విడిచిపెట్టి మిగిలిన ఒక్క ఆంగికాభినయమును గూర్చి మాత్రమే ఇప్పుడు చెప్పబడుచున్నది" (7 అ. 34 శ్లో) అనుచు శార్ఙ్గదేవుడు ఒక్క ఆంగికాభినయము (గాత్ర విక్షేప మాత్రము)ను గూర్చియే వివరించియున్నాడు. ఇంక జాయన కూడ ఒక్క ఆంగికాభినయము (గాత్ర విక్షేపమాత్రమైన నృత్తము)ను గూర్చి మాత్రమే అధికముగా చెప్పెను; అందుచేతనే తన గ్రంథమునకు 'నృత్తరత్నావళి' అని పేరు పెట్టినాడు.

భరతాది శాస్త్రకర్తలందరును నృత్త-నృత్యములు రెండును నాట్యమున కుపకారములని స్పష్టము చేసియున్నారు. నృత్తము పూర్వరంగమందు ప్రయోగింప దగినది కాన నాట్యమునకుపకరించును. ఇంక నృత్యము కథావశమున, శృంగారరససంభవమై, నాట్యమున ప్రవర్తిల్లును. కావుననే నృత్త-నృత్యశాస్త్ర గ్రంథములందు నాట్య ప్రశంస కూడ, సూక్ష్మముగానైన, వచ్చుచుండును. కావుననే జాయన కూడ ప్రథమాధ్యాయమున నాట్య ప్రశంసయు, చతుర్విధాభినయముల ప్రశంసయు చేసెను.

కావ్యార్థసాక్షాత్కారమునకు నృత్య-నాట్యము లుపయుక్తములగుచున్నవి కదా? ఇంక భావవిహీనమైన నృత్త ప్రయోజనమేమి? అనెడి ప్రశ్నకు భరతముని సమాధానమిట్లున్నది- "నృత్తము అర్థమును ఏ మాత్రమును ఆపేక్షింపని మాట నిజమే. కేవలము శోభను కలిగించుటకొరకే నృత్తము ప్రవర్తితమైనది. ప్రాయికముగా సర్వలోక మునకును నృత్తము సహజముగా ఇష్టము. అందుచేతనే నృత్తము మంగళప్రదమనబడినది. వివాహము, పుత్రజననము, ఆవాహము, ప్రమోదము, అభ్యుదయము మున్నగు సమయములందు వినోదకారణమగునట్లుగా ఈ

నృత్తము ప్రవర్తితమైనది.”

*-(చూ. తెలుగు నాట్యశాస్త్రము 1959-పుట-121)*

ఈ సందర్భమున నందికేశ్వరుని వివరణ మిట్లున్నది (12-14) - “నాట్య, నృత్తములను విశేషముగా పర్వకాలములందు చూడవలెను.” ఇంక నరేంద్రుని అభిషేకోత్సవము, యాత్ర, దేవయాత్ర, వివాహము, ప్రియసంగమము, నగరప్రవేశము, గృహప్రవేశము, పుత్రజననము మున్నగు సమయములందు సర్వకర్మ లందును శుభార్థులైనవారు మంగళప్రదమైన నృత్యమును ఏర్పాటు చేయవలెను.” శార్ఙ్గదేవుడు కూడ ఇట్లే వీనిని నృత్య సమయములుగానే పేర్కొనినాడు. కాని జాయనమాత్రము వీనిని ‘నృత్తసమయములు’ గానే చెప్పియుండుట గమనింపదగినది (1-18).

నృత్తవిషయమున భరతముని చెప్పిన సుకుమార భేదము నందికేశ్వరుని నాటికి ‘లాస్యము’గా రూఢి పొందినదని గుర్తించినాము. ఈ తాండవ - లాస్య భేదములను శార్ఙ్గదేవ - జాయనలు నృత్తమునకే కాక నృత్యమునకు కూడ అన్వయించినారు. జాయన లాస్య ప్రచారకథను చెప్పకపోయినను లాస్యాంగములను సంక్షిప్తముగా వివరించియున్నాడు (1-58-72).

గీత-వాద్య-నృత్తములు మూడును ‘సంగీత’ మనబడుననిచెప్పుచు, మార్గ-దేశి భేదములచే సంగీతము రెండు విధములని శార్ఙ్గదేవుడు చెప్పెను. జాయన ఈ భేదములను నృత్త-నృత్య-నాట్యములు మూడింటికిని చెప్పుట గమనింపదగినది (నందికేశ్వరుడిట్టి భేదములను చెప్పలేదు). జాయన చెప్పిన ప్రకారము - నాట్యవేదము నుండి వెలువడినది, మహర్షులు వెదకితీసినది, సజ్జనులు ప్రచారముచేసినది ‘మార్గ’మనబడును (1.52); ఇంక ఆయాదేశముల జనులయిష్టానుసారము చెల్లునది ‘దేశి’ యనబడును (1-54).

మి

# రావిపూడి వ్రాతలు

స్వేచ్ఛ గురించి మార్క్సిస్టులు విపరీత వ్యాఖ్యానాలు చేస్తున్నారు. స్వేచ్ఛ ఎవరికి? ఎందుకు? అని ప్రశ్నిస్తున్నారు. స్వేచ్ఛ దోపిడీదారులకా? దోపిడీ చేయడానికా? అని ప్రశ్నిస్తూ స్వేచ్ఛ అనే పదం మీదనే జుగుప్సను పెంచుకుంటున్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, అనే ఫ్రెంచి విప్లవ నినాదం వారికి కఠోరంగా వినిపిస్తుంది. చేదుగా అనిపిస్తుంది. వాస్తవానికి స్వేచ్ఛ మానవజీవన సారం. సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, నైతికాది నిర్బంధాలన్నీ నుంచీ విముక్తి పొందడమే స్వేచ్ఛ.



రావిపూడి

“విప్లవమంటే మంచివైపుకు మార్పు అని అర్థం. మానవ హక్కులకు, విలువలకు విడాకులిచ్చిన ఏ ప్రక్రియ కానీ విప్లవం కాదు. తమకు ఏది మంచిదో ప్రజలు తెలుసుకొని ఆ మార్పుకోసం ప్రజలు చేసేది విప్లవమవుతుంది. ప్రజల తరఫున, ప్రజలకు ధర్మకర్తలుగా, సంరక్షకులుగా పేర్లు పెట్టుకొని, కొద్దిమంది నాయకులు బయలుదేరి అధికారంలో వున్నవారి మీద చేసే పోరాటం విప్లవం కాదు. కమ్యూనిస్టు రాజ్యాలలో తరాలుగడిచినా మతం మాయం కాలేదు.

ప్రపంచ చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రగా భ్రమపడినందువల్ల ఆ భ్రమలో నుండి పుట్టిన సిద్ధాంతమే మార్క్సిజం. అందువలన సిద్ధాంతమే తప్పు. ఆ సిద్ధాంతం పునాదిగా వుండే ఆచరణ ఒప్పు కావడానికే అసలే వీలులేదు.

‘అందువల్ల కష్టజీవుల ఆకలిని ఆధారం చేసుకొని రాజకీయాధికారం కోసం ముఠాలు కట్టిన మేధావులు కష్టజీవుల స్వేచ్ఛను కూడా హరించి, బానసత్వాన్ని స్వేచ్ఛగా భ్రమించే స్థితికి వారిని లాక్కుపోయారని’ వెంకటాద్రిగారు ఆవేదన వ్యక్తం చేశారు. ‘జ్ఞానం ఉన్నవారికీ - లేనివారికీ, సంపద ఉన్నవారికీ - లేనివారికీ, అధికారం ఉన్నవారికీ - లేని వారికీ మధ్య కావలసింది పోరాటం కాదు, పంపిణీ కావాలి. జ్ఞానం, సంపద, అధికారం, అన్నీ పంపిణీ కావాలి. అందరికీ పంపిణీ కావాలి. ఇది ఇష్టం లేనివారు ఒకదాని పేరు చెప్పి మరొకదానికోసం పోరట నినాదం ఇస్తారు. జ్ఞాన పంపిణీ అంటే భావ వికాసమే’ అని వివరించారు రావిపూడి వెంకటాద్రి.

*(రావిపూడి రచనలు)* ***సేకరణ : గుమ్మా వీరన్న***



తొడైజీలో బౌద్ధాలయం

# జపా కుసుమం – జపాన్

– గొల్లపూడి మారుతీరావు

జపాన్‌లో నన్ను గొప్పగా ఆకర్షించిన విషయం – ఏ కారణంగానూ పరాయి భాషమీద ఆధారపడని ఆ దేశపు స్వయం సమృద్ధి. చచ్చి గింజుకున్నా ఎవరికీ ఇంగ్లీషు అర్థంకాదు. అర్థమయ్యే ఏ రెండు శాతమో హోటళ్లలో, రైలు స్టేషన్లలో కనిపిస్తారు. అయితే వారి ఇంగ్లీషు కూడా ఎంతో ప్రయత్నిస్తేకాని మనకి అర్థంకాదు. మన దేశంలో ఇంగ్లీషు వ్యామోహానికి, ఇంగ్లీషు మాత్రమే చదువుకున్న తెలుగురాని తెలుగు పిల్లలకి – మూలాలు దాదాపు 150 సంవత్సరాల కిందట ఆంగ్ల పరిపాలనది. పరాయిపాలనలో తప్పక నిలదొక్కుకోవలసిన నేపథ్యంలో – భారతీయులకు ఆ భాషని నేర్చుకోవడం ఉపాధి హేతువయింది. అయినా ఆ భాషా సౌందర్యాన్ని మన భారతీయులు ఆపోశన పట్టినట్టు ప్రపంచంలో మరెవరూ సాధించలేదేమో. రైట్ ఆనరబుల్ శ్రీనివాస శాస్త్రి, సర్వేపల్లి రాధాకృష్ణన్, ఆర్.కె. నారాయణ్, వి.ఆర్.కృష్ణయ్యర్ మొదలయినవారు ఇంగ్లీషు వారు కూడా గర్వపడవలసినంతగా ఆ భాషమీద పట్టు సాధించిన మహనీయులు. అయితే పరదాస్యపు మూలాలు వారసత్వమయి – యివాళ మాతృభాషని అటకెక్కించిన దుర్దశ మనది. పదిమంది తెలుగు కుర్రాళ్లను నిలబెట్టి – వేమన, సుమతి, భర్తృహరి గురించి అడిగితే తొమ్మిదిమంది ముఖాలు తేలేస్తారు. ప్రపంచంలో వాణిజ్యరంగంలో, సాంకేతింకరంగంలో పతాక స్థాయిలో ఉన్న జపాన్‌కు 2014లో కూడా ఇంగ్లీషులో అవసరం కనిపించలేదు. ఇలాంటి దేశాలు మరెన్నో ఉన్నాయి. చైనా, పోలెండు, ఈజిప్టు– ఇలాగ. 2008లో చైనాలో ఒలింపిక్స్ జరిగినప్పుడు వాలంటీర్లకు తప్పనిసరిగా ఇంగ్లీషు నేర్పారు. మన దేశంలో తెలుగు వారికే తెలుగు రాదు. ఇంగ్లీషు సరిగ్గా రాదు. కాగా, నేర్చుకోవాలన్న, పిల్లలకు నేర్పించాలన్న స్పృహ తల్లిదండ్రులకే లేదు. ఒక భయంకరమైన ఉదాహరణ. నా మొబైల్ ఫోన్‌లో చిప్ ఐడియాది. అందులో ఒక మెసేజ్ వస్తుంది. "ఈ డైలర్ టోన్‌ని కాపీ చేసుకోవాలంటే ఫలానా ఖర్చు. చార్జీలు వర్దిస్తాయి." గమనించండి – 'వర్దిస్తాయి'. కొన్ని వందల సార్లు ఈ మాటవిని తలపట్టుకున్నాను. కొన్ని లక్షల మంది రోజూ వింటూనే ఉండి ఉంటారు. 'వర్దిస్తాయి' కాదు బాబూ 'వర్తిస్తాయి' అని ఎవరూ వారికి చెప్పలేదు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకి తెలుగు రానక్కరలేదు కదా! ఇదీ తెలుగు దేశంలో తెలుగు భాష దుస్థితి.

మళ్లీ కథకి వస్తే – జపాన్ బయలుదేరక ముందు నుంచీ మా మిత్రుడు జానకిరామ్‌కి మా ఆవిడ ఆశక్తతమీద అపరిమితమైన నమ్మకం. అందుకని ఆయన సర్వీసులో ఎన్నడూ చెయ్యని ఒక పని చేశాడు. ప్రతీ మజిలీలో తన జపాన్ మిత్రుల సహాయాన్ని కూడగట్టాడు. తత్ఫలితంగా ఆయన టూరిజం శాఖలో పనిచేశాడు కనుక క్యోట్‌లో మేం దిగి 'సకూరా టెర్రేస్' హోటల్‌కి వచ్చేసరికి అక్కడ కారుతో పాటు కె.బి.ఎస్ టెలివిజన్ ప్రతినిధి నిలబడి ఉన్నాడు. ఈ ఛానల్ నిర్మాత జానకిరామ్, మిత్రుడు సైచీ సుజూకీ వీరిని కారిచ్చి పంపారు. ఇద్దరూ హిందీ సినిమా హీరోల్లాగ ఉన్నారు. శరీరాన్ని సగం వంచి పూల పళ్లెం అందించినట్టు రెండు చేతులతో అతని విజిటింగు కార్డుని జానకిరామ్‌కి అందించారు. 'కె.బి.ఎస్' అనే అక్షరాలు వినా ఆ కార్డులో నాకు ఏమీ అర్థం కాలేదు. వారిద్దరికి ఇంగ్లీషులో సాధారణంగా దొర్లే మాటలు కూడా అర్థంకావు. జానకిరామ్ జపాన్ భాషా పరిచయం మమ్మల్ని కాపాడింది. వారి మర్యాద, క్రమశిక్షణ, ఆదరణ అపూర్వం. క్యోటోలో మేమున్న రెండు రోజులూ మాతో ఉన్నారు. మా ఆవిడ నడవలేదని గుర్తించి –మర్నాడు ఎవరూ చెప్పకుండానే ఒక వీల్ చైర్‌ని తీసుకొచ్చారు.



జపాన్ ఉద్యోగులు యిచ్చిన శాఖాహారం

ముక్కూ మొహం తెలీని ముగ్గురు అతిథుల పట్ల – మా భాష తెలీని ఇద్దరు జపాన్ ఉద్యోగులు యిచ్చిన ఆతిథ్యం అద్భుతం. ఆ మధ్యాహ్నం కె.బి.ఎస్. టీవీ ఛానల్ అధిపతి సైచీ సుజూకీ – జానకిరామ్ మిత్రుడు మా కోసం జపాన్ శాఖాహార భోజనాన్ని ఏర్పాటు చేశారు. అది పెద్ద హొటల్ కాదు. రోడ్డు పక్క చిన్న యింట్లో అతి సంసార పక్షంగా భోజనానికి ఆహ్వానించినట్టు అనిపించింది. కాని ఏర్పాట్లు అతి ప్రొఫెషనల్‌గా ఉన్నాయి.

జపాన్‌లో శాఖాహార భోజనం హిమాలయాల్లో ఇడ్లీ సాంబారులాంటిది. ఇక్కడ దాదాపు అందరూ తినే ఆహారం– చేప, మాంసం. అదిన్నీ మనలాగ మసాలా, గసగసాలు, వెల్లుల్లి, అల్లం దట్టించి వండరు. ప్రకృతిలో లభించిన ఆహారాన్ని యథాలాపంగా స్వీకరించడం వారి సంప్రదాయం. కేవలం ఉడికించిన చేపని ఒక పొరలాగ కోసి వేడి వేడి అన్నం మీద ఉడకనిచ్చి చాప్ స్టిక్స్‌తో తీసుకుని తింటారు. వాటితో తినడం ప్రత్యేకమైన నైపుణ్యం. మనం తినే శాఖాహారం వారికి బొత్తిగా అర్థంకాదు. వారిని చూసినప్పుడు తిండిలో మనం ఎంత పురోగతిని సాధించి, ఎంత అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నామో అర్థమౌతుంది. ఆహారంలో 'రుచి' దాన్ని మరిగే అనర్థం. తిండి, శరీరాన్ని నిలుపుకోడానికి అనే ప్రాథమిక సూత్రాన్ని మనం ఏనాడో దాటేశాం. అరటి పువ్వు, తామర తూడులతో కూర, దవ్వ, అవిసెపువ్వు పప్పు, ఉల్లి కాడల పులుసు – యివన్నీ తినవచ్చని వీరికి తెలీదు. శాఖాహారం కావాలంటూ హోటళ్లకు వెళ్లినా ఎక్కడో చేప, మాంసం పదార్థాలు కలిసిపోవచ్చని హెచ్చరికలు వినిపిస్తాయి.

అదృష్టవశాత్తూ పువ్వులాంటి అన్నం దొరుకుతుంది. విచిత్రంగా మాల్స్‌లో చిన్న చిన్న అన్నం పొట్లాల్లు అమ్ముతారు. మరీ పట్టింపుగా శాఖాహారమే కావాలనుకుంటే బౌద్ధ ఆరామాలలోనో, దేవాలయాలలోనో భోజనం చేయాల్సిందేనంటారు. అయితే మాకు జపాన్ శాఖాహారాన్ని పరిచయం చెయ్యడమే ఈ విందు లక్ష్యం.

పరిశుభ్రంగా ఏర్పాటు చేసిన రకరకాల పింగాణీ చిప్పలు, వాటినిండా రకరకాల ద్రావకాలు, వేడినీళ్లతో ఎలక్ట్రిక్ ప్లగ్‌కి తగిలించిన పెద్ద కర్రగిన్నె, చాప్ స్టిక్స్, టేబిలు మీద అమర్చారు. మనం ఆహారాన్ని అన్నంలో రకరకాల అధరువులతో కలుపుకు తింటాం. మనకు అన్నం మూలపదార్థం. ఇక్కడ మరిగే నీళ్లలో తేలే సోయాగింజలతో చేసిన కేక్ మూల పదార్థం. దీన్ని 'తోఫూ' అంటారు. వేడి వేడి కేక్ మీద చిన్న చిప్పల్లో ఉన్న వగరుగా ఉన్న నీరు, ఎర్రటి పుల్లటి పదార్థం, యాలకులతో నానిన నీరు (వీటిని జపాన్ మంజూ, మోచా అంటారు) – మరేవో మరేవో. ఏదీ నాలికకి మనకి తెలిసిన 'రుచి'ని ఇవ్వలేదు. ఏదీ కడుపు నింపలేదు. ఎంతకని సోయాగింజల కేక్‌ని తింటాం? ఆ మాట మన అన్నం విషయంలో వారూ అంటారేమో!

*కాశీఖండం*లో శ్రీనాథుడు అన్నపూర్ణమ్మ వద్దన చేస్తే 'చక్షుల్ నిండగ యారగించితిమి యక్షుద్ర క్షుదాశాంతికిన్' అన్నాడు. మంచి ఆహారం కన్నూ, కడుపూ – రెంటినీ నింపాలట. జపాన్ భోజనం రెండూ నింపలేదు. అయితే ఆరోగ్య సూత్రాల ప్రకారం ఎప్పుడూ కడుపు పగిలేటట్టు తినడం రోగం. ఈ మాటని భగవద్గీతాకారుడు చెప్పిన రుజువులున్నాయి. జపాన్‌లో 80 ఏళ్ల వృద్ధులు ఆరోగ్యంగా సైకిలు తొక్కడం చూశాను. నూరేళ్ల వారినీ చూశాను. ముఖ్యంగా ఒక్కరు – ఒక్కరయినా శరీరం లావెక్కి, కడుపులు జారిన భారీ శరీరాల్ని చూడలేదు! అమెరికాలో వీరు



లేళ్ళు జనసందోహంతో మమేకమైన అద్భుతదృశ్యం



జనాదరణకి అలవాటు పడిన లేళ్ళు

కోకొల్లలు. శరీరాలు బరువెక్కిన పసి పిల్లలు కూడా అక్కడ కనిపిస్తారు. ఆరోగ్యాన్ని భోజన అలవాట్లలోనే నియంత్రించిన సంస్కృతి ఈ దేశానిది. మన వేదంలో అన్నసూక్తం ఉంది. మన ఆహారం మన ఆరోగ్యాన్నే కాక, మన ఆలోచనల్నీ, మన సంస్కారాన్నీ తీర్చిదిద్దుతుందంటారు. ఈ విషయాన్ని చెప్పి అమెరికా రుచులు మరిగిన మన దేశస్థుల్ని ఒప్పించండి చూద్దాం.

చాలా సంవత్సరాల కిందట – హైదరాబాదు రేడియోలో పనిచేసే రోజుల్లో మా కాంపౌండు పక్కనే ఉన్న నిజాం క్లబ్బులో ఎవరో మధ్యాహ్నం లంచ్ ఏర్పాటు చేశారు. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారూ వచ్చారు. ఆయనకి అప్పటికే మాట పోయింది. భోజనం అయాక నన్ను పిలిచారు. "ఈ దిక్కుమాలిన భోజనం చేశాక నా నోరు చచ్చిపోయింది. ఇంటికి ఫోన్ చేసి మా ఆవిడకి చారు పెట్టమని చెప్తావా?" అని అన్నారు. పెంకితనంతో కూడిన హాస్యం ఆయన సొత్తు. ఏమయినా జపాన్ భోజనం తర్వాత నా పరిస్థితీ అదే. చక్కగా గోంగూర పచ్చడి తినాలని. అయితే జపాన్ సంప్రదాయపు విలువలను వెక్కిరించడం నా ఉద్దేశం కాదు. మన జిహ్వకు అలవాటు లేని పదార్థాలవి. కిందటి తరం –అంటే మా తరం ఆహారంలో రుచులతోపాటు చాలా రోగాల నుంచి శరీరాన్ని కాపాడే లక్షణాలు ఉండేవి. ఉదాహరణకి మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచడానికి అరటి దవ్వ – జపాన్ ఫైబర్ ఒక్కటే చికిత్స అని ప్రపంచమంతా అంగీకరించిన సత్యం. మా నాన్నగారు వారంలో ఒక్క రోజయినా విధిగా అరటి దవ్వ చేయించేవారు. ఈ మధ్య మా అబ్బాయి మిత్రుడికి మూత్రపిండాలకు సంబంధించిన అస్వస్థత వచ్చింది. నాకు చెప్తే "హాయిగా అరటి దవ్వ కూరని తినమను" అన్నాను. మా అబ్బాయి నిర్ఘాంతపోయాడు. డాక్టరు 2013లో సరిగ్గా అదే చెప్పాడట అరటి దవ్వ రసాన్ని తాగమని. సంప్రదాయంలో నిక్షిప్తమయిన ఆచారాలు empirical truths.

ఆ రోజు క్యోటోలో ఏదో విశేషం ఉన్నట్టుంది. ఎక్కడ చూసినా జపాన్ మహిళలు సంప్రదాయపు జపాన్ దుస్తులు – కిమోనోలు ధరించి – కనిపించారు. అలవాటు లేనివారికి – అయిదుగురు అమ్మాయిల్ని వరసగా నిలబెడితే వారిని ప్రత్యేకంగా గుర్తుపట్టడం కష్టం. అందరూ దాదాపు ఒకేలాగ ఉంటారు. మన సర్దార్జీలను చూస్తే వారూ అలాగే కంగారు పడతారేమో. జానకిరామ్‌కి చెప్పి ఇద్దరు అమ్మాయిల్ని అడిగి వారితో ఫొటోలు తీయించుకున్నాం. తెల్లారి లేస్తే ఫొటోల కోసం తన వెంటబడే అభిమానులున్న సినీనటుడు వారి ఫొటోని కోరి అడుగుతున్నాడని వారికి తెలీదు. ఏకాంతం స్వర్గం. పొరుగువాడు ఇబ్బంది పెట్టని స్వేచ్ఛ అపూర్వం. క్యోటోలో నా వైభవం అది.

క్యోటోలో దేవాలయాల్ని గైడ్‌లో చూసి లెక్కపెట్టాను. కేవలం 137 ఉన్నాయి! మేం అక్కడ ఉండేది 48 గంటలు. క్యోటో అనగానే గుర్తొచ్చే షిన్యోదో ఆలయాన్ని బయట నుంచే చూశాం. 984 సంవత్సరంలో నిర్మించిన బౌద్ధ ఆలయం ఇది. ఇండియాకు తాజ్‌మహల్‌లాగ, ఫ్రాన్సుకి ఐఫిల్ టవర్‌లాగ, ఆస్ట్రేలియాకి ఆపెరా హౌస్‌లాగ, ఈజిప్టుకి పిరమిడ్‌లాగ, క్యోటో అనగానే గుర్తొచ్చేది ఈ ఆలయ శిఖరం.

మరొక అందమయిన, అపురూపమయిన, చూడ ముచ్చటయిన ఆలయం స్వర్ణ దేవాలయం. కింకాకు (రుంకోజీ) ఆలయం అంటారు.

మనదేశంలో లాగే ఇక్కడా మతానికీ, వదాన్యతకీ దగ్గర తోవ ఉంది. ఎంతో మంది సంపన్నులు మతాన్ని ఉద్ధరించడానికి కృషిచేశారు. చెన్నైలో ప్రముఖ నటీమణి అంజలీదేవి తను అపురూపంగా నిర్మించుకున్న అడయార్ భవనాన్ని సత్యసాయిబాబా ట్రస్టుకి అప్పగించారు. ఈ కింకాకు ఆలయ పూర్వ రూపం –సయోంజీ కిన్సునే అనే ఓ శ్రీమంతుడి భవనం. 1397లో సయోంజీ కుటుంబం నుంచి ఈ భవనం చేతులు మారింది. గోడోమత్సు అనే చక్రవర్తి కుటుంబానికి ఇది అతిథిగృహంగా ఉపయోగపడింది. యోషీమిత్సు తన తదనంతరం యిది ఆలయం కావాలని మూసోకోమాషీ అనే మతగురువుకి ధారాదత్తం చేశారు. ఈ

ఆస్తి అధిపతి పేరుమీదే ఆలయం చలామణీ అయింది. ఇందులో 9వ శతాబ్దంనాటి అద్భుతమైన బుద్ధుని విగ్రహం ఉంది. అతి సుందరమైన ఈ ఆలయ పరిసరాలు, భవనం కేవలం భక్తులనే గాక పర్యాటకుల్ని కూడా ఆకర్షిస్తుంది.

మా ఆవిడ వీల్‌ఛైర్‌ని ఆసరాగా చేసుకోడానికి ఇది ప్రారంభం. నిర్వాహకుల నుంచి వీల్‌ఛైర్‌ని సంపాదించి – జపాన్ మిత్రుడు ఆమెని తిప్పాడు. రెండు కళ్లు చాలని ఈ స్వర్ణ దేవాలయం సౌందర్యాన్ని అబ్బురంగా చూస్తూ గడిపాం.

అయితే 137 దేవాలయాలలో స్థాళీపులాక న్యాయంగా నాలుగింటిని మాత్రమే చూడగలిగామన్న అసంతృప్తితో, బోలెడంత నిస్సహాయతతో గదికి చేరాం. ఏమయినా రేపు – జపాన్‌కి ఒకప్పటి రాజధాని– యిక్కడికి 140 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'నారా' పట్టణానికి వెళ్లబోత్నుందుకూ, ప్రపంచంలో కల్లా అతి పెద్ద బుద్ధుని విగ్రహాన్ని చూడబోతున్నామన్న ఆలోచనతో నిద్రలోకి జారుకున్నాం.

జపాన్ దేశస్థుడు సహజంగా ఆవేశి. తన ఉద్రేకాన్ని , కోపాన్ని, ఆత్మాభిమానాన్ని, నిజాయితీని, చివరికి భక్తినీ అంతే ఆవేశంగా ఆకాశానికి అంటేలాగ ప్రదర్శిస్తాడు. ఇది జాతి సహజ లక్షణం. మనకి మూడు పెద్ద గదుల్ని ఆక్రమించిన పద్మనాభస్వామి (తిరువనంతపురం), వరదరాజస్వామి (తిరుపతి), శ్రీరంగనాయకులు (శ్రీరంగం) ఉన్నారు. ఆకాశాన్నంటే కొండల్లో మన దేవుళ్ళు వెలసి ఉంటారు. 20 అడుగుల ఎత్తు ఉంటారు. వారి శక్తి పర్వతాలను ఎత్తేది (మధురలో గోవర్థన క్షేత్రం). స్వరూపంలో రామప్ప నంది అద్భుతం. ఇక్కడి బుద్ధుడి ఆలయాలు అటువంటివే. తలెత్తి చూస్తేనే కాని విగ్రహ స్వరూపం తెలియదు. నారాలో తొడైజీ ఆలయం, కామాకురాలో బుద్ధుడి ఆలయం అద్భుతమైన బుద్ధుడి విగ్రహాలకే ప్రపంచ ప్రసిద్ధం. ఒక్కొక్క భక్తుడు లేదా దేశం వారి వారి అనుభూతుల విశ్వరూపాన్ని వారి వారి విశ్వాసాల్లో పొదుగుకున్నారు. అయితే తొడైజీ బుద్ధుడు ఆలయంలో వున్న విగ్రహం. కామాకురా బుద్ధుడు ఆరుబయట ఉన్న విగ్రహం. (దీని గురించి తర్వాత). యాత్రికులు తండోపతండాలుగా వచ్చి, ప్రార్థించి, దర్శించి వెళ్తుంటారు.

అసలు నారా పట్టణానికే ప్రత్యేకమయిన చరిత్ర ఉంది. క్యోటోకి 26 మైళ్ల దూరంలో ఉన్న ఈ పట్టణం సరిగ్గా 1304 సంవత్సరాల కిందట (710–784) జపాన్ రాజధాని. ఇవాళ వాణిజ్యానికి, ప్రభుత్వ కార్యాలయాలకూ స్థావరంగా మిగిలింది. కాగా, దాదాపు జపాన్ వచ్చిన యాత్రికులందరూ విధిగా వచ్చి దర్శనం చేసుకునే అద్భుతమైన ఆలయం తొడైజీ బుద్ధుడి ఆలయం. ఈ దేశంలో వీరులదీ, సైన్యాధిపతులదే మొదటినుంచీ రాజ్యం. యుద్ధ కళలు– కుంఫూ, కరాటేల వంటి ఎన్నో అద్భుతమైన, అనూహ్యమైన విద్యలు ఈ దేశంలో ఆయా తరాలలో వృద్ధి చెందాయి. జపాన్ భాషలో 'నారాసు' అంటే బలిష్టమైన – అని అర్థం. ఆ మాటనుంచే ఈ పట్టణానికి 'నారా' అని పేరొచ్చిందంటారు. ఈ స్థల పురాణాలెన్నో ఉన్నాయి. ఇక్కడ ఎనిమిది దేవాలయాలు గొప్పవి. అందులో ప్రపంచ ప్రసిద్ధి పొందిన ఆలయం – తొడైజీ.

మేం వెళ్ళిన రోజు వేలమంది యాత్రికులు – ముఖ్యంగా విద్యార్థులు కనిపించారు. ఎటుచూసినా జనసందోహం. ఈ సమూహాల మధ్య మనల్ని తమ కొమ్ముల్తో పొడుస్తూ – మన చేతుల్లో ఉన్న తినుబండారాల్ని అడిగి మరీ అందుకునే లేళ్లు, దుప్పులు. మనల్ని రాసుకుంటూ నడుస్తాయి. ఇక్కడి ఆకర్షణ ఆ జంతువులే. కనిపిస్తే మన దేశంలో మనల్ని తప్పించుకు పారిపోయే ఈ జంతువులు – సంవత్సరాల తరబడి జనసందోహానికి, వారి ఆదరణకి అలవాటు పడి పడి వారితో మమేకమైన అద్భుతదృశ్యమిది. బహుశా సమస్త ప్రాణికోటినీ సమతుల్యంగా పరిగణించాలన్న బుద్ధుని ఉద్బోధకు ఈ జంతువులు అద్దం పడుతున్నాయోమే ననిపిస్తుంది. అవి గొప్ప దృశ్యాలు (ఫొటోలు చూడండి).

ఇక తొడైజీ ఆలయం ఐక్యరాజ్యసమితి ప్రపంచ సంపదగా (హెరిటేజ్) పరిగణించిన అరుదైన, అద్భుతమైన ఆలయం. ఇక్కడ మూలవిరాట్టు – ప్రపంచంలోకెల్లా పెద్ద 'కర్ర'తో చేసిన విగ్రహం. కొన్ని శతాబ్దాలుగా నిలిచిన ఈ విగ్రహాన్ని ఏ కర్రతో,



తొడైజీలో మనుషుల మధ్య లేళ్లు

ఎంత పెద్ద వృక్షాల్ని నరికి తయారు చేశారా అని ఆశ్చర్యం కలుగుతుంది. శతాబ్దాలు గడిచినా ఆ మూర్తి ముఖ ఛాయలుగాని, కర్ర మన్నికగాని చెక్కు చెదరలేదు. ఈ మాట చెప్తున్నప్పుడే ఇక్కడ తరుచు వచ్చే భూకంపాలలో చెక్కు చెదరగా ఈ విగ్రహం చేతులను ఒకసారి (1568–1615), తలను ఒకసారి (1615–1867) మరమ్మత్తులు చేశారు.

పనివాడితనంలో చేసే కృషిలో ఆనాటి శిల్పుల సామర్థ్యం ఊహకి కూడా అందదు. 500 టన్నుల బరువు, 50 అడుగుల ఎత్తు ఉన్న ఈ విగ్రహం, శతాబ్దాలుగా తిరుమలలో నిలిచిన స్వామివారి సాలిగ్రామ శిల సౌందర్యానికి ఏ మాత్రమూ తీసిపోదు. ఈ ఆలయ ప్రాకారాలు, వసారాలు, ప్రాంగణం – అంతా సువిశాలం, అత్యంత విస్తృతం. 728 ప్రాంతాలలో ఇటలీలో వాటికన్‌లాగ ఈ ఆలయం, ఇక్కడ ఉండే బౌద్ధ భిక్షువులకు – ఈ మతానికి కేంద్ర స్థలంగా ఉండేది. ఇప్పుడిక్కడ ఒక ప్రదర్శనశాల, ఒక గ్రంథాలయం, ఒక పరిశోధనాకేంద్రం – ఇన్ని ఏర్పడ్డాయి.

తిరుమల మహతి ఆడిటోరియం ఇప్పుడు సంగీత సాహిత్య ఉత్సవాలకు ఆలవాలమయినట్టే – ఈ తొడైజీ ఆలయ సమీపంలో 1994లో జపాన్ అంతర్జాతీయ సంగీతోత్సవాన్ని నిర్వహించింది. 2010లో టోక్యో బ్రాడ్ కాస్టింగ్ సంస్థ ఇక్కడ ఇంగ్లీషు సొప్రానో సారా బ్రైట్‌మాన్ కచ్చేరీని నిర్వహించింది. జాతి గర్వపడే క్షేత్రం ప్రపంచం గర్వపడే సంగీతానికి వేదిక కావడం అద్భుతమైన సంప్రదాయం. 2015లో కూడా ఇంకా సంప్రదాయానికి పెద్ద పీట వేస్తున్న గొప్ప దేశం జపాన్. ఈ ఒక్క కారణాన్ని ఉటంకించడమే ప్రధానంగా ఈ యాత్రాస్మృతి లక్ష్యం. మన రామాయణాన్ని, మన భారతాన్ని, మన పాత సినీరంగాన్ని, మన మతాన్ని, మన సంప్రదాయ కళల్నీ వెక్కిరించే మేధావులు పుట్టుకొచ్చిన ఈ తరుణంలో ఎంతో ముందడుగు వేస్తున్న దేశం – వెనకచూపును విస్మరించకుండా తమ సంప్రదాయపు విలువలకి సిగ్గుపడడం లేదని, గర్వంగా తలకెత్తుకుంటోందని చెప్పడానికే ఈ ప్రయత్నం. ౚ


## ఏరియల్ చదివి ...

▲ *సాహితీ అభిమానిగా జీవితకాలంలో ఎన్నో గ్రంథాలు చదివాను. కానీ ఈ మధ్యనే 'ఏరియల్' చదవడం జరిగింది. అనువాద శైలి ఓ భాషా శిల్పంగా మలచబడింది. కథనం ఎంతో కమనీయంగా సాగి, పొందుపరచిన చిత్రాలు అపురూపంగా ఆవిష్కరింపబడ్డాయి. తెలుగు రచన అనన్య సామాన్యమై అనువాదాలకు జవసత్వాలు తిరిగి కల్పించిన రచయితకి నా హార్దిక అభినందనలు...*

– ఎ.వి కోటిరెడ్డి

▲ *మానవజాతిని ఎంతో ప్రేమించినా, ఈ మానవ సమూహాల మధ్య తాను ఎప్పుడూ ఒంటరిగానే మిగిలి పోయిన షెల్లీ, సుమధుర గీతాలన్నీ వ్యధా భరిత గాథలే అన్నట్లు ప్రపంచాన్ని నీతిమంతం చేయాలని జీవితమంతా పోరాటం సలిపి, ఎన్నో కష్టాలకు లోనైన షెల్లీ దయనీయ జీవిత గాథను తెలుగులో కవితాత్మకంగా అందించిన అశ్వినీ అభినందనీయులు...*

– కోడూరు పుల్లారెడ్డి

▲ *కష్టాలను భరిస్తూ కూడ తను నమ్మిన విలువలకు కట్టుబడిన షెల్లీ అంటే ఆరాధన, ప్రేమ కలిగాయి. వ్యక్తుల సంబంధ బాంధవ్యాలను కాస్త విపులంగా ఇస్తే నాలాంటి వారికి సదుపాయంగా ఉండేది.*

– రోహిణీ కుమార్




తెలుగులో తొలిసారి పెర్సీ బిష్ షెల్లీ జీవిత కథ !
మీ ప్రతి కోసం 'మిసిమి'ని సంప్రదించండి !



రమణీయ విషాద హృదయం

# దిలీప్ కుమార్

– ఎన్నార్కె

**టి.వి.** యాంకర్ ముందు జయాబచ్చన్ కూర్చొని ఉంది. మీకు బాగా నచ్చిన చిత్రాలు ఏవి? యాంకర్ ప్రశ్న – "చాలా ఉన్నాయి. సత్యజిత్‌రే సినిమాలు, ముఖ్యంగా దిలీప్ కుమార్ నటించిన అన్ని చిత్రాలు" సమాధానం.

విన్న యాంకర్‌కు మతి పోయింది. ఏమిటి? అమితాబ్ బచ్చన్ భార్యానే ఇలా మాట్లాడుతుంది? కాస్సేపటికి తేరుకుని, "మరి 20వ శతాబ్దపు అత్యుత్తమ నటునిగా అందరూ అమిత్‌జీనే పేర్కొంటున్నారు కదా!"

"అమిత్‌జీ ఒకప్పటి యువతరం గుండెల్లో తీవ్రంగా గూడుకట్టుకుని ఉన్న భావావేశాల్ని అత్యున్నతంగా ప్రదర్శించారు. ఒక తిరుగుబాటు యువకునిగా నటించి యువకుల దృష్టిలోకి చొచ్చుకొని పోయాడు. ఇప్పుడు సినిమా చూస్తున్న అధిక సంఖ్యాకులు అప్పటి టీనేజర్సే. అంతే కాక సంఖ్యాపరంగా ఎన్నో విజయవంతమైన చిత్రాలలో నటించారు. గాంధీజీకి నోబుల్ బహుమతి రాలేదు. అతని శిష్యులకు వచ్చింది అలానే! ఇది". (నేషనల్ టి.వి. 2001 లో ప్రసారం).



శాంతారామ్‌తో దిలీప్

పైన చెప్పిన భావాలు జయాబచ్చన్‌వే కాదు. లక్షలాది మంది సినీ ప్రేమికులది కూడా. హిందీ చిత్రసీమలో మానసికమైన, గాఢమైన మనోభావాల ప్రదర్శనకు మెరుగులు దిద్దిన వాడు దిలిప్ కుమార్. అందుకే హిందీ చిత్రసీమలో హీరోలుగా అడుగుపెట్టిన వారెందరిలోనో దిలీప్ కుమార్ నటనకు ప్రతిరూపం ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒకచోట తొంగి చూస్తుంది. అతని కెందరో కాపీలు. రాజేంద్ర కుమార్ అచ్చుగుద్ది నట్లుండే మొదటి జిరాక్స్ కాపీ అయితే, మనోజ్ కుమార్, అమితాబ్ బచ్చన్‌ల నుండి షారూక్ ఖాన్ వరకూ ఆ నటనా ప్రభావం తీవ్రస్థాయిలో నున్న రెండవ, మూడవ జిరాక్స్‌లు. అస్సలు దిలిప్ ప్రభావం పడని నటులుగా నసీరుద్దీన్ షా, ఓంపురి, సంజీవ్‌కుమార్, నానాపాటేకర్‌లాంటి కొద్దిమంది మాత్రమే ఉన్నారు.

కానీ.... కొందరికి దిలీప్ నటన నచ్చదు. "అదేమిటండీ ఎప్పుడూ కనురెప్పలాడిస్తూ తనలో తానే గొణుక్కుంటున్నట్లు మాట్లాడతాడు" అనే వారున్నారు.

సినిమా నటనను తూచే తూనిక రాళ్ళు ఎవరి వద్దాలేవు... దృశ్య ప్రధానమైన సినిమాను కావ్యాత్మకంగా మలచిన సత్యజిత్‌రే, రసాత్మకంగా, మలచిన వి. శాంతారామ్‌లు దేశ ఎల్లలు దాటి ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకున్న దర్శకులు. వాళ్ళు ఎప్పుడూ మర్యాదకోసమో, మొహమాటానికో, ప్రేక్షకుల చప్పట్ల కోసమో మాట్లాడరు. వారి మనసులోని భావాలను ఉన్నది ఉన్నట్లుగా కట్టెవిరిచినట్లు మాట్లాడతారు. "He is the only ultimate *method actor* in India." ఇవి సత్యజిత్‌రే మాటలు. దిలీప్ షేక్స్పియర్ కాలంలో జీవించి ఉంటే, అతని నటన చూసి షేక్స్పియర్ మరో గొప్ప ట్రాజెడీ వ్రాసేవాడు" ఇది శాంతారామ్ దిలీప్‌కు ఇచ్చిన కితాబు.

దిలీప్ నటన కంటే బలరాజ్ సాహ్ని నటన మరింత



అభిమాన నటుడు అశోక్‌తో దిలీప్

పరిపక్వంగా ఉంటుందనే బలరాజ్ సాహ్నీ అభిమానులు, వామపక్ష ప్రముఖులు ఉన్నారు. మరి బలరాజ్ సాహ్నీ దిలీప్ కుమార్ గురించి ఏమంటాడు? "క్లిష్టమైన సన్నివేశాలలో నటించ వలసి వచ్చినపుడు నటన పరంగా కొంత అస్పష్టత ఏర్పడినపుడు నా ఆలోచనలు దిలీప్ కుమార్ వైపు సాగుతాయి. అసలు ఈ పరిస్థితులలో దిలీప్ ఎలా ఆలోచిస్తాడు? ఎలా నటించి ఉంటాడు? అనుకుంటే దానితో ఏదో ఒక దారి దొరుకుతుంది. (వక్త రజతోత్సవ సందర్భంలో)

"అశోక్ కుమార్ ముందు దిలీప్ ఎంతండి?" అని మరికొందరంటారు. చిత్రమేమిటంటే ఈ అభిప్రాయం వెళ్ళబుచ్చిన వారిలో దిలీప్ కుమార్ కూడా ఉన్నాడు. "అశోక్ కుమార్ మేకప్ వేసుకుని బయటకు వచ్చిన వెంటనే ఆ పాత్రలోకి సునాయాసంగా ప్రవేశించ గలుగుతాడు. ఆయన బాడీ లాంగ్వేజ్ ఆ పాత్రను అనుసరిస్తుంది. అది నాకెంతో ఆశ్చర్యం కలిగిస్తుంది. అంత సులువుగా తన్ను తాను మరచి పోయి పాత్రలో ప్రవేశించటం ఆయనొక్కరికే సాధ్యం. నేను పాత్రలోకి వెళ్ళడానికి చాలా సమయం తీసుకుంటాను. అశోక్ కుమార్‌ది అనితర సాధ్యమైన ప్రతిభ." దిలీప్ అభిప్రాయం.

మరి అశోక్ కుమార్ ఏమంటారు? "నా నటనలో సహజత్వం ఉంటుందని అందరూ అంటారు. దిలీప్ నటనలో దానితో బాటు ఒక తాదాత్మ్యత, బరువు ఉంటుంది." దిలీప్ నటనపై అశోక్ కుమార్ కొన్ని సంఘటనలను ఉటంకిస్తారు. అందులో కొన్ని...

ఫిల్మాలయా స్టూడియోలో లీడర్ సినిమా షూటింగ్ జరుగుతుంది. అదే సమయంలో మరో ఫ్లోర్‌లో అశోక్ కుమార్‌కు పని ఉంది. కారులో వస్తున్న అశోక్ కుమార్‌కు మేకప్ వేసుకుని బయటనున్న స్టూడియో గ్రౌండ్స్‌లో రొప్పుతూ పరిగెడుతున్న దిలీప్ కుమార్ కనిపించాడు. యూసఫ్ (దిలీప్) ఎందుకు ఇలా పరుగులు తీస్తున్నాడు? అని అడిగాడు. ఇందులో హీరో పాత్రధారిని పోలీసులు తరుముతూ ఉంటారు ఈ సన్నివేశం ఇంతకు ముందు తీశాం. ఆ తరువాత అతను ఒక గుడిలోకి వెడతాడు. ఇక్కడ కొన్ని సంభాషణలున్నాయి. అవి రక్తికట్టడం కోసం, కంటిన్యూటీ కోసం దిలీప్ ఇలా చేస్తున్నాడన్నారు, దర్శకుడు రామ్ ముఖర్జీ. ఆ షూటింగ్ పూర్తయ్యేవరకూ అశోక్ కుమార్ అక్కడే ఉండి, యూసఫ్‌ను కౌగలించుకొని, నటనపై అతనికున్న కమిట్‌మెంట్‌ను అభినందించి వెళ్ళాడు.

*నయాదౌర్* చిత్ర నిర్మాణం ప్రారంభం కాక ముందు, బి. ఆర్. చోప్రా ఆ కథను అశోక్ కుమార్‌కు వినిపించి నటించమన్నాడు. కథ ఆసాంతం విన్న అశోక్ కుమార్ కథ బాగుంది, ఈ పాత్రకు చలాకీతనం చాలా అవసరం మంచి సందేశం ఉంది. దీనికి అన్ని విధాలా దిలీప్ ఒక్కడే సరిపోతాడన్నాడు. దానికి చోప్రా ఈ కథను మొదట దిలీప్‌కే వినిపించాం. ఈ *టాంగావాలా* పాత్ర నాకు నచ్చలేదు. నేను వేయనన్నాడు. "విషయాన్ని మీరు సరిగ్గా ప్రెజంట్ చేయలేక పోయి ఉండవచ్చు. నేను యూసఫ్‌తో మాట్లాడతాను" అని చెప్పి అశోక్ కుమార్ దిలీప్‌తో మాట్లాడి ఆ పాత్ర పోషించడానికి ఒప్పించాడు. దీదార్ సమయంలో గుడ్డివాని పాత్ర పోషించ వలసి వచ్చినప్పుడు దిలీప్ కుమార్ ఎన్నోసార్లు అశోక్ కుమార్‌తో సంప్రదింపులు జరిపాడు. ఆయన చెప్పిన సూచనలను పాటించాడు. దిలీప్ కుమార్ హీరో పాత్ర నుండి రిటైరై శక్తి చిత్రంలో తండ్రిపాత్రలో నటిస్తున్నప్పుడు ఒక పాత్రను సృష్టించి అశోక్ కుమార్‌తో నటింపజేశాడు. అందులో దిలీప్ పాత్ర డి.ఐ.జి అయితే ఆ పై స్థాయిలో నున్న ఐ.జి పాత్రను అశోక్ కుమార్ పోషించారు. పాత్రపరంగా కూడా అశోక్ కుమార్‌ను ఒక మెట్టుపైనే ఉంచాడు.

రాజ్‌కపూర్ దర్శకత్వంలో రిషికపూర్ ప్రేమ్‌నగర్ చిత్రంలో నటిస్తున్నప్పుడు ప్రేయసిని విడిచి వెళ్ళినప్పుడు ప్రియుని బాధను వ్యక్త పరుస్తున్న సన్నివేశముంది. రిషికపూర్ చూపిస్తున్న భావవ్యక్తీకరణ రాజ్‌కపూర్‌కు నచ్చలేదు. అటువంటి సన్నివేశం నటించవలసి వచ్చినపుడు దిలీప్

చూపించిన ముఖకవళికలను ఒకసారి జ్ఞాపకం చేసుకోమని రాజ్‌కపూర్ రిషికపూర్‌ను ఆదేశించాడు. (ముఝ్‌కో యూసఫ్ చాహియే).

తన ముందు తనం నటులైన షరాబ్ మోడీ, పృథ్వీరాజ్ కపూర్‌ల నటనంటే చాలా యిష్టపడతాడు. వారంటే చాలా గౌరవం. యహూదీ, మొఘలే ఆజామ్ చిత్రపు టైటిల్స్‌లో దిలీప్ కుమార్ కంటే ముందు వారి పేరు టైటిల్స్‌లో వస్తుంది.

షహీద్, ఉపకార్ చిత్రాలలో ఉవ్వెత్తున ఎగిసిన నట దర్శక తరంగం, మనోజ్ కుమార్, అతని అసలు పేరు హరికృష్ణగోస్వామి. హీరోగా అవకాశం వచ్చినపుడు ఈ హరికృష్ణగోస్వామి ఎంచుకున్న పేరు మనోజ్‌కుమార్. కారణం, అది షబ్నమ్ చిత్రంలో దిలీప్ కుమార్ నటించిన పాత్ర పేరు కావటమే.

అశ్వినీకుమార్‌తో కలిసి నేను, ప్రమోద్ కుమార్, అక్కినేనిని ఇంటర్వ్యూ చేశాం. మీకు బాగానచ్చిన ఇతర భాషా చిత్రాలేమిటి అని అడిగితే ఆయన రెండు చిత్రాల గురించే చెప్పాడు. ఒకటి హిచ్‌కాక్ దర్శకత్వం వహించి గ్రెగరీపెక్ నటించిన స్పెల్‌బౌండ్ రెండవది బిమల్ రాయ్ తీసిన దేవదాసు. అంతేకాదు 'అశోక్‌కుమార్‌ది సహజ నటన. అంటే నటించినట్టు కనపడదు. దిలీప్‌ది పరిణతి చెందిన నటన' అంటారు అక్కినేని. పరోక్షంగా దిలీప్ నటనపై అక్కినేనికి గౌరవం ఉందని అర్థమయ్యింది.

దిలీప్ కుమార్‌ది ఒకటే మూస, అన్ని చిత్రాలలోనూ ఒకటే పాత్ర పోషిస్తాడు. ట్రాజెడీ కింగ్ అనే పేరుతో ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటాడు. ఇది అతనిపై ప్రత్యర్థులు విడిచిన మరో బాణం. సినిమా మూకీస్థాయిలో ఒక కళగా ఆవిర్భవించి, కాలగతిలో కాసులార్జించటంతో వ్యాపారం ఇందులోకి చొరబడింది. మూస పాత్ర పోషణ చాలా గొప్ప నటులను వెంటాడి వేధించిన ఒక తప్పనిసరి దుర్మార్గం. చార్లీ చాప్లిన్‌నే తీసుకుందాం. లూజ్ ప్యాంట్, టైట్‌కోటు, గొడుగుకావ, అన్నిట్లోనూ అలానే ఉంటాడు. కానీ పాత్ర ప్రారంభమయినప్పటి నుంచి నటనలో మార్పు కనిపిస్తుంది. gags మారుతాయి. పాత్ర దృశ్యరూపం మాత్రం మారదు. మిగిలినది కథననుసరించి ఉంటుంది. City Lightsలో కనిపించే ట్రాంప్‌కు Great Dictatorలో కనిపించే ట్రాంప్‌కు, సర్కస్‌లో పాత్రకు దేనికదే. ఏ సన్నివేశంలో కూడా, ఇలాంటి సంఘటన ఇంతకు ముందు ఇలా నటించాడు కాబట్టి ఇప్పుడు అలానే నటిస్తాడు అని మనం అనుకోడానికి వీలుండదు. ఇది గొప్ప నటులందరికీ వర్తిస్తుంది. దిలీప్ తన రెండవ చిత్రమయిన మిలన్‌తోనే (తెలుగు చరణదాసిలో అక్కినేని నటించిన బరువైన పాత్ర) మంచి నటునిగా గుర్తింపు పొంది, ఐదవ చిత్రమయిన జుగ్నూతో నూర్జహాన్‌తో కలసి నటించి అగ్రస్థానం చేరుకున్నాడు. అందాజ్‌లోని సున్నితమైన భావ ప్రదర్శనతో నట శిఖరాలనందుకున్నారు. దిలీప్ ట్రాజడీ అద్భుతంగా నటిస్తాడు, తిరుగు లేదు అని అందరూ అతనిపై ఒక మూస ముద్ర వేయబోయే సమయంలో, రెండు సంవత్సరాల తరువాత వచ్చిన ఆన్ చిత్రంలో కత్తి, కళ్లెం పట్టుకుని గుఱ్ఱం మీద తిరిగే సాహసవీరునిగా నటించి, వైవిధ్యాన్ని చాటాడు. అలానే జగన్, మేలా లాంటి ట్రాజడీ ట్రాక్ నడుస్తున్నప్పుడు దానికి భిన్నంగా రాబిన్ హుడ్ శైలిలో Light hearted Heroగా ఆజాద్‌లో నటించి ప్రజాభిమానంతో పాటు ఫిలింఫేర్ అవార్డునూ గెలుచు కున్నాడు. సినిమాలలో విషాదాన్ని పండించే దిలీప్ కుమార్ నిజ జీవితంలో హాస్య ప్రియుడు. విషాద పాత్రపోషణలో దేవదాస్ చిత్రానికి, ఆరోగ్యమైన హాస్యాన్ని పండించినందుకు గాను కోహినూర్, లీడర్ చిత్రాలకు ఫిలింఫేర్ అవార్డు అందుకున్నాడు. అయినా ప్రజలకతను ట్రాజెడీ కింగే!

నటించిన సినిమాలు తక్కువ. 70 సం॥ల కాలపరిధిలో 70 సినిమాలు కూడా లేవు. అలానే హీరోయిన్‌లు కూడా తక్కువే. కామినీకౌశల్, నర్గీస్, నిమ్మి, మీనాకుమారి, మధుబాల, వైజయంతిమాల, వహీదా రహ్మాన్, సైరాబాను. ఇందులో సైరాబాను అతని భార్యకాగా, కామినీకౌశల్,



చిన్ననాటి మిత్రుడు రాజ్

మధుబాల, వైజయంతిమాలతో అతనికి శృంగార సంబంధా లున్నట్లు పత్రికలలో కథనాలు వచ్చాయి. ఒకటి రెండు సినిమాలో హీరోయిన్లుగా నటించిన వారు సుచిత్రా సేన్, షర్మిలా టాగూర్, నందా, రాఖీ, నూతన్, రేఖ, లీనా చంద్రావర్కర్, బిందు, నళినిజయవంత్, మున్వర్ సుల్తానా మొ॥వారు.

*నయాదౌర్* కోర్టుకేసు విషయంలోని మెట్రో పొలిటియన్ జడ్జిముందు, డిఫెన్స్ కౌన్సిల్ అడిగిన ప్రశ్న "మీరు మధుబాలను ప్రేమించారా?" దానికి దిలీప్ "నేను మధుబాలను ప్రేమించాను, ప్రేమిస్తూనే ఉంటాను" అని ప్రజలందరి సమక్షంలో జడ్జిముందు వాగ్మూలమిచ్చాడు. సినిమాలో హీరో హీరోయిన్ల మధ్య ప్రేమ సహజంగా చిగురించే అవకాశాలు అప్పుడప్పుడు ఏర్పడుతుంటాయి. ఎవరయినా దాని గురించి అడిగితే, "అదేం లేదు, మేము కేవలం స్నేహితులం మాత్రమే, ఇదంతా మీడియా సృష్టి" అంటూ ఆ తరువాత పెండ్లి చేసుకున్న, చేసుకోని ఎన్నో జంటలను మనం చూస్తూనే ఉన్నాం. కానీ 50వ దశాబ్దంలో రాజకపూర్-నర్గీస్, దేవానంద్-సురయ్యా, దిలీప్-మధుబాల ప్రేమ వ్యవహారాలు బహిరంగ విషయాలు. హీరోలెవ్వరూ ఆ విషయాన్ని దాచలేదు.

1980 వ సంవత్సరంలో దిలీప్ కుమార్ఆస్మా అనే ముస్లిం యువతిని హైదరాబాద్‌లో మరో పెళ్ళి చేసుకున్నాడు. సంగతి బయటకు వచ్చిన తరువాత మొదట బుకాయించినా తరువాత ఒప్పుకున్నాడు. ఆ తరువాత ఆమెకు విడాకులిచ్చాడు. అతని వ్యక్తిగత జీవితంలో ఇది అతను ఎప్పటికీ తుడిచి వేసుకోలేని మాయని మచ్చగా



అభిమాన నటుడితో అభిమాన నటుడు ధర్మేంద్ర, అమీర్ ఖాన్, అమితాబ్



ఎన్టీఆర్, ఎమ్.జి.ఆర్‌లతో దిలీప్

మిగిలింది. మధుబాలతో ప్రేమ విషయం బహిరంగంగా చాటగల్గిన వాడు ఆస్మాతో పెండ్లి విషయం దాచి ఉంచటం, భీరత్వం చూపించటం అతని వ్యక్తిత్వంపై పెద్ద దెబ్బవేసింది. 90 సంవత్సరాల వయస్సులో, ప్రచురించబడిన దిలీప్ స్వీయచరిత్ర, *ది షాడో అండ్ ది సబ్‌స్టెన్స్* 2014, జూన్ 6వ తేదీన విడుదలైంది. మధుబాల, ఆస్మాల విషయంలో ఏమిజరిగింది, తాను ఎందుకలా ప్రవర్తించ వలసి వచ్చినది అన్నది, చెప్పవలసినంతగా, ఆత్మవిమర్శ చేసుకుంటూ, ప్రజల ముందుంచే అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోయాడు. అలానే తనకు ప్లే బ్యాక్ సింగర్‌గా మొదట్లో రాణించిన తలత్ మహమూద్ విషయంలో అంతగా స్పందించక పోవటం అభిమానులు నిరాశపొందారు.

ఈ స్వీయ చరిత్రలో, తన గొప్పతనాన్ని చాటుకోవటం గాని, ఎవరినీ కించపరచటం గాని జరగలేదు. తన వైఫల్యాలకు తానే బాధ్యత వహించాడు. మనోజ్ కుమార్, అమితాబ్, రిషికపూర్ దిలీప్ గురించి రాసిన వ్యాసాలలో అతని వ్యక్తిత్వంలోని నిండు తనాన్ని మన ముందుంచారు.

ఒక్క మొగలే ఆజమ్ చిత్రం మినహా మిగిలిన అన్ని చిత్రాలలోనూ అతను హిందువుగానే నటించాడు. హిందూ పాత్రలలో అతనికి నచ్చిన పేరు శంకర్.

దక్షిణాదికి సంబంధించి జెమినీ వారి ఇన్‌సానియత్ (పల్లెటూరి పిల్ల - తెలుగు) పైగాం లలో మంచి నటనను ప్రదర్శించిన దిలీప్, తరువాత వచ్చిన రామ్ ఔర్ శ్యామ్ నుంచి ధర్మాధికారి చిత్రాలలో ఎప్పుడూ లేనిది అతని నటనలో Loudness (అతి) ప్రవేశించింది. ఈ సినిమాలన్నీ అతని నటనా స్థాయిని కొన్ని మెట్లు క్రిందకు దించాయి.



పరస్పర అభిమానం....

కళ కంటే కాసు ముఖ్యం. డబ్బులొచ్చేదే మంచి సినిమా. మిగిలింది కాదు, అనే చక్రపాణి భాష్యం అంది పుచ్చుకున్న దక్షిణాది నిర్మాత, దర్శకులూ కొంతవరకూ దానికి కారణం. వారంతా దిలీప్‌ను చూపించి కాసులు పోగుజేసుకోవాలనుకున్నారు తప్ప కళాత్మకమైన నటనను అతని నుంచి రాబట్టుకోవాలనే ప్రయత్నం చేయలేదు. ఆ నిబద్ధత వారికి లేదు.

1970లో ఒక్క ఐదు సంవత్సరాల విరామం తరువాత దక్షిణాది సిండ్రోమ్ నుంచి బయటపడి కారెక్టర్ ఆర్టిస్ట్‌గా పెద్ద తరహా పాత్ర నటిస్తూ దిలీప్ తన పూర్వస్థాయి నందుకున్నారు. క్రాంతి, విధాత, సౌదాఘర్, కర్మ, చిత్రాలు అతని బాక్సాఫీసు స్థాయిని మరో సారి ఋజువు చేశాయి. అంతగా హిట్‌కాని శక్తి, మషాల్ చిత్రాలలో నటనా విరాట్ రూపం మరోసారి ప్రదర్శితమైంది. చివరి చిత్రమైన ఖిల్లాలో కొన్ని మంచి నటనా ఘట్టాలు ఉన్నాయి.

బెంగాలీలో పేరుమోసిన దర్శకులైన సత్యన్ బోస్, అమియా చక్రవర్తి, బిమల్ రాయ్, తపన్ సిన్హా, అదే కోవలో మెహబూబ్ ఖాన్, బి.ఆర్. చోప్రా, మనోజ్ కుమార్, సున్నీ అతనిలోని విశిష్ట నటనను తమ చిత్రాలద్వారా బహిర్గతం చేశారు. తెలుగు వాళ్ళయిన తాపీ చాణక్య, దిలీప్ కుమార్‌కు అభిమాన పాత్రులైన దర్శకులలో ఒకరు. హిందుస్థానీ, క్లాసికల్ సంగీతం వినటం (చీకట్లో) అతనికిష్టమైన వ్యాపకం. సితారా, వయోలిన్ లాంటి వాయిద్యాలతో పరిచయం ఉంది.

దిలీప్ కుమార్ సిగరెట్ తాగే విధానాన్ని ఎందరో విద్యార్థులు అనుకరిస్తున్నారని తెలుసుకున్నప్పుడు ఇక తెరపై పొగత్రాగను అని నిర్ణయించుకొని అమలు పరిచాడు. చివరగా అతను సిగరెట్టు కాల్చిన చిత్రం *నదియా కే పార్*

ఎవరైనా దర్శకులు మితిమీరిన శృంగారాన్ని, అసభ్య సంభాషణలను చెప్పించితే నిర్వర్దంగా తిరస్కరించాడు. సినిమా కళాకారులకు సాంఘిక బాధ్యత ఉందని గుర్తెరిగినవాడు. "నాకు అయిదుగురు అక్కాచెల్లెళ్ళున్నారు. ఇలాంటి సన్నివేశాలలో నటించి రేపు వారికి మొఖమెలా చూపించగలను అని వాపోతాడు.

దిలీప్ కుమార్‌కు గౌరవ ఆస్కార్ బహుమతి ఇప్పించాలని, అలానే భారత రత్న ఇవ్వాలని కొందరు ప్రముఖులు కృషి చేశారు. వారిలో కమల్ హసన్, విజయ్‌భట్‌లతో పాటు, దిలీప్ వీరాభిమాని జయా బచ్చన్ ముఖ్యులు. ఇప్పుడు రెండూ రాజకీయమవటంతో అవి లభించే అవకాశం లేదు. అయినా ఒకప్పుడు వాటికున్న గౌరవ మర్యాదలు ఇప్పుడు లేవు.

దిలీప్ కుమార్‌కు ఉన్న అలవాట్లలో చాలా తీవ్రమైనది మద్యపానం. కానీ అది అతని ఆరోగ్యంపై ప్రభావం చూపినట్టు కనిపించలేదు.

93 సం॥ల వయస్సులో ఇప్పటికీ అతని ముఖవర్చస్సు తగ్గలేదు. He is still Radiant అంటాడు అమితాబ్ బచ్చన్.

అతని సినీ సమకాలికులలో ముఖ్యుడైన రాజ్‌కపూర్, పెషావర్ రోజుల్నుంచీ తెలిసిన బాల్య మిత్రుడు. దేవానంద్ అతనికి ఆత్మీయుడు. విలన్ పాత్రధారి ప్రాణ్ మరో మిత్రుడు.

ఉర్దూ, ఇంగ్లీష్, పంజాబీ భాషలలో అనర్గళంగా మాట్లాడగలిగే ప్రతిభ దిలీప్ స్వంతం. దిలీప్ కుమార్ గొప్ప సినిమా ప్రెజెన్స్ ఉండటమే కాదు, బయట ప్రెజెంటేషన్‌కు కూడా ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తాడు. 90 సంవత్సరాల వయస్సులో శరీరం సహకరించక పోతున్నా, క్లీన్ షేవెన్‌తో నిండుగా సూటువేసుకొని కనిపిస్తాడు. అలా కాకుండా అతను బయటకు వచ్చిన సంఘటనలు అరుదు.



ప్రియ మిత్రుడు దేవ్‌తో...

సైరాబాను దిలీప్‌ను ఆరాధించి మరీ పెండ్లి చేసుకుంది. ఆమె శ్రద్ధ, సేవల వల్లనే అతను ఇంతకాలం జీవించాడంటారు. ఆమె దృష్టిలో అతనొక ఐకాన్.

డిసెంబరు 11 దిలీప్ కుమార్ పుట్టినరోజు. ఆరోజు తూర్పు తెల్లవారక మునుపే తమ సినీఇలవేల్పును



సైరాబానుతో దిలీప్ కుమార్

చూడడానికి బాంబే చిత్రసీమ అంతా అక్కడే ఉంటుంది. అయితే అందరికంటే ముందుజేరుకుంటారు అమితాబ్ దంపతులు. దేవానంద్, బాలథాకరే మరణించిన సంవత్సరం, ప్రియమిత్రుడు దారాసింగ్, షమ్మీకపూర్, ప్రాణ్ మరణించిన సంవత్సరాలలో ఆయన నేను అమిత దుఃఖంతో ఉన్నానంటూ పుట్టినరోజు పండుగ జరుపుకోలేదు. దిలీప్ కుమార్ తన తండ్రి మరణించినప్పుడు (అప్పటికే అందాజ్ విడుదలైంది. దేశవ్యాప్తంగా హిందీ నటునిగా ఇంచుమించు మొదటి స్థానానికి చేరుకున్న సమయం.) మొదటి టెలిఫోన్ చేసినది తన చిన్ననాటి మిత్రుడు రాజ్‌కపూర్‌కే. పృథ్వీరాజ్‌తో కలిసి రాజ్‌కపూర్ మరి 15 మంది మిత్రులతో సమక్షంలో ఆయన సమాధి జరిగింది. కుటుంబానికి సంబంధించిన విషయాలలో దిలీప్ కుమార్ వీలయినంత నిరాడబంరంగా, తన సన్నిహిత మిత్రులకు మాత్రమే పరిమితమయ్యేలా జరుపుతారు.



దేవికారాణి

అసలు దిలీప్ కుమార్ సినిమాలో ప్రవేశించటమే ఒక విచిత్ర సన్నివేశం. బొంబాయి టాకీస్ అనే నిర్మాణ సంస్థ ముఖ్య నిర్దేశకుడైన హిమాంశురాయ్ ఆకస్మిక మరణంతో ఆ స్థానానికి వచ్చిన దేవికారాణితో సరిపెట్టు కోలేక అశోక్ కుమార్, ఎస్. ముఖర్జీ, సుబోధ్ ముఖర్జీలు ఫిలింస్తాన్ పేరుతో మరో సంస్థను ప్రారంభించాలను కున్నారు. అశోక్ కుమార్ స్థానంలో మరో గొప్పనటుడు అత్యవసరంగా బొంబాయి టాకీస్‌కు కావలసి వచ్చింది. వర్ధమాన నటులెందరివో ఫొటోలు పరిశీలించారు. దేవికారాణి లోపాలెన్నటంలో దిట్ట, వీడికి ముక్కు బాగోలేదు. వాడికి కండ్లు బాగోలేదు అంటూ ఎందరినో తిరస్కరించింది. దేవికారాణి దిలీప్‌ను మొదటిసారి నైనితాల్ మిలటీరీ క్యాంటీన్‌లో చూసింది. చూసిన వెంటనే అతనిని పిలిచి బొంబాయి వస్తే తనని కలవమని నటునిగా అవకాశమిస్తానని పేర్కొంది. దిలీప్ కుమార్ తండ్రి సంపన్నుడైన హోల్‌సేల్ పండ్ల వ్యాపారి. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో సరైన సమయంలో రైల్వే వేగన్‌లు దొరకక పండ్లు ఎగుమతి చేయలేక తీవ్ర నష్టం చవిచూశాడు. ఆ సమయంలో వేరు గత్యంతరం లేక దిలీప్ కుమార్ బొంబాయి వెళ్ళి దేవికారాణిని కలిసాడు.

ఆమె అమియా చక్రవర్తి, సత్యన్ బోస్‌లతో కలసి దిలీప్‌ను ఇంటర్వ్యూ చేసింది. హైస్కూలు, కాలేజీ రోజుల్లో ఎప్పుడూ స్టేజి ఎక్కి నాటకాలు కాని, Fancy dress కాంపిటీషన్ గాని పాల్గొనని యూసఫ్ ఖాన్ ఆమెను నిరాశపరిచారు. కానీ ఆమె అతనికి నో చెప్ప బోయే ముందు అతని నడవడిక, సంభాషణలో స్పార్క్‌ను చూసిన అమియా చక్రవర్తి, సత్యన్ బోస్‌లు అతన్ని నటునిగా ఎంపిక చేసి నేరుగా హీరో పాత్ర ఇచ్చారు.

యూసఫ్ ఖాన్ అన్న పేరు సీదా సాదాగా ఉందంటూ మూడుపేర్లను సూచించారు. అందులో మొదటి రెండూ వాసుదేవ్, జహంగీర్‌లు. యూసఫ్ ఖాన్‌కు వాసుదేవ్ అన్న పేరు నచ్చింది. చిత్రలేఖ నవలా రచయిత అయిన భగవతీ చరణ్ శర్మ యూసఫ్ ఖాన్‌ను దిలీప్ కుమార్‌గా నామకరణం చేశారు. ఇక మిగిలినదంతా చరిత్రే!



ఎన్నార్కె

కాండ్రేగుల నాగేశ్వరరావు
హైదరాబాదు

## సామెతల్లో

# వ్యవసాయం

*– ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు*

**"సువ్వన్న చుక్కల్లు రాజమామిళ్లు – నాచేతి రోకండ్లు నల్ల రోకండ్లు**
**చేయించు అన్నయ్య చేవ రోకండ్లు – వేయించు అన్నయ్య వెండిపొన్నుల్లు**
**సువ్వని నేనొక్క పోటేసితేను – చుక్కలు పిక్కటిల్లు సూరన్న కథలు**
**అస్సని నేనొక్క పోటేసితేను – ఆకసమ్ముకదలు ఆరాజుకదలు**
**తమలపాకులమీద వడ్లెండపోసి – రాచిలక పోచిలకవడ్లు దంతాము**
**రాచిలక దంచినవి రాసులడ్డాయి – పోచిలకదంచినవి పోగులడ్డాయి**
**రోకలిచిన్నాది, రోలుచిన్నాది – నాతోటిపోటేసే చెలియచిన్నాది**
***రోకలికిరోటికి రెండుదండాలు – మముకన్నతల్లికి వెయ్యిదండాలు"***

ఈ గేయాన్ని నేను చిన్నప్పుడు మా ఊళ్ళో వడ్లు దంచుతూ పాడుతుంటే విన్నపాట. ఇది తమ శ్రమను మర్చిపోవటం కోసం పాడుకున్నపాటలా కనిపించినప్పటికీ ఇందులో కవిత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఇటువంటి పాటలు శ్రామిక జీవన సౌందర్యాన్ని పట్టిచూపుతాయి. శ్రమైక జీవన సౌందర్యాన్ని చూడటం అంటే ఇటువంటి సందార్భాలేనేమో అనిపిస్తుంది.

మన భారతదేశం వ్యవసాయప్రధాన దేశం. రైతు చల్లగా ఉంటే సమాజంలోని అన్ని వర్గాలు పచ్చగా ఉంటాయి. ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి రైతును కేంద్రంగా చేసుకున్న మన వ్యవస్థ వివిధ ముఖాలుగా రైతుజీవనాన్ని వ్యాఖ్యానించింది. ఎంతగా కంప్యూటర్ల యుగంలో జీవించినా, ఆరులైన్ల రోడ్లతో ప్రగతిని సాధించినా తారురోడ్లమీద గింజలు పండవు కదా!

అంగుళం నేలకోసం ఆరుహత్యలు చేయడానికి సిద్ధమవుతున్న రియల్ఎస్టేట్ మాఫియా దెబ్బకు భూమాత అల్లాడిపోతుంటే, రైతులు పచ్చని పంటపొలాలను ప్లాట్లుగా మార్చి పచ్చనోట్లలో పచ్చని జీవితాన్ని వెతుక్కుంటున్నారు. బళ్ళు, గుళ్ళు, మళ్ళు అన్నీ పచ్చకాగితం చుట్టే తిరుగుతున్నాయి. ఇదే ధోరణి కొనసాగితే మనం "బియ్యంచెట్టు" నాగరికతను చూసి ఆశ్చర్యపడాల్సిన అవసరంలేదు. మన కవులంతా రైతును, రైతుజీవనాన్ని బహువిధాలుగా వర్ణించారు. కావ్యాలు రాసిన కవులనే ప్రభావితం చేసిన మన వ్యవసాయ నాగరికత, ఆధునిక నాగరికతను ప్రభావితం చెయ్యలేకపోతోంది. అందుకు ఎంతో బాధపడాలి. భూమాతను పచ్చిబాలింతరాలుగా నిరంతరం నిరూపించే రైతన్న ఎద్దుల గంటల సవ్వడి గర్భగుడిలోని గంటల సవ్వడికంటే ఎంతో పవిత్రమైనది. అటువంటి రైతు జీవితంచేత ప్రభావితం కాని సామాజిక కోణంలేదు. అయినప్పటికీ ఈనాటి ఆర్థికవ్యవస్థలో నాగలిమోస్తున్న ప్రతిరైతు శిలువను మోస్తున్న మరో క్రీస్తునే తలపింపచేస్తున్నాడు.

మన భాషా వ్యవస్థను గమనిస్తే రైతుకు సంబంధించిన పదజాలం, పదబంధాలు, సామెతలు, నుడులు–నానుడులు బహుముఖంగా కనిపిస్తాయి. జానపదసాహిత్యంలో అవన్నీ భాగాలుగా పరిగణిస్తున్నారుకాని, మన దేశీయ నాగరికతకు, సంస్కృతికి వాటిని ఆనవాలుగా స్వీకరించాలి. ఆకాశంలో కనిపించే నక్షత్రాలకు రైతులు పెట్టిన పేర్లని గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

| | |
|---|---|
| పూర్వోత్తరాషాఢలు | – అక్కాచెల్లెలు చుక్కలు |
| పుబ్బ, ఉత్తర | – అత్తాకోడలు చుక్కలు |
| శుక్రుడు | – ఆలబొద్దు |
| శతభిష | – ఆవులదొడ్డి |
| బృహస్పతి | – కాపుచెరువు చుక్క |
| రోహిణి | – కుమ్మరసాలె |
| ఆరుద్ర | – గోడుకొయ్యలు |
| సప్తర్షి మండలం | – పట్టెమంచం |
| పాలపుంత | – పాలబాట |

ఇలా రైతు ఎలా పేరుపెట్టుకోగలిగాడు అంటే తెల్లవారు ఝామునే లేచి ఎద్దుల్ని తోలుకుని డొంకదారిలో పొలంకోసం పరిగెత్తే రైతుకు ఆకాశంలోని నక్షత్రాలే దారిచూపుతాయి. రైతు గంటల సవ్వడికే సూర్యుడు నిద్రలేస్తాడు. తెలుగు వాళ్ళ పంచాంగంలో లాగానే రైతుల

నోళ్ళలోనూ కార్తెలు, మాసాలు, పున్నమలు నానుతాయి. కార్తె అనే పదం కృత్తిక శబ్దం నుండి వచ్చింది. మరి కృత్తిక నక్షత్రానికి ప్రాధాన్యం ఏమిటంటే చాంద్రమానంలో చైత్రం మొదలైన మాసాలు మనకున్నట్లే సౌరమానంలో కూడ మేషం మొదలైన మాసాలున్నాయి. సూర్యుడు ఏ రాశిలో ప్రవేశిస్తే దాన్ని ఆ మాసంగా సౌరమానంలో వ్యవహరిస్తారు. ఉదాహరణకు వృశ్చికరాశిలో ఉంటే దానిని వృశ్చికమాసం అంటారు. ఇది మన చాంద్రమానం లెక్కలో కార్తీకమాసం. ఈ వృశ్చికమాసంలో వచ్చే పౌర్ణమి రోజున కృత్తికా నక్షత్రం ఉండే పరిస్థితిని బట్టి రాబోయే సంవత్సరంలో వర్షాలు ఎట్లా ఉంటాయో నిర్ణయించబడతాయి. కృత్తికా నక్షత్రాన్ని బట్టి రాబోయే సంవత్సర వర్ష నిర్ణయం జరుగటం వల్ల వర్షమే ప్రధాన ఆధారం కాబట్టి కృత్తికా నక్షత్రానికి ప్రాముఖ్యత ఏర్పడ్డది. కార్తీక పున్నమి నాటికి సాధారణంగా స్వాతి విశాఖ అనూరాధ కార్తెలు తగులుతాయి. ఈ మూడు కార్తెలలో ఉండే గ్రహగమనాన్ని బట్టి సస్యసమృద్ధిని అంచనా వేయటం జరుగుతుంది. ఈ విధంగా పౌర్ణమినాటి కృత్తికా నక్షత్రప్రాధాన్యాన్ని ఆధారం చేసుకొని కృత్తిక శబ్దానికి ప్రాముఖ్యత ఏర్పడింది. ఈ కృత్తిక శబ్దమే నక్షత్రపర్యాయమై కార్తెగా సంభావించబడుతూ వచ్చింది. ఈ కార్తెలకు సంబంధించిన రైతు నానుడులను గమనిస్తే మన కృషి విజ్ఞానం తెలుస్తుంది.

'వానరాకడ ప్రాణంపోకడ ఎవరికి తెలియదని' లోక వ్యవహారం. కాని రైతు సామెతలను గమనిస్తే ఋతుపవనాలు రావడంలోని క్రమపద్ధతిని గమనించిన రైతుల సునిశిత పరిశీలనా దృష్టిని గమనించి అబ్బుర పడతాము. ఏ కార్తెలో వ్యవసాయాన్ని ప్రారంభించాలి? ఏ కార్తెలో అధిక వర్షాలు కురుస్తాయి? ఏ కార్తె వర్షం ఎటువంటి లాభాన్నిస్తుంది? వంటి శ్రేయోదాయకమైన సూచనలను గమనించవచ్చు. మారిన కాలాన్ని బట్టి శీతోష్ణస్థితిగతులను బట్టి పండించే పద్ధతులు మారటం వలన ఈ సామెతలు ఇప్పటి కాలానికి ఎంతవరకు ప్రయోజనం అన్నది వివేచిస్తే ఆ దోషం ఆ సామెతలది కాదని తెలుస్తుంది. ఇవి ఒకప్పటి మన వ్యవసాయ పరిజ్ఞానానికి, మన రైతుల వివేచనా శక్తికి దీపికలుగా భావించాలి. 'అశ్వని కురిస్తే ఆరుకార్తెల విడుపు' అనే సామెత అశ్వనీకార్తెలో వర్షం మంచిదికాదనే విషయాన్ని తెలియజెపుతుంది. ఆ కార్తెలో కురిసే జల్లులను బట్టతడుపు జల్లులు అంటారు. 'అశ్వని కురిస్తే అడుగు తడవదు' అనే సామెత వ్యవసాయపు పనులకు కలిగే ఆటంకాల్ని తెలియజేస్తుంది. అశ్వని కార్తెలో వానకురిస్తే మామిడి కాయలు, పూత రాలిపోతాయి. కోతకు సిద్ధంగా ఉన్న కంది వంటి పప్పుధాన్యాలు కూడా పాడవుతాయి. అందుకే అశ్వని కార్తె వర్షాన్ని రైతు హర్షించడు. భరణి కార్తెనే రైతులు అగ్గికార్తెగా వ్యవహరిస్తారు. భరణి, కృత్తిక మొదలైన ఏడు నక్షత్రాలకు అగ్నిమండల నక్షత్రాలుగా పేరుంది. ఈ కార్తెలోనే డొల్లుకర్తరి వస్తుంది. 'భరణి కార్తెలో ఎండలకు బండలు పగులుతాయ'నే సామెత ఎండలను సూచించినప్పటికీ ఈ కార్తెలో కురిసే వాన దుక్కిదున్నటానికి అనువుగా భూమిని మెత్తపరుస్తుంది. భరణికార్తెలో సహజంగా నువ్వు వంటి పంటలే కనిపిస్తాయి. ఈ కార్తెలో కురిసేవాన వాడిపోయే మెట్టపంటలకు కూడా కొత్త ఊపిరి వస్తుంది. అందుకే 'భరణి కురిస్తే ధరణి పండుతుంది' అని రైతు అంటాడు. కృత్తిక కార్తెకు కత్తెర, నిజకత్తెర అనే వ్యవహార రూపాలున్నాయి. ఈ కార్తెలో కురిసే వాన శుభసూచకంగా భావిస్తారు. 'కత్తెరలో వాన కనకం పండిస్తుంది' అనే నమ్మకం రైతుది. జల్లులకు భ్రమపడి విత్తనాలు చల్లితే వచ్చే నష్టాన్ని గురించి హెచ్చరికగా 'కృత్తికలో విత్తితే కుత్తుకలు నిండవు' అనే సామెత ఏర్పడింది.

'రోహిణిలో రోళ్ళు పగులుతాయనే' సామెత అందరికీ తెలిసిందే. 'రోహిణి కార్తెలో విత్తటం రోట్లో పోయటమే' అనే సామెత రైతు అనుభవాన్ని తెలియజేస్తుంది.

'మృగశిరకార్తెవస్తే ముసిలెద్దు రంకేస్తుందనే' సామెత ఎండల తీవ్రతను తగ్గటాన్ని తెలియజేస్తుంది. ఈ కార్తెలో తొలకరి జల్లులు కురుస్తాయి. జొన్న, సజ్జ, శనగ, కొర్ర వంటి పైర్లను వేస్తారు. 'మృగశిరకు ముంగిళ్ళు చల్లబడతాయి', 'మృగశిరకురిస్తే ముంగారు చల్లబడుతుంది', 'మృగశిర వర్షిస్తే మఖ గర్జిస్తుందనే' సామెతలు వెలువడ్డాయి.

ఆరుద్ర కార్తెలో కూడా ముంగారుపంటలు వేస్తారు. 'ఆరుద్రవాన అదునైన వాన', 'ఆరుద్రతో అదును సరి', 'ఆరుద్రలో అడ్డెడు చల్లితే పుట్టెడు పండుతాయి', 'ఆరుద్రలో పెట్టిన విత్తనానికి అన్నం పెట్టిన ఇంటికి సేగిలేదు', 'ఆరుద్రలో వేసిన ఆరిక ఆకులో పెట్టిన అన్నం', 'ఆరుద్ర ఉరిమితే ఆరు వానలు పడతాయి' వంటి సామెతలు ఈ కార్తెల్లో రైతు వ్యవసాయక విధానాన్ని తెలియజేస్తుంది. రైతులు ఆరుద్ర మొదటి పాదంలో విత్తనాలు విత్తటానికి ఇష్టపడరు. ఎందుకంటే ఆరుద్ర మొదటి పాదంలో భూమి సమర్థ

ఆడుతుందని, అందువలన విత్తటానికి అనువైన రోజులు కావని నమ్ముతారు.

పునర్వసు కార్తెలో 'చిట్టెడు చల్లితే పుట్టెడు పండుతాయని' రైతులు భావించటం ఉంది. ఈ కార్తెలో కురిసే వానని 'పునర్వసు వర్షం పుష్పాల వర్షం' అని కర్షకుడు ఆనందిస్తాడు. పుష్యమి కార్తె ఆషాఢంలో వస్తుంది. ఈ కార్తెలో పెద్దగా వర్షాలుండవని చెబుతూ 'పుష్యమి కురిస్తే పూరి పిట్టయినా తడవదని రైతులు భావిస్తారు. ఆశ్లేష కార్తె ఆషాఢమాసం ఉత్తరార్థంలో వస్తుంది. వ్యవసాయారంభానికి ఈ కార్తె తరువాతి కార్తెలకంటే ఎంతో అనువైంది. 'పుబ్బలో పుట్టెడు కంటే ఆశ్లేషలో అడ్డెడే చాలు' వంటి సామెతలు రైతు అనుభవాన్ని తెలియజేస్తాయి. 'ఆశ్లేషలో అడుక్కొక చినుకైనా అడిగినన్ని వడ్లు', 'ఆశ్లేష కురిస్తే ఆరోగ్యం' వంటి సామెతలు ఈ కాలాన్ని అదునైన కాలంగా తెలియజెప్తున్నాయి.

మఖ కార్తె శ్రావణమాసంలో వస్తుంది. 'మఖాపంచకం సదా పంచకం' అనే సామెత లోకవ్యవహారంలో ఉంది. మఖ, పుబ్బ, ఉత్తర, హస్త, చిత్త ఈ అయిదు కార్తెలను మఖా పంచకం అంటారు. పై సామెతలో పంచకం అనే శబ్దానికి అయిదు అనే సంఖ్యావాచకార్థమే కాకుండ యుద్ధభూమి అని అర్థాన్ని చెప్తాయి. అంటే ఈ అయిదు కార్తెలు రైతుకు యుద్ధభూమి వంటి కార్యక్షేత్ర కాలమని చెప్పటం. 'మఖ, పుబ్బలు ఒరుపైతే మహత్తరమైన కాటకం' వంటి సామెతల్లో ఈ రెండు కార్తెల్లో వర్షాలు లేకపోతే రైతుల ఆశలే కాదు సమాజంలో కూడా కరువు తాండవిస్తుందని తెలియజెపుతుంది. 'మఖలో పుట్టి పుబ్బలో మాడినట్లు' అనే సామెత అందరికీ తెలిసిందే. సహజంగా మఖ, పుబ్బలు వానకార్తెలు. అటువంటప్పుడు మొక్క మాడిపోవడం ఎలా జరుగుతుంది అంటే మఖలో వానకు మొలకెత్తిన అంకురం ఎదిగీ ఎదగకముందే పుబ్బలో వర్షాలు పడితే ఈ మొలకలన్నీ కుళ్ళి పాడైపోతాయి. ఆ విషయాన్నే పై సామెత తెలియజేస్తుంది. అందుకే ఈ ముంపు ప్రభావాన్ని తప్పుకునే విధంగా మఖలో కంటే ఆశ్లేషలో విత్తటం మేలని రైతులు భావిస్తారు.

పుబ్బకార్తె శ్రావణమాసపు ఉత్తరార్థంలో వస్తుంది. తెలిసిన ఏ రైతూ ఈ కార్తెలో విత్తనాల్ని చల్లడు. 'పుబ్బరేగినా బూతురేగినా పారం మోగుతుంది' అనే సామెత పుబ్బ వానపై ఉన్న భయాన్ని తెలియజేస్తుంది. 'పుబ్బ లో చల్లేదానికంటే దిబ్బలో పోయటం మేలు', 'పుబ్బలో చల్లేది మబ్బులో మొత్తుకునేది' వంటి సామెతలు తెలియజేస్తాయి.

ఉత్తరకార్తె భాద్రపదమాసపు మొదట్లో వస్తుంది. ఈ కార్తెలో కురిసే అధిక వర్షాలకు మొక్కలను బ్రతికించుకోటానికే రైతు ఎంతో కష్టపడతాడు. 'ఉత్తరలో ఊడ్చటం కంటే కూర్చుని ఏడవటం మేలు', 'ఉత్తరలో చల్లిన పైరు కత్తెరలో నరికిన కొయ్య', 'ఉత్తరలో విత్తితే ఊదుకుని తినటానికి ఉండవు' వంటి సామెతలు ఈ కార్తెలో మొక్కలని నాటటానికి అనువైన కాలంకాదని తెలియజేస్తాయి. ఏ కార్తెలో వానలు పడకపోయినా ఫరవాలేదు కాని ఉత్తర కార్తెలో కాని వానలు మోసం చేస్తే రైతు బ్రతుకు దుర్భరమే అవుతుంది. ఉత్తర చూసి ఎత్తర గంప వంటి సామెతలు ఈ విషయాన్నే తెలియజేస్తాయి. ఉత్తర కార్తెలో కాని వర్షాలు పడకపోతే తట్టాబుట్టా సర్దుకుని పొమ్మని ఈ సామెత తెలియజేస్తుంది. 'ఉత్తర ఉరిమి కురిసినా పాము తరిమి కరిచినా తిరుగులేదనే' సామెత వానపై రైతుకున్న నమ్మకాన్ని తెలియజేస్తుంది. ఏ విత్తనాలను ఈ కార్తెలో చల్లొద్దని భావించే రైతు, ఉలవలు చల్లటానికి ఈ కార్తె ఎంతో అనువైందని భావించాడు. అందుకే 'ఉత్తర పదును ఉలవకు అదును' అనే సామెత ఏర్పడింది.

హస్తకార్తెకే గొల్లకార్తె అనే పేరుంది. ఇది భాద్రపద మాసపు ఉత్తరార్థంలో వస్తుంది. 'హస్త ఆరుపాళ్ళు చిత్త మూడుపాళ్ళు వర్షం కురుస్తుందని' రైతులు భావిస్తారు. ముమ్మరంగా వ్యవసాయపు పనులు జరిగే కార్తె ఇది. అయినా ఈ కార్తెలో విత్తనాల్ని చల్లరు. ఎందుకంటే ఈ కార్తె నాటికి మొక్క నిలదొక్కుకోవాలని రైతు భావిస్తాడు. అందుకే 'హస్త కార్తెలో అనుగుపొట్ట చిత్తకార్తెలో చిగురుపొట్ట' అనే సామెత ఏర్పడింది. 'హస్తలో చల్లితే అక్షింతలకైనా రావనే సామెత' ఈ కార్తెలో విత్తనాలు చల్లకూడదనే విషయాన్ని తెలియజేస్తుంది. ఆదివారంరోజున హస్తకార్తె వస్తే కావల్సినంత వర్షం కురుస్తుందని రైతుల నమ్మకం. వర్షాలు పెరిగేకొద్దీ వైరస్ వ్యాధులు ప్రబలి పశుగణనష్టం జరుగుతుంది. 'హస్త ఆదివారం చస్తిమోయి గొల్లలారా రోజుకొకదాన్ని కాళ్ళుపట్టి ఈడవండి' వంటి సామెతలు పశు నష్టాన్ని తెలియజేస్తున్నాయి. 'హస్త కురవకపోతే విత్తినవాడు విత్తనివాడు ఒకటే' వంటి సామెతలు వ్యవసాయంలో రైతులకున్న అనుభవాలను తెలియజేస్తాయి. చిత్తకార్తె ఆశ్వీయజమాసంలో వస్తుంది. ఈ కార్తెనాటికి వానాకాలం దాదాపుగా ముగుస్తుంది. ఈ కార్తెలో జల్లులు

చెదురుమొదురుగా కురుస్తాయి. 'చిత్త వర్షం చిత్తమొచ్చినచోట పడుతుంది' అనే సామెత చిత్తకార్తెలోని వాన ప్రత్యేకతను తెలియజేస్తుంది. ఎక్కడ మబ్బు తునక ఉంటే అక్కడే వర్షం పడుతుంది. ఒకచోట ఉన్న వర్షం ఇంకోచోట ఉండదు. 'చిత్త చిత్తగించి స్వాతి దయచేసి విశాఖ విసిరికొట్టకుంటే వీసానికి పుట్టెడు పండుతాను అన్నదట' ఈ సామెత చిత్త, స్వాతి, విశాఖ మూడు కార్తెలకు సంబంధించినది. మెట్టపంటలకు ఈ కార్తెలోని జల్లులు బాగా ఉపకరిస్తాయి. 'చిత్తకార్తెకు ఉలవచేను చిత్తుచిత్తుగా పండుతుంది', 'చిత్తకురిస్తే చింతపండుతుంది' వంటి సామెతలు ఈ విషయాన్నే ధ్రువపరుస్తాయి. చిత్తకార్తెలో ఎండకూడా తీవ్రంగానే ఉంటుంది. 'చిత్త ఎండకు పిట్టతల పగులుతుంది' వంటి సామెతలు ఈ విషయాన్నే నిరూపిస్తాయి.

ఆశ్వీయజంలో వచ్చేది స్వాతికార్తె. వాయుగుండాలేర్పడి వర్షాలు భయపెట్టే కార్తె కూడా ఇదే. అప్పటికే బాగా వర్షాలు కురిసి భూమికి, చెరువులకు నీటిని పీల్చే శక్తి తగ్గిపోయుంటుంది. ఏ కొద్దిపాటి వర్షం కురిసినా పొంగిపొరలుతాయి, చేలు మేటవేస్తాయి. 'స్వాతి కురిస్తే భీతి కలుగుతుంది', 'స్వాతి కురిస్తే సముద్రాలు నిండుతాయి' వంటి సామెతలు ఈ విషయాన్నే ధ్రువపరుస్తాయి. స్వాతి కార్తెలో పడే సాధారణ జల్లుల గురించి 'స్వాతి మెరుపులు మంచి పంటలు', 'స్వాతి వర్షం చామకు హర్షం' వంటి సామెతలు వచ్చాయి. ఈ కార్తెలో కూడా ఎండలు తాపకారకంగానే ఉంటాయి. ఎండ, వానల సమ్మేళనం చిరాకు పుట్టిస్తుంది. 'స్వాతి కురిస్తే చీమకైన తాపం' వంటి సామెతలు ఈ విషయాన్నే ధ్రువపరుస్తాయి. విశాఖకార్తె కార్తీకమాసారంభంలో వస్తుంది. సాధారణంగా ఈ కార్తెలో వర్షాలుండవు. ఒకవేళ కురిసిందంటే భారీనష్టాలుంటాయి. అందుకే 'విశాఖ కురిస్తే విషం పెట్టినట్లు', 'విశాఖ పడితే పిశాచి పట్టినట్లే', 'విశాఖ చూచి విడవర కొంప' వంటి సామెతలు వచ్చాయి. అయితే ఈ విశాఖకార్తెలో కురిసే వాన ఆముదపు పంటకు ఎంతో దోహదం చేస్తుంది. 'విశాఖ వర్షం ఆముదాలకు హర్షం' వంటి సామెతలు రైతుల అనుభవాన్ని తెలియజేస్తూ 'విశాఖ వరదలు సంక్రాంతి మబ్బులు ఒకటేనన్న' సామెత రైతు భయాన్ని సూచిస్తుంది.

కార్తీకంలో వచ్చే మరో కార్తె అనూరాధ కార్తె. వరిచేను కోతకొచ్చి రైతు కళ్ళల్లోని ఆనందానికి కారకమౌతుంది. అందుకే 'అనూరాధతో మనోరోగాలు పోతాయి', 'అనూరాధలో అడిగినంత పంట' వంటి సామెతలు వెలిసాయి. 'అనాథకర్ర అయినా అనూరాధ కార్తెలో ఈనుతుంది' అనే సామెత ఈ కార్తెలోని పంట దిగుబడిని తెలుపుతుంది. జ్యేష్ఠాకార్తె కార్తీకం చివరలో వస్తుంది. 'జ్యేష్ఠ చెడ కురుస్తుంది. మూల ముురుగు కురుస్తుంది' వంటి సామెతలు జ్యేష్ఠ కార్తెలో వర్షం నష్టకారకమనే విషయాన్ని తెలియజేస్తుంది. 'మూల ముంచను, జ్యేష్ఠ తేల్చును' అనే సామెత జ్యేష్ఠకార్తెలోని వాన పూర్తి నష్టకారకం కాదని తెలియజేస్తుంది. కారణం ఏమంటే అప్పటికి కోతలు ప్రారంభం కావు కాబట్టి. వర్షం కురిసినా పంట కొంత చెడిపోతుందే కాని ఓదెలు మునిగేట్లుగా కురవదు. ఓదెలు మునిగితే పంట మురిగి రైతే మునిగిపోతాడు.

మూలకార్తె మార్గశీర్షంలో వస్తుంది. 'మూలకార్తెకు వరి మూలకు చేరుతుంది' అనే సామెత పంట ఇంటికి చేరే సందర్భాన్ని వివరిస్తుంది. 'మూల కురిస్తే ముంగారు పాడు', 'మూల వాన ముంచక తప్పదు' వంటి సామెతలు ఈ కార్తెలో కురిసే వర్షం వల్ల కలిగే నష్టాన్ని తెలియజేస్తుంది. మూలకార్తెలో చల్లే ఉలవలు బాగా పండుతాయని లోక ప్రసిద్ధి. 'మూలలో చల్లిన ఉలవలు మూడు పువ్వులు ఆరుకాయలు' అనే సామెత ఈ విషయాన్నే తెలియజేస్తుంది.

పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, శ్రవణం, ధనిష్ఠ, శతభిష, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర, రేవతి కార్తెలకు సంబంధించి సామెతలు పెద్దగా కనిపించవు. నేదునూరి గంగాధరం గారి సేకరణలో 'రేవతి వర్షం అన్ని పంటలకు రాణింపే' అన్న సామెత ఒక్కటి మాత్రమే తగులుతుంది. చైత్రంలో వచ్చే ఈ కార్తె కాలంలో కురిసే వర్షం ఏ పంటకైనా పుష్టిని కలిగిస్తుంది. అదే విషయం పై సామెత చెబుతుంది.

ఇంకా 'తూర్పున ఇంద్రధనుస్సు దూరాన వర్షం', 'తూర్పున కొర్రు వేస్తే తుంగమడిలోనే', 'తూర్పున తెరవేసింది తుంగభద్ర దొడ్డి కట్టరా గొల్లవాడా', 'పడమర కొర్రుపడితే పందిళ్ల మీద రాజనాలు పండతాయి', 'శింగిడి వేస్తే పదేను దినాలవాన', 'పడమట మెరిస్తే పది గడియలకు వర్షం', 'ఉరిమిన మబ్బు తరిమిన పాము ఊరికే పోవు' వంటి సామెతలు ఇంద్రధనస్సును బట్టి వర్షాన్ని గుర్తించే లక్షణాన్ని తెలుపుతాయి. ఇంద్రధనస్సును ధనస్సు అని, కొర్రు అని, శింగిడి, శింగిణి, తెర వంటి పదాలతో రైతులు పిలవటం కనిపిస్తుంది. తూర్పు దిక్కున ఇంద్రధనస్సు కనిపిస్తే వర్షం

పడదని, పడమట దిక్కున కనిపిస్తే వర్షం పడుతుందనే నమ్మకం రైతుల్లో ఉన్నట్లుగా పై సామెతల వల్ల తెలుస్తుంది. 'పొద్దున్నే వచ్చిన వాన పొద్దుగూకి వచ్చిన చుట్టం పోరు' అనే సామెత బహుళప్రచారంలో ఉంది. కాని పొద్దుటే వచ్చిన వాన నిలువదనే ప్రచారం కూడా బాగానే ఉంది.

'దక్షిణాన మబ్బుసాగితే వాన తప్పదు', 'పడమరకు పావురాపిట్టంత మేఘం నడిస్తే, పాతాళం బద్దలు కొడుతుంది', 'ఉత్తరాన మబ్బుపడితే ఊరికేపోదు', 'కార్తెమూల మబ్బు కారక మానదు' ఈ సామెతలు మేఘాలు తిరిగే దిక్కునుబట్టి వర్ష సమాచారాన్ని తెలియజేస్తాయి. పై సామెతల్లో కార్తెమూల అంటే ఈశాన్యపు దిక్కని అర్థం. ఆకాశంలోని మేఘాల దొంతరలని 'ఆగడపలు', 'గొర్రెతొక్కుడు', 'పులిచారలు' అంటారు. 'ఆగడపలు వేసినవి అత్తా అంటే అట్లుకి బియ్యం నానబొయ్యి కోడలా అందిట', 'కనుమల మీద మొయిలుమేస్తే కళ్ళముందరేవాన" అనే సామెత కొండల మీద మబ్బులు ఆగినా, కొండలని మబ్బులు కమ్మినా వాన వస్తుందని విశ్వాసాన్ని తెలియజేస్తుంది.

పశుపక్ష్యాది ప్రవర్తనను బట్టి కూడ వాన రాకడను గుర్తించటం లోకంలో కనిపిస్తుంది. గొర్రె, కోడి, కప్ప, గువ్వ, తూనీగ, తుమ్మెద, నక్క, ఎండ్రకాయ, కాకి మొదలైన పశు పక్ష్యాదుల ప్రవర్తనను పరిశీలించిన రైతు వాటి ప్రవర్తనతో వానకు గల సంబంధాన్ని ఇలా సూక్తులతో చెప్పాడు. 'గొర్రెలు గుంపు కూడితే గొప్పవాన', 'కోడిరెక్క ఆరవేస్తే గొప్పవాన', 'తూనీగలాడితే తూమెడు వర్షం', 'ఓటికుండలో ఒరడు పలికితే వచ్చిందివాన' (నక్క), 'ఎండునేలమీద ఎండ్రకాయ కనబడితే వానతప్పదు', 'కాకి గూడు పెడితే కడపటివర్షం', 'మట్టిగడ్డలో కప్పకూస్తే ఝాములో వర్షం'. వరిచేలల్లో సాలెపురుగులు గూళ్ళు పెట్టడం, గాడిద వెంట్రుకలు నిక్కబొడుచుకోవటం, ముడుచుకోవటం, చీమలు గుడ్లతో పైకి ఎగబాకటం, కప్పలు బెకబెకలాడటం మొదలైనవన్నీ వర్ష సూచకాలుగా రైతు భావిస్తాడు. కాకి ఒక విధంగా రైతుకు నేస్తమనే చెప్పాలి. ఎందుకంటే రైతు జీవితంలో ఎన్నో పోలికలకు కాకి ఉపమాద్రవ్యం. వానాకాలంలో ఎక్కడెక్కడో తలదాచుకుని వానాకాలం వెళ్ళిపోయేటప్పుడు కాకి గూడుకడుతుంది. వానాకాలంలో గూడు కట్టడం వలన పెద్దగా ప్రయోజనం ఉండదనీ, కట్టినా ఆ గూడు చెదిరిపోతుందని కాకి భావించి ఉండవచ్చు. కానీ, వానాకాలం వెళ్ళిపోయేటప్పుడు కాకి గూడుకట్టడాన్ని గమనించిన రైతు 'కాకి గూడు కడితే కడపటి వర్షం' అనే సామెతను చెప్పాడు. వర్షాకాలం వెళ్ళేటప్పుడు సేద్యాన్ని ఆరంభించటం నిష్ప్రయోజనం కాబట్టి 'కాకి గూడు కడితే కాలం కాదు' అనే సామెత వెలువడింది. తొలకరికి ముందు కాకులు గూళ్ళు కడితే ఆ సంవత్సరం వర్షాలు సరిగా ఉండవని రైతుల విశ్వాసం.

'కోడి రెక్క ఆరబెడితే గొప్ప వర్షం' వంటి సామెతల్లో రైతు పరిశీలనాశక్తి ఏపాటిదో అర్థమౌతుంది. ఉలవచారు ఈ మధ్యకాలంలో బాగా ప్రసిద్ధమైంది. వేడుకల్లో విందు భోజనాలలో ఉలవచారు, వెన్న వడ్డించటం గొప్పగా భావిస్తున్నారు. ఉలవ ప్రధానంగా పశువుల దాణా. పొలాన్ని సేద్యం కోసం కౌలుకు తీసుకున్న రైతు మొట్టమొదటగా ఉలవ వేస్తే దాని వలన ఏ నష్టం లేకపోగా దాని తిన్న పశువులు బలంగా తయారౌతాయి. బలమైన పశువులు వ్యవసాయానికి ఎంతో అండగా ఉంటాయి. అదే వ్యవసాయదారుడు నువ్వులు వేస్తే సరిగా పండకపోతే పంటను కాపాడలేక పోతే వాడి గతి శ్రీనాథుని గతే. అందుకే 'ఉండేవాడు ఉలవ పోయేవాడు నువ్వులు' అనే సామెత వచ్చింది. రైతు కుటుంబాల్లో పాడి గేదెలు కొండంత అండ. ఆధునిక కాలంలో రైతు వేళకు అన్నం తినగలగుతున్నాడంటే పాడిపశువుల వలననే అంటే అతిశయోక్తి కాదు. ఈ పాడిగేదెల మీద బోలెడన్ని సామెతలు వచ్చాయి. ఉదాహరణకు 'ఆవుతొలి చూలు, బర్రె మలిచూలు' వంటి సామెతలు. ఇందులో తొలిచూలు ఆవు, మలిచూలు బర్రె ఎక్కువ పాలు ఇస్తాయని రైతు నిర్ణయం. సాధారణంగా తొలిచూలు ఈనిన ఆవులు దూడలను పాలు తాగనీయక పాలుపిండుతుంటే తన్నుతుంటాయి. అందుకని వెనక కాళ్ళకు తాళ్ళతో బంధం వేస్తారు. ఈ బంధాన్నే 'దాయత్రాడు' అంటారు. 'దాయకట్టని ఆవు తన్నక మానదు' వంటి సామెతను పాడి చేసే వారికి జాగ్రత్త చెప్పడం వంటిది. 'మలపగేదె మానెడు పాలిస్తుంది', 'మక్కెన బర్రెకు ముక్కున పాలు' వంటి సామెతల్లో మలపగేదె, మక్కెనగెదె అంటే ఏమిటో ఈ తరంలోని వారికి తెలియకపోవచ్చు కాని నిన్న, మొన్నటి వరకు రైతుకు తెలియని విషయంకాదు. మలపగగేదె అంటే దూడ చచ్చిన గేదె అని అర్థం. మక్కెన గేదె అంటే పలుచని గొడ్డు అని అర్థం.

పశులకాళ్ళకు వేసే బంధాన్ని 'ఉర్రుతాడు' అంటారు.

అప్పుడప్పుడు పశువులకు గొంతువాచి ఉంగిడి తగులుతుంది. ఇది పశువులకు సోకేవ్యాధి. నాము (లేతజొన్న పైరు) తిన్నప్పుడు పశువులకు ఈ వ్యాధి వస్తుంది. గొంతువాచి ఊపిరాడక పశువులు మరణిస్తాయి. 'అదురుతిక్క' కూడా ఇటువంటి వ్యాధే. 'దొమ్మలన్నిటిలో మిడిదొమ్మ మెండెడు' అనే సామెత దొమ్మరోగాన్ని గురించిన ప్రస్తావన కనిపిస్తుంది. ఈ దొమ్మ వ్యాధి కడుపు ఉబ్బి, వణుకుతు, నీరు పారుతూ, ఊర్పులు విడుస్తూ, నెమరువేయక, ముక్కులెంబడ నీళ్ళుపడి, చేష్టలుడిగి పశువు క్రమంగా మరణిస్తుంది. పెద్దపశువులకు వచ్చేవి దొమ్మ, చలిదొమ్మ అని, దూడలకు వచ్చేదాన్ని పాలదొమ్మ అంటారని రైతు నిష్కర్ష. ఈ దొమ్మ రోగానికి వైద్యవిధానం చెబుతూ 'దొమ్మరోగానికి కొర్రగంజి' అనే సామెత వచ్చింది.

కొమ్ముమాద అనే రోగం సామెతల్లో ప్రస్తావించబడింది. కొమ్ముల్లో ఒకవిధమైన పురుగుచేరి బాధపెట్టడం వలన ఆ బాధను తాళలేక పశువు తలను దేనికైనా వేసి కొట్టుకుంటుంది. కొన్నిసార్లు ఆ బాధతోనే మరణించే ప్రమాదం లేకపోలేదు. ఇది పశువును బాగా ఇబ్బంది పెట్టే వ్యాధి. వెంటనే చావు ప్రమాదం లేకపోయినప్పటికీ ఆ బాధతో కనిపించిన ప్రతివస్తువును కూడా కుమ్ముతూ కూలుస్తూ ఉంటుంది. 'గాలికుంటు పశువును మందలో ఉంచకు' అనే మరొక సామెతలో గాలికుంటు వ్యాధిసోకిన పశువు బారినుండి మిగిలిన పశువులను ప్రస్తావించడం కనిపిస్తుంది.

గాలికుంటు వ్యాధి అంటువ్యాధి. దీనినే కాలికుంటు అనికూడా వ్యవహరిస్తుంటారు. ఇది సోకిన పశువుకు తీవ్రమైన జ్వరం, నోటివెంట చొంగ, నోటికి కాళ్ళకి పుళ్ళు ఏర్పడి మేత తినలేక, నీరసించి చనిపోతుంది. అందుకే ఈ జబ్బుసోకిన పశువును దూరంగా ఉంచి మిగిలిన పశువులనుంచి కాపాడుతారు. ఇలా పశువులకు సంబంధించి బోలెడన్ని సామెతలు మనకు కనిపిస్తాయి. అలాగే 'అచ్చోసిన ఆంబోతు' వంటి పదబంధాలు మనకు కనబడతాయి. అచ్చోయటం అంటే దేవతల పేరుతో వదిలిన పశువుల్ని గుర్తుపట్టటానికి తొంటి మీద చక్రాకారంలో కాల్చిన గుర్తును వేస్తారు. దీనినే అచ్చు అంటారు.

పశువులకు శరీరం మీద ఉండే సుడులను బట్టి కూడ రైతు పశువును కొనవచ్చో, లేదో ఆలోచిస్తాడు. బొట్టుసుడి, చెవిసుడి, రెప్పసుడి, రొమ్ముసుడి, గంగడోలు సుడి, గొలుసుకట్టు సుడి, నూగుసుడి, ఆసనపుసుడి, వెన్నుసుడి, ధాన్యపుసుడి, ముచ్చలగుంటసుడి వంటి సుడులు ఆక్షేపణలేనివిగా రైతు భావిస్తాడు. పిడుగుసుడి, భాషికపుసుడి, బొట్టుసుడి, ముక్కంటిసుడి, గాటిసుడి, రొమ్ముసుడి, సంకెళ్ళసుడి, తొండగిడిసుడి, ఆసనపుసుడి వెన్నుసుడి, రక్షలు, మొండి ఎముకలు, నాచుఎముకలు, అగ్నిమచ్చ, ఎడమమూపురము, మెడపాములు వీటి మీద ఉన్న సుడి ఆక్షేపణీయమైన సుడులని రైతులు భావిస్తారు.

లోకంలో ఒకే స్వభావం గలవారి గురించి వెటకరిస్తూ 'ఆబుర్రలో విత్తనాలు అనటం' బాగా ప్రసిద్ధమైన సందర్భం. ఈ ఆబుర్ర ఏమిటి అంటే పూర్వం కూరగాయవిత్తనాలని సొరకాయబుర్రలో నిల్వచేసేవాళ్ళు. ఒకబుర్రలో ఒకే రకమైన విత్తనాలు ఉంచేవాళ్ళు. అలాఉంచిన విత్తనాల మొలకలన్నీ ఒకే జాతికి చెందినవి కదా! అలాగే ఒకే విధంగా ప్రవర్తించే వ్యవహారం కలవాళ్ళనుద్దేశించి అన్నమాటలు.

మనం ఆకుపోత, దుక్కిదున్నటం, గుంటకతోలడం వంటి పదాల అర్థాలు తెలుసుకోలేక పోతున్నాం. దుక్కి అంటే కర్రునాగలితో ఒక వరుస దున్నటం. అలా నిలువుగా అడ్డంగా ఎన్నిసార్లు దున్నితే అన్ని దుక్కులకింద లెక్క. దుక్కి దున్నాలంటే ఎంతో శక్తి కావాలి. అరకను అదిమిపట్టి పొలమంతా ఒకసారి తిరగటమే కష్టమైతే దుక్కులను దున్నటం అంటే ఎంతో కష్టం. అందుకే 'పందుం తిన్నవాడే పది దుక్కులను దున్నగలడు' వంటి సామెత వచ్చింది. అలాగే 'జొన్నకు ఏడు మారులు గుంటక తోలాలి' అనే సామెతలో గుంటక అనే విషయ ప్రస్తావన కనిపిస్తుంది. గుంటక అనేది ఒక సాధనం దున్నిన నేలల్లో మట్టిని పొడిపొడిగా చేయటానికి ఈ గుంటకను ఉపయోగిస్తారు. గుంటక తోలేటప్పుడు మన్ను రెండు మూడంగుళాల లోతు వరకు రేగి, నేల లోపల తెగి గడ్డిగాదం తెగి మాడిపోతాయి. మెట్టభూముల్లో వేసవిలో భూమిని మెత్తబరచటానికి గుంటక తోలటం చేస్తుంటారు.

ఇలా గమనిస్తే ఎన్నో సామెతలు రైతు జీవితంతో పెనవేసుకుని మనకు కనిపిస్తాయి.

ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు
తెలుగుశాఖ
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

### తిలక్ పద్యకావ్యం

# మండోదరి

– శ్రీపాద కృష్ణమూర్తి

**“కీ.**శే. దేవరకొండ బాలగంగాధర తిలక్ గారితో నాకు కీ.శే. పిలకా గణపతి శాస్త్రిగారి ద్వారా పరిచయమయింది. అప్పటికే తిలక్‌గారు ‘మండోదరి’ అనే పేరుతో సుమారు రెండువందల పైచిలుకు పద్యాలతో ఒక కావ్యం రచించారట. ఈ కావ్యంలోని పద్యాలు మల్లవరపు విశ్వేశ్వరరావుగారికి, పిలకా గణపతిశాస్త్రి గారికి వినిపించేవారట. 1966లో తిలక్‌గారు ఆకస్మికంగా మరణించిన తరువాత శ్రీ ఉప్పులూరి కాళిదాసుగారు తమ “ఆనందవాణి” పత్రికను తిలక్ స్మారక సంచికగా వెలువరించారు. అందులో గణపతి శాస్త్రి గారు తిలక్‌గారిని గురించి వ్రాస్తూ – ఈ కావ్యాన్ని గురించి ప్రస్తావించారు. కానీ వారు ఈ కావ్యాన్ని “ఊర్మిళ” అని పొరపాటుగా పేర్కొన్నారు.

నేను తిలక్‌గారితో 1950 నుంచి 1960 దాకా పది సంవత్సరాలు చాలా సన్నిహితంగా వారి కుటుంబంలో ఒకణ్ణిగా మెలిగినవాడిని. ఆయన ఎప్పుడూ ‘మండోదరి’ కావ్యాన్ని గురించి చెపుతూ వుండేవారు. ఆయనకి సీత, ద్రౌపది, మండోదరి – ఈ ముగ్గురి పట్లా చాలా అభిమానం, సానుభూతీ వుండేవి.

సీతను గురించి ‘స్వయంవర’ – ‘సీత–1’ – ‘సీత–2’ అనే కావ్యఖండికలు రచించారు. తర్వాత ‘మండోదరి’ కావ్యం రచించినట్లు చెపుతూ వుండేవారు. ఈ కావ్యం రచించిన విషయం డా॥ తంగిరాల సుబ్బారావుకిన్నీ బాగా తెలుసు. తిలక్ గారితో సుబ్బారావుకి నా ద్వారానే పరిచయం. తొలిరోజుల్లో ఆయనంటే భయపడేవాడు.

ఇంతకీ ‘మండోదరి’ కావ్యం – శేషించివున్న కావ్య ప్రారంభ పద్యాలు మూడింటివల్లా చాలా ఉత్తమ కావ్యం అని నా అభిప్రాయం. ఈ కావ్యాన్ని ఆయన పాపు ఠావు సైజు రూళ్ళ కాగితాల మీద రాసి, ట్వైన్ దారంతో పైన ఒక మూలలో కుట్టారనుకుంటాను. ఆయన జబ్బుపడ్డనాళ్ళలో ఆ రాతప్రతి బీరువాలోంచి క్రిందపడిపోయి, చాలారోజులు దుమ్ముకొట్టుకొని పోయి వుంటే, వారి యింటి పనిమనిషి రోజూ కొన్ని కాగితాలు చింపి, కుంపటి అంటించేస్తూ వుండేది. అయితే ఆ కాగితాల కట్ట ‘మండోదరి’ కావ్యమే అని నేను వూహించలేకపోయాను.

కావ్యంలోని మొదటి పుట – ఆయన పుస్తకాల బీరువా క్రింద ఊడ్చిస్తూ వుంటే బయటపడింది. ఆ కాగితం చాలానాళ్ళు నా దగ్గరే వుండిపోయింది. తర్వాత శ్రమకోర్చి, ఏలూరు బెజవాడ గుంటూరులు వెళ్ళి, ఆయన రచనలు చాలావరకు సేకరించుకు వచ్చి వాటిని ఒక పుస్తకంలో రాసేటప్పుడు ఆ మండోదరి కావ్యంలోని పద్యాలు మూడు కూడా ఆ పుస్తకంలో రాసి వుంచాను.

కొన్నాళ్ళకి ఆ పుస్తకమూ పోగొట్టుకున్నారాయన. మండోదరి కావ్యానికి ఇంత ఉపోద్ఘాతం వుంది.

నేను ఎరిగినంతవరకూ కృష్ణశాస్త్రి తర్వాతి తరం కవుల్లో, తిలక్‌గారి అంతటి ప్రతిభావంతుడు లేడు. ఆయన born poet ! పద్యరచన చేసినా వచన పద్యరచన చేసినా, ఆయన అందరికంటె ప్రథమ స్థానంలో వుండేవాడు. “మండోదరి” చాలా గొప్ప కావ్యంగా పేరుతెచ్చుకొని వుండేది. ఏమి లాభం? ఆ కావ్యం కనుమరుగైపోవడం తెలుగు సహృదయుల దురదృష్టం! ‘మండోదరి’ కావ్యంలో మిగిలిన ప్రారంభ పద్యాలు…

**చ.** **నిశినిశి యెల్ల వీచిన వనీమృదు చందన ధూపమాలికల్**
**దెసల మొగిళ్ళవోలె కొసతేలెను తెల్లని వెండి అంచులన్**
**మసిమసివోని నిద్దురల మైకపుమాటున స్వప్నరమ్య రా**
**క్షస వనితాధరమ్ములొక చక్కని నవ్వున వెల్గినట్టులై**

**ఉ.** **తూరుపు కొండవెన్క అల తోచియు తో పని భానుకాంతి వి**
**స్తార సముద్ర వారి పడి శైత్యము తాలిచి వింత వెన్నెలై**
**పారగ ద్వీపమెల్ల సురతాలస సుందర కాలంతలంత క**
**న్నోరగ చేసి చూసి భ్రమతో నిదురించిరి హోయి క్రమ్మరన్.**

మి

# అట్టమీది బొమ్మలు



రవీంద్ర

**చిత్రకారుడు చలసాని రవీంద్ర :**

చలసాని రవీంద్రను మనం ఒక సారి కలిస్తే చాలు. ఈ జన్మలో మరువలేము. సహృదయత, భోళా తనం కలిసిపోయిన మృదువైన మూర్తిగా విట్ అండ్ విజడమ్‌తో... మనల్ని ఆకర్షిస్తాడు. గొప్ప స్నేహశీలి. జోక్స్‌తో మనల్ని నవ్విస్తాడు తప్ప, రిపార్టీతో మనం నొచ్చుకునేలా మాట్లాడడు. వాస్తవిక వాదం అతని జీవన సరళి. క్లిష్ట సమయాల్లో విషాద ఘటనల మధ్య తన్ను చూసి తాను జాలిపడడు. కాని హృదయం విచ్చుకునేలా నవ్వగలడు. విషాదం నుంచి పారిపోడు గానీ, దానిని తన నుంచి పారద్రోలతాడు.

అతని స్మృత్యర్థం జరిగిన సభలో మా భూమి నిర్మాత, ప్రఖ్యాత దర్శకులు బి. నరసింగరావు తనను మార్క్సిజం పై మళ్లించటంలో రవీంద్ర పాత్ర కీలకమైనదని పేర్కొన్నారు. రవీంద్ర మంచి రచయిత కూడా. *మంచు మండింది* అనే చిన్న నవలను వ్రాసాడు. ఇది సినిమాగా తెరకెక్కింది గాని, స్టార్‌డమ్ లేని కారణాన తెరపై ఆడడానికి నోచుకోలేదు. జీవన శైలిలో వైవిధ్యాన్ని ప్రేమించాడు. కోటీశ్వరులతో కరచాలనం చేసినా, కష్టజీవికి తట్టలెత్తి సహాయ పడినా రెంటిని సమదృష్టితో చూడగలిగాడు. లే ఔట్ ఆర్టిస్టుగా ఈ నాడు దినపత్రికలో ఉద్యోగం చేసినా సొంత బావగారైన ఎ.బి.కె. (రవీంద్ర ఎ.బి.కె. శ్రీమతి సుధారాణికి పెద్ద తమ్ముడు.) కంటే ముందుగా రాజీనామా ఇచ్చి స్వేచ్ఛా వాయువులు పీల్చుకొన్నాడు. ఆ తరువాతి కాలంలో దర్శకుడైన తిలక్ చిత్రాలకు కళాదర్శకత్వం వహించాడు. కొల్లేరు కాపురం, భూమికోసం చిత్రాలు అతని కళాప్రతిభతో రాణించాయి. భూమికోసం చిత్రానికి వేసిన పోస్టర్ అతనిలోని కళాభిరుచికి దర్పణం-పడుతుంది.




వయసు బరువు

మనది ఉష్ణదేశం. మనకి వేడి ఎక్కువ, అలానే కాంతి. మన ఉజ్వల కాంతిలో రంగులు దేదీప్యమానంగా ప్రకాశిస్తాయి. అనేక వర్ణ సంయమనాలు సులువుగా కంటికి గోచరిస్తాయి. అందుకే భారతీయులు సహజంగా దట్టమైన, చిక్కనైన, గాఢమైన రంగులను ఇష్ట పడతారు. ఇది మన జానపద శైలిలో స్పష్టంగా కనిపిస్తుంది. రవీంద్ర ఈ శైలిలో అనేక చిత్రాలు వేశాడు. అవి ఎంతో సహజంగా, ఎబ్బెట్టు అనకుండా కన్నుల విందు చేస్తాయి. ఈ గ్రామీణ బాణీలో అతను అందె వేసిన చెయ్యి. జానపద శైలిలోని చిత్రాలు ఇంచుమించుగా ఒకే బాణీలో, ఒకే మూసలో ఉన్నట్టు కనిపిస్తాయి. గ్రామీణ నేపథ్యమే కారణం కావటంతో వైవిధ్యం తక్కువగా ఉంటుంది. ఈ పరిధిని అధిగమిస్తూ ఎన్నో భిన్నమైన సంఘటనలను, సందర్భాలను కాన్వాస్‌పై గ్రంథస్తం చేశాడు. ఎప్పుడు వేసిన చిత్రాలు అప్పుడే అమ్ముడైపోయేవి. ఒక వంద వైవిధ్య భరితమైన చిత్రాలను (విషయ వైవిధ్యం, శైలీ వైవిధ్యం కాదు) ఒకే సారి ప్రదర్శనగా ఇవ్వాలనుకున్నాడు. ఆ ప్రయత్నంలో ఉండగానే కల నిజం కాకుండానే కన్నుమూశాడు. ఇతని చిత్రాలు 2×4, 4×16 అడుగుల విస్తీర్ణంలో చిత్రించబడ్డాయి. చిత్రాలన్నీ కాన్వాస్‌పై వేయబడ్డ అక్రిలిక్ రంగుల చిత్రాలు. గ్రామీణ శ్రమైక జీవితంలో పెనవేసుకున్న చిన్న చిన్న వేడుకలు, ఆనందాలకు ఇవి ప్రతీకలు. హైదరాబాదు ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో తోట వైకుంఠం, లక్ష్మాగౌడ్, సూర్య ప్రకాశ్‌లకు ఒకటి రెండు సంవత్సరాలు అటూ ఇటుగా చదివాడు. బి. నరసింగరావుకు సహవిద్యార్థి. 1944వ సంవత్సరంలో జన్మించిన రవీంద్ర జీవితంలో మే 10, 2009 వ సంవత్సరం రంగులు ఇంకిపోయి, రాగాలు ఆవిరైన దుర్దినం.



మనసు తేలిక

\- ఎన్నార్కె

# దిల్‌వారా జైన్ ఆలయ చరిత్ర


చదువుల తల్లి

సముద్ర మట్టానికి నాలుగు వేల అడుగుల ఎత్తులో, ప్రకృతి సౌందర్యపు ఒడిలో, అబు కొండ కోనల్లో ఒదిగి వెయ్యి సంవత్సరాల పైగా సందర్శకులకు కన్నుల పండుగ చేస్తున్న అత్యద్భుతమైన శిల్ప కళానైపుణ్యంతో చూసేందుకు రెండు కనులూ చాలవేమో అన్నంత ఔన్నత్యంతో - పరిశీలించేందుకు ఒక జీవితకాలం చాలదేమోనని ఆశ్చర్యపోయేట్లు తెల్లగా, చల్లగా దీవిస్తుంటాయి ఈ 'దిల్‌వారా' ఆలయ సముదాయం!!


పాలరాతి తోరణాలు

క్రీస్తు శకం 1021 లో మొదలయి 1582 వరకు సాగిన ఈ అయిదు ఆలయాల సముదాయం జైన తీర్థంకరులకు అంకితమయి వున్నాయి. 'ఆదినాథ్‌జా' మొదటి ఆలయం మొదట జైన్ తీర్థంకరులు రిషభ్ దేవ్‌కు అంకితమిచ్చారు.

అయిదవ ఆలయం - శ్రీ మహరాజ్ స్వామిజీ ఆలయం - 24వ జైన్ తీర్థంకరులు పార్మాస్వామికి అంకితమిచ్చారు. అయిదు ఆలయాలు, అయిదు శతాబ్దాలలో నిర్మాణం జరిగాయి.

1200 వందల మంది శిల్పుల నైపుణ్యం, 1500 మంది శ్రామికుల నిరంతర శ్రమ - 14 సంవత్సరాల కాలంలో ఒక్కో అద్భుతాన్ని సృష్టించారు.


పాలరాతి స్తంభం

అంగుళం-అంగుళం అలంకరించిన స్తంభాలు చూసినా - సెంటీమీటరు, సెంటీమీటరు చెక్కి మలచిన గోపురాలు చూసినా - పాలరాతి తోరణాలు పూలమాలల్లా గాలికి ఊగిసలాడే భ్రమ కలిగించినా, చదువుల తల్లి సరస్వతి - వీణా పాణియై కూర్చొన్నట్లు తంత్రీధ్వనులు మ్రోగించినా - ఇవన్నీ మానవమాత్రులు చేశారంటే ఎలా నమ్మటం? ఏ దేవతలు - ఏ రాత్రి సమయంలో వెన్నెల వెలుగు ముద్ద చేసి ఈ శిల్పాలను సృష్టించి - కాస్త వెన్న పూసి వెళ్ళిపోయారేమో అనిపిస్తుంది.

రంగ మండపంలో 12 పాలరాతి స్తంభాలు - అలాంటి నాలుగు మండపాలున్నాయి. అంగుళం ఖాళీ లేకుండా మలిచి నిలబెట్టారు. చతురస్రాకారపు వరండాలో జైన తీర్థంకరులకు గదులు ఏర్పాటు చేశారు. ఇవికాక ఇంకా 72 మంది సన్యాసుల, జైన్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇవన్ని చూసి ఆనందించి తరించాల్సిందే ఎంత వర్ణించినా న్యాయం చేయలేము కదా!

అరసూరి పర్వతం నుంచి వెన్నముద్దల్లాంటి చంద్రకాంతి శిలలను ఐరావతాలతో మోయించి ఈ ఆలయ శిల్పాలుగా నిలబెట్టారు. అరసూరి పర్వతం అబూ కొండకు 23 కి.మీ. దూరాన, అంబాజీ గ్రామానికి దగ్గరలో ఉంది. మౌంట్ అబూ ప్రాంతంలో క్రీ.శ. 916 లో పర్మార్ రాజవంశాన్ని సంస్థాపించిన వారు రాజా రామ్‌దేవ్. వీరి సర్వ సైన్యాధ్యక్షులు, ప్రధానమంత్రి అయిన విమల్‌షా ఈ ఆలయాలను నిర్మించారని ప్రసిద్ధి. అందుకు 18 కోట్ల 53 లక్షల నూటమూడు రూపాయలు ఖర్చయినట్లు చెప్తారు.


గోపురాంతరం

అబూ పర్వతం, వింధ్య పర్వతాలకు, హిమాలయాలకు మధ్యలో ఉన్న ఎత్తైన పర్వతం. ఒక్క సారైనా మౌంట్ అబూకు వెళ్లిరండి !

అక్కడ బ్రహ్మకుమారీల ప్రశాంత ఆశ్రమంవుంది! - ఎ. కె.

# వెన్నపూస వంటి కన్నెగంటి కథలు

**– దిలావర్**

ఇవాళ పనిగట్టుకొని కన్నెగంటి అనసూయను పరిచయం చేయనవసరం లేదు. తెలుగు కథా సాహిత్య లోకానికి ఆమె సుపరిచితురాలే. ఇప్పటిదాకా వంద కథల పైగా రాసింది అనసూయ. వివిధ పత్రికలలో, ప్రత్యేక సంచికలలో ఆమె కథలు ప్రచురింపబడ్డాయి. అనేక సంకలనాల్లో ఆమె కథలకు చోటు లభించింది. *జీవన శిల్పం, పొడిచే పొద్దు* అన్న రెండు కథా సంపుటులు ప్రచురించారు. మరోకథా సంపుటి త్వరలో కథా ప్రియుల్ని పలకరించనున్నది.

ముఖ్యంగా – కథారచయిత్రిగా అనసూయ గురించి చెప్పుకోవలసింది ఒకటుంది – నిజాయితీ. కేవలం తనకు తెలిసిన వస్తువుల్నే కథలుగా మలిచారు. తన కాళ్ళకింద 'నేల' వుందన్న స్పృహ ఆమె కలలో కూడా మరచిపోదు. అందుకే ఆమె కథలు ఎప్పుడూ చుక్కల్లో విహరించవు. అయితే వాస్తవికత పేరుతో ఆమె హాస్యాపదమైన కథలు సుతరామూ రాయదు. తనకి కనిపించిన ప్రతివస్తువు మీదా – ప్రేమ, ద్వేషం, ప్రేమలో విషాదం, సామ్యవాదం, ప్రేమికుల మధ్య, దంపతుల మధ్య అనుమానాలు, సాధించు కోవడాలు, సిద్ధాంతాల మీద గొంతు చించుకోడాలు, సైన్స్ ఫిక్షన్ పేరుతో మాయల మరాఠీల కథలు, సైకాలజీ పేరుతో పిచ్చి రాతలు, మిస్టిసిజం పేరుతో తలాతోకాలేని రచనలు – కలలో కూడా వీటి జోలికి పోదు అనసూయ. పేదవాళ్ళంతా మంచి వాళ్ళై పోవడం, ధనవంతులంతా దుర్మార్గులే కావడంలాంటి చౌకబారు రాతలు కూడా అనసూయ దరిచేరవు. ఇక పండుగలకు పబ్బాలకు రాసే కథలు. సర్కారీ కథలు ఆమె ఊహకందని విషయాలు.


కన్నెగంటి అనసూయ

ఈ సాహితీ ప్రయాణంలో ఆమె ఎన్నో అంశాలను స్పృశించింది. ఎన్నో సంఘటనలూ, దర్శించిన సత్యాలూ, సన్నివేశాలూ, సందర్భాలూ ఆమె చేతిలో కథలయ్యాయి. మనం కూడా సమాజంలో ఎంతో మందిని చూస్తాం. ఎన్నో సంఘటనలు మనకు ఎదురవుతాయి. ఎన్నో దృశ్యాలు అలలు అలలుగా మన కళ్ళనుండి చెదిరిపోతాయి. మనం పట్టించుకోని అతిసామాన్యమైన విషయాల్ని కూడా అనసూయ దృష్టినుండి తప్పించుకోలేవు. బడుగు జీవితాల వెతల్ని మనం చూసీ చూడనట్టు ఔదాసీన్యం మరుగున పడేస్తాం. అట్టడుగు బతుకుల్లో మధ్యతరగతి వాళ్ళ మనస్తత్వాల్లో, లంపెన్ వర్గం ఫాల్స్ ప్రిస్టేజిల్లోని లొసుగులు కాక, వారిలోని మానవీయకోణాన్ని కథలుగా మలచుకున్న అనసూయలో మానవతా దృక్పథం అక్షర జ్యోతిగా ప్రజ్వలించడం స్పష్టంగా కనిపిస్తుంది.

అమెరికాలో డేనియల్ హాపెర్న్ (DANIEL HALPERN) అని కథాసాహిత్య ప్రియుడు ఒకాయన ఉన్నాడు. ఆయన సంపాదకత్వంలో *THE ART OF THE STORY* అన్న కథాసంకలనం ప్రచురింపబడింది. ప్రపంచస్థాయి కథలు – (వివిధ దేశాలకు చెందినవి) డెబ్భైఅయిదింటిని ఎంపిక చేసి అందులో ప్రచురించాడు. ఆ పుస్తకానికి విలువైన ముందు మాట వ్రాస్తూ "There seems to be an investigative nature to the fiction of these stories written so close to the end of this century, a tendency, especially among writers from emerging nations, to use the story as a means of orientation, to restate for themselves their position- Politically, socially, and artistically - as if for these writers there is radically less separation between reality and the imagination. It is by way of the short sotry that writers are able to define the world in which they find themselves, wherever (and whatever) that turns out to be." అని అంటాడు కథకులతోపాటు విమర్శకులు కూడా గమనించాల్సిన సువర్ణాక్షరాలవి.

శృతిపెట్టిన అతి సుకుమార వీణ అనసూయ మనసు. చిరుగాలికే తంత్రులు ప్రకంపించి మూర్ఛనలు పోయినట్టు, జాలి గొలిపే ఏ చిన్న సంఘటనను చూసినా ఆమె మనసు విలవిలాడుతుంది. ఏదైనా ఓ ఘట్టాన్ని రచయిత చూసినపుడు ముందుగా దాన్ని రచయిత మానసికంగా అనుభవిస్తాడు. అప్పుడు అతనిలో ఘర్షణ మొదలవుతుంది. ఒక అలజడి, ఏదో కలకలం అతణ్ణి సిమితంగా ఉండనీయదు. లోలోన భావోద్వేగాలు సుళ్ళు తిరుగుతాయి. ఆ ఘట్టం గురించి రాయకుండా ఉండలేని తనమేదో తనను సతమతం చేస్తుంది. అలా పురుటి నొప్పులు పడ్డాకే ఏదో ఒక సాహిత్య ప్రక్రియ–ముఖ్యంగా ఓ కథ లేదా ఓ కవిత పురుడు పోసుకుంటుంది. ఒక్కో కథ రాయడానికి అనసూయ లోలోన ఎంత మథన పడిందీ ఆమె రాసిన ఏ కథ చదివినా తెలిసిపోతుంది.

*జీవన శిల్పం*లోని మొదటి కథ– *పడమటి సంధ్యారాగం* చూద్దాం. ఇది ఉత్తమ పురుష (ఉత్తమ స్త్రీ...?) కథనంతో సాగిన కథ. ఇక్కడ 'నేను' లో రచయిత్రే పరకాయ ప్రవేశం చేయడం స్పష్టంగా కనిపిస్తుంది. మతిస్థిమితం లేని ఓ అమాయకురాలి కథ. పాతికేళ్ళకు మించి ఉండదు ఆమె వయసు. బాగా మాసిపోయి నల్లగా మురికి పట్టిన లుంగీముక్క చుట్టుకుంది. పైన వెలిసిపోయి పల్చబడ్డ చొక్కా. అట్టగట్టి ఉండలు చుట్టుకుపోయిన కురుచని జుట్టూ... చూడ్డానికి ముష్టిదానిలా వుంటుంది... తన సర్వస్వాన్ని ఎవరైనా లాక్కుంటారేమో నన్నంత భయంగా ఓ పుస్తకాలసంచిని గట్టిగా గుండెల కదుముకొని వుంది.

ఇంతలో "నా డైరీ తీసేసిందండి... ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుందామని అన్నీ ఒరిజినల్స్ సర్టిఫికెట్స్ డైరీలో పెట్టానండి..." అంటూ అక్కడ మూగిన గుంపుతో అంటాడు ఓ యువకుడు. ఇంకేముంది? గుంపు గుంపంతా ఉద్రేకంతో ఊగిపోతుంది. లాగండి. తన్నండి అంటూ బూతులు తిట్టడం మొదలవుతుంది. 'లెగెహె... నీయమ్మా... మూటలోంచి పుస్తకం బయటపెడతావా లేదా?' అంటూ విసురుగా వీపు మీద లాగిపెట్టి ఒక్క తన్ను తన్నుతాడు ఆమె ఆ తన్నుకి వేగంగా తూలి కింద పడుతుంది... పుస్తకాలు చెల్లాచెదురవుతాయి. ఇంగ్లీషు, హిందీ పుస్తకాలు... అన్నా ప్రఖ్యాత ఆంగ్ల రచయితల పుస్తకాలే...! పుస్తకాలను ఏరుకుంటూ, ఏడుస్తూ... "హూ ఆర్ యూ టు టచ్ మై బిలాంగింగ్స్ వితవుట్ మై పర్మిషన్... వై ఆర్ యూ త్రాషింగ్ మి వితవుట్ ఈవెన్ షోయింగ్ ఏ లీస్ట్ కన్సిడరేషన్ ఫర్ ఎ లేడీ... డర్టీ ఫెలోస్... వ్వాట్ హ్యూమన్స్ యూ ఆర్... హు హేవ్ నేమ్డ్ యు పీపుల్, ఏజ్ హ్యూమన్స్'' అంటూ అక్కడున్న వాళ్ళందర్నీ ప్రశ్నిస్తుంది.

ఆమె చేతుల మీదున్న పచ్చబొట్టును చూసి ఆమె ఎవరో గుర్తుపట్టుతుంది కథకురాలు. ఆమె మంచి సాహిత్యాభిలాష వున్న పంజాబీ సైక్రియాట్రిస్ట్ దీపాకౌర్... !!! ఒక ఆడది అని కూడా చూడకుండా పశువుల్లా ప్రవర్తించే వీళ్ళను మనుష్యులని ఎవరన్నారు? మానవత్వం లేని మనుషులు... ఆమె మాట్లాడిన మాటలు అర్థమైతే తల పట్టుకెళ్ళి రైలు కింద పెట్టుకోవాలి... ఆమెని హింసించిన వాళ్ళంతా. ఆ మాటల్లో ఎంత ఆవేదన "భగవంతుడా! ఈ మనుషుల్లో కాస్తంత మానవత్వం నింపవూ? కష్టాల్లోనున్న వాళ్ళ కష్టాలను గుర్తించేలా చెయ్యి స్వామీ!" ఇది మానవాళి తరఫున రచయిత్రి దైవానికి ఘటించిన అంజలి అనిపిస్తుంది – అన్న ప్రఖ్యాత రచయిత్రి యద్దనపూడి సులోచనరాణి అన్నమాటలు అక్షర సత్యాలు. మనసును కుదిపి వేసే కథ.

*ఒడ్డుకు చేర్చిన కెరటం* మరో విశిష్టమైన కథ. 'నేను' రైల్లో ప్రయాణిస్తూ వుంటాడు. లక్ష్మణ శాస్త్రి అన్న పురోహితుడు రైల్లో 'నేను'కు తారసపడతాడు. దయనీయమైన తన కొడుకు పరిస్థితిని వివరిస్తాడు. కాలేజిలో అన్నిట్లోనూ తన కొడుకు ఫస్టువచ్చేవాడు. సమాజం గురించి పట్టించుకునే మనస్తత్వం ఉన్నవాడు. అనమానతల గురించీ, అవినీతిగురించీ, అన్యాయాలగురించీ పత్రికల్లో వ్యాసాలు రాసేవాడు. టెర్రరిస్టు అన్న ముద్రవేసి పోలీసులు అతణ్ణి జైల్లో పెడతారు. తన కొడుకును విడిపించ వలసిందిగా కాలేజి ప్రిన్సిపాల్‌ను, లెక్చరర్లను ప్రాధేయ పడతాడు. అంతకు ముందు ఎంతో పొగిడిన వాళ్ళు ఇప్పుడు కిమ్మనకుండా వుండి పోతారు. "ఏం న్యాయం? ఎక్కడుంది న్యాయం? అన్నీ తెలిసిన వాళ్ళే నోరు విప్పక పోతే ఇక న్యాయం ఎలా జరుగుతుంది సార్? ఒక దుర్మార్గుడి దురాగతాలకన్నా ఒక మంచి వాడి మౌనం సమాజానికి చేటు చేస్తుందని మీకూ తెల్సుగదా సార్?" అని 'నేను'ను ప్రశ్నిస్తాడు. "తమకు తెలిసిన నిజాన్ని చెప్పలేని వాళ్ళు... పిరికిపందలు... వాళ్లేం తయారు చేస్తారు సార్ రేపటి

పౌరుల్ని...” అంటూ గొంతులో సుడులు తిరుగుతున్న బాధతో నిలదీస్తుంటే గుండెల్ని పిండివేసినట్టు వుంటుంది.

'నేను' తండ్రికి పిండ ప్రదానం చేయడానికి పుష్కరాల ఘాట్‌కు వెళతాడు. అక్కడ పోలీసులు పురోహితుల మీద తమ ప్రతాపం చూపిస్తారు. ఓ వృద్ధ పురోహితుడు కూడా పోలీసుల దెబ్బలకు గాయపడతాడు. 'నేను' అతని పరిస్థితికి కదిలిపోతాడు. అతని చేతే పిండ ప్రదానం చేయించి అతని చేతిలో వెయ్యిరూపాయలు పెడతాడు. “నాన్నగారి ఆత్మకి నా కార్యంతో విముక్తి కలిగించాననే ఆనందం కంటే ఎదురుగా ఉన్న ముసలానయ కళ్ళలోని తృప్తి నా కెక్కువ ఆనందాన్నిచ్చింది...” అనుకుంటాడు 'నేను'. అతనిలోని మానవత్వాన్ని ఈ మాటలతో చక్కగా 'ఎలివేట్' చేసింది రచయిత్రి. ఇంతకీ ఆ 'నేను' ఓ కలెక్టర్ గారని చివరలో తెలుస్తుంది. రైల్లో పరిచయమైన లక్ష్మణ శాస్త్రి కూడా అక్కడి కొస్తాడు. తను సాయం చేసిన వృద్ధ పురోహితుడు లక్ష్మణ శాస్త్రి తండ్రే అని కూడా తెలుస్తుంది. “తన కున్న అధికారంతో లక్ష్మణ శాస్త్రి కుమారుణ్ణి విడిపించడం సాధ్యమే” అని కలెక్టర్‌గారు తనలో అనుకోవడంతో కథ ఆశావహంగా ముగుస్తుంది.

*అమ్మా! నాకు పుట్టాలని లేదు* అన్న పేరే మనసును కదిలించేలా వుంది. తల్లి ఊరికి వెళ్ళుతుంది. హర్షిత ఒంటరిగా యింట్లో వుంటుంది. ఓ రాత్రి దొంగలు నగలూ, డబ్బూ దస్కంతో పాటు హర్షిత శీలాన్ని కూడా దోచుకుంటారు. ఫలితంగా హర్షిత గర్భవతి అవుతుంది. ఫిట్‌నెస్‌ను ప్రాణప్రదంగా చూసుకునే హర్షితకు, ఉబ్బెత్తుగా వున్న తన పొట్ట అసహ్యంగా కనిపిస్తుంది. గర్భస్థ శిశువును హర్షిత ఏం చేయాలనుకుంటున్నదో కడుపులోని బిడ్డ పసిగడుతుంది. అప్పుడు “అమ్మా! నేను నీలో ప్రవేశించిన క్షణం... అది నీకు ఆనందమో, విషదమో... ఆశక్తతో... మరేమైనా కాని... నేనంటూ... నీలో... నీ ఊపిరి పోసుకుంటూ... నీవు తింటే తిని... మానేస్తే మానేసి... నడిస్తే... నడిచాను కదమ్మా! ఇన్ని నెలలు... నీ పక్కన కాదు.... నీతోనే ఉన్నా కదమ్మా...! ఇంతవరకూ...నన్ను చూడకుండానే పెంచావే... నేను పుట్టాకా...

నా శరీరపు తడి ఆరకముందే నిద్రలోకి జారుకుంటూ... నా లేత నాలుకను చూచి నా ముఖంతో నీ పాలిండ్లని వెదుక్కుంటూ... లేచిగుళ్ళవంటి నా పెదవులతో నీ చనుమొనల్ని చుదుతూ ఉంటే... ఆ హాయి.... కి.... తల్లిగా నీ మాతృహృదయం... ఈ మాధుర్యాన్ని ఎన్నికోట్లతో కొనగలవమ్మా...” అని అంటుంది. కర్కశ హృదయాలను సైతం ద్రవింపజేసే ఇలాంటి చిత్రీకరణ మాతృహృదయమున్న ఒక మాతృమూర్తి మాత్రమే చేయగలుగుతుంది.

“.. every short story has one chief purpose, and every sentence, phrase and word is crafted to achieve that end. The ideal short story is like a knife - strongly made, well balanced and with an absolute minimum of moving parts ” అన్న - Michale Swanwick వివరించిన ఈ లక్షణాలన్నిటికి *అమ్మా! నాకు పుట్టాలని లేదు* అన్న యీ కథ మంచి ఉదాహరణ.

*కన్నీరా! కారకే గోదారికి వరదలొస్తాయి...* కూడా కరుణ రసాత్మకమైన కథ. ప్రపంచీకరణ పరోక్ష ప్రభావంతోనైనా Joint family లన్నీ విచ్ఛిన్నమై Nucleous Family లు ఏర్పడుతున్న పిదపకాలం యిది. మానవ సంబంధాలన్నిటిని ఆర్థిక సంబంధాలు డామినేట్ చేస్తున్న యీ కృత్రిమ కాలంలో అరుదైన యిలాంటి కథ రావడం హర్షింప దగిన విషయం. అమ్మమ్మా – మనవరాలి మధ్య ఉండే అనురాగాన్ని, అనుబంధాన్ని అపురూపంగా చిత్రించిన కథ యిది. కథ ప్రతీకాత్మక ధోరణిలో సాగుతుంది.

“మరేమో... నా దగ్గర దాచుకున్న మొత్తం నీరు ఇచ్చెయ్యమంది కదా (గోదారి). ఆనకట్ట దగ్గరున్నపుడు కొంతే యిచ్చేను. (ఆనకట్ట మీంచి పడి కాలు విరగ్గొట్టుకొని విలపిస్తుంది అమ్మమ్మ) ఇంటి దగ్గర ఆ పనీ ఈ పనీ చేస్తూ తన నీరు తనకివ్వటం మరచిపోతానేమోనని ఇలా శాశ్వతంగా మంచం మీద పడుకొని (కాలు విరిగి నడవలేని స్థితికదా) ప్రతిరోజూ కొంత కొంత యివ్వమన్న దన్నమాట...” అంటూ తన కన్నీటికి కారణమేంటో మనవరాలికి వివరిస్తుంది అమ్మమ్మ.

“అమ్మమ్మ మాత్రం ఆ మంచం మీద పడుకొని గోదారి మట్టాన్ని అలా పెంచుతూనే ఉంది” అన్న ముక్తాయింపుతో కథ ముగిస్తుంది రచయిత్రి. ఆ మాటలు మన హృదయాలను కెలకడానికి మాత్రం ముగింపు ఉండదు.

ఇంకా జీవన శిల్పం, చైతన్యం, బియ్యపు రవ్వ ఉప్మా, మనసుకి చెకప్, ప్రోత్సాహం లాంటి మంచి కథలెన్నో యీ సంపుటిలో ఉన్నాయి.

ఇక అనసూయ రెండో కథాసంపుటి *పొడిచే పొద్దును*

చూద్దాం. మొదటి కథే టైటిల్ కథ. సుబ్బు చిన్న పిల్లాడు. అభం శుభం తెలియని అమాయకుడు. అమ్మా నాన్నా ఎప్పుడు పోయారో వాడికి తెలియదు. కాస్త ఊహ తెలిసే నాటికి అక్క రావులమ్మే అమ్మా నాన్న అయి తనను చూసుకుంటోంది. పొద్దంతా పెంటకుప్పల మీదా, అక్కడా యిక్కడా తిరిగి ప్లాస్టిక్ సంచులు, సీసాలూ ఏరుకుంటుంది. ఎప్పుడైనా ఇనుపముక్కల్లాంటివి కూడా దొరుకుతాయి. వాటిని అయిన కాడికి పోశమ్మ హొటల్లో అమ్మి బియ్యం తెస్తుంది. వాటిని ఉడకేసి తమ్ముని ఆకలీ– తన ఆకలీ తీర్చుకుంటుంది. అలాంటి పరిస్థితిలో రావులమ్మకు జ్వరమొచ్చి మంచాన పడుతుంది.

సుబ్బుకు తెలిసిన విద్యల్లా ఒక్కటే. తెల్వాఆరు ఝామున్నే కూరగాయల మార్కెట్‌కు వెళ్ళడం, బండ్ల మీంచి కూరగాయల బస్తాలు దింపేటప్పుడు జారిపడిన కూరగాయులు ఏరుకుంటాడు. బళ్ళమీదున్న బస్తాల్లోంచి లాఘవంగా కూరగాయల్ని లాగేసెయ్యడం. మండీలో కింద గోనెపట్టాల మీద పరచిన కూరగాయల్ని చాక చక్యంగాతీసేసుకోవడం. అలా సంపాదించిన కూరగాయల్ని నాలుగైదు యిడ్లీలకోసం పోశమ్మకి యిస్తాడు. ఆ యిడ్లీలతో తన అక్క ఒంట్లో సత్తువ వచ్చి జ్వరం తగ్గిపోతుందని వాడి ఆశ. ఈ అవసరాన్ని గమనించిన పోశమ్మ సుబ్బును అన్నివిధాలా దోచుకుంటుంది. పోశమ్మ సుబ్బును దగాచేయడం మనసును కలచి వేస్తుంది. ఇలాంటివి రోజూ మనం చూసే అతిసాధారణ దృశ్యాలే. కానీ అవే అనసూయ కంటబడితే మరచిపోలేని కథలవుతాయి. తన కథాకథన నైపుణ్యంతో మన హృదయాలను అల్లకల్లోం చేస్తుంది.

కథలంటే మనం మధ్యతరగతి మందహాసాన్నే ఎక్స్‌పెక్ట్ చేస్తాం. రచయితలైనా – పాఠకులైనా ఎక్కువ పట్టణ వాసంలోనే ఉంటారు గనుక. ఇక రచయిత్రులైతే ఎక్కువలో ఎక్కువ స్త్రీవాద కథలే రాస్తారనుకుంటాం.కాని *పొద్దు పొడిచింది* లాంటి కథలు అనసూయలు మాత్రమే రాయగలుగుతారు. ఈ కథ చదువుతుంటే నా మనోపథంలో ఓ క్షణం తళుక్కున మెరిశాడు శ్రీశ్రీ.

"ఇతిహాసపు చీకటి కోణం – అట్టడుగున పడికాన్పించని కథలన్నీ కావాలిప్పుడు – దాచేస్తే దాగని సత్యం" సుబ్బు యీ అట్టడుగు చీకటి కోణానికి ప్రతినిధే కదా!

"ఓ వ్యథా నివిష్టులార! ఓ కథావశిష్టులార!
పతితులార ! భ్రష్టులార! బాధా సర్పదష్టులార!
ఏడవ కండేడవకండి..." అంటూ సమాశ్వాసిస్తున్న శ్రీశ్రీకి కన్నెగంటి అనసూయ అంతేవాసియే కదా!

*చిక్కుముడి* ఆలోచింపజేసే కథ. సూర్యం రెండు రోజుల ఆఫీసుపని మీద వైజాగ్ వెళ్ళి తిరిగి రాజమండ్రికి వస్తాడు. ఇంటికి వెళ్ళేందుకు రైల్వే ఓవర్ బ్రిడ్జ్ దాటవలసి వస్తుంది. బ్రిడ్జి మధ్యదాకా చేరాక అక్కడో గుంపు తారసపడుతుంది. అక్కడో యాచకురాలు నల్లటి మాసిపోయిన గుడ్డొకటి ఎదురుగా పరచుకొని తన ఇద్దరు పిల్లలతో కూర్చొని వుంటుంది. అక్కడికి ఓ సోషల్ యాక్టువిస్టు వస్తుంది. "నీతోపాటు పిల్లలు కూడా భిక్షమెత్తుకొని బ్రతకాలా? హోంలో చేరు. అక్కడ చేతివృత్తులు నేర్పిస్తాము. గౌరవంగా బతకొచ్చు" అని బిచ్చకత్తెతో అనునయంగా అంటుంది. గుంపులో జనం వెటకారంగా మాట్లాడుతూ, అవహేళన చేస్తూ యాచకురాలిని హోం చేరుమని నానా రకాల మాటలంటారు.

"... మీరు దానం అనుకొని విసిరిన ఆ నాణెం... ఒక జీవితాన్నే నాశనం చేస్తుంది. ఆ నాణెం బాలల్లో సహజ సిద్ధంగా వున్న అమాయకత్వాన్ని దూరం చేస్తుంది. క్రమంగా ఆ నాణెం వీళ్ళని యాచక ముఠాల బారిన పడేయటమే కాక రేపటి దొంగగానో, ఒక మాఫియా ముఠా సభ్యుడిగానో లేకపోతే ఒక వ్యభిచారిగానో కూడా మార్చేయవచ్చు. అంతెందుకు వీళ్ళు మాదక ద్రవ్యాలకు బానిసలవ్వటమే కాక, వీళ్ళ ద్వారా అయితే ఎవరికీ అనుమానం రాదని కాలేజీలకీ, యూనివర్సిటీలకీ మత్తుమందుల్ని సరఫరా చేసేందుకు వీళ్ళని పావులుగా వాడుకుంటున్న సంఘటనలకీ కొదవ లేదు..." అంటూ తనేదో సమాజాన్ని ఉన్న పళంగా మార్చే సంఘ సంస్కర్త అయినట్టు అవాకులూ చవాకులు పేల్తుంది.

"ఏందమ్మా... ఏదో ఎభిసారం గట్రా అంటన్నావ్... నేనూ నా బిడ్డలూ నీకెలా కనిపిత్తన్నాం తల్లీ.... నా మొగుడూ గౌర్నంగా బతికేటోడేనమ్మా... రైళ్ళల్లో సమోసాలమ్మీడోడు. పెట్టి నుంచి ఇంకో పెట్లోకి మారతా కాలుజారి రైలు కిందపడి కాలుపోగొట్టుకున్నాడు. ఆడు నాయంగా సమోసామ్మిన సంపాదన పెద్దయ్యోర్ల లంచాలకే సరిపొయ్యే. పెళ్లాం పిల్లలున్నోడు కాలు విరిగి ఎలా బతుకుతాడని జాలితో పదిపైసలు కూడా ఎడం సేత్తో ఇసరలా. ఆనాడు ఆ పైసలు

గుంజిన నాయాళ్ళుగానీ, ఈ రైల్వే వోల్లుగానీ, గవర్నమెంటోల్లుగాని, ఇసుమంటి పెద్ద మనుసులుగాని ఒక్క రూపాయి యిచ్చిన పాపాన బోలేదు. ఎండకి ఎండుతా వరసంలో తడుత్తా యాడ కడతేరుతాయో తెలవని బతులుకు మాయి. రోగాలొత్తే వైజ్జగం జరక్క రోడ్ల పక్కన పడుండి ఈగల్నీ, దోమల్నీ తోలుకుంటూ ఏటయిములో సత్తామో, ఎలా సత్తామో సచ్చాక.. ఏమవుతామో తెలవని బతుకులు మావి. లెచ్చర్లిత్తంగాదు... సిన్న ఇంటి జాగా గానీ, తెల్ల కారుడు గానీ... ఆరోగ్గ సిరో... ఏందో... ఇప్పిచ్చగలవా...?" అంటూ ఆ యాచకురాలు ఏడుస్తూ చేతులెత్తి దండం పెడుతుంది. పిల్లలు కూడా గోసగోసగా ఏడుస్తుంటారు. ఆ దృశ్యం చూసి గుంపులోని జనం మనసు కలచివేయగా అవాక్కయిపోతారు. దిమ్మదిరిగిపోయే యాచకురాలి మాటలతో– సూర్యం హృదయం బరువెక్కుతుంది. మన గుండెల్ని కూడా ఎవరో ఇనుప హస్తాలతో నలిపివేస్తు న్నట్టనిపిస్తుంది... అయితే సంభాషణలు పేజీలకు పేజీలు, సుదీర్ఘమైన ఉపన్యాసాల్లా వుండటం వల్ల పాఠకులు చదవడానికి కొంచెం యిబ్బంది పడతారేమోననిపిస్తుంది.

*నిజాయితీ* కూడా చదవదగిన కథ. ఇక్కడా కథ ఉత్తమ పురుషలోనే సాగుతుంది. ఆమె–ఆమె భర్త ఆనంద్ హైదరాబాద్‌లో ఇల్లు కట్టుకుంటారు. కొత్తింట్లోకి వెళ్ళాక తను మొక్కుకున్న ప్రకారం త్రినాథ స్వామి వారికి మేళా సమర్పించుకోవాలని నిశ్చయించుకుంటుంది. బంధు మిత్రుల్ని ఆహ్వానిస్తుంది. ఆ వ్రతం ఆమెకు, ఆమె అమ్మమ్మ నుండి సంక్రమించిన సెంటిమెంటు. అయితే త్రినాథ స్వామి వారికి, మేళా సమర్పించుకోడానికి మర్రి ఆకులు కావాలి. గ్లోబలైజేషన్‌లో 'గ్లోబల్ విలేజి' గురించి ఊదర గొట్టడం మనకు తెలిసిన విషయమే. 'గ్లోబల్ విలేజి' సంగతి దేవుడెరుగు. వేయికాళ్ళ జెర్రిలా 'నగరీకరణ' అంగుళం సందు కూడా లేకుండా వికృతంగా పాకడంతో అసలు 'విలేజి'లే లేకుండా కనుమరుగై పోతున్నాయి. నగరాలు బకాసురుళ్ళలా నోళ్ళు తెరుచుకొని "హాం... హాం..." అని పల్లెల్ని మింగేస్తున్నాయి. పిరమిడ్లలా భవనాలు విస్తరిస్తున్నాయి. హైదరాబాదు కూడా అందుకు మినహాయింపు కాదు. కాంక్రీట్ జంగిల్లాంటి హైద్రాబాదులో చెట్ల ఊసెత్తేదెవరు? కనుచూపు మేరల్లో పచ్చదనమే లేకుండా పోయింది. ఇలాంటి నగరంలో 'మర్రి ఆకులు కాదుగదా గరికపోచలు కూడా దొరకడం దుర్లభమే". మరి స్వామికి మొక్కు తీర్చుకునేదెలా...? మూడు మర్రి కొమ్మలు తెచ్చి దేవుడి పటం ముందుంచిన మూడుగ్లాసుల్లో నీళ్ళుపోసి వాటిలో ఈ కొమ్మలుంచాలి. త్రిమూర్తులకి మర్రి చెట్టంటే చాలా యిష్టమట. మర్రి కొమ్మలు ఉంచితే త్రిమూర్తులు వేంచేస్తారట. ఇదొక నమ్మకం.

కూకట్‌పల్లి రైతుబజార్ కెళ్ళమని అక్కడ పల్లెటూరు వాళ్ళు చాలామంది ఉంటారని, వాళ్ళకి అంతో యింతో యిస్తే పనిజరుగుతుందని ఆమె స్నేహితురాలు నీరజ ఫోన్లో చెబుతుంది. 'ఆమె' వెంటనే 'కేపిహెచ్‌బీ' రైతు బజారుకు వెళ్ళుతుంది. అక్కడ ఒకతనితో బేరం కుదిరించుకుంటుంది, నాలుగొందలకు. రెండొందలు యిచ్చి మిగతావి మర్రి కొమ్మలు తెచ్చాక యిస్తానంటుంది.

తెల్లవారింతరువాత బిలబిలమంటూ బంధుమిత్రు లంతా వచ్చేస్తారు. పూజక్కూడా వేళవుతుంది. కాని అనుకున్నట్టుగా మర్రి కొమ్మలు రాలేదు. అప్పటికే ఎంతో ఆలస్యమవుతుంది. బంధుమిత్రులంతా తొందరపెడుతూ వుంటారు. ఎంతకీ డబ్బులు తీసుకున్నతడు రాకపోవడంతో మర్రికొమ్మలు లేకుండానే ఎలాగోలాగు వ్రతం అయిందని పించుకుంటుంది ఆమె. బంధుమిత్రులు వెళ్ళిపోయాక "బంధువుల ముందు పరువు తీసిందని... ఎంత అవమానం జరిగిందని ముక్కదొబ్బులు పెడతాడు ఆమె భర్త ఆనంద్".

ఆ 'సెగ'తో ఆఘమేఘాల మీద రైతు బజారుకెళ్ళుతుంది ఆమె. డబ్బులు తీసుకున్నతడు తీరుబడిగా ఓ స్తంభానికి జారగిలబడి వుంటాడు. వాణ్ణి చూడగానే ఆమె కోపం నసాళానికంటుతుంది. "డబ్బులు చేతిలో పడగానే హాయిగా ఏ కల్లుపాకలోనో దూరి పీకలదాకా సారావట్టించి దొరబాబులా యిక్కడ తొంగున్నావా? అసలు నీలాంటి వాళ్ళను నమ్మడం నాదే బుద్ధి తక్కువ" అంటూ ఆనంద్ తనను తూలనాడిన 'మంట' మీద వాణ్ణి ఛడామడా కడిగి పారేస్తుంది.

"అమ్మా ! మీ కోసమే చీకట్లో మర్రి చెట్టు ఎక్కాడు. చీకట్లో వద్దని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. పట్టు దప్పి కిందపడి కాలు విరగ్గొట్టుకున్నాడు. మీరిచ్చిన డబ్బులు ఆసుపత్రి పాలయ్యాయి. అయినా వీడు ఊరోకోకుండా 'ఆ యమ్మ డబ్బులు ఆ యమ్మ కియ్యక పోతే మోసం చేసినట్టువుతుంది' అని నా దగ్గరున్న డబ్బులు తీసుకొని

ఎట్లాగో అట్లా ఇక్కడికి చేరుకొని మీ కోసం చూస్తున్నాడు చూడండమ్మా'' అని అతని కాలుమీద కప్పిన గుడ్డ తొలగిస్తుంది. 'ఆమె'తో పాటు మనం కూడా షాకవడం తప్పదు. నా మాటల్లో కథలోని 'జీవం' సరిగా లేదు గాని రచయిత్రి కథనం ఆసక్తి కరంగా ఉంటుంది.

*కనుచూపు మేరలో* అన్న కథ కూడా *పొద్దు పొడిచింది* కథ లాంటిదే. అథోజగత్సహోదరులే ఈ కథల్లో కథానాయకులు. పోరిగాడు చెత్తకుప్పలెంట, డ్రైనేజిలెంట కాయితాలేరుకొని బతుకుతూ ఉంటాడు. దొంగతనంగా కాంక్రీటు గద్దల్ని పెకలించి ఇనుపరాడ్‌లను వెలికి తీసి వాటినమ్ముకొని డబ్బులు కూడ గట్టుకోవాలనుకుంటాడు. అలా కూడగట్టిన డబ్బులతో పల్లీల బుట్ట కొనాలని కలలు గంటూ వుంటాడు. ఓ సారి కాంక్రీటు గద్దను పెకలించి ఇనువరాడ్‌లను పట్టుకొని ఎవరూ చూడకుండా చాటుమాటుగా వస్తావుంటాడు. వానికి పొదల్లో రక్తమోడుతూ తనలాంటి వాడే కనిపిస్తాడు. తన కలలన్నీ పక్కన బెట్టి వాడికి వైద్యం చేయించడానికి పూనుకుంటాడు. మానవత్వం పరిమళించే పూల బుట్టను కథారూపంలో మనకు అందిస్తున్నది రచయిత్రి. ఆస్వాదించడమే తరువాయి.

"A short story can be held in the mind all in one piece. It is less like a building than a fiendish device. Every bit of it must be cunningly made and crafted to fit together perfectly and without waste so it can perform its task with absolute precision. That purpose might be to move the reader to tears or wonder, to awaken, the conscience, to console, to gladden, to enlighten..." అంటాడు మైకేల్.

కథా నిర్మాణ మర్మజ్ఞురాలైన అనసూయ ఈ పైన పేర్కొన్న లక్షణాలన్నీ పుణికి పుచ్చుకుంది.

ఈ సంపుటిలో చదవదగిన కథలు యింకా చాలానే ఉన్నాయి. అన్నిటినీ ప్రదర్శించలేము కదా!

కథలు రాయడానికి అనసూయ ఉపయోగించిన భాష గురించి ముఖ్యంగా చెప్పుకోవలసి వుంది. ప్రజల నోళ్ళలో నానే పలుకులను, నుడులను, నానుడులను, జాతీయాలను, సామెతలను అద్భుతంగా ఒడిసి పట్టుకుంది. అందువల్ల కథల్లోని వాక్యాలు జీవంతో తొణికిసలాడాయి. అయితే ఇంగ్లీషు పదాలను ఎడాపెడా ఉపయోగించడం వల్ల పాయసం తింటున్నపుడు పంటికింది రాయి పడ్డట్టు అనిపిస్తుంది. అనివార్యంగా అక్కడ ఇంగ్లీషు పదం వాడకుంటే రచయిత ఉద్దేశించిన అర్థం రాదనుకుంటే తప్ప విరివిగా ఆంగ్లపదాలను ఉపయోగించడం అంత సముచిత మనిపించుకోదు.

మొత్తం మీద కన్నెగంటి అనసూయ తన కథలతో తెలుగు కథా లోకంలో తన స్థానం పదిల పరచుకుంది.



ఆమె శైలీ, శిల్పాలు ప్రతిభావంతంగా కథల్లో ఒదిగి పోయాయి. తెలుగు కథల పూదోటలో కొత్త అంట్లు కట్టుతున్న అనసూయకు తెలుగు సాహిత్యం స్వాగతం పలుకుతున్నది. అభినందన మందార చందనాలు...

డాక్టరు దిలావర్
పాల్వంచ, ఖమ్మం జిల్లా




## సప్తపర్ణి

*తెలుగులో మొట్టమొదటిగా వచ్చిన*
*చిత్రకళ చరిత్ర, విశ్లేషణల కదంబం.*

సప్తపర్ణి (₹777/-) ***మిసిమి*** పాఠకులకు కేవలం ₹ 500/- లకే అందజేస్తున్నాము. మీ కాపీ కోసం ***మిసిమి*** కార్యాలయాన్ని సంప్రదించండి.

**మిసిమి** మాసపత్రిక
*Kala Jyothi Process Pvt. Ltd.,*
*1-1-60/5, R.T.C 'X' Roads, Musheerabad,*
*Hyderabad - 500 020.*
*Ph : 040-27645536, Cell : 99480 83387*
*E-mail : misimi_monthly@yahoo.in*
*e-magazine : www.kinige.com/misimi*

# అన్నీ కాదన్న జ్ఞాని

***– మిసిమి పాఠకుడు***

**"కృష్ణమూర్తి అర్థం కాని మనిషి"**
**"అర్థం చేసుకున్నవారికి మనీషి" (శార్వరి)**

"కృష్ణమూర్తి భారతీయ చింతనకు వారసుడు కాడు. అసలు ఏ చింతనకూ వారసుడు కాడు. ఆయనది పూర్తిగా తనదే అయిన ఒక విలక్షణ, విచిత్ర చింతన" అంటారు, శ్రీ నండూరి రామమోహన్‌రావు తన విశ్వదర్శనంలో. "కృష్ణమూర్తికి ఎట్టి భూమికాలేదు. అన్ని భూమికలను అతడు త్రోసిరాజన్నాడు. వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, శంకరాద్వైతం, బుద్ధుని నిర్యాణవాదం – అన్నింటినీ అతడు త్రోసిపుచ్చాడు"

భారతీయ చింతనకు వారసుడు కాని అతని తత్త్వాన్ని అర్థం చేసుకోడానికి మనం శ్రమించవలసి ఉంటుంది అన్నది ఒక వాస్తవం.

శ్రీ శార్వరి అన్నట్లు "మన వివేకం పరిమితం, మన జ్ఞానం, మన ఆలోచనలు పరిమితం, మన బ్రతుకులే పరిమితం. ఈ పరిమితుల్లో చిక్కుకొని ఉన్న మనకు, అన్ని పరిమితులనూ నిరాకరిస్తున్న కృష్ణమూర్తిని అవగాహన చేసుకోవడం సులభం కాదు. కృష్ణమూర్తిని అర్థం చేసుకోవాలంటే ధైర్యం, తెగింపు మొండితనం కావాలంటారు శ్రీ శార్వరి. "మీరు కప్పుకున్న ముసుగులన్నీ వదిలి నగ్న మనస్సుతో ఆయన ముందు నిలవాలి. కృష్ణమూర్తికీ మనకూ మధ్య ఉన్న దూరాన్ని తగ్గించుకొని ఆయన్ని సమీపించందే కృష్ణమూర్తి అర్థం కావడం కష్టం. మన సాంప్రదాయాలు, నమ్మకాలు, విశ్వాసాలు, ఆచారాలు, పూజలు, దేవుళ్ళు, మతం, ప్రాచీన పరిజ్ఞానం యావత్తూ మూటగట్టి, అటకమీద పెట్టి, రిక్తహస్తాలతో, శూన్యమనస్సుతో ఆయన లోపల ప్రవేశించాలి. అప్పుడు కృష్ణమూర్తి అంటే ఏమిటో తెలుస్తుంది". ఆ శూన్యంలో కృష్ణమూర్తితో కలిసి అడుగులు వేసుకుంటూ నిదానంగా నడిచి వెళ్ళినప్పుడే అది సాధ్యం.

కృష్ణమూర్తిని తెలుగు పాఠకులకు పరిచయం చేసిన ప్రముఖ రచయిత్రి శ్రీమతి అబ్బూరి ఛాయాదేవి ఆయన్ని ధార్మికుడుగా, విశిష్టగురువుగా, కరుణామయుడుగా, వినూత్న మార్గదర్శిగా కొనియాడారు. ఆమె అంటారు–

1. అన్నిమతాలకూ అతీతమైన ధార్మిక మనస్సే మానవుడికత్యంత అవసరమని బోధించిన ధార్మికుడు; 2. గురువునని చెప్పుకోని విశిష్ట గురువు; 3. నిజమైన ప్రేమ అంటే ఏమిటో తెలియజెప్పిన కరుణామయుడు; 4. సత్యాన్ని దర్శించడానికి ఒక మార్గమంటూ లేదనీ, మనస్స్వేచ్ఛాపిపాసే మనల్ని సత్యం దగ్గరకు చేరుస్తుందని, మనిషి తన అంతరంగం లోలోతులను దర్శించడానికి తనకి తానే వెలుగు అవాలని మానవాళికి వెలుగుచూపిన వినూత్న మార్గదర్శి.

**మన చేతనావర్తాని (Consciousness) పరిశోధిద్దాం**

వైద్య, వైజ్ఞానిక, సాంకేతిక రంగాల్లో, సమాచార ప్రసారవ్యాప్తిలో మనిషి సాధించిన ప్రగతి విప్లవాత్మకం. తన అపారమైన మేధాశక్తితో బాహ్య ప్రపంచాన్ని వశం చేసుకోగలిగాడు. కాని అతడు తన చేతనావర్తాన్ని గాని, తన అంతరంగ రహస్యాల్ని గాని, తన అంతఃచేతనలో నిద్రాణంగా దాగి ఉన్న బ్రహ్మాండమైన శక్తి సామర్థ్యాలనుగాని సమగ్రంగా నేటికీ గ్రహించలేకపోతున్నాడు. వీటిని గ్రహించడానికి తన మేధస్సుకున్న అపరిమేయత్వాన్ని వినియోగించలేకపోతున్నాడు.

ఇది సాధించడానికి తన మనస్సులో పరిపూర్ణమైన నిశ్శబ్దం ఉండాలి. ఆ నిశ్శబ్దం ఆలోచన చేత సాధించబడేది కాదు. అది మాటలకందనిది. ఆ నిశ్శబ్దాన్ని మానవుడు శతాబ్దాల నుండి అన్వేషిస్తూనే ఉన్నాడు. అన్ని మతాలు ఈ పరిపూర్ణ నిశ్శబ్దానికి తమతమ అర్థాలు యిచ్చుకొని అందులో కూరుకొని ఉండిపోయాయి. అందులోంచి అవి బయటపడలేవు. ఇవి కల్పించిన సంసారం అనే చట్రంలో చిక్కుకుపోయి మనిషి తన బ్రతుకు సాగిస్తున్నాడు. ఆ చెరసాలలో బందీగా కొనసాగుతూనే ఉన్నాడు. స్తబ్దంగా, మూర్ఖంగా, సంకుచితంగా జీవిస్తున్నాడు. వివాహం, పిల్లలు, నిర్జీవమైన దినసరి కార్యక్రమం ఇదే అతని పరిధి అయిపోయింది. తన లోపలి లోతుల్లో వుండే స్వభావలక్షణమైన సృజనాత్మకత పై స్పృహ లేకుండా

మనుగడ సాగిస్తున్నాడు. ఆ సృజనాత్మకతను వినియోగించుకోగలిగితే తన జీవితం సుఖమయం, వివేకవంతం అవుతుందన్న వాస్తవాన్ని గ్రహించే స్థితిలో లేడు.

వేల సంవత్సరాలుగా పరిణామం చెందుతున్న మానవుడి మస్తిష్కంలో చేరిపోయిన జాతీయతా భావాలు, మతవిశ్వాసాలు, రాజకీయ సిద్ధాంతాలు అతని ఆలోచనా స్రవంతిని కలుషితం చేసివేశాయి. వీటి నుండి మనిషికి విముక్తి కలుగుతుందా అన్నది ప్రశ్నగానే మిగిలింది. ఈ ఆలోచనా స్రవంతి మన సంస్కారంగా రూపొందినందువల్ల, మనుషుల మధ్య సంబంధాలలో హింస, ద్వేషం, అసూయ శాశ్వతంగా నిలిచిపోయాయి. వాటిని తొలగించుకోడానికి తాను చేసిన, చేస్తున్న ప్రయత్నాలన్నీ మాటిమాటికీ విఫలం కావడంచేత, అవి మానవ జీవితంలో అంతర్భాగం, మన చేతనావర్తంలో అవి సహజమైన అంతర్భాగం అని విశ్వసించే స్థితికి మనిషి చేరుకున్నాడు.

ఈ లోకంలో పేరుకుపోయి ఉన్నదంతా కుళ్ళూ, అవినీతి, దురహంకారం, హింస, ఘర్షణలేనా, మంచి అన్నదే లేదా అన్న సందేహం ఎవరికైనా కలగవచ్చు. ఉంది – నిస్సందేహంగా ఉంది. అయితే దాని పరిధి చాలా పరిమితం. దాని ప్రభావం స్వల్పం. మంచి మనుషులు అక్కడక్కడా కనబడకపోరు. మానవ సమాజం అనే ఈ ఎడారిలో అక్కడక్కడా ఒయాసిస్సులు తారసపడకపోవు. ఇన్ని రోజులు ఆ మంచినే నమ్ముకున్నాం. ఆ ఒయాసిస్సులే నందనవనాలౌతాయని ఆశపడ్డాం. వాటిపై భ్రమలు సృష్టించుకొని, ఆ భ్రమల మధ్యే యుగాలు గడిపేశాం. ఈ భ్రమలు కూడా శాశ్వతంగా మన చేతనా వర్తంలో భాగమైపోయాయి.

అందుచేత మనముందున్న ప్రశ్న ఏమిటంటే మన చేతనావర్తంలోని ఒక్కొక్క మలినాన్ని తొలగించుకునే ప్రయత్నాలే మరలా మరికొన్ని యుగాలను వ్యర్థం చేసుకోకుండ, మన చేతనావర్తాన్నే సమూలంగా మార్చుకొని, వినూత్న చేతనకి మనం ఆహ్వానం పలకలేమా?

A new consciousness and a totally new morality are necessary to bring about a radical change in the present culture and social structure. The mess, the confusion, and the misery that human beings have got into are within the area of old consciousness.

ఇదొక సమూల పరివర్తన, ఇదొక మానసిక విప్లవం. కృష్ణమూర్తి మనముందు నిలుపుతున్న కర్తవ్యం యిదే. అత్యుత్తమ మానవ సమాజాన్ని ఆవిష్కరించుకునే ప్రయత్నంలో మనం వేయవలసిన తొలి అడుగు ఇదే.

ప్రశ్న : గతంలో ఇలాంటి కలల సౌధాలు నిర్మించిన చింతనాపరులెందరు లేరు? ఇలాంటి యుటోపియాల అవశేషాలు చరిత్రలో ఎన్ని లేవు?

జవాబు : కొత్తగా ఆలోచించే ప్రయత్నాలు మానుకుందామా? పాత సామాజిక చట్రంలోంచి బయటపడటం అవివేకం అనుకుందామా? జె.కె.ది కూడా ఒక యూటోపియానే, ఒక పగటికలే అని మీరు నిర్ణయించుకోగలిగితే, జె.కె. టీచింగ్స్‌ని కూడా సమూలంగా తిరస్కరించండి. కాని తిరస్కరించే ముందు అతని ప్రాతిపదికలేమిటో, అతని ప్రణాళిక ఏమిటో అవగాహన చేసుకోవడం మన ధర్మం.

జె.కె. మనల్ని నిజజీవితానికి దూరంచేసి, మనలో కొత్త భ్రమలు కల్పిస్తున్నాడా? అతని ప్రతిపాదనల్లోని వాస్తవాలేమిటో మనం తేల్చుకోవాలి కదా. మానవుని భవిష్యత్తును గురించి చెప్పేవన్నీ అభూతకల్పనలే ననడం చింతనాపర్వతం అనిపించుకోదు.

**స్వీయ జ్ఞానంలోనే సృజనాత్మకమైన ప్రజ్ఞ ఉదయిస్తుంది**

మానవుడి సమస్యలకన్నిటికీ మనం పరిష్కారాలు వెదకాలి. పుస్తకాలు చదవటంతో గురువులను అనుసరించటంతో పరిష్కారాలు దొరకవు. మనవిశ్వాసాలూ, సిద్ధాంతాలు పరిష్కారం చూపవు. సమూలమైన మానసిక పరివర్తన తీసుకురావాలంటే, మనం మానవుడి హృదయాన్ని, మనస్సును అవగాహన చేసుకోవాలి. మన జీవితంపైనే కళ్ళు బాగా విప్పి చూడాలి – మనం ఎంత స్తబ్ధంగా, ఎంత మూర్ఖంగా, ఎంత సంకుచితంగా జీవిస్తున్నామో తెలుస్తుంది. వివాహం, పిల్లలు, ఉద్యోగం, నిర్జీవమైన దినసరి, monotonous routine - ఇదే మన జీవితం అయిపోయింది. సృజనాత్మకంగా జీవించడం అంటే మనకు తెలియకుండానే ఉండిపోయింది.

మనం సేకరించుకున్న జ్ఞానం, మన అనుభవాలు మన సమస్యల్ని పరిష్కరిస్తాయి అనుకుంటాం కాని అవి

నిత్యనూతనమైన జీవితాన్ని మనకు అందించలేక పోతున్నాయి. మన మనస్సు మరింత జ్ఞానాన్ని మరింత అనుభవాన్ని పోగుచేసుకున్నంత కాలం మనలోని అహంభావం, స్వార్థపర్వతం ఘనీభవిస్తాయి తప్ప పరిష్కారాలు రావు. వివేకం లేనట్లయితే పరిష్కారాలు దొరకవు. "నా" నుండి విముక్తి కలిగినప్పుడే వివేకం ఉదయిస్తుంది.

ఈ ప్రక్రియనంతా అవగాహన చేసుకోడానికి, అంటే స్వీయజ్ఞానాన్ని సంపాదించటానికి మన మనస్సులు ప్రశాంతంగా ఉంటే కదా! అన్ని వేళలా లెక్కకు మీరిన వ్యాపకాలతో తనలో తాను గొణుక్కుంటూ కాలం వెళ్ళబుచ్చే మనస్సులో ప్రశాంతతకు తావేది? అన్ని ఘర్షణలనూ, అన్ని విభజనల్ని తొలగించుకున్న మనస్సే ప్రశాంతంగా, మౌనంగా ఉండగలదు. అన్ని నమ్మకాలనూ, ద్వేషాలనూ, తపనలనూ, కోరికలనూ తన చేతనావర్తం నుండి తొలగించుకున్న మనిషికే సంపూర్ణమైన మౌనం దక్కుతుంది. ఆ మౌనం అభ్యాసంవల్లగాని, క్రమశిక్షణ వల్లగాని దక్కదు. మన సర్వ కార్యాలకూ "నేను" కేంద్రం కావడం ఆగిపోయినప్పుడే మౌన ప్రశాంతత దక్కుతుంది. అదే మానవ జీవితంలో అత్యుత్తమ దశ. మన మనస్సులు పరిపూర్ణంగా వికసించే అవకాశం ఆ స్థితిలోనే కలగడం మనమే చూడగలం. మానవ జీవితాన్ని అతలాకుతలం చేస్తున్న ఈర్ష్య, జుగుప్స, స్వార్థపర్వతం అన్నింటినీ నీకు నీవుగా స్వతంత్రంగా పరిశోధించినపుడే వాటి నిజస్వరూపం నీకు తెలిసివస్తుంది. వాటిని అణచిపెట్టడంలోను, వాటిని తొలగించుకునే ప్రయత్నం వల్లా కాదు.

ప్రశ్న : స్వీయజ్ఞానాన్ని ఆర్జించడం సులభంగా ఉన్నట్లు తోచదు. దానికి బదులు ఒక గురువునో, మతం నిర్దేశించే మార్గాన్నో ఆచరించి, నా జీవితాన్ని సార్థకం చేసుకోవడం సులభం కాదా?

జవాబు : అద్దంలో నిన్ను నీవు నగ్నంగా చూసుకోవడం గాని, నీ జీవిత పుస్తకంలోని వాస్తవాలను నీవే అవగాహన చేసుకోవడం గాని సులభం కాదు. అనాటమీ లేబొరేటరీలో డాక్టర్లు బల్లమీదున్న కళేబరాన్ని ప్రతి పొరా చీల్చిన రీతిలో, నీ స్వీయ జ్ఞానార్జనలో నీవే సజీవంగా ఉండే నీ మెదడునే dissect చేయడం సులభం అని ఎవరంటారు? సజీవంగా ఉన్న నీ అంతరంగంలోని సూక్ష్మాతి సూక్ష్మమైన మారుమూలల్ని పరిశీలించటం కష్టం కాదని ఎవరంటారు?

అయితే దీనికి ప్రత్యామ్నాయం ఒక గురువునో ఒక మతాన్నో నమ్ముకోవడంవల్ల, అనుసరించడంవల్ల స్వీయజ్ఞానం కలగడం దుర్లభం అని చరిత్ర చెబుతుంది.

నీ మనస్సు లోలోతులను అన్వేషించగల ప్రజ్ఞ నీకు సహజంగా వుంది. బాల్యంలో మిక్కుటంగా ఉండే సృజనాత్మకత ప్రతి మానవ జీవికీ స్వంతం. మన విద్యావిధానంలో, మన పెంపకంలో అందులో చాలా భాగం నశించినా, సృజనాత్మకమైన ఆలోచన మనకు సహజమైన లక్షణం. నీవు స్వతంత్ర పరిశోధనకు నడుంకట్టినప్పుడు అది నీకు తోడుగా నిలుస్తుంది. నీ పరిశీలనలో నీవే గ్రహించే విషయం ఏమిటంటే ఆపరేషన్ సమయంలో డాక్టరుకు అవసరమైన సావధానతకంటే మించిన సావధానత నీకు అవసరమవుతుందని. ఈ ప్రజ్ఞను, ఈ సృజనాత్మకతను వినియోగించు కోడానికి మనిషికి తోడుగా నిలిచేది అతని వివేకం.

**సావధాన శీలతతోనే సత్యాన్ని గ్రహించగలం**

సావధానత (Attention) అంటే ఏమిటో లోతుగా పరిశీలించకపోతే మిగిలిన అన్ని విషయాలపట్ల మనం ప్రదర్శించే సావధానతేకదా అనుకుంటాం. కానీ స్వీయజ్ఞాన సాధనలో మనకు అవసరం అయ్యేది పరిపూర్ణమైన సావధానత. దానిని కృష్ణమూర్తి Choiceless Awareness అంటారు - అంటే మన దృష్టిని మరోదానిపై నిమగ్నం చెయ్యకుండా, కేవలం మనముందున్న విషయ అవగాహనకి మనల్ని మనం అంకితం చేసుకోవడం - మన కళ్ళు, చెవులతోనే కాకుండా మనస్సు హృదయం మొత్తం అస్తిత్వంలో అవధానించడం. అలా చేస్తున్నప్పుడు మనస్సు అన్ని అవరోధాలను తొలగించుకొని విముక్తమవుతుంది. ఆ సావధానత సృజనాత్మకతను సంతరించుకోవడం మనమే చూస్తాం. అది విశ్లేషణాత్మకతను జాగృతం చేస్తుంది. అలాంటి సంపూర్ణ సావధానత మనకు అలవడినప్పుడు కృష్ణమూర్తి చెప్పే ప్రతి విషయం మన రక్తంలో రక్తమై, మన జీవనాడుల్లో నాడిగా అయిపోయి, మన అస్తిత్వంలో భాగమైపోతుంది. దీనికి భిన్నంగా, మనం వినే విషయం మీద ముందుగానే ఒక అభిప్రాయం ఏర్పరచుకొని వింటే, ఆ పక్షపాతం వల్ల మనసు పక్కదారిపడుతుంది.

సావధానతలో వినడమంటే సవ్యంగా వినడమే. సవ్యంగా వినడం అనే ప్రక్రియ ఒక అపురూపమైన అనుభవం.

అప్పుడు వింటున్న విషయంలోని సత్యం మనలోని భారాన్ని తొలగించినట్లు, యుగాలుగా పేరుకుపోయిన వైఫల్యాల, గెలుపు ఓటముల కల్మషం కడిగివేసినట్లు అవుతుంది. ఈ అద్భుతాన్ని శ్రోతలే గ్రహిస్తారు. సవ్యంగా వినడం అంటే అదొక సంపూర్ణమైన మార్పు. అది ఓ పరిపూర్ణ విప్లవం. మనం శ్రద్ధగా వింటున్నకొద్దీ మన చుట్టూ నిశ్శబ్దం అనే గోడలు వాటంతట అవే లేవడం, ఆ నిశ్శబ్దాన్ని ఏ శబ్దమూ భంగపరచక పోవడం మనమే చూస్తాం. అప్పుడు "నేను" అవగాహన చేసుకుంటున్నాను అన్న స్పృహే ఉండదు. కర్తృత్వం లేని పరిశోధన మాత్రమే మన ముందు నిలుస్తుంది.

(సావధానత ఉండటానికి ఏకాగ్రత, క్రమశిక్షణ అవసరం కావు. వాటిలో అణచిపెట్టటం నిరోధించడం ఉంటాయి. అవి సావధానతకి శత్రువులు)

పరిపూర్ణ సావధానతలోనే మన మనస్సులు పూర్తిగా వికసించడం మనమే చూడగలం – అది కృష్ణమూర్తి మనకందించే అభయం కాదు.

అందుచేత, అది ఎంత కఠినమైనా, నిన్ను గురించి నీవు అర్థం చేసుకోకుండా మానవ జీవితాన్ని పరిశోధింప జూడడం వివేకం కాదు. నీ అంతరంగాన్ని నీవే పరిశీలించుకున్నప్పుడు, మరొక విషయం కూడా నీకు తెలిసివస్తుంది. నీవు లోకానికి ప్రతిబింబమేనని కూడా నీవు గ్రహిస్తావు. నీలో ఉన్న సుగుణాలు, దుర్గుణాలు అన్నీ లోకానికి ఉన్న లక్షణాలే అని గ్రహిస్తావు.

**ప్రజ్ఞ (Enlightenment) మన మార్గదర్శి**

ఏ నిర్జన ప్రాంతంలోనో, కీకారణ్యంలోనో ఏళ్ళతరబడి కఠోరమైన తపస్సు చేస్తే లభించేది ప్రజ్ఞ అనుకుంటాం. కాషాయం ధరించి, నిరంతర ఉపవాసాలతో శరీరాన్ని శుష్కింపజేసి, ఏకాగ్రతలో మౌనవ్రతంలో జీవితం గడిపే ఏ కొందరు మహాత్ముల మనసులో సంపూర్ణ వికసనం చెందుతాయన్న ఛాందస భావాల్ని కృష్ణమూర్తి నిరాకరిస్తాడు. ప్రజ్ఞ అనేది మహాబోధి క్రింద లభ్యమయ్యే నిగూఢ బ్రహ్మపదార్థం కాదని, అది మనుషుల దైనిక సంబంధాలలో ప్రభవించేదే గాని, దానిలో మార్మికత శూన్యం అంటాడు. దాన్ని దైవప్రసాదంగా భావించడం మన అజ్ఞానం అంటాడు.

మన మనస్సుల లోలోతులను శోధించడానికి ప్రజ్ఞ అవసరం. అది సహజంగా మనలో ఉండే "లోవెలుగే" అంటాడు. సన్యాసం వల్ల, సాధనవల్ల తపస్సు చేత సాధింపబడేది కాదు. అది మానవుడి సహజ లక్షణం. కాని దాన్ని నీవు సొంతం చేసుకొని, నీ ఆధిపత్యానికి వాడుకునే వస్తువు కాదది. మానవ సంబంధాలను ప్రభావితం చేస్తూ, మన అవగాహనకు ఆధారభూతమైంది. స్వతంత్రంగా ఆలోచించేవాడికి ఉపకరించే సాధనం అది. దాన్ని తమ అనుభవంలోకి తెచ్చుకొన్న వారికి సత్యం తెలుస్తుంది. అలా విశదమైన సత్యాన్ని ఆచరణాత్మకం చెయ్యడం దాని లక్షణం.

సాంప్రదాయాన్ని అనుసరించేవాడికి స్వేచ్ఛ లేదనేకదా అర్థం. వాడికి ప్రజ్ఞతో సంబంధం లేదు.

క్షణక్షణం సజీవంగా ప్రవహించే నదిలాంటి మన జీవితాన్ని పరిపూర్ణ సావధానతతో పరిశీలించినప్పుడే, నిజజీవితంలోని సత్యాలు అవగతం అవుతాయి. అలా అవగతం కావడానికి నీలోని వెలుగే నీకు మార్గదర్శి – గురువులు కాదు, పవిత్ర గ్రంథాలు కావు.

నీలోని వెలుగు నీ ప్రజ్ఞ. నీ అంతరంగపు లోతుల్ని శోధించగల శక్తి దానికే వుంది. ఇదే నీలోని సవ్యమైన, వినూత్నమైన క్రియాశీలతని నీకు కలిగిస్తుంది. క్రియాశీలతను వాస్తవం చేయగల ప్రేమ, వివేకం నీలోని వెలుగులే. ఆ వెలుగునే నీవు మార్గదర్శిగా మలుచుకుంటావు. మరొకరి వెలుగు నీ వెలుగు కాదు.

నీ వెలుగే నీ స్వేచ్ఛ. ఆ స్వేచ్ఛ నిన్ను అన్ని బంధాల నుండి, మమతల నుండి, అనుభవాల వ్యామోహం నుండి రక్షిస్తుంది. ఆలోచనల ప్రభావం నుంచే కాదు ఆలోచనా చక్రం నుండి కూడా నిన్ను విముక్తం చేసేది ఆ ప్రజ్ఞే.

నీ ప్రజ్ఞ చూపే మార్గంలో నీవు నడిచి వెడితే, నీ ముందు నిత్యనూతనమైన జీవితం ప్రత్యక్షమౌతుంది. సంప్రదాయ బద్ధమైన మార్గంలో నడవడం ఎంత ప్రమాదమో నీవే గ్రహిస్తావు. నీ వెలుగు చూపని మార్గంలో నడవడం అంటే నిన్ను నువ్వు విభజించుకొని, ఘర్షణల పాలు కావడమేనని నీకే తెలుస్తుంది. అలా గ్రహించుకోవడమే వివేకానికి నాంది. నీ తాపత్రయంతో అభ్యాసంతో ఆ వెలుగును ప్రసన్నం చేసుకోవడం అసాధ్యం. మనస్సులో పరిపూర్ణ మౌనం ఉన్నప్పుడే ఆ వెలుగు ఉంటుంది.

నేను ఆ వెలుగు చూస్తున్నాను అని నీవు గుర్తించిన క్షణమే ఆ వెలుగు అక్కడ ఉండదు. "నేను" లేనప్పుడే ఆ వెలుగు ఉంటుంది.

ఆ వెలుగే ప్రేమ, రెండూ వేరు వేరు కావు.

## క్రాంతి దర్శనం

ప్రశ్న : నిర్యాణం అని, జ్ఞానోదయం అని, ఆత్మసాక్షాత్కారం అనీ, దేవుడనీ రకరకాల పేర్లు పెట్టి వాటికోసం అన్వేషిస్తూ ఉంటారు. కొంతమంది తాము కోరుకున్న సత్యదర్శనాన్ని సాధించామని నమ్మి, అందరికీ దూరంగా ప్రశాంతమైన ఆశ్రమంలో రోజులు గడుపుతూ ఉంటారు. సత్యసాక్షాత్కారం అనేది ఒకటి ఉన్నదా? ఉంటే, అది ఏమిటి?

జె.కె. : ఆత్మజ్ఞానం అని గాని, సత్యసాక్షాత్కారం అనిగాని అనబడేవి చాలావరకు నిత్య జీవితం నుండి పలాయనవేం. లోకమంతా ఆమోదించిన ఒక పరమసూత్రంగా దీనిని తీసుకుంటే మన జీవితంలోనే దాన్ని పొందగలమా అని చూడాలి. సత్యసాక్షాత్కారం అంటే తనే ఒక దీపంగా వెలిగి, తనకు కాంతిని యిచ్చుకోవడం. కాని ఈ దీపం తను స్వయంగా చిత్రించుకున్నదీ, తనే కల్పన చేసుకున్నదీ, వ్యక్తిగతమైన తిక్కచేష్ట కాకూడదు.

ప్రశ్న : సత్యదర్శనం అంటే అర్థం?

జె.కె. : అన్నింటినీ కాదంటున్న స్థితి. కాదు కాదు అనడమే అన్నింటికంటే నిర్ద్వంద్వమైన చర్య. మూఢ విశ్వాసాలనూ, మతాచారాలనూ మనలో చాలామంది ఏ అభ్యంతరమూ లేకుండా ఆమోదిస్తుంటారు – అందులో భద్రత దొరుకుతుంది కనుక. నిర్ద్వందంగా ఉండే వైఖరే విభజిస్తుంది. ద్వైదీ భావాన్ని కలిగిస్తుంది. ఘర్షణకు దారితీస్తుంది. ఇది మనలను నిబద్ధీకరిస్తుంది. సమస్తమైన విలువలను, సమస్త నీతి సూత్రాలనూ అన్ని నమ్మకాలనూ కాదనడం, చుట్టూ ఏ హద్దులూ గీసుకోకుండా ఉండటం అవసరం. అంతటినీ విసర్జించటం నీతి బాహ్యం కాదు అదే అసలైన గొప్ప నీతి. అందులో అనుకూల ప్రతికూలతల మధ్య విభజన ఉండదు.

ప్రశ్న : ఏ ప్రమాణాలూ, విలువలూ లేకపోతే మనం వెధవ పనులు చేయకుండా ఏది నిరోధిస్తుంది?

జె.కె. : అలవాటుగా మంచి అని నమ్ముతున్నదాన్నే అనుసరిస్తూ ఉండేవాడు నిబద్ధమైన జీవి అన్నమాట. మన భయాలు, మన బాధలు, అనే జైలు లోపల జరిగే కార్యకలాపాలు మాత్రమే మనకు తెలుస్తాయి.

ఆ దృష్టితో చూచినప్పుడు అన్నింటినీ కాదనడం అంటే అదేదో భయంకరమైనదనీ, శూన్యమూ అని ఊహిస్తూ ఉంటాం. కానీ గతాన్నుండి విముక్తి చెందిన మనిషి యొక్క కార్యకలాపాలన్నింటిలోనూ పనిచేస్తూ ఉండే ఈ కాదనడమే సత్యసాక్షాత్కార స్థితి. కాదనడమే విముక్తి. విముక్తి చెందిన స్వేచ్ఛామానవుడే జీవించగలడు. ప్రేమించగలడు. చనిపోవడమంటే తెలిసేది అతనికే.

ప్రశ్న : అతీంద్రియమైన, అలౌకికమైన దానినుండి వినవచ్చే అజ్ఞాత సంకేతాలు ఏవన్నా ఉన్నాయా?

జె.కె. : స్వేచ్ఛలో మాత్రమే దాని నుండి వచ్చే సందేశాలను కనిపెట్టగలుగుతాము.

దానిని గురించి ఏ వ్యాఖ్యానం చేసినా అది మళ్ళీ స్వేచ్ఛకు అడ్డు వస్తుంది. దానిని గురించి మాట్లాడటం అంటే అర్థంలేని శబ్దాలు ఉచ్చరించడమే. అది ఉంటుంది. అంతే. దానిని మనం కనిపెట్టలేము. రమ్మని పిలిచి ఆహ్వానించలేము.

చర్చిలలోగానీ మసీదుల్లోగానీ ఆలయాల్లోగానీ అది లేదు. దానిని చూడటానికి ఏ మార్గమూ లేదు. ఏ గురువులూ, ఏ విధానాలు ఆ సౌందర్యాన్ని ఆవిష్కరించి చూపలేరు. ప్రేమ ఉన్నప్పుడే ఆ తన్మయానుభూతి కలుగుతుంది. సత్యసాక్షాత్కారం అంటే అది.

ప్రశ్న : దాని ద్వారా ఈ మహావిశ్వపు స్వభావ రీతిని గురించి గాని, చేతనని గురించి గాని, అస్తిత్వాన్ని గురించి గాని ఒక సవ్యమైన అవగాహన కలుగుతుందంటారా?

జె.కె. : ఈ తీరం మీద నివసిస్తూ, అవస్థలు పడుతూ, ఆవలి తీరం గురించి ప్రశ్నలు వేయడంలా ఉంది మీరు అడుగుతున్నది. ఆ అవతలి తీరం మీద మీరు ఉన్నప్పుడు సమస్తం మీదే, ఏమీ లేకపోవడం మీదే; ఇటువంటి ప్రశ్నలు మీరు అడగనే అడగరు. ప్రశ్నలన్నీ ఈ తీరం మీద ఉన్నప్పుడే.

నిజానికి ఈ ప్రశ్నలకు అర్థం లేదు. జీవించడం ఆరంభించండి. అప్పుడు మీరు కోరుకోకుండానే, ప్రయత్నించకుండానే నిర్భయంతో అక్కడికి చేరుకుంటారు.

జిడ్డు కృష్ణమూర్తితో మన సంక్షిప్త పరిచయం ముగిసింది.

---

**మిసిమి పాఠకుడు**

# తెలుగులో 'కాలమ్'లు

- వంకాయల లావణ్య

'కాలమ్'కి తెలుగులో నేను పెట్టిన పేరు సూక్ష్మిక. కొంతమంది ఈ పేరుని ఒకింత ఒప్పుకున్నారు. మరి కొంతమంది ఒకింత ఒప్పుకోలేదు. ఇంకొంతమంది ఏ అభిప్రాయాన్నీ వ్యక్తీకరించలేదు. ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా నేనొప్పుకున్న, పెట్టుకున్న తెలుగు పేరుమాత్రం 'సూక్ష్మిక'. 'శీర్షిక' అన్న పేరు కాస్త ప్రాచుర్యం ఉన్నమాట వాస్తవమే కాని 'శీర్షిక' కంటే 'సూక్ష్మిక' సరైనదని నా మేధస్సు నన్ను ఒప్పుకునేటట్లు చేస్తుంది. అందుకే 'సూక్ష్మిక' ఖరారు. తెలుగులో 'సూక్ష్మిక' ఎప్పుడు ఆవిర్భవించిందో ఎవ్వరికి ఖచ్చితంగా తెలీదన్న విషయం కొన్ని వందల పుస్తకాలని చదివిన తర్వాత కొన్ని వందలమందితో కాకపోయినా, అనేకమందితో మాట్లాడిన తర్వాత నేను ఖచ్చితంగా తెలుసుకున్న విషయం. అప్పుడే అంకురించింది ఈ పరిశోధనాంశం నా మెదడులో. నాటుకున్న విత్తుకి నీరు పోయాలన్న ఉద్దేశ్యంతో వనరులను వెతకనారంభించా. ప్రారంభించిన తర్వాత కానీ నాకు తెలిసి రాలేదు నేను సప్తసముద్రాలు దాటవలసిన అవసరం వస్తుందని. దాటడానికి అనేక తెప్పలు, ఓడలు, నౌకలు, తెడ్డులు, వలలు ఇంకా చాలా అవసరమయ్యాయి. అన్నిటినీ సమకూర్చుకుని, పూసగుచ్చుకొని వాటిని చెప్పాలనిపించి మొదలుపెట్టిన కసరత్తే ఈ *తెలుగులో కాలమ్*లు.

ప్రస్తుత విషయం ప్రస్తావించకముందు, ఆ విషయం వెనుకగల పుట్టుపూర్వోత్తరాలను స్పృశిద్దాం.

మనిషికిగల సకల భావావేశాలకు మూలం అతనిలో దాగివున్న కుతూహలం. తన గురించి అందరూ తెలుసుకోవాలి, అందరి గురించీ తను తెలుసుకోవాలి. కావ్యాలు, నవలలు, కథలు, నాటికలు ఇంక ఏ ఇతర సాహితీ ప్రక్రియకైనా ఈ కుతూహలమే పునాది. ఇటువంటి కుతూహలమే శిలాశాసనాల ఆవిర్భావానికి దారితీసింది. సమాచారాన్ని నిక్షిప్తపరచడమే ఈ శిలాశాసనాల ముఖ్య ఉద్దేశ్యం. కాకపోతే, అప్పటికప్పుడు సమాచారాన్ని అందరికీ తెలియచేసినవి ఆనాటి చాటింపు, దండోరాలు దూరప్రాంతాల వారికి పావురాల ద్వారా సమాచారాన్ని అందచేసారు. ఇవన్నీ మన దేశ రాజులు పాటించిన మార్గాలు. ప్రపంచ వ్యాప్తంగా సమాచారాన్ని ఏ విధంగా అందించేవారో విహంగవీక్షణం చేద్దాం. క్రీ.పూ. 59లో రోమ్ దేశంలో జూలియస్ సీజర్ తను తెలుపవలసిన సమాచారాన్ని లోహం మీదనో, రాయి మీదనో రాయించి అందరికీ అందుబాటులో ఉండే ప్రదేశంలో ఉంచేవాడు. వాటి పేరు 'Acta Diurna'. మొత్తానికి సమాచారాన్ని అందరికీ చేరవేయాలన్న ఉద్దేశ్యమూ, సమాచారాన్ని నిక్షిప్తపరచి ముందు తరాలవారికి అందచేయాలన్న ఉద్దేశ్యమూ ముద్రణా వ్యవస్థకు నాంది పలికిందని చెప్పవచ్చు. ఈ క్రమంలో అద్దకం block printing మొదటిది. క్రీ.పూ. 3000లో ప్రాచీన గ్రీకు దేశంలో రాగి లేక కంచుతో తయారుచెయ్యబడిన బంగారు రంగు ఫలకం మీదగల ముద్రను ప్రపంచంలోనే తొలిముద్రణగా పేర్కొన్నారు. దీని పేరు Amulet MS 5236. దీనికి ఈ పేరు ఎందుకు, ఎవరు పెట్టారో నిర్ధారించడానికి ఆధారాలు అలభ్యం. క్రీ.పూ. 220లో చైనాలో లభ్యమయిన హాన్ వంశపు పట్టువస్త్రం మీద గల మూడు రంగుల పువ్వుల భాగం తొలి రంగుల ముద్రణగా నిర్ధారించబడింది. క్రీ.శ. ఏడవ శతాబ్దంలో ఈ బ్లాక్ ప్రింటింగ్ కాగితం మీద జరిగినట్టుగా సాక్ష్యాలు లభించాయి. క్రీ.శ. 868లో చైనాలో ముద్రింపబడిన 'డైమండ్ సూత్ర' అనే బౌద్ధ శాసనాల పుస్తకమే ప్రపంచపు తొలి పుస్తకం. దీన్ని ముద్రించింది 'Wang Chich' అనే చైనీయుడు. బ్లాక్ ప్రింటింగ్ తర్వాతి దశ కదిలే అచ్చుయంత్రం. చైనా దేశానికి చెందిన Bi Sheng అనే వ్యక్తి తొలి అచ్చుయంత్రాన్ని తయారుచేసాడు. కాకపోతే మట్టితో చేసిన ఈ యంత్రం విఫలమయ్యింది. క్రీ.శ. 1234 మొట్టమొదటిసారిగా లోహాన్ని ఉపయోగించి అచ్చు

యంత్రాన్ని తయారు చేసినవాళ్లు కొరియన్లు. క్రీ.శ. 1337లో ఇటువంటి లోహ ముద్రణా యంత్రం ద్వారా వెలువడిన తొలి పుస్తకం పేరు జిక్‌జీ–Jikji. దాదాపు 103 సంవత్సరాల తర్వాత 1440 ప్రాంతాల్లో 'జాన్ గూటన్‌బర్గ్' కనుగొన్న కదిలే లోహ ముద్రణాయంత్రం లోకవిదితం. 1450 ప్రాంతాల్లో బైబిల్‌ను ఈ యంత్రం సహాయంతో ముద్రించాడు.

గూటన్‌బర్గ్ అచ్చుయంత్ర నిర్మాణంతో ముద్రణ కొత్తపుంతలను తొక్కింది. అభివృద్ధి పథంలో నడిచింది.

1476లో ఇంగ్లాండుకు చెందిన 'విలియం కాక్స్‌టన్' అనే వ్యక్తి మొట్టమొదటి ముద్రణాలయం స్థాపించాడు. అప్పట్నించీ ముద్రణ కొత్త పంథాను అవలంబించి పత్రిక వెలువరింతకు దోహదం చేసింది.

ఈ *తెలుగులో కాలమ్‌లు*ను నేను వార్తాపత్రికల 'కాలమ్'ల వరకే పరిమితం చేసుకున్నాను కనుక వార్తాపత్రికల ఆవిర్భావ విషయ వివరాలను నేనెక్కువగా సేకరించాను. వీటినే ఇక్కడ పొందుపరుస్తున్నాను. ప్రపంచ వ్యాప్తంగా వార్తాపత్రికలు పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోకుండా వాటిలో ముద్రించబడిన సూక్ష్మికలను ఉదహరించడం అసంభం కనుక ప్రపంచపు తొలి వార్తా దినపత్రిక మీదకు నా దృష్టిని సారించాను. ఆ క్రమంలో అనేక ఆసక్తికరమైన అంశాలు వెలుగుచూసాయి. వాటిని మీ ముందుంచుతున్నాను. ఇప్పుడు మనం ఉపయోగించే 'NEWS' అనే పదం క్రీ.శ. 1500 వరకు సమాచారాన్ని సూచించే పదంగా వాడినట్టు దాఖలాలు లేవు. ఇప్పటి 'NEWS' అనే పదానికి సమానార్థంగా 'Tydiurs' అనే పదం వాడేవారని ఎడ్విన్ ఎమరీ 'Edwin Emory' 'ది ప్రెస్ అండ్ అమెరికా' అనే పుస్తకంలో ఖరారు చేసారు. 1566లో 'వెనిస్' దేశం 'దాలేమాషియా' – 'Dalmatia'లో జరిగిన యుద్ధవివరాలను చేతిరాతలో రాయించి ఆ కాగితాలను జనబాహుళ్యంలో ఉంచేది. వీటిని పొందటానికి ఒక నాణెం 'గెజెట్' చెల్లించేవారట. అందుకే వీటిని 'గెజెట్' అనేవారట. ఇటువంటి ముప్పై గెజెట్‌లు ఫోరెన్స్‌లోని మాగిలాయాబెచి 'Maggiliabeccti' గ్రంథాలయంలో ఇప్పటికీ నిక్షిప్తపరచ బడ్డాయి. ఈ 'గెజెట్' అనే పదం తర్వాతి కాలంలో ప్రాచుర్యం పొందిందనడానికి సాక్ష్యం మన భారతదేశపు తొలి పత్రిక పేరయిన 'బెంగాల్ గెజెట్'. ఈ గెజెట్‌కు సంబంధించిన మరోకథనం కూడా వుంది. 1556లో వెనిస్ ప్రభుత్వం 'Notisie Seritle' అనే మొట్టమొదటి మాసపత్రికను వెలువరించినట్టు నిరూపితమయ్యింది. దీని వెల ఒక గెజెట్ అని చెప్పబడింది. చేతిరాతతో రాయించిన ఈ కాగితాలకు 'అవిసి ఉత్తరాలు' అని పేరు. అటువంటి ముప్పై అవిసి ఉత్తరాలను ఒక మాసపత్రికగా వెనిస్ ప్రభుత్వం వెలువరించింది. ఎలాగైతేనేం 1556–1566 మధ్యలో ఇటలీ దేశంలో 'గెజెట్స్' అనేవి ఉన్నాయని అర్థం అవుతుంది.

ఇక ప్రపంచపు మొట్టమొదటి వార్తాపత్రికను క్రీ.శ. 1605లో 'జాన్ కరోలిస్' అనే వ్యక్తి జర్మనీ భాషలో 'స్ట్రీస్‌బర్గ్' అనే ప్రదేశం నుండి వెలువరించాడు. దీని పేరు : Aller Furnemen und gederckiwurdigen Historien. మొట్టమొదటి ఆంగ్ల వారపత్రిక 1620లో డిసెంబరు 2న ఆమ్‌స్టర్‌డామ్‌లో వెలువడింది. దీని పేరు కరంటోస్ - Corantos'. దీని నిడివి ఒక పేజీ మాత్రమే. దీన్ని ప్రచురించిన వారు 'Nathanier Butter', 'Nicholas Bourne'. ఈ కరంటోస్ నిండా ఇటలీ, జర్మనీ, హంగేరీ, పోలండ్ మొదలగు దేశాలకు సంబంధించిన వార్తలే ఉండేవి. ఫ్రాన్స్ దేశంలో 'లాగెజిట్', క్రీ.శ. 1641లో పోర్చుగల్‌లో 'గెజెటా' పత్రికలు ఆయాదేశముల మొట్ట మొదటి పత్రికలు.

తొలుత నుండి వార్తాపత్రికలు జనసామాన్యానికి అందుబాటులో ఉన్న కారణంగాను, ఆ వార్తలు ఆసక్తికరంగా ఉండటం చేతను, కొన్ని వార్తలు ప్రజల మీద ఎక్కువ ప్రభావం చూపించిన కారణంగాను, అప్పటి ప్రభుత్వానికి లేదా రాచరికపు వ్యవస్థకు, ప్రచురణకర్తలకు మధ్య అనేక వివాదాలు తలయెత్తేవి. అప్పటి ప్రభుత్వం ప్రచురణకర్తలకు వ్యతిరేకంగా అనేక చట్టాలను రూపొందించి వారిని నిర్బంధించేది. అందుకనే, ఏ వార్తాపత్రిక ఎక్కువ కాలం నిలబడలేకపోయింది. ఆ ఆటుపోట్లను అధిగమించి వెలువడిన మొట్టమొదటి దినపత్రిక 'The Daily Courant'. క్రీ.శ. 1702 మార్చి 11న వెలువడి 1735 వరకూ నిరాఘాటంగా కొనసాగింది. దీనిని ప్రచురించింది ఎలిజెబెత్ మాలెట్ అయినా పునరుజ్జీవనం కల్పించింది మాత్రం 'శామ్యూల్ బక్‌లీ'. ఇది ఇంగ్లండు దేశంలో వెలువడిన దినపత్రిక, ఇదే ప్రపంచపు తొలి దినపత్రిక.

ఈ విధంగా నిరాఘాటంగా వెలువడిన అమెరికా తొలి

దినపత్రిక *Boston Newsletter*. ఇది క్రీ.శ. 1704 ఏప్రిల్ 24న Compbell, Bartholonew Green వెలువరించారు. తదాదిగా వార్తాపత్రిక నేటివరకూ అవిరామంగా, ప్రపంచవ్యాప్తంగా అనేక భాషల్లో ముద్రింపబడుతూనే ఉన్నాయి.

మన భారతదేశంలో క్రీ.శ. 1780 జనవరి 29న 'జేమ్స్ అగస్టన్ హిక్కీ' అనే అంగ్లేయుడు *బెంగాల్ గెజెట్* వార్తాపత్రికను ఆంగ్లభాషలో ప్రచురించాడు. దీనినే *హిక్కీస్ గెజెట్* అని, *కలకత్తా జనరల్ ఎడ్వయిజర్* అని కూడా వ్యవహరిస్తారు. ఇది మొదలుకొని పుంఖానుపుంఖాల వార్తాపత్రికలు వెల్లువలా వెలువడుతూనే ఉన్నాయి.

ఇది నేను ప్రపంచవ్యాప్తంగా వార్తాపత్రికల ఆవిర్భావం గురించి తెలుసుకున్న విషయాలు. ఇక 'సూక్ష్మిక–కాలమ్' పుట్టుపూర్వోత్తరాలు, ప్రాథమిక లక్షణాలను గురించి తర్వాతి భాగంలో వివరిస్తాను.

అసలు 'కాలమ్' అనగానే మనకు భవన నిర్మాణానికి సంబంధించిన 'కాలమ్స్' గుర్తుకొస్తాయి. ఈ పదం వార్తాపత్రికకు ఏ విధంగా ఆపాదించబడింది అంటే 'నిలువ వరుస' అనే అర్థంలో. క్రీ.శ. 1377లో కొరియన్లు 'Jikji' అనే గ్రంథాన్ని ముద్రించారన్న విషయం లోగడ ప్రస్తావించానుకదా, ఆ గ్రంథాన్ని పరిశీలిస్తే, అందులోని ప్రతీ పుట అనేక నిలువు గీతలుగా విభజించబడి ఉంది. ఆ మధ్యగల ఖాళీల్లో అక్షరాలు, పదాలు, వాక్యాలు వ్రాయబడి వున్నాయి. మనం ఎలా అక్షరం పక్కన ఇంకొక అక్షరం రాస్తామో, కొరియన్లు అక్షరం కింద ఇంకొక అక్షరం రాస్తారు. కొరియన్లు తమ సంప్రదాయాన్ని అనుసరించి, దానికి అనుగుణంగానే కదిలే లోహయంత్రాన్ని తయారు చేసుకున్నారేమో మరి. గూటన్‌బర్గ్‌కి ఆ అచ్చుయంత్రం తెలుసో లేదో తెలీదుకానీ, అతను రూపొందించిన అచ్చుయంత్రం ఆధారితంగా రూపొందించబడినవే. ఆ తర్వాతవి కూడా ప్రపంచపు తొలి దినపత్రికైన 'The Daily Courant'లో వార్త కూడా రెండు కాలమ్‌లలో ముద్రింపబడింది. ఆ విధంగా పత్రికాపరంగా 'కాలమ్' అన్న పదానికి నిలువు వరస అనే అర్థం ఆపాదింపబడి ఉండవచ్చు. ప్రస్తుత 'కాలమ్' అర్థంలోకి పరిణామం చెందడానికి 'కాలమ్' చాలా సమయాన్ని తీసుకుంది.

ఇదివరకే చెప్పుకున్నట్టు The daily Courant లో శామ్యూల్ బక్‌లీ వార్తను యథాతథంగా చెప్పడానికే ఇష్టపడ్డాడు కానీ, ఆ వార్త మీద అభిప్రాయాన్ని తెలియపరిచే ఉద్దేశ్యం అతనికి ఏమాత్రమూ లేదు. పేపరుకి ఒకవైపు మాత్రమే ముద్రించేవాడు. ఎప్పుడైనా ఏదైనా ప్రత్యేక వార్తలున్నప్పుడే రెండవవైపు కూడా ముద్రించేవాడు లేకపోతే ఆ చోటు ప్రకటనలకే పరిమితం చేసేవాడు. వార్తను వార్తలుగా మాత్రమే అందించేవాడు. సంపాదకీయాల నుంచి పాఠకుడు ఏం ఆశిస్తాడో, వార్తను ఆ విధంగా తీర్చిదిద్దడానికి ఆయన చాలా భయపడేవాడు. ఏ విధమైన వ్యక్తిగత అభిప్రాయమూ జోడించేవాడు కాదు. ముద్రణను అరికట్టాలనే ఉద్దేశ్యంతో పన్నుభారం అనేకంగా వేసేది అప్పటి పరిపాలనా యంత్రాంగం. ఆ భీకరమైన ప్రకటనల ఆధారంగా వచ్చే ఆదాయంతో ఆయన ఆ పన్నుభారాన్ని తట్టుకోగలిగేవారే. ఆవిధంగా వారానికి ఆరురోజులు పత్రికను వెలువరించేవారు. ఈ విధంగా వ్యక్తిగత అభిప్రాయాలకు ఏమాత్రం తావూ లేదు. అప్పటి 'The daily Courant'లో ఇక 1709–1711 వరకు 'టేట్లర్' అనే పత్రిక, 1711–1712, 1714 వరకూ 'స్పెక్టేటర్' అనే వార్తాపత్రికలు ఇంగ్లండు నుండి వెలువడ్డాయి. మొదటి వార్తాపత్రిక ప్రచురణకర్త, సంపాదకుడు 'రిచర్డ్ స్టీల్', రెండవ దానికి రిచర్డ్ స్టీల్ మరియు జోసఫ్ ఎడిసన్ సంయుక్తంగా ప్రచురణకర్తలుగా, సంపాదకులుగా వ్యవహరించేవారు. ఈ రెండు వార్తా పత్రికలు ఒకవైపు మాత్రమే ముద్రింపబడేవి. ఆ మొత్తం పుట అంతా వ్యాసమే. మరింకేవార్త అందులో ఉండేది కాదు. అందుకే ఆ రెండు పత్రికలూ వ్యాసాల కాగితాలుగా గుర్తింపుపొందాయి. స్పెక్టేటర్ రోజూ ముద్రింపబడి, ఒకానొక దశలో 60,000 కాపీలు అమ్ముడుపోయాయంటే ఆ వ్యాసాలు పాఠకులలో ఎంత ఉత్సాహాన్ని రేకెత్తించాయో అర్థం అవుతుంది. వీటి ఖరీదు ఒక పెన్ని ఉండేది. దీని మూలంగా వార్తను కేవలం వార్తగా ప్రచురించే దశను దాటి అభిప్రాయాన్ని వ్యక్తపరచే వ్యాసరూపాన్ని వార్తకు సంతరింపచేసారని అర్థం అవుతుంది. 'డేనియల్ డెఫో - Daniel Defoe' అనే పాత్రికేయుడు 1717–1720 వరకు ఇంగ్లండు నుండి వెలువడిన 'మిస్టేస్ జర్నల్' పత్రికకు సంపాదకుడు. టేట్లర్ వ్యాస ప్రభావం చేతనేమో డేనియల్ తనదైన అభిప్రాయాన్ని సంపాదకుని స్థానంలో నుండి ధీటుగా, నిర్భయంగా, సూటిగా వ్యక్తపరచేవాడు

పత్రికాముఖంగా. అన్నివిధాల అంశాలను చాలా చాకచక్యంగా, నిపుణతతో చర్చించేవాడు. ఆ విధమైన చర్చలు, అభిప్రాయాలు ప్రస్తుత సంపాదకీయాలను పోలి ఉన్నాయి కనుకనే దేనియల్ డెఫోని చాలా అధికారిక సంస్థలు సంపాదకీయాలకు ఆద్యుడు, పిత - Father of Editorials అని పేర్కొన్నాయి. అంతకుముందు 1710లో ఇంగ్లండు నుండి వెలువడిన 'ఎగ్జామినర్' పత్రికా సంపాదకుడు 'డీన్ స్విఫ్ట్' అప్పటి కాలంలో 'టోరీస్', 'ట్విగ్స్' అనే రెండు తెగల మధ్య జరిగే అంతర్యుద్ధం గురించి చాలా వ్యంగ్యాత్మకంగా పత్రికాముఖంగా వ్యాఖ్యానించేవాడు. పైన చెప్పబడిన రెండింటి ప్రభావం వల్లనేమో ఇతర రచయితలు కూడా వార్తలమీద తమ అభిప్రాయాలను వ్యక్తపరచడం ప్రారంభించారు. వార్తను అందచేసే తీరులో కలిగిన పరిణామాన్నిబట్టి, వార్తలపై అభిప్రాయాన్ని వ్యాఖ్యానం చేసే రచయిత స్థానం బట్టి, వెలిబుచ్చే స్థాయినిబట్టి ఈ కాలమే (సమయం) 'కాలమ్' ఆవిర్భావానికి తొలిమెట్టు అని భావించవచ్చు. వార్తను వార్తగా అందచేయడం, వార్తపై సంపాదకుడి స్థానంలో ఉండి అభిప్రాయాన్ని వ్యక్తపరచడం (సంపాదకీయాలు), వార్తపై సంపాదకుడు కాక ఒక రచయిత స్థానంలో ఉండి వ్యాఖ్యానం చెయ్యడం – ఇవి వార్తను అందించే తీరులో మొదట్నుంచి అప్పటివరకూ జరిగిన పరిణామాలు. చిట్టచివరి పరిణామమే ప్రస్తుత కాలమ్. ఆ క్రమంలో రచయితలు తమ అభిప్రాయాలను జనంతో పత్రికాభిముఖంగా పంచుకునేవారు. వీటిల్లో 'కెటో – Cato' అనే కలం పేరుతో 'జాన్ ట్రెంచర్డ్ - John Trencherd', 'థామస్ గార్డన్ - Thomas Garden' అనే ఇద్దరూ ఆ పత్రికా సంపాదకునికి ఉత్తరాలు రాసేవారు. అవి చాలా ప్రసిద్ధి గాంచాయి. 'కేటో ఉత్తరాలు' అని వారి ఉత్తరాల పరంపరకు పేరు. స్వేచ్ఛకి సంబంధించిన సూత్రాలు, అప్పటి ప్రభుత్వం గురించిన వ్యాఖ్యానాలు, భావప్రకటనా స్వేచ్ఛ కేటో ఉత్తరాల సారాంశం. ఇవే ప్రపంచపు తొలి కాలమ్‌లని నా అభిప్రాయం. దీనిని నిర్ధారించేముందు మీకు కాలమ్ నిర్వచనం, లక్షణాలను తెలియపరచాలి.

డిజిటల్ ముద్రణ రాకమునుపు వార్తాపత్రిక ఎనిమిది కాలమ్స్ కింద విభజించబడి ముద్రించబడేది. ప్రతీ కాలమ్ వెడల్పు 4.5 సెం.మీ. ఒక్కో కాలమ్‌కు మధ్యలో 0.4 సెం.మీ. ఖాళీ ఉండేది. కాలమ్‌ని రాసినవాళ్లు కాలమిస్టులు. వీళ్లు 4.5 సెం.మీ. వెడల్పుగల కాలమ్‌లో తన కాలమ్‌ను పొందుపరుస్తాడు. కనుకనే, అంతే నిడివి గలది మాత్రమే కాలమ్ అవుతుంది. నిడివి అంతకంటే ఎక్కువ ఉంటే దానిని 'Feature' కింద పరిగణించాల్సి వస్తుంది. కనుక, ప్రతీవారంగానీ, ప్రతీరోజూగానీ, ప్రస్తుత అంశం మీదగానీ, ప్రస్తుత వార్త మీదగానీ తనదైన (రచయిత ఒకరైతే) లేక తమదైన (రచయితలు ఒకరుకంటే ఎక్కువమందైతే) వ్యాఖ్యానాన్ని లేక అభిప్రాయాన్ని వ్యంగ్యంగానో, విమర్శనాత్మకంగానో లేక మరే ఇతర విధంగానో ఒక ప్రత్యేక శీర్షికతో, నిర్ణీత నిడివిలో, తెలివైన, పదునైన ఒక వ్యాస పరంపరను పాఠకులకు 'కాలమ్'ల రూపంలో అందించేవాడు కాలమిస్టు. ఇదే కాలమ్ స్వరూప స్వభావాలు. సకల అంశాలూ కాలమ్‌లలో చోటుచేసుకుంటాయి. ఇటువంటి సర్వలక్షణాలనూ పొందుపరుచుకున్నవే ఆ 'కేటో ఉత్తరాలు'. అప్పటికీ 'కాలమ్' అనే పదం ప్రతిపాదింప బడకున్నా, ఆ స్వరూప, స్వభావాల ఆధారంగా 'కేటో ఉత్తరాలే' ప్రపంచపు తొలి కాలమ్‌లని నా గాఢ అభిప్రాయం. ఈ కేటో ఉత్తరాలు నాలుగు సంపుటాలుగా ముద్రింపబడ్డాయి తర్వాతి కాలంలో. ఇదంతా ఇంగ్లండుకు పత్రికా వ్యవస్థకు సంబంధించిన వివరాలు.

అమెరికా మొట్టమొదటి పత్రిక 1704 ఏప్రిల్ 4న వెలువడిన బోస్టన్ న్యూస్ లెటర్. అప్పటి నుండి 1721 వరకు వెలువడిన పత్రికల్లో ఏ సంపాదకుడూ ప్రభుత్వ నిబంధనలు మీరి తమ అభిప్రాయాల్ని వ్యక్తీకరించలేదు. అమెరికా పత్రికా వ్యవస్థలో పెనుమార్పులని సంభవింప చేసింది 1721లో వెలువడిన న్యూ ఇంగ్లండ్ కరెంట్ - New England Current'. ఈ పత్రిక సంపాదకుడు జేమ్స్ ఫ్రాంకలిన్. జగమెరిగిన బెంజమిన్ ఫ్రాంక్ అగ్రజుడు అతను. పాఠకులకు ఏది ఆసక్తికరంగా ఉంటుందో, ఏది అవసరమో గమనించి పాఠకుల దాహార్తిని తీర్చిన సంపాదకుడు ఇతను. అధికారుల పంజాకు చిక్కకుండా, నిర్భీతిగా, స్వతంత్రంగా, బాహాటంగా పత్రికను ప్రచురించేవాడు. నాణ్యమైన, ఉన్నత విలువలు కూడుకున్న సాహిత్యాన్ని పాఠకులకు అందించేవాడు ఇతను. అత్యున్నత విలువలను కలిగిన సంపాదకుడిగా, కేవలం సమాచార సమాహారాన్ని నివేదించడంతో సంతృప్తిపడక, జనావళిని ఆకర్షించే విధంగా Feature Stories, Human - interest Stories

కు రూపకల్పన చేసాడు. వీటన్నిటికీ ఆద్యుడు ఇతనే. ఈ రెండు రంగాల్లో అందెవేసిన చెయ్యి ఇతనిది. అప్పటికే ఇంగ్లండులో వెలువడుతున్న వ్యాసపరంపర పట్ల ఆకర్షితుడై, ఆ కళను ఆకళింపు చేసుకున్నాడు. ఇదివరకు ప్రస్తావించిన స్పెక్టేటర్ వ్యాసాలను కూడా తన పత్రికలో పునఃముద్రణ గావించేవాడు. ఈ జేమ్స్ ఫ్రాంక్లిన్ తన సోదరుడు బెంజిమెన్ ఫ్రాంక్లిన్‌చే కొన్ని వ్యాసాలు రాయించాడు. ఇవికూడా సంపాదకుని లేఖల రూపంలో వెలువడేవి. సైలెన్స్ డూ గుడ్ - Silence Do good' అనే కలం పేరుతో వెలువడేవి. దీనిలోని ఇతివృత్తాన్ని గమనిస్తే 'రెవరెండ్ మాథుర్' అనే ప్రముఖ వ్యక్తి వివాహానికి సంబంధించినది. సమాజంలో ప్రముఖ వ్యక్తుల వ్యక్తిగత విషయాలకు సంబంధించిన కాలమ్‌ను 'ఏగోనీ కాలమ్ - Agony Column' అంటారు. కనుక నిడివినిబట్టి, లక్షణాన్నిబట్టి, స్వరూపాన్నిబట్టి, శైలినిబట్టి Silence Do good ను కాలమ్‌గా అంగీకరించాలి. ఇదే అమెరికా తొలి కాలమ్ అని లభ్యమయిన ఆధారాలమేరకు ఖరారయిన విషయం.

Silence Do Good - అమెరికా తొలి కాలమ్, బెంజ్‌మెన్ ఫ్రాంక్లిన్ – తొలి కాలమిస్టు.

ఇక భారతదేశంలో తొలి కాలమ్ గురించి చర్చిస్తాను. మన దేశ పూర్వ పత్రికారచనకు ప్రాతినిధ్యం వహించిన వార్తాపత్రికలలో ముఖ్యమైనవి సెప్టెంబరు 20 1878న మద్రాసులో వెలువడిన 'ది హిందూ', కలకత్తా నుండి వెలువడిన అమృతబజార్ పత్రిక, మలబార్ (ఇప్పటి కేరళ) నుండి వెలువడిన 'ఇండియన్ పేట్రియాట్' పత్రికలు. అప్పటి ది హిందూ పత్రికా వ్యవస్థాపకుడు గణపతి దీక్షితార్ సుబ్రహ్మణ్య అయ్యర్. 1889లో ఆయన ఆహ్వానం మేరకు 'ఎర్డ్‌లీ నార్టన్ - Earaley Norton' అని ఆంగ్లో ఇండియన్ న్యాయవాది ఓల్ల పోడ్రిడా - Olla Podrida' అనే కాలమ్‌ను నిర్వహించడం ప్రారంభించారు. ఇదే విషయాన్ని ఆహూజా గారు తన Theory and Practice of Journalism' అనే పుస్తకం ద్వారా ఖరారు చేసారు. కనుక ఇదే మన భారతదేశపు తొలి కాలమ్ అని నేను భావిస్తున్నాను.

క్లుప్తంగా తెలుగులో తొలి కాలమ్ వివరాలను పొందుపరుస్తాను. ఈ విషయాల సేకరణలో నాకు ఒక్క విషయం చాలా సుస్పష్టమయ్యింది. ఆంగ్లేయులు తమది అది గుండుసూదైనా సరే, దానిని తేలికగా తీసిపారెయ్యక జాగ్రత్తగా భద్రపరచుకుంటారు, మనం అంటే మన భారతీయం. మన వస్తువులను వేటిని పదిలపరచు కోలేకపోయాం. ఇప్పుడిప్పుడు సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందిన తర్వాత వాటిని భద్రపరుస్తున్నాం కానీ, ఇంతకు పూర్వం మాత్రం అలా కాదు. ఎందుకు అలా అంటున్నానూ అంటే, మన భారతీయ తొలి పత్రికలు మనకు అలభ్యం. కానీ, బ్రిటీషు గ్రంథాలయం - British Library లో ఇప్పటికీ సురక్షితంగా ఉన్నాయి. నేను స్వయంగా వాళ్లకి e-mail రాసాను. దానికి వాళ్లు కొన్ని కొన్ని వార్తాపత్రికలు వాళ్ల దగ్గర ఉన్నాయని కూడా జవాబిచ్చారు. అవకాశం కుదిరినప్పుడు అక్కడి వెళ్ళి వాటిని కూడా పరిశోధించాలను కుంటున్నాను. సరే, ప్రస్తుత విషయానికి వస్తే, తెలుగులో తొలి ప్రతిక వృత్తాంతిని. అది ఇప్పుడు అలభ్యం. కాకపోతే దానికి సంబంధించిన కొన్ని విషయ వివరాలను సేకరించ గలిగాను. వృత్తాంతినిలో పాఠకుల స్వేచ్ఛను గౌరవించేవారు పంపిన లేఖలను సైతం ప్రచురించేవారట. ఈ విధంగా 'లో రక్షణ' అనే కలం పేరుతో సంపన్నుల ఇంట్లో పెళ్లి దుబారాగా పేర్కొంటూ రాసిన ఒక లేఖను యధాతథంగా ప్రచురించారట. వృత్తాంతినిలో సంఘ సంస్కరణకు ఊతమిచ్చే అనేక లేఖలను ప్రచురించేవారు. ఆంగ్లపత్రికలో వచ్చిన వ్యాసాలను కూడా అనువదించి ముద్రించేవారట. కానీ, ఈ పత్రికలో ఎక్కడ, కాలమ్‌ను ప్రతిబింబించే లఘువ్యాసాలు కానీ, 'కేటో ఉత్తరాల' వంటి ఓ వ్యాస పరంపర ముద్రింపబడినట్టు దాఖలాలు లేవు. కనుక వృత్తాంతినిలో కాలమ్‌లు లేవని చెప్పవచ్చు. దీని తరువాత పత్రికలైన 'వర్తమాన తరంగిణి', 'హితవాది' సంఘ సంస్కరణకు, సముద్ధరణకు తోడ్పాటు నందించినా, కాలమ్ ఛాయలు ప్రతిఫలించే వ్యాసాలు ముద్రింపబడినట్టు లేదు. 'హితవాది' పత్రిక కొన్ని సంచికలు ఇప్పటి బ్రిటీషు లైబ్రరీలో ఉన్నాయన్న విషయం నేను స్వయంగా వాళ్లకు రాసినప్పుడు నాకు తెలిసింది. కాలక్రమంలో కందుకూరి వీరేశలింగం గారు, కొక్కొండ వెంకటరత్నం పంతులు గారు ఆంధ్రభాషా సంజీవని, పురుషార్థ ప్రదాయిని ద్వారా వాగ్వివాద ప్రత్యుత్తరాలు జరిగేవి కానీ, అవి కాలమ్‌లు కావు. ఇక, మొట్టమొదటగా తెలుగు పత్రికా రచనలో రెండే రెండు చోట్ల ఫలానావాళ్లు కాలమ్‌లు రాసారన్న విషయం గ్రహించాను. అంటే ఇది పూర్వకాలానికి సంబంధించిన

## Statement about ownership and other particulars of **MISIMI**

**FORM IV (SEE RULE - 8)**

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | Hyderabad |
| 2. | Periodicity of Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | ALAPATI BAPANNA |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane,<br>R.T.C. Cross Roads, Musheerabad,<br>Hyderabad - 500 020. A.P. |
| 4. | Publisher's Name | : | ALAPATI BAPANNA |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane,<br>R.T.C. Cross Roads, Musheerabad,<br>Hyderabad - 500 020. A.P. |
| 5. | Chief Editor's Name | : | CHENNURU ANJANEYA REDDY |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane,<br>R.T.C. Cross Roads, Musheerabad,<br>Hyderabad - 500 020. A.P. |
| 6. | Names and Addresses of Individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total capital | : | Kala Jyothi Process Pvt. Ltd.,<br>1-1-60/5, Iftekar Mansion Lane,<br>R.T.C. Cross Roads, Musheerabad,<br>Hyderabad - 500 020. A.P. |

I, ALAPATI BAPANNA, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

**ALAPATI BAPANNA**

Date : March 1, 2014.

Publisher

విషయం. 1902లో ముట్నూరు కృష్ణారావుగారు కృష్ణాపత్రిక ద్వారా రాసిన- *'Thought from an easy Chair - Was a Classic'* అని *ప్రెస్ ఇన్ ఇండియా* పుస్తకంలో పేర్కొన్నారు.

ఇంకొకటి గాడిచర్ల హరి సర్వోత్తమరావుగారు 1908లో స్వరాజ్య పత్రిక ద్వారా 'విపరీతబుద్ధి' అనే శీర్షిక రాసిన యుద్ధం అనివార్యం అనే వ్యాసానికి ప్రతిస్పందనగా ఆంగ్లేయులు ఆయనను చెరసాలపాలు చేసారు. పైన ఉదహరించిన రెండు పత్రికలు ఇప్పుడు అలభ్యం. కనుక, ఏది ముందో, ఏదో తర్వాతో తెలీదు కానీ, 1902 లో తర్వాత తెలుగులో తొలి కాలమ్ వెలువడింది, కాకపోతే అది ముట్నూరి కృష్ణారావుగారిదా లేక గాడిచర్ల వారిదా అన్నది వివాదాంశం. ఇంతవరకు కాలమ్‌ల పుట్టు పూర్వోత్తరాలు తెలుసుకున్నాం. తర్వాత భాగంలో మన తెలుగులో వచ్చిన కాలమ్‌లలో మొదటిగా శ్రీ గొల్లపూడి మారుతీరావు గారి జీవన కాలమ్‌ల గురించి సంగ్రహంగా వివరిస్తాను. ⓜ



వంకాయల లావణ్య
ఫ్యాకల్టీ సౌత్ ఏయన్ లాంగ్వేజెస్
చికాగో విశ్వవిద్యాలయం
చికాగో



### తమంత తామయి
# వలచి వచ్చిన...

– శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

ఎవరి గ్రంథం వారే అచ్చు వేయించుకోవలసి రావడంకంటే మరి దౌర్భాగ్యం లేదు కవులకు.

వనితలకు తమంత తామయి వలచి వెళ్ళవలసి రావడం వంటిది కవుల కిది.

"తన రచన తన డబ్బుతో అచ్చువేయించుకోడమే కవికి దౌర్భాగ్యం అయితే, యాచించి తెచ్చిన యితరుల డబ్బుతో అచ్చువేయించుకోడం మరీ దౌర్భాగ్యం కాదూ?" అంటే కాదనే చెబుతాను.

ఏమంటే?

అచ్చువేయించుకోవలసిన బాధ్యత కవిమీద పడ్డమే అసలు, దౌర్భాగ్యం.

కాక, – ప్రచురణకర్తలు ముందుకి రానప్పుడు తానయినా తన గ్రంథం, అచ్చువేయించుకోకపోతే, అదీ దౌర్భాగ్యమే అవుతుంది కవికి.

అది తప్పనప్పుడు ద్రవ్యం యెవరిదైనా వొకటే, యెలా వచ్చినా వొకటే.

అంటే, ఇల్లు కట్టుకోడానికి యాచించడమూ, రుణాలు తీర్చుకోడానికి యాచించడమూ, బిడ్డలకు చదువు చెప్పించుకోడానికీ శుభకార్యాలు నిర్వహించుకోడానికీ యాచించడమూ వంటిది కానేకాదు.

అవి జానెడు పొట్టకోసం చెయ్యవలసినవి.

ఇది, అచ్చంగా, ఇతరుల నానందపెట్టడానికి చేసే మంగళకార్యం.

ఇతరుల చిత్తవృత్తులను సంస్కరించడానికీ, పరిణతి కలిగించడానికీ చేసే దోహదక్రియ.

సభ్యత అలవరచి జాతి ఏకతాటిమీద నడిపించడానికి చెయ్యవలసిన విధికృత్యమున్నూ.

మొత్తానికి కవి బాధ్యత యిది.

కవి ప్రాప్యమున్నూ యిదీ.

నలుగురూ చదవడమూ, పాఠకుని హృదయం స్పందించి మొగం ఆనందోత్ఫుల్లం కావడమూ, ఆ మనిషికెంతో కొంత సంస్కారమున్నూ అబ్బడమూ, ఆ విధంగా తన జీవితం ధన్యం కావడమూ – ఇదీ తన రచనవల్ల కవి సాధించుకోవలసినవి.

నలుగురూ తన ప్రతిభ గుర్తించడమూ, కొంచెమయినా తనని మెచ్చుకోడమూ కూడా ఈ పద్దులోవే, సందేహం లేదు.

అయితే, గౌణా లివి.

అనుషంగికాలున్నూ.

అవి సిద్ధిస్తేనే సిద్ధించేవిన్నీ యివి.

నిజమే; కాని "అచ్చుపడే ప్రతీగ్రంథానికీ యీ శక్తి వుంటుందా?" అంటే, పోనీ, వుండేదాని మాట?

అది నిర్ధారణ కావడం మాత్రం యెలాగా?

చెట్టున పుట్టే ప్రతీపిందే సారవంతం కాదు.

నిలవనూ నిలవదు.

మరి, నిలిచే దేదో యెలాగా చెప్పడం?

అలాంటిదే కవుల గ్రంథాల విషయమున్నూ.

కాక, – పూర్వకవులు రాసిన గ్రంథాలు కొంచెమే వున్నాయి, మన కిప్పుడు.

ఆ రోజుల్లో యివి మాత్రమే పుట్టాయా?

కవులున్నూ వీరు మాత్రమే వుండినారా అప్పుడు?

నన్నయ్య భారతాది మాత్రమే రచించాడా?

తిక్కన భారతోత్తరభాగం మాత్రమే రచించాడా?

ఎర్రన్నా, శ్రీనాథుడూ, పెద్దన్నా, తిమ్మన్నా, రామరాజ

భూషణుడూ – మొదలైనవారు ఇప్పుడు మనకు లభ్యాలయి వున్న పెన్నిధులు మాత్రమే రచించారా?

కాదు కాదు, అలాంటి నికరమైన శక్తీ నేర్పూ అలవడ్డానికి, వారు, ఎన్నో శతకాలూ, పద్యాలూ, మరింకా యెన్నో గ్రంథాలూ రచించివుంటారు, సాధకావస్థలో,

అయితే, యిప్పటి అనేకుల్లా కాక, వా రపరిమితమైన సంస్కారం గలవారు కనక, వారి ఆ ప్రాథమిక రచనలున్నూ జనులాదరించే వుంటారు.

కాని తపస్సిద్ధి కాక పూర్వం రచించినవి కనక, అవి కాలం సుడిగుండాలు తప్పించుకోలేక నశించిపోయి వుంటాయి.

అలా పోయినవి పోగా రత్నాలే మనకి మిగిలాయి.

ఎప్పుడయినా గట్టిగింజలే మిగులుతాయి; కాని పొల్లు గింజలకున్నూ కివి తప్పనిదే.

కనక, గ్రంథం తయారయిందా అచ్చుపడవలసిందే, ఇప్పుడు.

దానివల్ల యితరులకు ఆనందాదిప్రయోజనం కలిగినా కలక్కపోయినా, అది అచ్చుపడ్డంవల్ల మరో గ్రంథం రచించాలన్న ప్రేరణ కలుగుతుంది కవికి.

కవి అయినవాడికి ప్రాణాలకంటేనూ విలవయిందీ ప్రేరణ.

కవి అయినవాడికి నిద్రాహారాల కంటేనూ యెక్కువ ఆవశ్యకమయిందీ ప్రేరణ.

ఈ ప్రేరణ తన్మయీభావం కలిగిస్తుంది కవికి.

ఈ ప్రేరణ దీక్ష పుట్టిస్తుంది కవికి.

ఈ ప్రేరణ ఆ దీక్షకు ఏకాగ్రత సంఘటిస్తుంది కవికి.

దాంతో రాత క్కూచుంటాడు కవి.

రాయగా రాయగా భాష స్వాధీనం అవుతుంది కవికి.

రాయగా రాయగా రచనావిధానం సుపరిష్కృతం అవుతుంది కవికి.

రాయగా రాయగా క్రాంతదర్శిత నిశితం అవుతుంది కవికి.

రాయగా రాయగా తపస్సు సిద్ధించి మహర్షి అవుతాడు కవి.

"నానృషిః కురుతే కావ్యమ్"

మహర్షి కానివాడు కావ్యం రచించలేడు.

మహర్షి కానివాడు రచించినది కావ్యమూ కాలేదు.

మరి వొక్క రోజులో మహర్షి కాగలడా యెవ డయినా?

సోపానక్రమంగా ఎంతో సాధన కావాలి దానికి.

రాతప్రతి అయినా అచ్చుప్రతి అయినా గ్రంథం నలుగురి చేతుల్లోనూ పడ్డం ఆ సోపానాల్లో వొకటి.

అలాగ వొకటితరవాత వొకటిగా యెన్నో సోపానా లెక్కితే గాని తత్కర్తకు తన భంగపాటేదో తెలియదు.

తనకి సాధ్యం – సాదించుకోవలసింది – ఏమిటో తెలియదు.

అది తెలిస్తే గాని అడుగు ముందుకి పడదు.

పడితే తప్ప సిద్ధి యెక్కడిదీ?

తన గ్రంథం తానే అచ్చువేయించుకోవలసివస్తే మాత్రం ప్రేరణ దుర్బలమూ, సిద్ధి దుర్లభమూ అయిపోతాయి, కవికి.

ఈ విషయమై కొందరికపవాద (మినహాయింపు) లుండవని కాదు; కాని మొత్తాని కిది కవులకు దౌర్భాగ్యం.

ఏమంటే?

తన గ్రంథం తానే అచ్చువేయించుకుంటే, పెట్టిన డబ్బు తిరిగీ రాబట్టుకోడమూ, తన సంసారం నిర్వహించుకోడానికీ మరో గ్రంథం అచ్చువేయించుకోడానికీ తగినంత లాభం లాగడమూ – ఇలాంటి ధోరణిలో పడిపోతాడు కవి.

దీనివల్ల అతని కవితాతపస్సు భంగపడిపోతుంది.

కవికి కాదు, తెలుసుకోగలిగితే జాతికే తీరని నష్టం అది.

అయితే, కవి అయినవాడల్లా దరిద్రుడయి వుండాలని కాదు.

కవి అయినవాడల్లా ధనికుడయి వుండకూడ దనిన్నీ కాదు.

ధనకత్వమూ నిర్ధనికత్వమూ లోకసామాన్యాలు.

మరి కవి?

లోకాతీతుడు.

కనక

ధనసంపాదన కవికి ధ్యేయం కాగూడదు.

కవికే కాదు, ధనసంపాదన యే కళావేత్తకూ ధ్యేయం కాగూడదు.

నిశ్చింతగా – చిన్న యెత్తున అయినా అతనికి కాలక్షేపం జరిగిపోవాలి – అంతే.

పంచభక్ష్య పరమాన్నాలే అక్కర్లేదు, చారునీళ్ళతో

కాలక్షేపం చేసిన్నీ ఉద్గ్రంథాలు రచించగలడు కవి.

దారిద్ర్యమూ ఐశ్వర్యమూ కూడా ప్రేరకాలూ కాలేవు, భంజకాలూ కాలేవు కవిత్వానికి.

టాగూరు జమీందారు కనుకనే - సాంసారికా లైన వడిదుడుకు లెరగనివాడు కాబట్టే అలాంటి ఉద్గ్రంథాలు రచించగలిగాడనీ, నోబిలుబహుమానమున్నూ గడించు కోగలిగాడనీ అనుకుంటాడనుకర్త.

కవితాసమాధిలో కూచున్నాడా - సరి అయిన తాదాత్మ్యం సిద్ధించిందా, ఇక అతనికి భోగాలమీదికి దృష్టి పోదు, కష్టాలూ కనపడవు.

నీరసం వచ్చి చెయ్యి ముడుచుకుపోగూడదు, పేగులు మాడి దృష్టి చెదిరిపోగూడదు, ఈ ప్రతిబంధకాలు కలక్కుండా వుండడానికే కవి కాహారం.

ధనికు డైనవాడి కయినా కవితావేశం కలిగినప్పుడిదే ప్రవృత్తి.

పర్సులో (బహూమితంగానే) డబ్బుండినా, దృష్టి రచనావ్యగ్రవై కదలలేక - కలమూ కాగితాలూ కిందబెట్టలేక, కూరల కోసం బజారుకి వెళ్ళాలన్న స్ఫురణే కలక్క, ''కూరగాయలేవీ లేవు మరి'' అంటూ వంటింటోనుంచి కేక వినవచ్చినా ప్రకృతిలో పడలేక, వేళకి మాత్రం పీటమీదికి వెళ్ళి - ఆ పూటకు పూర గాయలతోనూ, చారు మజ్జిగలతోనూ భోజనం అయిందని పించుకుని చెయ్యి ఆరడం తడువుగా మళ్ళీ కలంపట్టి, దాంతో, ప్రపంచం మరిచిపోయిన సందర్భా లెన్నో వున్నాయి, నా జీవితంలో.

“ఏదో” రాయకుండా వుండలేని నా స్థితే యిలా వుండగా, పద్యబంధం చేసినా వచనరచనే చేసినా మహాకవులే అయివుండినవారి స్థితి యెలా వుండనూ?

తెలుసుకోగలిగితే, ఈ భౌతిక దేహం నిలుపుకోగలగడానికి ఫలానా మాత్రమే అగత్యం అన్న నిర్ధారణ లేదు.

వేషం విషయమై కూడా అంతే.

ఉజ్వలవేషంతో వీధిలోకి వస్తాడు కవి, ఒక్కొక్కప్పుడు.

ఎంత డాబురా అనుకుంటా డల్పబుద్ధి.

చింకిపాతలతో కనపడతాడు కవి, మరొక్కొక్కప్పుడు.

“వో-ట్టి దరిద్రుడు” అనుకుంటుంది మాయలోకం.

పరిశీలిస్తే, ఆ భావనా యీ ఘోషణా కూడా అవివేకజన్యాలే.

ఏమంటే?

అతను మహర్షి అనడానికి నిదర్శనం అది.

ఆ చీనీ చీనాంబరాలూ ఆ చింకి పాతలూ కూడా అతని ఇచ్ఛాపూర్వంగా కావు.

లోకంలో శరీరధర్మాలు కొన్ని వున్నాయి.

సంసారంలో వున్నప్పుడు అవి తప్పవు.

కాని, కవి అయినవాడికి అవి గడిచిపోవడమే ప్రధానం.

కవితావేగాని కవి అడ్డంకులు కాలేవు.

భిల్లాంగనతో మన్మథ తంత్రంలో మునిగిపోయివుండిన వాల్మీకే రామాయణం రచించాడు.

గాఢారణ్యాల్లో తపోనిష్ఠుడయివుండిన కృష్ణ ద్వైపాయనుడే మహాభారత గాథలో ప్రముఖపాత్ర అయినాడు.

అంటీ అంటని మహాకవుల యీ అవస్థ, లోకం బోధపరుచుకోనూ లేదు, అనుసరించా లేదు.

''ఆయన దరిద్రుడే; కాని సకలసంపదలకూ కారణభూతుడు. వల్లకాటిలోనే తిరుగుతూ వుంటాడు; కాని త్రిలోకాలకూ నాథుడాయన. భయంకరంగా కనబడతాడు; కాని శుద్ధసౌమ్యుడు” అంటూ నిర్వచించి “మహేశ్వరుడి యాథార్థ్యం తెలిసినవారు లే” రంది తపోనిష్ఠురాలయిన పార్వతి.

కవి యాథార్థ్యమూ అలాంటిదే.

మహామహావ్యాఖ్యాతలున్నూ నిర్ధారణ చెయ్యలేకుండా వున్నా రది.

మనిషి యెంత నిర్లిప్తుడు కావచ్చునో అంత నిర్లిప్తుడూ కాగలడు, ఎంత లిప్తుడు కావచ్చునో అంత లిప్తుడూ కాగలడు కవి.

ఇచ్ఛామాత్రా లతనికా అవస్థలు.

అతని చూపుమాత్రం యే అవస్థలోనూ వొకటే.

అది క్రాంతదర్శిత.

కనకనే ఆకాశసౌధాల్లో విహరించే ఆగర్భ శ్రీమంతుల భోగభాగ్యాలూ వర్ణించగలడు, ఎలకల కలుగులవంటి చుట్టుగుడిసెల్లో తల దాచుకునే కటికదరిద్రుల యమ యాతనలూ చిత్రించగలడు, కవి.

సుఖం వచ్చినా దుఃఖం వచ్చినా మరి దేనిమీదికీ దృష్టి

పోదు, మనిషికి.

రకంలో భిన్నమే గాని రాశిలో అలాంటి మనోధర్మమే కవిదిన్నీ.

అయితే, జీవయాత్రలో భంగపాటు తటస్థపడితే, ప్రపంచం మునిగిపోయినట్టు గోలపెట్టేస్తాడు మామూలు మనిషి.

కాయికంగా బాధపడుతూ, మానసికంగా నిర్వికల్పు డయిపోతాడా స్థితిలో కూడా, కవి.

అతని తాదాత్మ్యతకు నిదర్శనం అది.

రసలోలుపత అలాంటి విశిష్టత కలిగిస్తుం దతనికి.

"రసో వై సః"

నిజవేం; కాని రసనిష్ఠ రసికునకూ కలుగుతుంది, కవి యెక్కువ ఏమిటీ? అంటే, అంతానూ.

ఒకమాటలో చెప్పాలంటే రసికుని రసనిష్ఠ యేకదేశం.

రసికుడైనవానికి, కవి రచనలో, వొకప్పుడొక వాక్యంతో – లేదా వొక పద్యంతో బుద్ధి చమత్కృతం అవుతుంది.

హృదయం స్పందిస్తుంది.

ఆనందమున్నూ అనుభూతం అవుతుంది, దాంతో.

మరి, మరొకప్పుడు?

తక్కిన వాక్యాల – లేక – పద్యాల మాట?

ఏ రసికుడూ కూడా "ఈ కావ్యంలో యిక్కడే వుంది, ఇంతే వుంది రసం" అంటూ నిర్ధారణా చెయ్యలేదు, దానికి పరిమితీ కట్టలేదు.

ఏమంటే?

ఈశ్వరసృష్టివంటిది కవి సృష్టి.

కాళిదాసు రచనల కెందరో వ్యాఖ్యానాలు చేశారు.

ఎందరో యెన్నో సారస్యాలు తీశారు.

పూర్తి చెయ్యగలిగారా?

ఇంకా యింకా యెందరో కొత్త అందాలు చూపగలుగుతూనే వున్నారేం?

అయినా, యింకా ఏదో నిగూఢంగా వుండి పోయినట్టే అనిపిస్తోందేం?

కవికీ రసికునకూ వుండే అంతరం అదిగో, అది.

రసికుని సత్తా సావధికం.

కవి సత్తా నిరవధికం.

ఇంతేకాదు.

అతనిది భౌతికం.

ఇతనిది ఆధ్యాత్మికం.

ఇంతమాత్రమున్నూ కాదు.

అఖండ గోదావరిలో జలపానం చేసే చలిచీమదీ, కవి రచనలో రసం ఆస్వాదించే రసికుడిదీ వొక్కటే అంతస్థు.

ఎంచేతనంటే?

రసికుడు రసపిపాసి మాత్రమే.

కవి రసస్రష్ట.

కాని ధనలోభం పుట్టిందా, కవి కి యీ శక్తి సన్నగిల్లి పోతుంది.

అటు దౌర్బల్యమూ ఇటు పతనమూను దీంతో, కవికి.

ఇలాంటిది తటస్థించకుండా వుండాలంటే, రసికు లైనవారు కవిని కనిపెట్టుకుని వుండాలి, సర్వకాల సర్వావస్థల్లోనూ.

కవికి, తన గ్రంథాలు స్వయంగా అచ్చువేయించుకునే దౌర్భాగ్యం పట్టకుండా చూడాలి.

చూడాలి కాదు, చూసుకోవాలి.

**రసికుడు రసపిపాసి మాత్రమే.
కవి రసస్రష్ట.
కాని ధనలోభం పుట్టిందా,
కవి యీ శక్తి సన్నగిల్లి పోతుంది.
అటు దౌర్బల్యమూ, ఇటు పతనమూను
దీంతో, కవికి. ఇలాంటిది
తటస్థించకుండా వుండాలంటే,
రసికు లైనవారు కవిని కనిపెట్టుకుని
వుండాలి, సర్వకాల సర్వావస్థల్లోనూ.
కవికి, తన గ్రంథాలు స్వయంగా
అచ్చువేయించుకునే దౌర్భాగ్యం
పట్టకుండా చూడాలి.**

అంతమాత్రమే చాలదు.

కవిని ఆరాధించాలి.

కవిని అందలా లెక్కించాలి.

కవికి కనకాభిషేకం చెయ్యాలి.

ఇంతా చేస్తే కవి కిది "పత్రం పుష్పం ఫలం తోయ"మున్నూ మాత్రమే.

ఇక రసికులకా, ఇదే పరాయణం.

**శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి**
**అనుభవాలూ-జ్ఞాపకాలు నుండి....**

### ఇందూరు సీమ

# చారిత్రక వైభవం

– కొసరాజు వెంకటేశ్వరరావు

దక్కను పీఠభూమిలో ఇందూరు సీమకు ఘనమైన చారిత్రక వైభవం వున్నది. ఇందూరుకు ఆ పేరు ఎట్లా వచ్చిందో చరిత్రకారుల మధ్య భిన్నాభిప్రాయాలు వున్నాయి. ఇందూరు సీమ (77$^{0}$.40'–58' ఉ. అక్షాంశం. 18$^{0}$.05'–19' తూ. రేఖాంశం) దక్షిణాన మెదక్ జిల్లా, పశ్చిమాన నాందేడు (మహారాష్ట్ర), బీదరు (కర్ణాటక) జిల్లాలు, తూర్పున కరీంనగర్ జిల్లా, ఉత్తరాన ఆదిలాబాద్ జిల్లా హద్దుల మధ్య వున్న ప్రాంతం. ఇందూరును 1876లో అప్పటి నిజాం ప్రభువు మీర్ మెహబూబ్ అలీఖాన్ (క్రీ.శ. 1869–1911) జిల్లాగా చేసి, తిరిగి 1905 సం॥లో నిజామాబాద్ జిల్లాగా మార్చారు. ఈ జిల్లా వైశాల్యం 8.04 కి.మీ. ఈ ప్రాంతానికి క్రీస్తుపూర్వం నుండే ఎంతో ఘనమైన చరిత్ర వున్నది. గోదావరి ఉపనదిగా పిలువబడే మంజీర నది, ఈ జిల్లాలో కందకుర్తి అనే గ్రామం వద్ద గోదావరిలో కలుస్తుంది. ఈ జిల్లాలో ప్రవహిస్తున్న గోదావరి (113 కి.మీ.), మంజీర నది లోయలలో కొన్ని వేల సంవత్సరాల క్రితమే ఆదిమానవుడు నివసించినట్లుగా, అతను తయారు చేసి ఉపయోగించిన, రాతి పనిముట్ల ద్వారా తెలుస్తున్నది. ఈ జిల్లాలో మాహూర్, కొల్లాపూరు, రత్నాపూర్, ఎల్లారెడ్డిపేట మొదలైన ప్రదేశాలలో రక్కసి గుళ్ళు లేక రాకాసి గుళ్ళు (రాతి సమాధులు) వున్నట్లుగా పురాతత్వ శాస్త్రజ్ఞులు నిర్ధారించారు. ఈ రాతి సమాధులు లోహ యుగానికి సంబంధించినవి. సరైన (శాస్త్రీయ) అన్వేషణ నిర్వహిస్తే ఇంకా అనేక ప్రదేశాలలో రాతి యుగానికి, లోహ యుగానికి సంబంధించినవేకాక చారిత్రక యుగానికి చెందిన అనేక ప్రాచీన అవశేషాలు వెలుగులోకి వస్తాయనటంలో ఏమాత్రం సందేహం లేదు.

క్రీ.పూ. 6వ శతాబ్దంలో భారతదేశంలో వున్న షోడశ (పదహారు) మహా జనపదాలలో ఒకటైన అస్మక లేక అశ్మక (నేటి కరీంనగర్, ఆదిలాబాదు, నిజామాబాదు జిల్లాలు వున్న ప్రాంతం) రాజ్యంలో ఇందూరు సీమ కూడా భాగంగా వుండేది. ఈ అస్మక్ మహా జనపదానికి పోతలి లేక పోదన (ఇప్పటి బోధన్) రాజధానిగా వుండేది. గౌతమ బుద్ధుని జీవిత కాలంలోనే బౌద్ధమతం అస్మక రాజ్యంలో ప్రవేశించిందని బౌద్ధ ధర్మ గ్రంథాలు ఎంతో సమాచారాన్ని మనకు అందచేశాయి. బుద్ధఘోషుని "పరమాత్మక జ్యోతిక" అనే బౌద్ధ గ్రంథం ప్రకారం కోసల మహా జనపదకు చెందిన బావరి అనే బ్రాహ్మణుడు బుద్ధుని జీవిత కాలంలోనే ఉత్తర దేశాన్నుండి చాలా దూరంలో వున్న అస్మక మహా జనపదానికి వచ్చి గోదావరిలో వున్న కవితవనం (దీనినే బాదనకుర్తిగా చరిత్రకారులు గుర్తించారు) అనే ద్వీపంలో కుటీరం నిర్మించుకుని యజ్ఞ యాగాదులు నిర్వహిస్తూ ఉంఛ వృత్తిపైన జీవిస్తూ ధర్మం తెలిసిన పరిపూర్ణ వ్యక్తిగా గౌరవించబడేవాడట. ఆయన బుద్ధుని గురించి విని ఆయన బోధనలు విని, వాని దార్శనిక స్థాయిని పరిశీలించి రావలసినదిగా, దారి, డొంక లేని ఉత్తర దేశానికి తన శిష్యులను పంపించాడని బౌద్ధ పాళీ త్రిపీటక "సుత్తనిపాత"లోని పారాయణ వర్గ పేర్కొన్నది. ఆ సమయంలో బుద్ధుడు రాజగృహం (బీహారు రాష్ట్రం)లోని వేణువనంలో ధర్మాన్ని బోధిస్తున్నాడట. బుద్ధుని బోధనలకు ఆకర్షితులైన బావరి శిష్యులు కొందరు ఆయన వద్దనే వుండిపోగా పింగియ అనే శిష్యుడు మాత్రం అస్మక దేశానికి తిరిగివచ్చి బావరికి బుద్ధ ధర్మాన్ని వివరించగా ఆయన ధర్మసాక్షాత్కారం పొంది అర్హంతుడైనాడని బౌద్ధగ్రంథాలు తెలియచేస్తున్నాయి. బుద్ధుని శిష్యాగ్రగణ్యులలో ఒకరైన మహాకాత్యాయనుడు అస్మక దేశపు రాజైన సుజాతునికి క్రీ.పూ. 527లో ప్రవ్రజ్య ఇచ్చినట్లుగా, సుజాతుడు మరియు అతని కుమారుడు బౌద్ధ ధర్మం స్వీకరించినట్లుగా బౌద్ధగ్రంథం *విమానవత్తు వ్యాఖ్యానం* తెలియజేస్తున్నది. బౌద్ధం తెలుగు ప్రజల జీవితాన్ని ఎంత ప్రభావితం చేసిందో, వారు బౌద్ధానికి ఏ విధంగా హారతి పట్టారో, ఆ ధర్మాన్ని ఎంతగా ఆదరించారో, అనుసరించారో చెప్పటానికి తెలుగు నేలలో అడుగడుగునా వారు నిర్మించిన బౌద్ధ స్థూపాలు, విహారాలు, ఆరామాలే ప్రత్యక్ష సాక్షులు అని ఘంటాపథంగా చెప్పవచ్చును. ఉత్తర దేశాన్నుంచి

ఆంధ్రదేశానికి సరైన దారి ప్రయాణ సాధనాలు లేని ఆ రోజుల్లోనే తెలుగు ప్రజలు స్వాగతం చెప్పినట్లుగా బౌద్ధ గ్రంథాలు తెలియజేస్తున్నాయి. వజ్రయాన మాధ్యమిక యోగాచార మూలపురుషుడైన మైత్రేయనాథుడు పోతలిపురం (బోధన్) నివాసి అని డా॥ బి.యన్. శాస్త్రిగారు తన *తెలంగాణ శాసనాలు* అనే గ్రంథంలో అభిప్రాయపడ్డారు.

ఇందూరు సీమ చరిత్రను గురించి అనేక గ్రంథాలు ప్రచురించబడినాయి. యన్. రఘురామశర్మ గారు సంపాదకులుగా ప్రచురించిన *ఇందూరు సీమ విజ్ఞాన సర్వస్వం* అనే గ్రంథం, నిజామాబాద్ జిల్లా చరిత్రను రచించిన గిరి నాగభూషణం గారి చరిత్రలో నిజామాబాద్ జిల్లా డి. రాజేశ్వర శర్మ గారి *చరిత్ర పుటలు*, జిల్లా రచయితల సంఘం వారిచే ముద్రించబడిన "నిజామాబాదు (ఇందూరు) జిల్లా *సాహిత్య-సాంస్కృతిక చరిత్ర*", కందకుర్తి యాదవరావు గారి పుస్తకం *చరిత్ర పరిశోధన వ్యాసావళి* (ఇందూరు) పుస్తకం, కె. నరేష్ కుమార్ గారి ఆధ్వర్యంలో ఇతిహాస సంకలన సమితి వారు ముద్రించిన *నిజామాబాద్ జిల్లా చరిత్ర అనే వ్యాసాలు,* సిద్ధ సాయిరెడ్డి గారి *నిజామాబాద్ జిల్లా చారిత్రక వైభవం* పుస్తకం, డా. ఈమని శివనాగిరెడ్డి గారి *తెలంగాణాలో బౌద్ధం* అనే పుస్తకం *తారిఖ్.ఇ.ఇందూరు* అనే ఉర్దూ పుస్తకంలో, నిజామాబాద్ జిల్లా గజెటీరు గులాం అహ్మద్ గారి *హాలాతే నిజామాబాద్,* మరికొన్ని పుస్తకాలు నిజామాబాద్ జిల్లా చరిత్రను తెలియజేస్తున్నాయి. సిద్ధ సాయిరెడ్డి జిల్లాలో ప్రతి వూరు తిరిగి పురాతన కట్టడాల విశేషాలను తన పుస్తకంలో నిక్షిప్తం చేశారు. ఇన్ని గ్రంథాలు ఇందూరు జిల్లా చరిత్రను వెలుగులోకి తెచ్చినప్పటికీ ఇంకా ఎంతో చరిత్ర మరుగున పడివున్నది అని నిస్సందేహంగా చెప్పవచ్చును.

ఈ ఇందూరు సీమను నాగులు, నందులు, మౌర్యులు, శాతవాహనులు, బాదామి చాళుక్యులు, రాష్ట్రకూటులు, బోధన్, వేములవాడ చాళ్యుకులు, కల్యాణి చాళుక్యులు, యాదవరాజులు, కాకతీయులు విజయనగర రాజులు, బహమనీలు, కుతుబ్‌షాహీలు, మరాఠా, మొగలులు మరియు అసఫ్‌జాహి (నిజాం నవాబులు) రాజులు పరిపాలించినట్లుగా వారు కట్టించిన అనేక ప్రాచీన కట్టడాల ద్వారా, వేయించిన శాసనాల ద్వారా, వారు ముద్రించిన నాణేలద్వారా, గ్రంథాల ద్వారా తెలియవచ్చింది. వీరి సామంతులుగా అనేకమంది జమీందార్లు, దేశ్‌ముఖ్‌లు, రెడ్డి రాజులు, రాణులు కూడా ఇందూరు సీమను పరిపాలించారు. ఈ ప్రాంతాన్ని "మంజీరక దేశము"ని, "సపాదలక్ష" ప్రాంతంగా పిలిచేవారు. ఈ జిల్లాలో అనేకచోట్ల బౌద్ధమతానికి సంబంధించిన ప్రాచీనావశేషాలు మనకు దర్శనమిస్తాయి.

శాతవాహనుల మొదటి రాజధాని అయిన కోటి లింగాల (కరీంనగర్ జిల్లా) నుండి రెండవ రాజధాని అయిన ప్రతిష్టానపురం (మహారాష్ట్రలో పైఠాన్)కు వెళ్ళే రాజమార్గం ఇందూరు సీమ ద్వారా వెళ్తుంది. అస్మకదేశానికి రాజధాని అయిన పోతలి నగరంలో బౌద్ధమతానికి సంబంధించిన అవశేషాలు లభించకపోవటం ఆశ్చర్యం కలిగిస్తున్నది. అస్మక దేశపు రాజు బౌద్ధమతాన్ని స్వీకరించినందువలన ఆయన బౌద్ధమతాన్ని ప్రచారంచేసి బౌద్ధ స్థూపాలను నిర్మించే వుంటాడు. కానీ బోధన్ (పౌదనాపురం లేక బహుధాన్యపురం) లో చేసిన త్రవ్వకాలలో రోము దేశపు వెండి నాణాలు, మహా జనపదానికి చెందిన నొక్కుడు నాణాలు (పంచ్ మార్క్‌డు నాణాలు), శాతవాహనుల సీసపు నాణాలు, ఆ కాలంనాటి మట్టిపాత్రలు మాత్రమే లభించినట్లుగా తెలుస్తున్నది. బోధనుకు ఎంతో చారిత్రక ప్రాధ్యాన్యత, వున్నప్పటికీ బౌద్ధమతానికి సంబంధించిన ఎక్కువ అవశేషాలు లభించలేదు. బోధన్ పాతనగరంలో బుద్ధుని విగ్రహాలు కొన్ని సంవత్సరాల క్రితం వరకు వుండేవని సాయిరెడ్డిగారు తన పుస్తకంలో తెలియచేశారు. బహుశా ఆ విగ్రహాలు నాశనం అయినా చేయబడి వుండాలి లేక అవి దొంగిలింపబడి అయినా వుండి వుండాలి.

బోధనులో రాకాసి పేట ప్రాంతంలో త్రవ్వకాలు జరిపితే మంచి ఫలితాలు లభిస్తాయనడంలో ఎట్టి అనౌచిత్యము లేదు. బోధను పట్టణం చుట్టూ మట్టితో నిర్మించిన కోట వున్నట్లుగా ఇప్పటికీ ఆనవాళ్ళు కనిపిస్తాయి. గ్రీకు రాయబారి మెగస్తనీసు తన గ్రంథం *ఇండికా* లో ఆనాటి ఆంధ్రదేశంలో 30 పైగా ప్రాచీన దుర్గాలు వున్నవని తెలియజేశాడు.

అస్మక దేశ రాజధాని అయిన పోదనలో మట్టితో నిర్మించిన కోట కూడా మెగస్తనీసు పేర్కొన్న దుర్గాలలో ఒకటి అయివుండవచ్చును. బోధనులో లభించిన రోము దేశపు నాణాలు, మృణ్మయ పాత్రలు ఇతర అవశేషాలనుబట్టి ఈ ప్రాంతం గోదావరి నది, బంగాళాఖాతం ద్వారా రోము దేశంతో వర్తక వాణిజ్యాలు నిర్వహించినట్లుగా స్పష్టం అవుతున్నది.

సిద్ధ సాయిరెడ్డి గారు ఇందూరులో వున్న నీలకంఠేశ్వర

ఆలయం, బౌద్ధ స్థూపం పునాదులపైన నిర్మించబడిందని, శాతవాహన రాజు రెండవ శాతకర్ణి ఆ స్థూపాన్ని నిర్మించి వుంటాడని తన పుస్తకంలో తెలియచేశారు. ఆయన ఏ ఆధారాలపైన ఈ అభిప్రాయానికి వచ్చినాడో తెలియదు. సంతాయిపేట మురళీధర రావు తన వ్యాసంలో నిజామాబాద్ జిల్లాలో వున్న బౌద్ధ అవశేషాలను గురించి చర్చించారు. మాజీ పార్లమెంటు సభ్యులు శ్రీ బాలాగౌడ్ గారి ప్రోత్సాహంతో కొన్ని సంవత్సరాల క్రితం లింగంపేట - పోల్కంపేట (కామారెడ్డి మండలం) గ్రామాలలో జరిపిన అన్వేషణలో బౌద్ధశిథిలాలు కనిపించాయట. కానీ వాటి పూర్తి వివరాలు తెలియరాలేదు. నిజామాబాద్ జిల్లాలో ధర్మవరం లేక ధర్మారం (దమ్మవరం) అనే పేరుతో వున్న గ్రామాలు అనేకం వున్నాయి.

ఈ గ్రామాలలో ఒకప్పుడు బౌద్ధధర్మ అవశేషాలు తప్పనిసరిగా వుండివుంటాయి. పిల్లి రాంబాబు గారు తన గ్రంథం *ఆంధ్ర దేశంలో బౌద్ధ వైభవంలో* ఈ జిల్లాలో అనేక బౌద్ధస్థూపాలు, విహారాలు ఆ తరువాతికాలంలో హిందూ దేవాలయాలుగా రూపాంతరం చెందాయని అభిప్రాయపడ్డారు. ఆయన అభిప్రాయం ప్రకారం నీలకంఠేశ్వర దేవాలయం రెండవ శాతకర్ణిచే నిర్మింపబడిన బౌద్ధారామమని, కాకతీయులు దీనిని శివాలయంగా మార్చినారని, బుద్ధపూర్ణిమ (వైశాఖ శుద్ధ పూర్ణిమ) రోజునే ఈ దేవాలయంలో ఉత్సవాలు జరుపుతారని ఆయన పేర్కొన్నారు.

భీంగల్ మండలంలోని నీలాంచల (లింబాద్రి) కొండపైన అనేక బౌద్ధస్థూపాలు, విహారాలు, అలీసాగర్-నిజాం సాగర్ మార్గంలో వున్న అడవిలో బౌద్ధారామాలు, బుద్ధుని విగ్రహాలు, నీటితొట్టెలు, ఆర్మూరు (ఆరమూరు=ఆరామం వున్న వూరు అని అర్థం) పట్టణానికి ఆనుకుని వున్న సిద్ధులగుట్ట ఒక బౌద్ధ క్షేత్రమని, ఆ కొండపైన చైత్యశిథిలాలు, గుహాలయాలు, బౌద్ధులు నిర్మించిన రాతిమెట్లు, ఒక గుహలో రాతిస్థూపం వున్నాయని రాంబాబు గారు అభిప్రాయపడ్డారు. మామూలుగా జైనమునులను సిద్ధులు అని అంటారు. కనుక సిద్ధులగుట్ట బహుశా జైనక్షేత్రం అయివుంటుందేమో పరిశీలించవలసి వుంటుంది. బోధన్‌లోవున్న ఏక చక్రేశ్వరాలయం వున్న ప్రదేశం ఒకప్పటి బౌద్ధారామం అని, స్థానిక రైతు 1959లో తన పొలంలో దుక్కి దున్నుతుండగా ధర్మచక్రం, ఏకశిలా నిర్మితమైన ఆరామం, స్థూపం, నాణాలు బయటపడినట్లు, భిక్నూరు (భిక్షులు లేక భిక్షువులు, వుండే వూరని అర్థం) మండల కేంద్రానికి రెండు కి.మీ. దూరంలో 7వ జాతీయ రహదారి పక్కనే వున్న ప్రాచీన బౌద్ధారామమే ఇప్పుడు సిద్ధిరామేశ్వరాలయంగా పిలవబడుచున్నది. బౌద్ధ సాహిత్యంలో అత్యంత ఉన్నతమైన గ్రంథాన్ని భిక్షువులు ప్రజల సందర్శనార్థం ఊరేగించేవారని స్థానికులు తెలియచేశారని రాంబాబు తన గ్రంథంలో తెలియచేశారు. ఈ జిల్లాలో శాస్త్రీయ అన్వేషణలు జరిపినట్లయితే ఇంకా అనేక బౌద్ధస్థూపాలు, విహారాలు ఆరామాలు వెలుగులోకి వస్తాయనటంలో ఎట్టి సందేహమూ అవసరం లేదు. రాష్ట్ర పురావస్తు, సంగ్రహాలయాల శాఖవారు ఆ ప్రయత్నం చేస్తారని ఆశిద్దాం.

ఈ జిల్లాకు ఇందూరు లేక ఇందూరుపురము అనే పేరు ఎలా వచ్చినదో చరిత్రకారుల మధ్య భిన్నాభిప్రాయాలు వున్నాయి. క్రీ.శ. 5వ శతాబ్దపు రెండవ అర్థభాగంలో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన త్రైకూటక రాజు ఇంద్రదత్తుని పేర ఇందూరుపురము అనే పురు వచ్చివుంటుందని కొందరు చరిత్రకారుల అభిప్రాయం కాగా, ఇంకొందరి చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం రాష్ట్ర కూటరాజు మూడవ ఇంద్రుని (క్రీ.శ. 915-917) పేరనే ఇందూరు అనే పేరు వచ్చిందట. ఏదిఏమైనా రాష్ట్ర కూటులకు ఇందూరు జిల్లాకు అవినాభావ సంబంధము వున్నది. రాష్ట్రకూటుల రాజధాని మాల్ఖేడు (గుల్బర్గాజిల్లా) కాగా పౌదనాపురము వారి ఉపరాజధానిగా వుండేది. మూడవ ఇంద్రుడు బోధన్ నగరంలో ఇంద్రనారాయణ దేవాలయాన్ని కౌలాస్, నిజామాబాద్‌లో కోటను, అలీసాగర్-నిజాంసాగర్ మార్గంలో వున్న అడవిలో వున్న బౌద్ధారామాన్ని నరసింహాలయంగా మార్చాడని సాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర కూటులు జైన మతాన్ని కూడ ఆదరించి అనేక జైన దేవాలయాలు నిర్మించినట్లుగా చరిత్ర తెలియచేస్తున్నది. ఆచార్య జైకిషన్‌గారు ఈ ప్రాంతంలో అతి ప్రాచీన కాలము నుండి ఇనుము ఎక్కువగా లభిస్తున్నందున, దీనిని ఇనుమూరు అని పిలిచేవారని అదే క్రమేణా ఇందూరుగా మారి వుండవచ్చని అభిప్రాయపడ్డారు.

ఈ పై సిద్ధాంతాలతో మూడవ ఇంద్రుని పేర ఇందూరు పురము లేక ఇందూరు అనే పేరు సహేతుకముగా వున్నట్లుగా అనిపిస్తున్నది. ఇందూరు సీమకు, రాష్ట్రకూట రాజులకు అవినాభావ సంబంధం వున్నది. వీరు తమ సామంతులైన బోధన్ చాళుక్యులతో కలిసి జిల్లాలో అనేక జైన దేవాలయాలు నిర్మించినట్లుగా వాస్తుశైలి తెలియజేయుచున్నది. వీరి

పాలనాకాలములో బోధన (బోధించు ప్రదేశం అని కూడా అర్థం వున్నది) పట్టణము పెద్ద విద్యాకేంద్రముగా వుండేదని చరిత్ర తెలియజేస్తున్నది. ఇక్కడ జైన విశ్వవిద్యాలయము వుండేదని, చంద్రప్రభ ఆచార్యులుగా వుండేవారని, వీరు భారతదేశపు ఇతర ప్రాంతాల నుండి వచ్చి ఈ విశ్వవిద్యాలయములో చదువుకునే విద్యార్థులకు విద్యను బోధించినట్లుగా తెలుస్తున్నది. రాష్ట్రకూట రాజులు క్రీ.శ. 9, 10 శతాబ్దాలలో అనేక ప్రజాహిత కార్యాలు నిర్వహించి, జిల్లాలో నీటిపారుదల వసతులు కల్పించి బోధన్ చుట్టుప్రక్కల పాడి, పంటల అభివృద్ధికి కారకులై, అనేక పంటలు పండించటానికి కారణమైనందువలననే బహుశా ఈ నగరానికి "బహుధాన్యపురము" అనే పేరు వచ్చి వుంటుందని చరిత్రకారుల అభిప్రాయం. వీరు అనేక జైన దేవాలయాలనేకాక ఇందూరు, బాల్కొండ, కౌలాస్ కోటలను నిర్మించారు. వీరు నిర్మించిన జైన ఆలయాలు, జైన బసదులు బోధన్, భీంగల్, ఇందూరు, జుక్కల్ మొదలైన గ్రామాలలలో వున్నాయి. వీరు జైన దేవాలయాలకు బసదుల ధూప, దీప, నైవేద్యాల నిర్వహణకు అనేక భూదానములు చేసినట్లుగా వారి శాసనాల ద్వారా తెలుస్తున్నది. జైన తీర్థంకరుల చిత్రాలు అనేక దేవాలయాలపై మనకు దర్శనమిస్తాయి. బోధన్ పట్టణంలోను, జిల్లాలోని పరిసర ప్రాంతాలలోను అనేక జైన విగ్రహాలు ముక్కలు చేయబడి చెల్లాచెదురుగా కనిపిస్తాయి. బోధన్, ఇందూరు, బినోల, మగ్గిడి, బడా భీమ్‌గల్, ఎడపల్లి, బోర్లాం, రాజంపేట్, నావనంది, సిరికొండ, సంతాయిపేట, లింగంపేట, డిచ్‌పల్లి, ఎల్లారెడ్డి, బండరామేశ్వర్‌పల్లి, లోలం మొదలైనవి ఈ ఇందూరు జిల్లాలో జైన క్షేత్రాలుగా వర్ధిల్లాయి. బోధన్ చాళుక్య రెండవ అరకేసరి ఆస్థాన పండితుడు పంపకవి బోధన్‌లో *విక్రమార్క విజయం* అనే కన్నడ భారతము మరియు *ఆదిపురాణం*ను రచించాడు. క్రీ.శ. 11వ శతాబ్దంలో పోదననాడులో వున్న ఆచార్యుడు నగనంది భట్టారకుని శిష్యుడు గంధావిముక్త భట్టారకుడు బహుధాన్య నగరంలో, సమాధి చెందినట్లు చరిత్ర తెలియచేస్తున్నది. పంపకవి, రన్న, పొన్నలు బోధన్‌లో వున్న విద్యాకేంద్రంలో ఆచార్యులుగా వున్నారని సాయరెడ్డి తన గ్రంథంలో తెలియజేశాడు. పంపకవిసమాధి బోధన్ నగరంలో వున్న విషయం అందరికీ తెలిసిందే.

ఇందూరు సీమలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శి మతాలకు సంబంధించినవారే కాక లంబాడి, కచ్చి, ఆదివాసి, గిరిజన తెగల జాతులవారు వున్నారు. తెలుగు, ఉర్దు, మరాఠీ, కన్నడ, ఖత్రి, లంబాడి, కచ్చి, పంజాబి, మార్వాడి, గుజరాతి, రాజస్థాని, సింధీ, ఇంగ్లీషు, హిందీ మొదలైన భాషలు ఈ జిల్లాలో మాట్లాడబడే భాషలు.

ఇందూరు జిల్లాలో రాష్ట్రకూటులు, కల్యాణి చాళుక్యులు, వారి సామంతులు మరియు కాకతీయ రాజులు అనేక శివాలయాలు, వైష్ణవ దేవాలయాలు నిర్మించారు. వీటిలో రామాలయం (డిచ్‌పల్లి), నీలకంఠేశ్వరాలయం, రఘునాథ ఆలయం, బడా రామ్‌మందిరము (నిజామాబాదు), ఆంజనేయస్వామి మందిరము (సారంగపూర్), శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం (జానకంపేట), ఇంద్రనారాయణ చక్రేశ్వర ఆలయం (బోధన్), సోమలింగేశ్వర ఆలయం (దుర్కి), నగరేశ్వరాలయము (బిచ్కుంద), నీలకంఠేశ్వరాలయం (ఎల్లారెడ్డి), త్రిలింగరామేశ్వరాలయం (తాండూరు), సిద్ధరామేశ్వరాలయం (భిక్నూర్), లక్ష్మీనరసింహస్వామి ఆలయం (భీమ్‌గల్), మహాదేవుని ఆలయం (దోమకొండ) మొదలైనవి ముఖ్యమైన దేవాలయాలు.

ఈ జిల్లాలో వున్న ముస్లిమ్ నిర్మాణాలుగా దేవల్ మసీద్, ఆలంగీర్‌మసీద్ (బోధన్), సాదుల్లా హుసేన్ దర్గా (పెద్దగుట్ట) ముఖ్యమైన కట్టడాలు. ఈ జిల్లాలో ముఖ్యమైన కోటలు ఇందూరు, కౌలాస్, బాల్కొండ, సిర్నపల్లి, దోమకొండ, బోధన్‌లో వున్నాయి. క్రైస్తవుల చర్చిలు, నిజామాబాద్, ధర్మారం, డిచ్‌పల్లిలో వున్నాయి. సిక్కుల గురుద్వారా నిజామాబాద్‌లో వున్నది. ఈ జిల్లాలో శక్కరనగర్‌లో నిజాం చక్కెర కర్మాగారం, సారంగపూర్‌లో ఖండసారి చక్కెర కర్మాగారం, కామారెడ్డి దగ్గర గాయత్రీ చక్కెర కర్మాగారం ముఖ్యమైనవి. ఈ జిల్లాలో ముఖ్యమైన పంటలు వరి, చెరకు, జొన్న, గోధుమ, మక్కలు, పసుపు, సెనగ, వేరుసెనగ మొదలైనవి. ఈ జిల్లాలో అనేకమంది కవులు ఉన్నారు. వీరిలో కొరవి గోపరాజు ముఖ్యుడు. గోపరాజు రచించిన *సింహాసన ద్వాత్రింశిక* అనే గ్రంథం జిల్లాలో మొదటి తెలుగు గ్రంథంగా భావిస్తారు. గోపరాజు తన రచన ద్వారా ఇతర తెలుగు కవులకు మార్గదర్శకుడైనాడు. ఈ జిల్లాలో అనేకమంది స్వాతంత్ర్య సమరయోధులు దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని జైలు జీవితం అనుభవించారు. ప్రముఖ కవి దాశరథిని నిజాం ప్రభుత్వం నిజామాబాద్ జైలులో బంధించింది. ఇందూరు

జిల్లాలో అనేక (100 కు పైగా) శిలాశాసనాలు, రాగి రేకులపై వున్న శాసనాలు, తాళపత్ర గ్రంథాలు లభించినాయి. ఆ శాసనాలు సంస్కృతం, తెలుగు, కన్నడ, మరాఠీ, మోడి, దేవనాగరి, అరబ్బీ, ఉర్దూ భాషలలో ఉన్నాయి. పురావస్తు శాఖ వీనిలో కొన్నింటిని మాత్రమే ప్రకటించ గలిగింది. ఆ శాఖలో సహాయ నిర్దేశకులుగా పనిచేస్తున్న బ్రహ్మచారిగారు అనేక గ్రామాలలో శాసనాలను సేకరించి *నిజామాబాద్ జిల్లా శాసనాలు* శీర్షిక పైన శాసనాలను ముద్రించే ప్రయత్నంలో వున్నట్లుగా తెలుస్తున్నది. ఈ జిల్లాలో లభించిన శాసనాలు రాష్ట్రకూటుల, కళ్యాణి చాళుక్యుల బోధన్ మరియు వేములవాడ చాళుక్యుల, కాకతీయ, విజయనగర, మరాఠా, బహమనీ, తుగ్లక్ కుతుబ్‌షాహి, మొగలు వంశాలకు సంబంధించినవి. పశ్చిమ గాంగుల రాజు రాచమల్లుని సేనాని చాముండ రాయనిచే శ్రావణబెలగొళలో (హాసన్ జిల్లా కర్ణాటక)లోని కన్నడ శాసనంలో బోధన్‌ను అభినవ పౌదనపురము అనే ప్రస్తావన ఉన్నది. కళ్యాణి చాళుక్యుల శాసనాలు వర్ని, బోధన్, జుక్కల్, బానిసవాడ (బాన్సువాడ), పంటకుర్దు, దేశాయిపేట, వాజిద్‌నగర్, ఖుదావంద్‌పూర్, బిచ్కుంద, సెట్‌లూరులో లభించాయి. ఇవి తెలుగు-కన్నడ లిపిలో 11, 12 శతాబ్దాలకు చెందినవిగా శాసన పరిశోధకులు గుర్తించారు. కాకతీయుల సంస్కృతి, తెలుగులో వున్న శాసనాలు బాల్కొండ (గణపతి దేవుడు 1199-1261), బీర్కూరు, బండరామేశ్వరపల్లి, చిన్నమల్లారెడ్డి, కుప్రియాల్ గ్రామాలలో (రుద్రమదేవి 1261-1295) మరియు రెండవ ప్రతాపరుద్రుని శాసనం బిచ్కుందలో లభించాయి. పారశీ భాషలో వున్న మహమ్మద్ బిన్ తుగ్లక్ (1325-1351) శాసనం బోధన్‌లో వున్న దేవల్ మసీదులోను ఔరంగజేబు (1658-1707) అరబ్బి, పారశీ భాషలలోవున్న శాసనం బోధన్‌లోని అలంగీర్ మసీదులో లభించింది. ఇవేకాక రెడ్డి రాజుల, మోడి భాషలో వున్న శాసనాలు యాడారం, బిచ్కుంద, మద్నూర్, పెద్దకోడప్‌గల్ గ్రామాలలో లభించాయి. ఆధునిక యుగానికి చెందిన స్థానిక నవాబుల ఉర్దూశాసనాలు బోధన్ మరియు ఇతర ప్రాంతాలలో లభించాయి.

ఇందూరు సీమలో అనేక కాలాలకు చెందిన సీసపు, వెండి, బంగారు, రాగి నాణాలు లభించాయి. బోధన్‌లో నిర్వహించిన త్రవ్వకాలలో మౌర్యుల కాలం నాటి నొక్కుడు నాణాలు, శాతవాహనుల సీసపు నాణాలు, రోమను వెండి నాణాలు లభించాయి. 1977లో బోధన్‌లో పాండు చెరువు దగ్గరవున్న పంటకాలువ త్రవ్వుచుండగా బాలకృష్ణ, లక్ష్మి, గండబేరుండ ప్రతిమలు వున్న విజయనగర కాలంనాటి 52 బంగారు నాణాలు లభించాయి. వెల్లుట్ల, తగ్గెల్లి, నర్వ, మోతె గ్రామాలలో మొగలుల వెండి నాణాలు లభించాయి. 1987లో బోధన్‌లో బహమనీ కాలం నాటి వెండి, రాగి నాణాలు లభించాయి. ఇంకా అనేక చోట్ల చాలా నాణాలు లభించినట్లుగా తెలుస్తున్నది.

ఇందూరు జిల్లాలో దేవాలయాల చుట్టుప్రక్కల అనేక రాతి విగ్రహాలు వున్నట్లు వూరూరా తిరిగి నివేదిక తయారు చేసిన సిద్ధ సాయిరెడ్డి గారు తెలియజేస్తున్నారు. వీనిలో చాలా విగ్రహాలు సంఘవిద్రోహ శక్తుల చేతిలో నాశనం కాగా కొన్ని విగ్రహాలు సురక్షితంగానే వున్నాయి. ఈ రాతివిగ్రహాలు రాష్ట్రకూటుల, కళ్యాణి చాళుక్యుల బోధన్/వేములవాడ చాళుక్యుల, కాకతీయుల, విజయనగర రాజుల కాలానికి సంబంధించినవి. ఈ విగ్రహాలలో శివలింగం, నంది, నరసింహ, జైన తీర్థంకరులు, ఆంజనేయ, సప్తమాతృకలు కాలభైరవుడు, వీరగల్లు, వీరభద్రుడు, నాగనాగిని, గణేశుడు, దశావతారాల విష్ణు, పార్వతి ముఖ్యమైనవి. ఆలనాపాలనా లేని విగ్రహాలను ఇప్పటికైనా జాగ్రత్తగా నిజామాబాద్‌లో వున్న రాష్ట్ర పురావస్తు సంగ్రహాలయానికి తరలించి వాటిని భద్రపరచవలసిన అవసరం ఎంతైనా ఉంది. విశ్రాంత చరిత్ర ఉపన్యాసకుడు సిద్ధ సాయిరెడ్డి గారిని రాష్ట్ర పురావస్తు శాఖవారు తగిన ఉద్యోగం ఇచ్చి ఆయన ద్వారా ఎటువంటి రక్షణ లేని రాతి విగ్రహాలను సంగ్రహాలయానికి తరలించి సంవత్సర కాలం నుండీ మూసి వుంచిన సంగ్రహాలయాన్ని తిరిగి తెరిపించి విద్యార్థులకు, పురావస్తు పరిశోధకులకు, స్థానికులకు, తమ జిల్లా చారిత్రక వైభవాన్ని తెలుసుకోగలిగే అవకాశం కలిపించాలని స్థానికులు ప్రభుత్వం వారిని కోరుకుంటున్నారు.

ఈ వ్యాసం వ్రాయటానికి నాకు తగిన సమాచారాన్ని అందించిన మిత్రులు సిద్ధ సాయిరెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

**కొసరాజు వెంకటేశ్వరరావు**
**పురాతత్వవేత్త, నిజామాబాదు**

# తూర్పు యూరప్ కవిత్వం

*గత సంచిక తరువాయి ...*

*– ముకుంద రామారావు*

**సాండొర్ పెటోఫి (1823–1849) :** కొత్త కవిత్వ రచనాపద్ధతిని సృష్టించి, వారి పూర్వకవులకు పూర్తి భిన్నంగా కవిత్వం రాశారు. జాతీయకవిగా కొనియాడబడ్డారు. వీరి పురాణేతిహాసాలు – శక్తివంతమైన జానపద అంశాల, వైఖరుల, నిష్కళంక మానవ అనుభవాల కళాసౌందర్యాత్మకమైన వ్యక్తీకరణల మిశ్రమాలు. అవి – ప్రకృతి, సాధారణ మానవుల సుఖ దుఃఖాలు, వైవాహిక ప్రేమ, కుటుంబ జీవితం, దేశభక్తి మొదలైన విషయాలతో ప్రసిద్ధికెక్కాయి. వీరి భాష, మనశ్చిత్రాలు, జానపదాలు, హంగరీ ప్రాంతంలో బాగా పాదుకు పోయాయి. 1848–49 లలో హంగరీ స్వాతంత్ర్య సముపార్జనకోసం జరిపిన పోరాటంలో పాల్గొని, 31 జూలై 1849 నుండి కనిపించలేదు. బహుశ వీరిని సామూహిక సమాధుల్లో పూడ్చిపెట్టి ఉంటారని భావిస్తున్నారు.

**ఏమి లాభం :**

భూమిని దున్ని ఏమి లాభం
మొలకెత్తే విత్తనం లేకుండా
ఉపేక్షిస్తే కలుపుమొక్కలు లేస్తాయి
నీ శ్రమంతా వృధా అవుతుంది.....

**మిక్లోస్ రడ్నోటి (1909–1944) :** 21ఏళ్లకే వీరి మొదటి కవితా సంకలనం వెలువడి, వీరిని కవిగా హంగరీ గుర్తించేట్టు చేసింది. తీవ్రమైన నియంతృత్వ విరోధ కవి. మారణహోమం మీద రాసిన కవితల్లో వీరివి చాలా గొప్ప కవితలని చెబుతారు. హంగరీ సాహిత్యం మీద డాక్టరేట్ పొందారు. ఆఫ్రికన్ కవిత్వాన్ని, జానపదాల్ని హంగరీ భాషలోకి అనువాదం చేశారు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో వర్గిల్, రింబౌడ్, మల్లార్మే, ఎలువర్డ్, అపొల్లినర్ లాంటి వారి కవితల్ని అనువాదం చేశారు. రష్యన్ సైన్యం నుండి నాజీలు వెనుదిరిగి పోతున్నప్పుడు, నిర్బంధశిబిరంలో ఉన్నవారితో బాటు వీరినీ, హంగరీ యుగోస్లావియా గుండా కవాతు చేయించారు. ఆ కవాతు సందర్భంగా తాను చూసిన ఘోరాల్ని కవితల రూపంలో వీరు గ్రంథస్తం చేసుకున్నారు. అటువంటి వాటిల్లో చివరి కవిత ఈ క్రిందిది. అది రాసిన వెంటనే ఒక సైనికుడు తీవ్రంగా వీరిని కొట్టి, వీరితోబాటు నడవలేకపోతున్న 21 మందిని, 9 నవంబరు 1944న కాల్చి చంపారు. అప్పటి సామూహిక సమాధి తవ్వినప్పుడు, వీరి శరీరం మీద ఉన్న చిన్న పుస్తకంలో పెన్సిల్‌తో రాసి ఉన్న ఆ కవితలు దొరికాయి.

**చివరి కవిత :**

అతని పక్కన నేను కూలిపోయాను
ముందే అతని శరీరం బిగుసుకుపోయింది
తెగిపోయేముందు వింటినారిలా బిగువుగా
తలవెనక వేటువేయబడ్డాడు........

**ఆనా హంజల్ (1909–1977) :** కవయిత్రి, అనువాదకురాలు, యవజనులకోసం పుస్తకాలు రాసిన రచయిత్రి. సమకాలీన హంగరీ కవిత్వంలో వీరిది ప్రభావశీలమైన కవిత్వం. హంగరీ కవయిత్రులలో ప్రముఖమైన పాత్ర వీరిది. 14 వరకూ కవిత్వ సంకలనాలు 1935 నుండీ వెలువడ్డాయి. వీరి కవిత్వం జర్మనీ, చైనా భాషలలో అనువాద మయింది. అనేక అంతర్జాతీయ కవిత్వ సంకలనాల్లో వీరి కవిత్వం చోటు చేసుకుంది.

**చిరుత సన్నద్ధమవుతోంది :**

ప్రతివారికీ తమ వంతు వస్తుంది
అంతవరకూ జాగ్రత్తగా నెమ్మదిగా కదలండి
నీడల్లో, ఏత్తైన గడ్డిలో తలదాచుకుంటూ
సరిగా చూస్తూ తెలివిగా గ్రహిస్తూ
మౌనంగా, మామూలుగా ఉంటూ
మనందరం ఆశించినట్టే ఆశించండి..........

**యుగేశ్లావియా చరిత్ర :**

యూరప్ కి ఆగ్నేయాన ఉన్న యుగేశ్లావియాకి సరిహద్దులు – ఉత్తరాన హంగరీ, పూర్వోత్తరాన రుమేనియా, ఆగ్నేయాన

బల్గేరియా, దక్షిణాన అల్బానియా మసెడోనియా, నైరుతిన ఆడ్రియాటిక్ సముద్రం, పశ్చిమాన క్రోసియా. సెర్బులు, క్రోట్స్‌లు, జెక్ రాజ్యాలతో 1929లో మొట్టమొదటిసారిగా యుగోశ్లావియా ఏర్పడింది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఉద్భవించిన యుగో శ్లావియా ఒక ఆరు గణతంత్ర రాజ్యాల సమాఖ్య. వాయువ్యం నుండి ఆగ్నేయం వరకూ రాజకీయ సమీకరణాల్లో ఉన్నవి – స్లొవెనియా, క్రోసియా, బోస్నియా, హెర్జిగోవినా, సెర్బియా, మోంటెనెగ్రో, మసెడోనియా దేశాలు. గత సహస్రాబ్దిలో ఈ ప్రాంతం, దాని చుట్టూ ఉన్న దేశాలు – ఇస్లాం, సంప్రదాయక క్రైస్తవం, రోమన్ కేథలిక్ మతం; ఈ మూడు మత విశ్వాసాలతో భీష్మించుకుని ఉండేవి. అది అనేక సంఘర్షణలకు దారి తీసేవి. అంతే కాకుండా ఆయా దేశాల జాతీయవాదాలు యుద్ధాలకు పురికొల్పేవి. 6వ శతాబ్దానికి పూర్వం కొసావొ దాని పరిసర ప్రాంతాలు ఇల్లిరియన్ ప్రజలు ఆక్రమించారు, వారే ఇప్పటి అల్బానియన్లు. 6–7 శతాబ్దాల్లో సెర్బులు కూడా అక్కడకు చేరారు. 12–13 శతాబ్దాల్లో రస్కో (1174–1236) మొదటి సెర్బియా జాతీయ చర్చిని నెలకొలిపాడు. అది సంప్రదాయక క్రైస్తవానికి నాంది అయింది. 14వ శతాబ్దంలో ఒట్టొమాన్ తుర్కులు కొసావొ యుద్ధంలో సెర్బులను ఓడించి, వారి ఆక్రమణలో ఇస్లాం మతాన్ని అక్కడ వ్యాపించారు. ముస్లిం ప్రభావాన్ని బోస్నియా–హెర్జిగొవినా వరకూ తీసుకుపోయారు. 16వ శతాబ్దానికి స్లొవెనియ, క్రోసియా దేశాలు ఆస్ట్రియా అధీనంలోకి పోయాయి. అక్కడ రోమన్ కేథలిక్కులు రాక తప్పలేదు. వేలకొద్దీ సెర్బులు బోస్నియాతో క్రోసియా సరిహద్దుల్లోకి పంపబడ్డారు. 19వ శతాబ్దంలో తుర్కులను రష్యా ఓడించాక, సెర్బులకు స్వాతంత్రం లభించింది. కానీ కొసావొ, మసెడోనియ తుర్కుల అధీనంలోను, బోస్నియ–హెర్జిగొవిన, క్రోసియా, స్లొవెనియా దేశాలు ఆస్ట్రో–హంగరీ అధీనంలోకి పోయాయి. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు, ఆస్ట్రో–హంగరీ సామ్రాజ్యం విచ్ఛిన్నం కావడం, ఒట్టొమాన్ సామ్రాజ్యం పతనం, మొదటి ప్రపంచ యుద్ధం ముగింపుతో – అలెగ్జాండర్ రాజు అధీనంలో యుగోశ్లావియా రాజ్యం ఏర్పడింది. అతని ఆధిపత్యంలో స్లొవెనియ, క్రోసియ, బోస్నియ–హెర్జిగొవిన, సెర్బియ, మోంటెనెగ్రో, మసెడొనియ దేశాలు యుగోశ్లావియా రాజ్యంలో చేరాయి. రెండవ ప్రపంచ యుద్ధంలో, నాజీలు యుగోశ్లావియాని ఊచకోత కోసారు. ఆ అంతర్యుద్ధంలో ఒక మిలియన్ వరకూ యుగోశ్లావియన్లు మరణించి ఉంటారని అంచనా. 1945–1980 వరకూ రష్యా ప్రమేయం లేకుండా, జోసెఫ్ టిటో – ఆ ఆరు గణతంత్ర రాజ్యాల్నీ కమ్యూనిస్ట్ నియంతృత్వపాలనలో ఉంచి వారందరినీ కలిపి ఉంచగలిగారు. కానీ 1980లో టిటో మరణానంతరం నెమ్మదిగా విచ్ఛిన్నమవుతూ, ఒక్కొక్క దేశం స్వతంత్ర దేశాలయాయి. చివరకు యుగోశ్లావియాగా మిగిలిన దేశాలు మోంటెనెగ్రో, సెర్బియాలు మాత్రమే. అయితే ఈ రెండింటినీ కలిపి యుగోశ్లావియాగా అనేక దేశాలు గుర్తించ లేదు, అమెరికాతో సహా. దానిని వారు ఇంకా సెర్బియా మోంటెనెగ్రోగానే పిలుస్తున్నారు. అత్యధిక భాగం ప్రజలు సెర్బియన్ భాషనే మాటాడతారు.

యుగోశ్లావియా కవిత్వాన్ని నాలుగు భాగాలుగా చూడొచ్చు.

1. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు. పూర్వ యుగోశ్లావియాలో (1918లో ఏర్పడ్డది) అక్కడి ప్రజల కవిత్వంగా ఆ కవిత్వాన్ని భావించారు. 2. మొదటి రెండవ ప్రపంచ యుద్ధాల మధ్యది. 3. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత, 1991లో యుగోశ్లావియా ఛిన్నా భిన్నం కాకముందు. 4. 1991 నుండి ఇప్పటి వరకూ (1950–1991 వరకూ ఉన్న అనేకమంది కవులు ఇప్పుడు యుగోశ్లావియాలో కాకుండా, దానినుండి విడిపోయిన దేశాల్లో ఉన్నారు).

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత యుగోశ్లావియా కవిత్వం ఆధునికతను సంతరించుకుంది. 19వ శతాబ్దం లోను, 20వ శతాబ్దాల మొదటిలోనూ ఉన్న కవిత్వ లక్షణాలకు విరుద్ధంగా వచ్చిన కవిత్వం. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత సామ్యవాద వాస్తవికతావాద కవిత్వం వచ్చింది. అది ఆధునికవాదంతో సహా దేనినైనా, బూర్జువా, భ్రష్టుపట్టిన సంస్కృతిగా తిరస్కరించింది. అయితే 1950 సరికి మళ్లీ ఆధునిక కవిత్వం తిరిగొచ్చింది, పశ్చిమంలో పరిణామాల్ని చేర్చుకుంటూ. 1991 తరువాత జాతీయవాదాన్ని కొత్తగా పునరుద్ధరిస్తూ, ఒక్కోమారు అంతకుముందరి ఆధునిక సర్వవ్యాప్త వాదాన్ని తోసిరాజంటూ కవిత్వం వచ్చింది. అనాదిగా కవులు, కవిత్వ సారాంశం మీద, తమదైన పద్ధతిలో తమకు నచ్చిన వ్యాఖ్యానాల్ని చేస్తూనే ఉన్నారు. ప్రాధాన్యం వ్యక్తిగత ప్రారబ్ధం అయినప్పుడు, విభావకుని లక్షణమయేది.

ప్రకృతిమీద కేంద్రీకృతమయితే ప్రతీకాత్మకమయేది. స్వీయదేశం ముఖ్యమైనపుడు స్వాతంత్ర్యం ప్రముఖ వస్తువయేది. సమాజం ముఖ్యమయితే, సామాజిక విమర్శ, అన్యాయం మీద పోరాటం, ముఖ్య వస్తువులుగా మారేవి. చరిత్ర ప్రముఖమయినపుడు ప్రజల బలిదానాలు, త్యాగాలు ఎక్కువగా తీసుకోబడేవి. అయితే సమయంతో బాటు ఎవరు ఎవరి పక్షం, ఏ విధానం, ఏ వర్గం అన్నవి మరచిపోయి కవిత్వం కోసమే వెదుకులాట మొదలయింది.

యుగోశ్లావియాలో కవుల సంఖ్య చాలా ఎక్కువ. సాహిత్యంలో అత్యధిక ప్రజాదరణ పొందిన ప్రక్రియ అక్కడ కవిత్వం. అక్కడ సాహిత్య బహుమతులు కూడా ఎక్కువ భాగం కవిత్వానికే. ఆ కారణంగా అక్కడ రచయితలకంటే కవులే ఎక్కువ. 22వ శతాబ్దంలో అన్ని రకాల కవిత్వ ధోరణులు అక్కడ రాజ్యమేలాయి. వాటిల్లో ముఖ్యంగా వాస్తవికతా వాదం, ప్రతీకవాదం, అధివాస్తవికత, అరాజక సాహిత్య వాదం, సామాజిక, ధార్మిక, దేశభక్తి, మార్మిక, యుద్ధ, ఆధునిక, అత్యాధునిక కవిత్వాలున్నాయి. ఈ క్రింది డెసంకా మక్సిమోవిచ్ కవిత దానినే స్పష్టం చేస్తుంది.

17వ శతాబ్దపు ఇవన్ గుండులిక్ (1589–1638), 18వ శతాబ్దంలో ఇగ్నట్ డొర్దిక్ (1675–1737), అనోరా కసిస్ మియొసిక్ (1702–1760), 19వ శతాబ్దంలో బ్రాంకో రడిసెవిక్ (1824–1853), స్టాంకొ వ్రజ్ (1810–1851), ఇవన్ మజురనిక్ (1814–1890), ఫ్రాన్స్ ప్రెసెరెన్ (1800–1849), డ్జుర జక్సిక్ (1832–1878), ఒటొన్ జుపన్సిస్ (1878–1949), యుద్ధానంతర కవుల్లో ప్రముఖులు – మిలొస్ క్రంజన్స్కి (1893–1977), రాస్కొ పెట్రొవిక్ (1898–1949), కొకొ రసిన్ (1908–1943), కవిగా కూడా ప్రసిద్ధుడు నోబెల్ బహుమతి గ్రహీత ఇవన్ అంద్రిక్ (1892–1975), మిరొస్లావ్ క్లెజ (1893–1981) మొదలైనవారు.

19,20 శతాబ్దాల ముఖ్య కవుల్లో (ముఖ్యంగా సెబియన్లలో) జోవన్ జొవనొవిక్ జ్మజ్ (1833–1904), దురా జాక్సిక్ (1832–1878), బ్రాంకో రడిసెవిక్ (1824–1853), లజా కోస్టిక్ (1841–1910), జోవన్ దుకిక్ (1871–1943), మిలన్ రకిక్ (1876–1938), వ్లడిస్లవ్ పెట్కొవిక్ డిస్ (1880–1917), అలెక్సా సంటిక్ (1868–1924), బ్రంకో మిల్జొవిక్ (1934–1961), డెసంకా మక్సిమోవిచ్ (1898–1993), రుమేనియా సంతతి వారైన వాస్కో పోపా (1922–1991) ముఖ్యమైనవారు.

జూర్ కస్టిబన్ (1919–), ఫోతెస్స్ వెస్న పసున్ (1922–2010), స్లవ్క మిహలిక్ (1920–), బ్లాజె కొనెస్కి (1921–1993), ఏఒ సొపొవ్ (1923–1982), మటెజ మటెవ్స్కి (1929–), గనె టొడొరొవ్స్కి (1929–2010), ఇవన్ వి లలిక్ (1931–1996), అలెక్సండర్ పెట్రోవ్ (1938–), హుసెయిన్ టహ్మిసిక్ (1931–), ఎడ్వర్డ్ కొయెబిక్ (1904–1981), గ్రెగొర్ స్ట్రిస్ (1930–), టోమాజ్ సలమున్ (1941–), నోవిక టాడిక్ (1949–), లిల్జన డిర్జన్ (1953–), నీనా జివన్సెవిక్ (1957–), స్లావె గొర్గొ డెమొస్కి (1959–) మొదలైన వారు మరి కొందరు సమకాలీన యుగోశ్లావియా లోని ముఖ్య కవులు.

**డెసంకా మక్సిమోవిచ్ (1898–1993) :** సెర్బియన్ కవయిత్రి, సాహిత్య ప్రధానాధ్యాపకురాలు. జర్మనీకి విరుద్ధంగా వీరు రాసిన కవిత్వం, యుద్ధానంతరం వరకూ ప్రచురించబడలేదు. వీరి కవిత్వం – ప్రేమ, దేశభక్తి పూరితం. వైజెవోలో వీరు చదివిన పాఠశాలలో వీరు బతికుండగానే వీరి గౌరవార్థం వారి ప్రతిమను అక్కడ నెలకొల్పారు. వీరి పేరుమీద ప్రతీ ఏటా అవార్డులు ఇవ్వబడుతున్నాయి.

**బ్రాంకో మిల్జొవిక్ (1934–1961) :** సెర్బియన్ కవి, అధివాస్తవికతని ప్రతీకాత్మకతని ఒకటి చేసే, నవ్య ప్రతీకాత్మక ఉద్యమానికి నాయకత్వం వహించారు. వీరి మొదటి కవిత్వ సంకలనం *ఆమెను వ్యర్థంగా*



డెసంకా

**ఈ ప్రాంతంలో నువ్వు మూలుగుతే**
**అది ఒక కవిత అవుతుంది**
**పనిలోనో మాటల్లోనో తప్పు చేస్తే**
**ప్రాయశ్చిత్తం ప్రార్థనగా గంటలు మోగుతాయి**
**నీకో బిడ్డ పుడుతే / జోలపాట వినబడుతుంది**
**నువు మరణిస్తే / శోకం అనుసరిస్తుంది**
**నువు ప్రేమలో పడితే / బాధామయ నిద్రలేమిలో**
**కవిత్వ చరణాలు చెప్పబడతాయి.**
**నువ్వు ఏది చేసినా / అది కవిత్వంగా మారుతుంది.**

*లేపుతున్నా*నుతో బ్రాంకో పదాలతో పోరు, వాటి మధ్య అంతర్యుద్ధం, సందిగ్ధత కనబడుతుంది. పదాలు వీరి అధీనంలోనో, పదాల అధీనంలో వీరో అడుగడుగునా కనిపిస్తారు. దురదృష్టంతో ఆయన జీవిత యుద్ధం ముగుస్తుంది, చివరిమాటగా కవితలో – నేను చంపబడ్డాను చాలా బలిష్టమైన పదంతో అన్న చరణంతో. చెట్టుకి వేలాడబడి 27 ఏళ్ల ప్రాయంలో ప్రాయంలో మరణించారు. అది ఆత్మహత్యగా ఆధికారికంగా నమోదు చేయబడ్డా, వివాదాస్పద విషయంగానే ఉండిపోయింది. మరణించిన వారందరికంటే ఎక్కువగా నేనెప్పుడో మరణించినా, బతకడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను అని ఒక మిత్రుడకి రాసుకున్న ఉత్తరం తెలియజేస్తుంది. ప్రాచీన గ్రీకు తత్వవేత్త హెరాక్లిటస్ బోధనలతో ఎక్కువగా ప్రభాతుడయారు. అంత సంక్షిప్త జీవితంలో కూడా వీరివి 5 కవిత్వ సంకలనాలొచ్చాయి.

**రూపకంమీద విమర్శ :**
రెండు పదాలు నువ్వు చెప్పిన వెంటనే కలుసుకుని
అదృశ్యమయిపోతాయి తెలియని అర్థాల్లోకి
వాటితో ఏవిధమైన సంబంధం లేకుండా.
ఎందుకంటే తలలో ఒకే ఒక్క పదముంది
అలాగే కవిత రాయబడింది.......

**వాస్కో పోపా (1922–1991) :** ప్రముఖ కవి టెడ్ హ్యూజెస్ అన్నట్టు – పోపా ఊహాత్మక ప్రయాణం – విశ్వం విశ్వాన్ని దాటుతున్నట్టుంటుంది. ఆధునిక కవిత్వంలో ఆ యాత్రని తిలకించడం, అదొక అత్యంత ఉత్సాహకరమైన విషయం. యుద్ధానంతర యూరోపియన్ కవుల్లో ప్రతిభావంతుడైన కవి. అధివాస్తవిక కల్పన నుండి సాంప్రదాయక జానపద కథ వరకూ, వ్యక్తిగత ప్రస్తావన నుండి గిరిజన కాల్పనికం వరకూ, పోపా కవిత్వం మన కాలపు విస్తారమైన ఊహాత్మక సత్యాన్ని ఆవిష్కరిస్తుంది. అది మధ్య యూరప్ లోని సెర్బియా చరిత్ర హృదయంలోనిది. 38 ఏళ్ల సాహిత్య ప్రస్థానంలో కేవలం ఎనిమిది కవిత్వ సంకలనాలు వెలువరించారు. అయితేనేం ఆ అన్ని సంకలనాలూ విస్తృతంగా అనువాద మయాయి. వీరి కవిత్వం నిర్దిష్టమైనది, నమ్మశక్యంకానిది, తరచు విలక్షణమైనది. విశ్వజనీన విషయాలైన – జీవితం, మరణం, ప్రారబ్ధం, ప్రేమ మొదలైనవి వీరి కవిత్వ వస్తువులు.


వాస్కో పోపా

**చిన్న పెట్టె :**
చిన్న పెట్టె, తన మొదటి పళ్ళు పెంచుకుంటుంది
దాని చిరు పొడవు పెరుగుతుంది
దాని చిరు వెడల్పు చిరు ఖాళీ
దానికున్నవన్నీ............

**బల్గేరియా చరిత్ర :**

క్రీ.పూ. 200 ప్రాంతంలో అక్కడున్న బల్గర్ ప్రజల మూలంగా ఆ ప్రాంతానికి బల్గేరియా అని పేరొచ్చింది. బల్గర్ అంటే టర్కీలో కలుపుట అని అర్థం. ప్రాచీన థ్రేస్ సంస్కృతి అక్కడ విరాజిల్లింది. ఈ బల్గర్లు, మధ్య ఆసియా టర్కీ ఆదివాసీలు. వారు అక్కడి స్థానిక స్లావిక్ వాస్తవ్యు (మధ్య యూరప్ వాసులు) లతో కలిసి 7వ శతాబ్దం 681లో మొట్టమొదటి బల్గేరియా రాజ్యం ఏర్పర్చుకున్నారు. తరువాత ఒకటో సైమన్ నాయకత్వంలో 893 నుండి 927 వరకూ, మొదటి బల్గేరియా సామ్రాజ్యం ఏర్పడింది. ఆ సమయం బల్గేరియాకి స్వర్ణ యుగంగా భావిస్తారు. ఐశ్వర్యం, కళ, సంస్కృతి, విద్య, సాహిత్యం అన్నింటా అభివృద్ధి సాధించిన కాలమది. అయితే అది ఎన్నాళ్లో కొనసాగలేదు, ఇరుగుపొరుగు దేశాలు, సామ్రాజ్యాలు ఆ తరువాత వెయ్యేళ్ల వరకూ బల్గేరియా మీద తమ ప్రతాపాన్ని చూపాయి – మొదట 1018లో బైజంటైన్ సామ్రాజ్యం, తొందరలోనే మంగోలులు, ఆ తరువాత 14వ శతాబ్దంలో ఒట్టొమాన్ సామ్రాజ్యం. ఒట్టొమాన్ సామ్రాజ్యం 500 ఏళ్లకు పైగా బల్గేరియాని పాలించింది. 1908 వరకూ వారినుండి విముక్తి లభించలేదు. ఆ తరువాత అనేక యుద్ధాలు జరిగాయి, బల్కన్ యుద్ధం, మొదటి రెండవ ప్రపంచ యుద్ధాలతో సహా. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత 1946లో బల్గేరియా సోవియట్ సమాఖ్యకు అనుచర దేశాంగా కమ్యూనిస్ట్ రాజ్యమయింది. 1990లో సోవియట్ సమాఖ్య పతనమయాక బల్గేరియా ఆర్థిక సామాజిక సంఘర్షణలకు లోనయింది. 1 జనవరి 2007 లో బల్గేరియా యూరోపియన్ సమాఖ్యలో సభ్య దేశమయింది. యూరప్‌లో అత్యంత ప్రాచీనమైన దేశాల్లో బల్గేరియా ఒకటి. ఆసియాతో యూరప్ సరిహద్దుకి దగ్గరగా బల్గేరియా ఉండటం దాని చారిత్రక ప్రాధాన్యం.

యూరప్ నుండి మధ్యప్రాచ్యానికి ఆసియాకి బల్గేరియా నుండి దారులుండటంతో దాని ప్రాముఖ్యత మరింత పెరిగింది. అత్యధిక జనాభా అక్కడ సనాతన క్రైస్తవులదే. ఆగ్నేయ యూరప్‌లోని బల్కన్ ద్వీపకల్పం మీద బల్గేరియా ఉంది. తూర్పున నల్ల సముద్రం,ఉత్తరాన రుమేనియా, డనూబే నది దక్షిణాన గ్రీస్, టర్కీ పశ్చిమాన మసెడోనియా, సెర్బియా బల్గేరియాకు సరిహద్దులు. వారి జాతీయ భాష బల్గేరియన్ – సిరిలిక్ లిపిని వాడే, అది ఇండో యూరోపియన్ భాషా కుటుంబంలోని దక్షిణ స్లేవిక్ భాష. అనేక పదాలు రష్యా, గ్రీక్, టర్కీ నుండి వచ్చి చేరాయి. 19వ శతాబ్దం వరకూ ఈ భాషకు ఒక స్థిరరూపం ఏర్పడలేదు.

9వ శతాబ్దం నుండీ సాహిత్య జాడలున్నా, అవి క్రైస్తవ మతానికి చెందినవి. 10వ శతాబ్దంలో ఉపదేశ కథలు మొదటిసారిగా వచ్చాయి. అయినా అవి కూడా మత సంబంధమైనవే. ఆధునిక బల్గేరియన్ సాహిత్యం 19వ శతాబ్దం మధ్య నుండే మొదలైంది. ఆధునిక బల్గేరియన్ భాష అప్పటికి రూపొందడం అసలు కారణం. బల్గేరియన్ భాషలో అచ్చయిన మొదటి పుస్తకం బిషప్ సోఫ్రోనీ వ్రచాన్ స్కీ (1739–1813) రాసి 1806లో వచ్చిన ఆదివారం పుస్తకం. 1878లో జరిగిన బల్గేరియన్ విముక్తి పోరాటం, బల్గేరియన్ సాహిత్య అభివృద్ధికి బాగా తోడ్పడింది. అందులో ప్రముఖుడు జాతీయ కవిగా కీర్తించబడే ఇవాన్ వజోవ్ (1850–1921). 1870 నుండి వివిధ సాహిత్య ప్రక్రియల్లో వీరు వెలువరించిన అసంఖ్యాక సాహిత్యం బల్గేరియన్ సాహిత్యాన్ని ఒక మలుపుతిప్పాయి. వీరితో సరిపోల్చ దగ్గ మరో కవి కోన్స్టాంటిన్ వెల్చ్ కోవ్ (1855–1907). 1890 తరువాత యువతరం కవుల్లో పెంచో పెట్కోవ్ శ్లావెకోవ్ (1866–1912) బల్గేరియన్ కవిత్వంలో కాల్పనిక కవిత్వాన్ని మరింత విశాలతరం చేసి, సంకీర్ణమయిన కవిత్వానికి బీజం వేసారు. 20వ శతాబ్దానికి పశ్చిమంలో ఉధృతమైన ప్రతీకవాద ఉద్యమం బల్గేరియాని కూడా తాకింది. కిరిల్ క్రిస్టొవ్ (1875–1944) ఆ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన కవి. వీరు రాసిన వేకువకి కీర్తనలు ఆ కోవకి చెందిన కావ్యం. బల్గేరియన్ భాషలోని మధురాని కవిత్వం ద్వారా కృషిచేసిన అద్భుత కవి పెయో ఎవరోవ్ (1878–1914). మొదటి ప్రపంచ యుద్ధంలో మరణించిన, డించో డెబెల్యనోవ్ (1887–1916) వీరిని అనుసరించి రాసిన మరో ముఖ్య కవి. ప్రతీకవాదం యుద్ధానంతర కవిత్వాన్ని ప్రభావితం చేసిన వారిలో ముఖ్యులు నికొలయ్ లిలిఎవ్ (1885–1960), టెయొడొర్ ట్రయనోవ్ (1882–1945).

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత శోచనీయ పరిస్థితుల్లో మరణించిన వామపక్ష భావలున్న కవుల్లో కొందరు – గియొ మిలెవ్ (1895–1925), ఎనిమిదేళ్ల సాహిత్య జీవితంలో కనీసం 70 మారుపేర్లతో కవిత్వం రాసిన హ్రిస్టొ స్మిర్నెన్ స్కి (1898–1923), నాజీల చేతిలో మరణించిన మరో గొప్ప యువ కవి నికొల వప్టరోవ్ (1909–1942) మొదలైనవారు.

కవయిత్రి డోరా గాబ్ (1886–1983), జాతీయ విప్లవవాద కవి హ్రిస్టొ బోటెవ్ (1848–1876), అటనస్ డల్చెవ్ (1904–1978), ఎలిసవెట బగ్రీన (1893–1991), ఎలిసవెట బర్యమ (1893–1991), కవయిత్రి బ్లగ డిమిట్రొవ (1922–2003), బొఝిడర్ బొఝిలోవ్ (1924–), కవిత్వ పఠనానికి భారత దేశానికొచ్చిన ల్యుబొమిర్ లెవ్చెవ్ (1935–), లుచిజల్ ఎలెంకోవ్ (1936–), నినొ నికొలొవ్ (1933–), ఇవన్ బొరిస్లవోవ్ (1946–), కవయిత్రి మిర్యన బషెవా (1947–), గెఒర్గి బొన్సొర్ (1950–), ల్యుబొమిర్ నికొలోవ్ (1954), వ్లాడిమిర్ లెవ్చెవ్ (1957–), ఈవన్ ట్రుస్తెవ్ (1965–) మొదలైనవారు మరికొంతమంది ముఖ్య కవులు. మాతృభాష జర్మనీ అయినా, బల్గేరియాలో జన్మించి బ్రిటీష్ పౌరసత్వం తీసుకున్న ఎలియాస్ కానెట్టి (1905–1994), సాహిత్యానికి నోబెల్ బహుమతి పొందిన ఒకే ఒక్క నవలాకారులు.



శ్లావెకోవ్

**పెంచో పెట్కోవ్ శ్లావెకోవ్ (1866–1912) :** 22 ఏళ్ల వయస్సులో ఐస్ స్కేటింగ్‌లో జరిగిన ప్రమాదంలో చేతికర్ర సాయం లేకుండా నడవలేని, సరిగా

**సరస్సు నిద్రపోతోంది :**

**సరస్సు నిద్రపోతోంది; పైన తెల్ల కొమ్మల వృక్షాల**
**శాఖలు మెలితిరిగి ఒంగి**
**దాని గుప్తమైన విశ్రాంత లోతుల్లో**
**ప్రతిబింబాల నీడలై కలుసుకుంటున్నాయి**

మాటాడలేని రాయలేని స్థితికి నెట్టబడ్డారు. అనేక దేశాల్లో ఎన్ని ప్రయత్నాలు చేసినా కోలుకోలేకపోయారు. తండ్రీ కూడా కవి కావడంతో సహజంగా కవిత్వం పట్ల ఆకర్షితులయారు. శరీర అశక్తత మూలంగా నిరాశకు లోను కాకుండా ప్రపంచ సాహిత్యాన్ని ముఖ్యంగా యూరప్, బల్గేరియన్ సాహిత్యాన్ని అధ్యయనం చేసారు. సాహిత్యాన్ని తత్వశాస్త్రాన్ని చదువుకున్నారు. విస్తృతంగా పర్యటనలు చేసారు. ఆ ప్రభావం ఆయన కవిత్వంలో అడుగడుగునా కనిపిస్తుంది. బల్గేరియాలో అంతవరకూ లేని ఆధునిక కవిత్వం అది. బల్గేరియా కవిత్వాన్ని అది ఒక మలుపు తిప్పింది. జర్మన్ సాహిత్యాన్ని బల్గేరియాలో అనువాదం చేసారు. 1912లో నోబెల్ బహుమతికి దాదాపు ఎన్నుకోబడ్డారు, అంతలోనే వీరి మరణంతో ఆ బహుమతి రాకుండాపోయింది. వీరి రక్తం పాట బల్గేరియా చరిత్రకు సంబంధించిన మహాకావ్యం.

**వ్లాదిమిర్ లెవ్చెవ్ (1957–) :** 16 కవిత్వ సంకలనాలు వెలువరించిన గొప్ప కవి, అనువాదకులు. ఒకప్పటి కమ్యూనిస్ట్ బల్గేరియాలో మొట్టమొదటి సాహిత్య పత్రికను బల్గేరియా, తూర్పు యూరప్ ప్రవాసులకోసం నడిపి, నిషేధాన్ని అనుభవించినవారు. 13 సంవత్సరాలు అమెరికాలో అధ్యాపకుడుగా పనిచేశారు. వీరి కవితలు అనేక భాషల్లో అనువాదమయాయి, పంజాబీతో సహా.



లెవ్చెవ్

**ప్రవాసం :**

**వర్షం తరువాత**
**గోపురంలా సూర్యకాంతి**
**నా చీకటిగది నేలమీద పడుతోంది**
**నేను కిటికీనుండి చూస్తే**
**తూర్పున ఇంద్రధనుస్సు కనిపిస్తోంది.**
**ఈ గోపుర కాంతిలో**
**నేను ఉండాలనుకుంటున్నాను**
**ఆకాశంలో ఈ వారధి**
**మరో దేశంలో**
**మా ఇంటికి దారి**

**బోస్నియా–హెర్జెగోవినా చరిత్ర :**

బోస్నియా–హెర్జెగోవినా ఒకే దేశం. నిజానికి బోస్నియా ఆ దేశపు ఉత్తర ప్రాంతంలోను, హెర్జెగోవినా ఆ దేశపు దక్షిణ ప్రాంతంలోను ఉన్నాయి. విచిత్రంగా ఈ రెండు ప్రాంతాల్లో విరుద్ధ వాతావరణాలుంటాయి, ఒక ప్రాంతంలో చలి ఉంటే మరో ప్రాంతంలో వేడి. ఈ దేశాన్ని సంక్షిప్తంగా బిహ్ అని పిలుస్తారు. ఆగ్నేయ యూరప్ బల్కన్ ద్వీపకల్పం మీద ఈ దేశముంది. సెర్బియా, క్రోసియా, మోంటెనెగ్రో ఈ దేశానికి సరిహద్దు దేశాలు. ఈ దేశంలో బోస్నియన్లు ముఖ్యంగా ముస్లింలు, క్రోయట్స్ ఎక్కువగా కేథలిక్ మతస్థులు, రోమన్ కథోలిక్ మతాన్ని అనుసరించే సెర్బులు ఉన్నారు. ఈ మూడు మతస్థులకూ వారి వారి భాషలున్నాయి. బోస్నియా నది ఆ ప్రాంతం గుండా ప్రవహించడాన్ని ఆ ప్రాంతానికి బోస్నియా పేరొచ్చిందని అంటారు. హెర్జెగోవిన పేరు ఆ ప్రాంతాన్ని ఓట్టొమాన్ తుర్కులు ఆక్రమణకు పూర్వం పాలించిన ప్రభువు పేరు హెర్సెగ్ మూలాన అని చెబుతారు.

ఈ దేశం ఒక్కప్పుడు రోమన్ సామ్రాజ్యంలోని భాగం. ఇండో యూరోపియన్ ఆదివాసులైన ఇల్లిరియన్లు ఉండటం మూలాన రోమన్లకు పూర్వం ఈ దేశానికి ఇల్లిరికం అని పేరుండేది. రోమన్ సామ్రాజ్యం పతనమయాక ఈ ప్రాంతం బోస్నియా సామ్రాజ్యంగా ఎదిగింది. 1463లో ఈ సామ్రాజ్యాన్ని ఒట్టమాన్ తుర్కులు ఆక్రమించి, 1800 చివరివరకూ వారే పరిపాలించారు. 1908 లో ఇది ఆస్ట్రియా–హంగరీ అధీనంలోకి పోయింది. దక్షిణ బోస్నియా వాసులకు అది ఎంత మాత్రమూ సమ్మతం కాలేదు. సెర్బులకు బోస్నియా హెర్జెగోవిన మీద ఆధిపత్యం ఉండాలన్న పట్టుదల మూలాన ఆస్ట్రియన్ వాసి సెర్బియన్ జాతీయుడు ఫెర్డినండ్‌ని, ఇప్పటి బోస్నియా రాజధానిలో చంపడం అప్పటి మొదటి ప్రపంచ యుద్ధానికి (1914–1918) కారణమయింది. యుద్ధం తరువాత బోస్నియా యుగోస్లేవియాలో భాగమయింది. బోస్నియన్ల పరిస్థితుల్లో ఏమీ మార్పు రాలేదు. రెండవ ప్రపంచ యుద్ధంలో అనేక మంది బోస్నియన్లు మరణించారు, హింసించబడ్డారు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత యుగోస్లేవియా కమ్యూనిస్ట్ దేశమయింది. 1986 వరకూ అప్పటి ఆ దేశ అధ్యక్షుడు టిటో పరిపాలన తరువాత వచ్చిన మిలోసెవిక్ పాలనలో దేశంలోని వివిధ మతస్థుల మధ్య అంతర్యుద్ధాలు మొదలయాయి. 1991లో బోస్నియాలోని బోస్నియన్లు, క్రోయట్స్ స్వతంత్ర దేశంగా విడిపోదామంటే సెర్బులు అందుకు ఒప్పుకోలేదు. అది వారి మధ్య కొట్లాటలకు దారి తీసి రెండున్నర లక్షల మంది వరకూ ప్రాణాలు కోల్పోయారు. 1992–1995 మధ్య సెర్బులు, వారి విరోధులనుకునే వారిని చాలావరకు నిర్మూలించారు. ఫలితంగా

అనేక మంది ముస్లిములు జర్మనీకి , టర్కీకి పారిపోయారు. ఆ సమయంలో ఆ దేశంలో అత్యంత దుర్భర పరిస్థితులు నెలకొనడంతో బోస్నియా తమని స్వతంత్ర దేశంగా 1992లో ప్రకటించుకుంది.

మధ్య యుగ కాలం నుండీ బోస్నియా-హెర్జెగొవినలో సంపన్నమైన సాహిత్య సంపద ఉంది. వారి రచనల అనువాదాలతో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన వారు అనేకం ఉన్నారు, నోబెల్ బహుమతి పొందిన ఇవో ఆండ్రిక్ (1892-1975), ప్రఖ్యాత కవి మాక్ డిజ్దర్ (1917-1971) లాంటి వారు. వారి సాహిత్యానికి ఎంత దీర్ఘ చరిత్ర ఉందంటే మటిజ డివ్కొవిక్ (1563-1631) వారి ఆధునిక సాహిత్యానికి ఆద్యుడుగా భావిస్తారు. ఆంటున్ బ్రాంకో సిమిక్ (1898-1925) సంప్రదాయవాద కవిత్వాన్ని కాదని విభావక కవిత్వానికి ప్రాణం పోసారు. పేదరికం, జీవితం, మరణం మొదలైన అంశాల మీద కవిత్వం విరివిగా రాసారు. బోస్నియా కరెన్సీ మీద వీరి చిత్రాన్ని ముద్రించారు. అలెక్సా సాంటిక్ (1868-1924) వారి జీవిత కాలంలో 800 కు పైగా కవితలు రాసారు. సామాజిక సాంస్కృతిక అంశాల్లో ప్రభుత్వ వ్యతిరేకత వీరి కవిత్వంలో ఎక్కువ ఉండేది. బోస్నియా ప్రాంతపు సెర్బియన్ కవి జోవన్ దుకిక్ (1871-1943) ఫ్రెంచి ప్రతీకాత్మక కవిత్వాన్ని ప్రవేశ పెట్టారు. సెర్బియన్ హోమర్‌గా పిలవబడే ఫిలిప్ విసంజిక్ (1767-1834), సెర్బియన్ కవి టేసన్ పొడ్రుగొవిక్ (1775-1815), మార్టిన్ నెడిక్ (1810-1895), ముస కజిం కటిక్ (1878-1915), క్రోయట్ కవి ఇవన్ గోరన్ కొవకిక్ (1913-1943), ఇజెట్ సరజ్లిక్ (1930-2002), క్రోయట్ కవి అసఫ్ దురకొవిచ్ (1940-), గోరన్ సిమిక్ (1952-), సష స్కెండెరిజ (1968-) మొదలైన వారు ఇంకొందరు ముఖ్య కవులు.

> **ఒక దేశం సందేశం :**
> రెచ్చగొడుతూ ఎవరో అడుగుతారు
> ఎవరు, ఏమిటి, ఎక్కడ, నన్ను క్షమించండి
> ఆ బోస్నియా ఎలా ఉంది
> నాకు చెప్పండి ....

**మాక్ డిజ్దర్ (1917-1971) :** హెర్జెగొవిన ప్రాంతంలో జన్మించారు. 15 ఏళ్ల ప్రాయం నుండి కవిత్వం రాయడం మొదలెట్టారు. 18 ఏళ్ల ప్రాయంలో వచ్చిన వీరి కవిత్వ సంకలనం "విడ్సోల్జే రాత్రి" అక్కడి ప్రభుత్వం మూలంగా అనేక కత్తిరింపులకు, అభిశంసనకు గురయింది. రెండవ ప్రపంచ యుద్ధం చివర్లో ఎక్కడో అజ్ఞాతంగా ఉండాల్సి వచ్చింది. వీరిని పట్టుకోలేక దొరికిన వీరి తల్లి, సోదరిని నిర్బంధ శిబిరానికి తరలించి చంపారు. టంజుగ్ పత్రికకు విలేఖరి గాను, సంపాదకుడు గాను పని చేసారు. వీరి ఆధునిక కవిత్వ పద్ధతుల్ని అప్పట్లో హర్షించకపోయినా, ఆ తరువాత విమర్శకులు ఆ కవిత్వంలోని కొత్తదనాన్ని గుర్తించగలిగారు. 10 కవిత్వ సంకలనాల వరకూ వచ్చాయి. ఒట్టొమాన్ బోస్నియా క్రైస్తవ సంస్కృతి, 15వ శతాబ్దపు మార్మికవాదుల ప్రభావం వీరి రచనల్లో ఎక్కువగా కనబడుతుంది.

> **నువ్వు ఎక్కడున్నావు? :**
> హరిత ప్రాంత మొదటి పూత పూలమీద
> రాత్రి మంచు ముత్యాల జల్లు పడుతున్నప్పుడు
> నా హృదయ రాగం మొదలవుతుంది
> నువ్వు ఎక్కడున్నావు? నువ్వు ఎక్కడున్నావు?...

**అలెక్సా సాంటిక్ (1868-1924) :** బోస్నియా ప్రాంతపు సెర్బియన్ కవి. అప్పటి సామాజిక అసమానతల పట్ల బలమైన భావోద్రేకాలు, గతవ్యామోహం వీరి కవితల్లో ఎక్కువ. సెర్బియాలోని ఒక గ్రామానికి వీరి పేరు పెట్టారు. వీరు రాసిన ఎమీనా (పక్కింటి అందమైన అమ్మాయి) దీర్ఘ కవిత, అనేక ప్రదర్శనలకు ఇప్పటికీ నోచుకుంటునే ఉంది.

**తూర్పు జర్మనీ చరిత్ర :**

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత, జర్మనీ సైనిక నాయకులు, 8 మే 1945న మిత్ర రాజ్యాలకు (సోవియట్ సమాఖ్య, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, బ్రిటన్, ఫ్రాన్స్) బేషరతుగా లొంగిపోయారు. అప్పటికి జర్మనీ పూర్తిగా ధ్వంసమయింది. అంతా పునర్ నిర్మించుకోవాల్సిన దుస్థితి. మిత్రరాజ్యాలు జర్మనీని నాలుగు మండలాలుగా విభజించుకున్నాయి. తొందర్లోనే వాటి మధ్య ఉద్రిక్తతలు మొదలయాయి, సోవియట్ సమాఖ్య ఒక వైపు, మిగతా మూడు మరో వైపు. సోవియట్ సమాఖ్యని తప్పించి మిగతా మూడూ రాజ్యాలు, వారి అధీనంలోని జర్మనీని మండలాల్ని గణతంత్ర జర్మనీ సమాఖ్యగా (FRG) పరిగణించాయి. అది పశ్చిమ జర్మనిగా వాడుకలోకొచ్చింది. సోవియట్ సమాఖ్య జవాబుగా దాని అధీనంలోని మండలాన్ని ప్రజాస్వామిక గణతంత్ర జర్మనీగా (GDR)గా ప్రకటించింది. అదే తూర్పు



ఫిలిప్ విస్‌జిక్ గస్లర్

జర్మనీ. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు 1974 వరకూ GDRని ఆమోదించలేదు. 1990లో జర్మనీ మళ్లీ ఒకటయాక FRG GDRని విలీనం చేసుకుంది. అయినా ఈ రెంటి మధ్యా ఉద్రిక్తతలు ఏ మాత్రం తగ్గలేదు. రెంటికీ రాజధానిగా పంచుకున్న బెర్లిన్ మూలంగా ఎప్పటికప్పుడు ఉద్రిక్తతలు పెరుగుతూనే ఉండేవి. దానికితోడు తూర్పు జర్మనీ నుండి పశ్చిమ జర్మనీకి వలసలు ఎక్కువయాయి. అది భరించలేని, ఆపలేని సేనలు, (1961 వరకూ కనీసం 30 లక్షల మంది తూర్పు జర్మనీ వాసులు పశ్చిమ జర్మనీకి వలసపోయారని అంచనా) రెండు దేశాల్నీ వేరుచేస్తూ అతిపెద్ద గోడని 1961లో నిర్మించారు. అది బెర్లిన్ గోడగా ప్రసిద్ధి చెందింది. అనేక ఒడిదుడుకుల మధ్య, రెండు గోడల మధ్య అనేక జీవితాలు నలిగిపోయిన తరువాత 9 నవంబరు 1990న బెర్లిన్ గోడ విరిగింది. అలా 7 అక్టోబరు 1949 నుండి 3 అక్టోబరు 1990 వరకూ GDR అన్న తూర్పు జర్మనీ కమ్యూనిస్ట్ రాజ్యంగా అస్తిత్వంలో ఉంది. 40 సంవత్సరాల వేర్పాటు తరువాత కలిసిన తూర్పు పశ్చిమ జర్మనీల మధ్య ఇప్పటికీ విభేధాలు, వ్యత్యాసాలు సమసిపోలేదు. వారి వారి జీవన పద్ధతి, సంపద, రాజకీయ నమ్మకాలు, ఇంకా ఇతర విషయాల్లో కూడా. పశ్చిమ జర్మనీ పశ్చిమ దేశాల ప్రభావంతో సార్వజనీన భావనలో ఉంటే, తూర్పు జర్మనీ ఆశ్చర్యంగా సంప్రదాయవాద భావన నుండి బయటపడలేక పోతోంది. బెర్లిన్లో మాటాడే జర్మన్ మాండలికం, జర్మన్, స్లావిక్లు మాటాడే సెర్బియన్ భాషలు అక్కడ వాడుకలో ఉన్న భాషలు.

తూర్పు జర్మనీ, అమెరికా టెన్నీసీ రాష్ట్రం కంటే కాస్త చిన్నది. దాని సరిహద్దులుగా తూర్పున పోలాండ్, జెకొస్లోవేకియా; పశ్చిమాన FRG అనబడ్డ పశ్చిమ జర్మనీ ఉన్నాయి. తూర్పు బెర్లిన్, తూర్పు జర్మనీకి రాజధాని. అందులోని రాష్ట్రాలుగా మెక్లెంబర్గ్-వోర్పొమ్మెర్న్, బ్రాండెంబర్గ్, సేక్సొని-ఆనల్ట్, థురింగియ, సేక్సొని, బెర్లిన్ తూర్పు ప్రాంతం.

తూర్పు జర్మనీ కవిత్వానికొస్తే దాని చరిత్ర ప్రకారం, అక్కడి కవిత్వ చరిత్రను మూడు భాగాలుగా చూడొచ్చు. తూర్పు జర్మనీగా మారక పూర్వం (1949కి ముందు), మారిన తరువాత (1949-1990 కి మధ్య), తూర్పు జర్మనీ పూర్తిగా లేనప్పుడు (1990 తరువాత నుండీ). అయితే కొందరు కవులు తూర్పు జర్మనీని శాశ్వతంగా విడిచిపెట్టి పశ్చిమ జర్మనీకి పోయిన వోల్ఫ్ బియెర్మన్ (1936-), పశ్చిమ దేశాలకు పూర్తిగా వలసపోయిన పీటెర్ హుచెల్ (1903-1981), రైనెర్ కుంజె (1933-), కవయిత్రి సరహ్ కిర్స్చ్ (1935-2013) లాంటివారు ఉన్నా, వారినీ తూర్పు జర్మనీ వాసులుగానే తీసుకోవచ్చు. కానీ కొందరు కవులు బెర్టోల్ట్ బ్రెచ్ట్ (1898-1956), జొహన్నెస్ ఆర్. బెచెర్ (1891-1958) లాంటి వారు తూర్పు జర్మనిలో స్థిరపడక పూర్వం కవిత్వం రాస్తే, రైనెర్ కుంజె, థొమస్ బ్రష్చ్ (1945-2001) లాంటి వారు తూర్పు జర్మనీ నుండి వలసపోయాక కవిత్వం రాసారు. బెర్లిన్ గోడ మూలంగా అనుభవించిన హింస మీద బోలెడంత కవిత్వం ఉంది. గోడ కూల్చాక కోల్పోయిన దేమిటో కూడా కవిత్వ రూపంలో వచ్చింది.



శాన్‌డర్ పెటోఫ్ హంగరీ

ఆ మూడు విభాగాల కవుల్లో ముఖ్యమైన వారు కొందరు -

1. ఎరిచ్ వైనెర్ట్ (1890-1953), ఎరిచ్ ఆరెండ్ట్ (1903-1984), రెనె స్క్వచ్హొఫెర్ (1904-1970), జార్జ్ మౌరెర్ (1907-1971), లౌయిస్ ఫరంబెర్గ్ (1909-1957), మాక్స్ జిమ్మెరింగ్ (1909-1973).

2. కర్ట్ బార్థెల్ (1914-1967), స్టీఫన్ హెరంలిన్ (1915-1997), జొహన్నెస్ బొబ్రొవ్స్కి (1917-1965), హాన్స్ సిబుల్క (1920-2004), 1933లో తల్లిదండ్రులతో వలసపోయిన పాల్ వియెన్స్ (1922-1982), గుంథెర్ డెయికె (1922-2006),

వాల్టెర్ వెర్నెర్ (1922–1995); హెల్ముట్ ప్రెయిస్లెర్ (1925–2010).

3. క్రిస్ట రెయినిగ్ (1926–2008), వెర్నెర్ లిండెమన్ (1926–1993), ఉవె బెర్గెర్ (1928–2014), హెయినెర్ ముల్లెర్ (1929–1995), గుంటెర్ కునెర్ట్ (1929–), అడొల్ఫ్ ఎండ్లెర్ (1930–2009), కవయిత్రి ఎవ స్ట్రిట్మాట్టెర్ (1930–2011), హెయింజ్ కహ్లౌ (1931–2012), ఉవె గ్రెస్మన్ (1933–1969), వుల్ఫ్ కిర్స్టెన్ (1934–), రైనెర్ కిర్స్చ్ (1934–), కార్ల్ మికెల్ (1935–2000), కవయిత్రి హెల్గ ఎం. నొవక్ (1935–2013), హెయింజ్ జెచొవ్స్కి (1935–2009), కుంట్ బర్ట్ష్ (1937–), వొల్కెర్ బ్రౌన్ (1939–), బెరండ్ జెంట్జ్ స్చ్ (1940), హెల్గ మని హెరంజె (1946–), క్రిస్టొఫ్ ఎయిసెనుథ్ (1949–), లుట్జ్ రథనొవ్ (1952–), థోమస్ ఎర్విన్ (1961–)

**బెర్టొల్ట్ బ్రెష్ట్ (1898–1956) :** 20వ శతాబ్దంలో సాటిలేని పలుకుబడిగల జర్మన్ కవి, నాటక కర్త, రంగస్థల నిర్దేశకులు. ఆధునిక నాటకం, కవిత్వంలో చెరగని ముద్రవేసారు. నాజీల కాలంలోనే కాదు, తరువాత కూడా ఎవరికీ లొంగని దేనికీ భయపడని మనస్తత్వం. తూర్పు బెర్లిన్ వీరి కవిత్వ నాటక పరివర్తనకు వేదిక. ప్రచ్ఛన్నయుద్ధం సమయంలో వీరు తూర్పు జర్మనీని, కమ్యూనిజాన్ని సమర్ధించినందుకు పశ్చిమ జర్మనీకి వీరిమీద ఎంత కోపం ఉన్నా, వారి రచనలపట్ల మాత్రం కాదు.

**రాబోయే తరాలు**
నేను దీనిని ఒప్పుకుంటున్నాను:
నాకు ఆశ లేదు
పారిపోయేందుకు అవివేక సంభాషణ.
అవును
తప్పులయిపోయాక
శూన్యం మన పక్కనే కూర్చుంటుంది
మన చివరి సహవాసిలా.

**హెయినెర్ ముల్లెర్ (1929–1995) :** హిట్లర్ పెరుగుదల నుండి సోవియట్ ఆక్రమణ, బెర్లిన్ గోడ కూల్చడం వరకూ ఉన్న చరిత్రలో జీవించారు. బెర్టొల్ట్ బ్రెష్ట్‌ని తన ఆదర్శంగా తీసుకుని, బ్రెష్ట్ లానే కవిత్వంలోను, నాటకంలోను చివరివరకూ జీవించారు. బ్రెష్ట్ లానే రాసే జర్మనీ భాష కంటే, మాటాడే జర్మనీ భాషనే రచనలకు వాడుకున్నారు. కమ్యూనిజానికి పూర్తిగా నిబద్ధుడయినా, తూర్పు జర్మనీ ప్రభుత్వాన్ని అసహ్యించుకున్నారు. ఫలితంగా వీరి రచనలు అనేక అభిశంసనలకు గురయేవి.

**బ్రెష్ట్**
నిజంగా అతను చీకటి కాలంలో బతికాడు
కాలాలు తేలికపడ్డాయి
కాలాలు విషాదభరితాలయాయి
వెలుగు నేను చీకటిని అంటే
అది సత్యం చెప్పినట్టు
చీకటి నేను వెలుగుని అంటే
అది అబద్ధం చెప్పనట్టే

**కవయిత్రి సరహ్ కిర్స్చ్ (1935–2013) :** నాజీల కాలంలో జన్మించిన వీరు, యూదుల వ్యవహారశైలిని వ్యతిరేకిస్తూ తన పేరును సరహ్ గా మార్చు కున్నారు. రైనర్ కిర్స్చ్ ని వివాహమాడేక కిర్స్చ్ పేరు కూడా జోడించబడింది. ఆ వివాహం ఎన్నాళ్లో నిలవలేదు. ఆధునిక కాలంలో గొప్ప రాజకీయ చతురత ఉన్న కవయిత్రిగా పేరు పొందారు. దాదాపు 10 కవిత్వ సంకలనాలు వెలువరించిన, వీరి కవిత్వంలో ప్రేమ, వేర్పాటు, ఏకాంతం ఎక్కువగా కనిపించే అంశాలు.

**స్వేచ్ఛ కవితలు**
గత రాత్రి నేను లేచాక తెలుసు
ఈ కవితలకు
ఇప్పటికి నేను వీడ్కోలు చెప్పాలని
కొన్నేళ్ల తరువాత అలాగే జరుగుతుంది
అవి ప్రపంచంలోకి పోవాలి
వాటిని ఈ కప్పుకింద ఇక్కడ
శాశ్వతంగా ఉంచుకోలేము.........

**అల్బానియా చరిత్ర, కవిత్వం :**

అడ్రియటిక్ సముద్రతీరాన గ్రీసుకు పక్కన, అల్బానియా ఉండటంతో, అల్బానియా ని అనేక రాజ్యాలు, దేశాలు పాలించాయి, అనేక అంతర్జాతీయ సంఘర్షణలకు వేదికయింది. క్రీ.పూ. 2000 నాటికి ఈల్లిరియన్ ఆదివాసీ లుండేవారు. ఆ తరువాత రోమన్, బైజంటైన్, ఒట్టొమాన్ సామ్రాజ్యాల అధీనంలో ఉంది. ఒట్టొమాన్ సామ్రాజ్య కాలంలోనే అత్యధిక జనాభా ఇస్లాం మతంలోకి మార్పిడి జరిగింది. అల్బానియా స్వాతంత్ర్యము కోసం అనేకమార్లు పోరాటం చేసినా, మధ్య మధ్య క్లుప్తంగా కొన్నిసార్లు మాత్రమే అది సాధించగలిగినా, 1900 ప్రథమార్ధంలో జాతీయ గుర్తింపు పొందిన దేశమయింది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో అల్బానియా – జర్మనీ, ఇటలీ రెండు దేశాల ఆక్రమణకు మళ్లీ గురయింది. యుద్ధం తరువాత కమ్యూనిస్ట్ పాలనలోకి పోయి, 40 ఏళ్లకు పైగా వారి అధీనంలో ఉండి, 1992 లో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడింది. అప్పటినుండీ అధికారం కోసం కమ్యూనిస్ట్‌లు, ప్రజాస్వామ్య వాదులూ కుమ్ములాడుకుంటూనే ఉన్నారు.

15వ శతాబ్దం నుండీ 20వ శతాబ్దం మొదటి వరకూ ఉన్న ఒట్టోమాన్ సామ్రాజ్యం, అల్బానియా భాషలో ఏదీ ప్రచురించరాదన్న శాసనంతో, అల్బానియా భాషలో సాహిత్యం చాలా నష్టపోయింది. జెరోనిం డె రడ (1814–1903) వారి గొప్ప కాల్పనికవాద కవి. జాతీయ కవిగా కొనియాడబడ్డ నైం ఫ్రషెరి (1846–1900), లాస్గుష్ పొరడెకి గా పిలవబడే లజర్ సొటిర్ గుషో (1899–1987) ఆధునిక కవిత్వానికి దారితీస్తే, ఎసద్ మెకులి (1916–1993), డ్రిటెరొ అగొల్లి (1931–), ఫటొస్ అరపి (1930–) మొదలైనవారు మరికొంతమంది దానిని కొనసాగించారు.

ఏ సగం :

వాళ్లంటారూ –
మనిషి తన మాతృభూమిని ప్రేమించాలని
మా తండ్రి కూడా అదే చెప్పేవారు తరచు
నా మాతృభూమి రెండుగా విభజించబడింది
రెండు భాగాల్లో
నేను దేన్ని ప్రేమించాలి
వాటికన్ సిటీ చరిత్ర, కవిత్వం

**సైప్రస్ చరిత్ర, కవిత్వం :**

సైప్రస్ మెడిటరేనియన్ సముద్రంలో ఒక దీవి. తూర్పు పశ్చిమ సామ్రాజ్యాలకు ఈ దీవి ఒక శ్రేష్ఠమైన స్థావరం. ఫలితంగా ఈజిప్ట్, పెర్సియా, గ్రీస్, రోమన్ లాంటి ప్రాచీన నాగరకతలకు అది నిలయమైంది. క్రీ.పూ. 364 నుండి 800 సంవత్సరాలు బైజంటీం సామ్రాజ్యం, 12వశతాబ్దం నుండి అనేక చేతులు మారుతూ 1500 నాటికి ఒట్టొమాన్ సామ్రాజ్యం వచ్చింది. 1878లో బ్రిటన్ ఈ దీవిని హస్తగతం చేసుకుని 1960 వరకూ పాలించింది. 1960లో బ్రిటన్ నుండి విముక్తి చెంది స్వతంత్ర రాజ్యమైంది. అయితే 1974లో సైప్రస్ రెండు భాగాలుగా విభజించబడింది. దక్షిణాన గ్రీక్ మాట్లాడే భాగం ప్రభుత్వ నియంత్రణలో ఉంటే, ఉత్తరాన టర్కీ మాట్లాడే ప్రాంతాన్ని టర్కీ ప్రజల అధీనంలో ఉంది. ఈ రెండు ప్రాంతాల మధ్య ఐక్యరాజ్యసమితి శాంతి దళాలు ఈ రెండు ప్రాంతాల్ని సామరస్యంగా ఉంచే ప్రయత్నంలో ఇప్పటికీ ఉండాల్సి వస్తోంది.

జాతీయ భావాల్ని పెంపొందించే కవిత్వం బ్రిటీష్ అధీనంలోకి వచ్చేవరకూ ఉంది. బ్రిటీష్ పాలన నుండి ఆధునికతను సంతరించుకుంది. సైప్రస్ జాతీయ కవిగా కొనియాడబడే వసిలిస్ మిచెలిడెస్ (1849–1917), అంతే ఖ్యాతి పొందిన డెమెట్రియొస్ లిబెర్టిస్ (1866–1937), ప్రబలమైన ఫలవంతమైన కవిత్వం రాసిన కొస్టస్ మొంటిస్ (1914–2004), గ్రీక్ దౌత్యవేత్త కవి నికొస్ క్రనిడియొటిస్ (1947–1999), సాహిత్యంలోని అన్ని విభాగాల్లోనూ అద్భుత కృషి చేసిన ప్రముఖ కవి కైప్రొస్ క్రిసంథిస్ (1915–1998), సమకాలీన కవి లూసియస్ జఫిరిఒవ్ (1948), కవయిత్రినికి మరంగొవ్ (1948–2013), గలాజీ పిట్సా (1940–), కవయిత్రి నేసే యాసిన్ (1959–), కవయిత్రి మోన సవ్విదొవ్–థియొడొవ్లొవ్ (1982–) మొదలైనవారు సైప్రస్ ముఖ్యమైన కవులు.

**నేసే యాసిన్ (1959–) :** ప్రముఖ టర్కీ సైప్రస్ కవయిత్రి. రెండుగా విడదీయబడ్డ సైప్రస్ ఆమెను ఎక్కువ బాధిస్తుంది. ప్రేమ, నష్టం, సర్దుబాటు ఆమె ముఖ్యమైన ఇతివృత్తాలు. రాజకీయ నాయకుల నినాదాలు, వాక్పటిమ నిర్లక్ష్యం చేస్తే మనం తిరిగి కలిసి ఉండగలం అని ఆమె దృఢమైన నమ్మకం. ఈ క్రింది కవిత ఆమెకు చాలా మంచి పేరు తెచ్చిపెట్టింది. టర్కిష్ లోను, గ్రీకులోను సమకూర్చిన సంగీతంతో ఈ కవిత పాటగా రెండు ప్రాంతాల్లోనూ వినబడుతుంది. ఆమె తండ్రి సోదరి కూడా కవులే.

వాటికన్ సిటీగా పిలవబడుతున్నది హోలీ సీ, రోం నగరం. ఈ నగరం చుట్టూ గోడ. కేథలిక్ చర్చి ద్వారా నడపబడుతున్న 110 ఎకరాల ఈ నగరం ఒకదేశం; ప్రపంచంలో అతి చిన్న దేశం. 8వ శతాబ్దం నుండీ కేథలిక్ చర్చి ప్రభువు పోప్. ఇటలీలో అతి పెద్ద ప్రాంతం వారి అధీనంలొ ఉండింది. 1860లో ఇటలీ రాజు దాన్ని ఆక్రమించి, కేవలం రోం నగరం, పోప్ కోసం వదిలాడు. 1870 లో అది కూడా ఆక్రమించి, రోం నగరాన్ని ఇటలీకి రాజధాని చేయబడింది. 1929లో ఇటలీ ప్రభుత్వం వాటికన్ నగరాన్ని ఒక దేశంగా చేయడానికి అంగీకరించింది. దాని మీద సర్వాధికారాలూ కేథలిక్ చర్చి పోప్‌వి. ఇక్కడ కవిత్వం సాహిత్యం మతానికి సంబంధించినదే ఎక్కువ.



ముకుంద రామారావు,
హైదరాబాదు.

# సూఫీ బాబా  సైకిల్ యాత్ర

*- కొల్లూరి సోమ శంకర్*

**అజిత్ హరి సింఘాని** - పూనే నుంచి జమ్ముకి చేసిన మోటర్ సైకిల్ యాత్రను *One life to ride* అనే పేరుతో ఆంగ్లభాషలో ప్రచురించారు. దీనిని **కొల్లూరి సోమ శంకర్** *ప్రయాణానికి జీవితం* అనే పేరుతో అనువదించారు. ఆ సాహస యాత్రలో ఒక భాగం ఈ సూఫీ బాబా.

అటువంటి ఒక టీ స్టాల్‌లో నా డిజిటల్ కెమెరా ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఒంటి మీద చొక్కాల్లేని అరడజను మంది లారీ డ్రైవర్లు, ధాబా యజమాని తమ ఫోటోలను వెంటనే చూసుకోవాలనుకున్నారు. నేను అరుగు మీద కూర్చుని, వాళ్ళ కథలు వింటూ, నా గురించి చెబుతున్నాను. నేను ఆఖరి టీ తాగుతుండగా, పొడవాటి ఆకుపచ్చ గౌను, లుంగీ ధరించిన ఓ వృద్ధుడు, నేను వెడుతున్న మార్గంలోనే మండుటెండలో సైకిల్‌పై ముందుకు వెడుతున్నాడు. టీ తాగి, డ్రైవర్లకి వీడ్కోలు పలికి, నేనూ బయల్దేరాను. కాసేపటికి ఆ ముసలాయనను దాటి ముందుకు వెళ్ళాను. ఓ కల్వర్ట్ దగ్గర ఆగి ఆయన కోసం ఎదురుచూడసాగాను.

మొదటి సారిగా చూసినప్పుడు ఆయనని బక్కపలచని బలహీనపు ముసలి వ్యక్తిగా పొరపడతాం. దగ్గరికి వచ్చేకొద్దీ, వైరులా సన్నగా ఉన్న ఆయన శరీరంలో ఎక్కడా కొవ్వనేది పేరుకుపోకుండా ఉండడంవల్లనే ఆయన బక్కపలచగా కనపడుతున్నాడని తెలుస్తుంది. ఆయన కాలి కండరాలు శ్రమకోర్చి సైకిల్ పెడల్‌ని తొక్కుతున్నాయి. నిప్పులు చెరుగుతున్న ఆ ఎండలో, ఆయన బారెడు గడ్డం వేడిగాలికి రెపరెపలాడుతుంటే, ఆయన నావైపు వస్తున్నాడు. ఎండ నుంచి రక్షణ కోసం తెల్లని తలపాగా చుట్టుకున్నాడాయన. మెడలో నీలం రంగు ఉత్తరీయం, భుజాల మీదుగా ఓ శాలువా ఉన్నాయి. కల్వర్ట్ దగ్గర ఆయన కోసం వేచి ఉండడం గమనించి, ఆయన సైకిల్ వేగం తగ్గించాడు.

"సలాం వాలేకుమ్" అంటూ పలకరించాను. ఆయన చిన్నగా తలాడించాడు. కొద్దిగా సంశయించి, సైకిల్ దిగి, స్టాండ్ వేసాడు. అదో సాధారణమైన, పాత తరహా సైకిలు. రెండు వైపుల ఒంపులు తిరిగి ఉన్న హ్యాండిల్ బార్, సీటు వెనుక పాత నమూనా క్యారేజిని చూస్తేనే అర్థమవుతుంది ఆయన తత్త్వమేమిటో! కాకపోతే, సైకిలు చాలా శుభ్రంగా ఉంది, బాగా ఆయిలింగ్ చేయబడి ఉంది.  ఓ మంచి నీళ్ళ క్యాను తగిలించుకునే సౌకర్యం ఉందా సైకిలుకి. వెనుక క్యారేజిపై బెడ్డింగ్ బిగించి కట్టి ఉంది. ఓ పాత గుడ్డ సంచీ కూడా. హ్యాండిల్ బార్‌కి గోనె సంచీలాంటిది వేలాడుతోంది. ఆయన తన ఆహారాన్ని దానిలో ఉంచుకుంటున్నారు - నలిగిపోకుండా. హ్యాండిల్‌కి ఒకవైపు భారత జాతీయ జెండా, మరో వైపు వెనుక వచ్చే వాహనాలను గమనించే అద్దం ఉన్నాయి. అంతే కాకుండా ఓ పెద్ద ఇనుప రేకు మీద ఆయన చేస్తున్న ఈ యాత్ర వివరాలు రాసున్నాయి.

ఆయన మౌనంగా వచ్చి నా పక్కన కల్వర్ట్‌పై కూర్చున్నారు. అప్పుడప్పుడు వచ్చిపోతున్న ఒకటీ అరా లారీల సవ్వడి మా మధ్య నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తోంది.

చాలా సేపటి వరకు మా మధ్య మాటలు లేవు. బహుశా వాటి అవసరం కూడా లేదేమో. ఆయన దృష్టి దిగంతాల వైపు ఉంది, చూపులలో కరుణ పొంగి పొరలుతోంది. అయిదు నిముషాల పాటు నిశ్చలంగా కూర్చున్నాడాయన.

కాసేపటికి ఆయన కదిలి, జేబులోంచి బీడీ కట్ట బయటకు తీసాడు. అది చూడగానే నాక్కూడా కాస్త ధైర్యమొచ్చింది. జేబులోని సిగరెట్ పాకెట్‌లోంచి ఓ సిగరెట్, లైటర్ బయటకి తీసాను. ఇద్దరివీ వెలిగించాను. అప్పుడు మాట్లాడాయన. నా వివరాలడిగాడు. నేను ఆయనని


సైకిలుపై భారతీయ జెండాతో సూఫీబాబా

అడిగాను. ముంబై దగ్గరి వాసి నుంచి ఆయన సైకిల్ మీద వస్తున్నాడట. ప్రస్తుత గమ్యం అజ్మీర్, అక్కడి నుంచి మక్కాకి వెడతాడట.

"మక్కానా? అది సౌదీ అరేబియాలో ఉంది...." అన్నాన్నేను ఆశ్చర్యంగా, ఆయనకి తెలియదేమోనన్నట్లుగా. ఆ క్షణంలో నాకు మా అక్క గుర్తొచ్చింది. నా ప్రయాణం గురించి చెబుతూ, లడాఖ్ ఎంత దూరంలో ఉందో చెబుతున్నప్పుడు *దహానులో* మా అక్క ముఖంలో ఏయే భావాలయితే కదలాడాయో, అవే భావాలు ఇప్పుడు నాలో కలిగాయి. ఈ తెల్ల గడ్డం ఫకీర్ ప్రయాణం గురించి వింటే అక్క ఇంకేమంటుందో?

"బాబా, ఏదైనా చెప్పండి" అన్నాను. ఎవరైనా కొద్దిపాటి ఆధ్యాత్మిక శక్తులున్న వారు ఎదురైతే, మా అమ్మ వాళ్ళని ఇలాగే వేడుకోడం నాకు గుర్తుంది. ఆయన ముఖం దట్టమైన నల్లని రంగులో ఉంది, జుట్టు తెల్లగా ప్రకాశిస్తోంది. మెరుస్తున్న కళ్ళు నాకేసి కాంతిని వెదజల్లుతున్నట్లుగా ఉన్నాయి. ఆయనేమీ మాట్లాడలేదు.

"మక్కా చేరడానికి మీకెన్ని రోజులు పడుతుంది?" అని అడిగాను. నా స్వరంలో ఎన్నో సందేహాలు. వాటిని అణచుకోలేకపోతున్నాను.

ఆయన ఆకాశం కేసి చూసాడు. ఆ తర్వాత నెమ్మదిగా చెప్పాడు – ప్రస్తుతం అక్కడే ఉన్నానని.

***"ఈ కాయాన్ని మాత్రమే అక్కడికి చేర్చాలి***
***ఆత్మ ఎప్పుడూ అక్కడే తిరుగాడుతుంటుంది"***

ఆయన తన ఆత్మ ఉన్న చోటుకి శరీరాన్ని చేరుస్తున్నాడంతే. ఈ ప్రయాణం ఉద్దేశాన్ని నెరవేర్చుకుని సంతృప్తి చెందడానికే తప్ప, ఆయన నిజంగా మక్కా చేరుతాడో లేదా అన్నది ముఖ్యం కాదు. ఆయన శరీరం ఎక్కడైతే చివరి శ్వాస తీసుకుంటుందో అదే ఆయన పాలిట మక్కా. ఆ రోజుకి ఆయన 100 కిలో మీటర్లు ప్రయాణించాలని అనుకున్నాడట. గంటకి 15 కిలోమీటర్ల వేగంతో 'పాలీ' నుంచి వస్తున్నాడట.

"ఎక్కడ ఉంటారు?"

"భగవంతుడిచ్చిన ఈ రాజప్రాసాదం వంటి భూమి మీద పడుకోడానికి రెండు గజాల స్థలం ఎక్కడైనా దొరుకుతుంది"

నేనిచ్చిన డబ్బులు తీసుకోడానికి ఆయన మొదట నిరాకరించాడు. హిందీ సినిమాలలోని డైలాగుల లాంటి డైలాగులు కొన్ని వదిలాక....."బాబా, ఇదంతా నాది కాదు, వస్తూ పోతుంటుంది. మాయ లాంటిదే.... కాదనకండి" అని అన్నాక, నేను ఇచ్చిన సొమ్ములోంచి చాలా తక్కువ తీసుకున్నాడాయన. మిగిలిన డబ్బు నాకు తిరిగి ఇచ్చేస్తుంటే, ఎందుకని అడిగాను. "ఓ కథ చెబుతాను, వినడానికి సమయం ఉందా?" అని అడిగాడాయన. తలూపాను.

బీడీ దమ్ము లాగుతూ, ఆయన చెప్పడం మొదలుపెట్టారు.

"ఇది ఓ యువ సాధువు కథ. బాహ్య ప్రపంచానికి దూరంగా, ఎక్కడో ఏకాంతంగా ఉన్న ఓ ఆశ్రమంలో ఉంటాడీ యువ సాధువు. అక్కడున్న మిగతా వారందరూ కూడా పురుషులే."

నేను కొద్దిగా కదిలి బాసిం మఠం వేసుకుని కూర్చున్నాను – ముసలి తాత చెప్పే కథలు వినడానికి ఆసక్తిగా కూర్చున్న మనవడిలా. ఆయన నవ్వి కథ కొనసాగించాడు.

ఈ యువ సాధువుకి ఆ రోజుతో 18 ఏళ్ళు నిండాయి. తమ పరమపూజ్య గురువులు అందించిన జ్ఞానాన్ని సామాన్య ప్రజలకు పంచమని అతని గురువు ఆదేశించాడు. తన పొట్ట నింపుకోడానికి సాంప్రదాయక విధానమైన భిక్షాటననే పాటించాలని గురువు ఆజ్ఞాపించాడు.

కొండ మీది ఆశ్రమం నుంచి కిందకి దిగుతాడా యువ సాధువు. ఇప్పటి వరకు తన మఠం దాటి బయటకు రాని అతనికి ఈ ఊరంతా విచిత్రంగా కనబడుతుంది. అక్కడి దృశ్యాలు, ధ్వనులు అతనిని అబ్బురపరుస్తాయి. వింత ప్రాణులు, మగ వాళ్ళతో కలసి తిరగడం అతనికీ మరీ



మోటార్ సైకిల్ యాత్ర

ఆశ్చర్యాన్ని కలిగించింది. మగ పిల్లలని అతను ఇంతకు ముందు చూసాడు. కానీ ఈ వింత ప్రాణుల తీరుతెన్నులు, దుస్తులు, నడక, మాట తీరు అన్నీ అతనికి గుహ్యంగా ఉన్నాయి.

కాసేపటికి అతనికి ఆకలి వేయసాగింది. గురువు ఆదేశించినట్లే చేతిలో భిక్షాపాత్ర పట్టుకుని ఓ గుమ్మం ముందు నిలబడతాడు. ఆ ఇంటి యజమాని ఈ యువ సాధువుని ఆహ్వానించి, నీటితో అతని కాళ్ళు కడిగి గౌరవిస్తాడు. వయసులో ఉన్న తన కూతురుని పిలిచి, భిక్షాపాత్రలో ధాన్యం గింజలు పోయమంటాడు. ఆమె పాత్ర నిండుగా ధాన్యం పోస్తుంది. ఆ రోజుకే కాక, వారం రోజులకి సరిపోతాయవి. ఆ పైన చేతులు జోడించి, నమస్కారం చేసిందావె. యువ సాధువు తన సందేహాలను తీర్చుకోకుండా ఉండలేకపోయాడు. ఈ ప్రాణి ఎవరని ఇంటి యజమానిని అడుగుతాడు. జవాబు లభిస్తుంది. యువ సాధువు ఆమె గుండెలకేసి చూపించి, వాటి గురించి అడుగుతాడు. కొండ మీద ఏకాంతంగా ఉండే మఠంలో అందరూ పురుషులేనని, 18 సంవత్సరాలు నిండే దాకా వారసలు బయటి ప్రపంచాన్నే చూడరని ఆ ఇంటి యజమానికి తెలుసు. అందుకే అతని అమాయకమైన ప్రశ్నలకి కోపం తెచ్చుకోకుండా ఓపికగా సమాధానాలు చెబుతాడు. పాలిండ్ల ప్రయోజనాన్ని వివరిస్తాడు. కొన్ని సంవత్సరాల తర్వాత, తన కూతురికి పెళ్ళయి, పిల్లలు పుడితే వారికి పాలు సమకూర్చేందుకే భగవంతుడు వాటినిచ్చాడని చెబుతాడు.

ఆ యువకుడు ఏదో ఆలోచనలో ఉండిపోయి కొన్ని క్షణాల పాటు అలాగే నిలుచుండిపోతాడు. తర్వాత తను అధికంగా తీసుకున్న ధాన్యానంతటిని తిరిగిచ్చేస్తాడు. ఒక రోజుకి సరిపడా ఆహారాన్ని మాత్రమే తీసుకుంటానని చెబుతాడు. ఎక్కువ భాగం ధాన్యాన్ని ఎందుకు తిరిగిచ్చేస్తున్నావని ఇంటి యజమాని అడిగితే, "మా గురువు గారు ఒక రోజుకు సరిపడా ఆహారాన్ని మాత్రమే స్వీకరించాలని చెప్పారు. నేను ఆయన ఆజ్ఞని ఉల్లంఘించాను. నేను చేసిన తప్పేంటో నాకిప్పుడు అర్థమైంది. రేపటి గురించి బెంగ పడడం ఎంత నిష్ఫలమో గ్రహించాను. ఎన్నో రోజుల తర్వాత పుట్టబోయే బిడ్డ ఆహారానికి ఇప్పటినుంచే ఏర్పాట్లు జరిగి ఉంటే, రేపు ఏం తినాలని ఆలోచించడం మూర్ఖత్వమే అవుతుంది" అని అంటాడు.

కథ చెప్పడం, ఆయన రెండో బీడీ తాగడం పూర్తయ్యింది. ప్రయాణం కొనసాగించడానికి సిద్ధమయ్యా డాయన. దానికన్నా ముందుగా, ఈ గౌరవనీయుడు రెండు చేతులను ఆకాశం వైపు చాచి నా భద్రత కోసం ప్రార్థించాడు.

తన లుంగీని బిగించి కట్టి, ముందుకడ్డీ పై నుంచి కాళ్ళెత్తి సైకిలెక్కాడు. దృష్టిని ముందుకు నిలిపి, సైకిల్ తొక్కడం ప్రారంభించాడు. ఆ మధ్యాహ్నపు మండుటెండలో ఆయన కనుమరుగయ్యే వరకు చూస్తూనే ఉన్నాను.

నిజమైన సూఫీ చక్రవర్తి.... మారువేషంలో తిరుగుతున్నాడు.

వాహ్, ఎంత అద్భుతమైన దేశం మనది!


సోమ శంకర్

ఆంగ్లమూలం : అజిత్ హరిసింఘాని
అనువాదం : కొల్లూరి సోమ శంకర్



# యోగవిద్యా రహస్య వేది
# రాళ్లపల్లి

**"రాళ్లపల్లిలోన రాళ్లెన్ని పుట్టెనో**
**రాళ్లలోన వజ్జరాలు పుట్టె**
**వజ్జరాలలోన వలపెట్లు పుట్టెరా**
**కీర్తనీయ చరిత కృష్ణశర్మ"**

అని డా॥ చిలుకూరి నారాయణరావుగారిచేత కీర్తింపబడి,

**"రాళ్లలో ఒక నవ్య రాగముదయిస్తే**
**పల్లితో ఒక భవ్య భావముదయిస్తే**
**రాగభావములు రసయోగాకృతి వహిస్తే**
**ఆ మూర్తి రాళ్లపల్లి అనంత కృష్ణునిది**
**ఆ స్ఫూర్తి అక్షర శిఖరాగ్ర రోచిష్ణునిది"**

అని సి. నారాయణరెడ్డి గారిచేత ప్రస్తుతింపబడిన రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ గారు అనంతపురము జిల్లా రాళ్లపల్లిలో 1893 జనవరి 23న జన్మించి 1979 మార్చి 11 న తనువు చాలించారు.

రాళ్లపల్లివారు సంగీత సాహిత్యాలలోనే కాదు యోగవిద్యలోనూ దిట్ట.

రాళ్లపల్లి వారు తన 'వేమన' ఉపన్యాసాల సంకలనములోని *వేమన యోగసిద్ధి - మత ప్రచారము* అను వ్యాసంలోని యోగ విద్యను గూర్చి తెలుపడమే ఈ వ్యాస ఉద్దేశము.

గొప్ప విమర్శకుడైన రాళ్లపల్లి వారు ఎంతో క్లిష్టతమమైన యోగ విద్యను సరళంగా వివరించారు. అభ్యాసకులకు సులభంగా నడచి వెళ్లుటకు దారిని సుగమము చేశారు.

జీవితం ఈనాడు ఎంతో వేగవంతమైనది. అనేక ఒత్తిడులకు ఆవాలమైంది. ప్రశాంతంగా గడిపే కాలం కనమరుగై పోయింది. నేడు బీపీ, షుగర్ వంటి అనేక రోగాల పుట్ట మనిషి.

ఆరోగ్యంగా, ఆనందంగా నూరేండ్లు జీవించడానికి మన ప్రాచీనులు చూపిన దారుల నుండి మనం దూరమయ్యాం. అలాంటి దారుల్ని తిరిగి చేరవలసిన అవసరం మనముందున్నది. మనల్ని శ్రేయోదాయకమైన ఆ దారుల్లో నడిపించే విద్య యోగ విద్య.

రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ గారు *వేమన యోగ సిద్ధి మత ప్రచారము* ను గురించి వివరిస్తూ, యోగ విద్యలోని సోపానాల్నీ, మెలకువల్నీ పతంజలి యోగశాస్త్రానుసారంగా సరళంగా, అభ్యాసకుల అవగాహనకు వీలుగా వివరించారు.

అది సగుణముగానీ, నిర్గుణముగానీ, మరి అది శూన్యంగానీ దాని స్వరూపము అనుభవపూర్వకంగా తెలిసినప్పుడే అది తెలిసినట్లు అవుతుంది. కానీ అట్టి అనుభవాన్ని తెలుసుకొనుట ఎట్లు? అని రాళ్లపల్లివారు తన్ను తాను ప్రశ్నించుకుని, అభ్యాసకుల్లో తెలుసుకోవాలనే జిజ్ఞాసను రేకెత్తిస్తారు.

కన్ను ముక్కు మొదలగునవి బహిరింద్రియములు. ఇవి మితమైన శక్తిగలవి. వీటితో సాధ్యంకాదు. మరి అమితమైన ప్రభావంగల అంతరింద్రియమగు మనస్సు చేతనే సాధ్యం కావలయును. కానీ ఈ మనస్సు అతి చంచలమైనది. నిమిష కాలమైనను ఒక విషయంపట్ల ధ్యానం కలిగియుండే దారుఢ్యం లేనిది. దానికితోడు శరీరమందును, సంసారమందును గలుగు వివిధావస్థలు మనసును ఒకచోట నిలువనీయవు. కావున మనస్సు ఈ దేహమునకును, బహిస్సంసారమునకును లోబడక తనంతట అఖండముగా నిలిచి కార్యమును నిర్వహించు మార్గమొకటి వెదకవలసి వచ్చెను. అదే యోగము అంటారు రాళ్లపల్లివారు.

ఇక్కడ *కఠోపనిషత్తు* మాటను గమనించండి-

**"యదా పంచావతిష్ఠన్తే**
**జ్ఞానాని మనసా సహ**
**బుద్ధిశ్చన విచేష్టతి తామాహుః పరమాంగతిమ్**
**తాం యోగమితి మన్యన్తే**
**స్థిరా మిన్ద్రియ ధారణమ్"**

- ఎప్పుడు పంచేంద్రియములు మనసుతో చేరి నిలుచునో, బుద్ధి యల్లాడదో అదియే పరమ గతి, అట్టి ఇంద్రియ ధారణమే యోగమందురు.

బ్రహ్మ ధ్యానము అవసరం. దానికి మనోనిగ్రహము, దేహ దండనము చేయక తప్పదు అంటారు రాళ్లపల్లివారు. మన యోగ శాస్త్రకారులు పరబ్రహ్మ అనుభవమును సాధించుటకు ఎన్ని పద్ధతులు కావలయునో వాటినన్నింటినీ అనుభవపూర్వకంగా చెప్పారు. అవి:

**యమము :** ఒకరిని హింసింపక, అసత్యమాడక, ఒకరి సొమ్ము దొంగిలింపక, ఇంద్రియ లోలుడు కాక, తనకెంత ముఖ్యముగా కావలయునో అంతకన్న ఎక్కువ దానమిచ్చిననుగ్రహింపకుండుట యమమందురు.

సరళము, సుబోధకము అయిన వివరణ

**నియమము :** యనుములోని లక్షణాల్ని అనుభవంలోకి తెచ్చుకున్న తర్వాత, శారీరకంగా, మానసికంగా పరిశుద్ధంగా ఉండటం, సంతోషము, తపస్సు, వేదశాస్త్రములు చదువుట భగవద్భక్తి – వీటిని సాధించడం నియమమగును.

మనోనిగ్రహం కోసం, చేపట్టే కఠోర దీక్షకు చేపట్టే సాధన క్రియ తపస్సు. వేదశాస్త్రాల్ని చదవటం అంటే ఇంద్రియాల్ని రెచ్చగొట్టే అంశాలపట్ల ఆసక్తి కలిగించని పఠనమని గ్రహించవచ్చును.

యమ నియమముల వలన దేహము మనస్సు కొంతవరకు పరిశుద్ధమగును. ఆ తరువాత శరీరమునందు ఇంతకు మునుపున్న రోగములు నశించుటకును, క్రొత్తవి రాకుండుటకును, శ్రమము, సహించు శక్తి కలుగుటకు కొంత వ్యాయామము అవసరము. యోగుల ఉద్దేశము ప్రకారము శరీరమందు జిడ్డు పెరుగనీక తేలికపడుటకు ఏదో ఒక కష్టమైన తీరులో చాలా ప్రొద్దు నిలుచుకొని యుండుట, కూర్చుండుట, పరుండుట చేయవలయును. వీటిని వాసనములు అందురు అని చెప్తారు రాళ్లపల్లివారు. వీటినే ఆసనములు అని వ్యవహరించడం కద్దు.

దేహమునకు చలనమునిచ్చి దాని వలన మనస్సును చలింపచేయునది వాయువు. దీనిని స్థిరముగా నిలుపనిచో మనస్సు నిశ్చలముగా ఉండనేరదు.

**"చలే వాతే చలం చిత్తం**
**నిశ్చలే నిశ్చలం భవేత్"**

– గాలి కదలిన మనసు కదులును, గాలి నిలిచిన మనసు నిలుచును – అని హఠయోగ దీపిక ఉపదేశము.

కావున లోని ఊపిరి బైటికి పోనీయక, బైట ఊపిరి లోనికి రానీయక లోపలనే పట్టి నిలుపుట ఆవశ్యకము. దీనినే ప్రాణాయామము అందురు. దీనిచే మనస్సును చుట్టుకొనియున్న మాలిన్యములన్నియు నశించి పోతాయంటారు.

తరువాత కన్ను ముక్కు మొదలగు పంచేంద్రియములు తమకు విషయములైన రూపము వాసన మొదలగువానియెడ పోనీయక మనస్సును కట్టడి చేయవలయును. ఇలా చేయు క్రియను ప్రత్యాహారము అందురు.

ఈ విధంగా శరీరము స్వాధీనమై, మనసు తన చంచల స్వభావాన్ని తగ్గించుకున్నప్పుడు, ఇష్టమైన ఏదైనా ఒక రూపమునందుననో, వస్తువునందుననో మనసును నిలుపవలయును. దీనిని ధారణ అందురు. ఆ రూపము, లేదా వస్తువు తప్ప తక్కిన వృత్తులందు మనసును పోనీయక నిలుపుట ధ్యానము. ఈ రెంటియందును 'నేను దీనిని ధ్యానించుచున్నాను' అను ధ్యాత, ధ్యేయము, ధ్యానము అను మూడు పదార్థములుకలవు. ఈ ధ్యానమును ఇట్లే సాగనిచ్చినయెడల ధ్యానము చేయు రూపము లేదా వస్తువు మాత్రము నిలిచి, నేను అను కర్త, ధ్యానముఅను క్రియ ఈ రెండును అంతరించును. దీనినే సమాధి అందురు. ఇదే అష్టాంగ యోగము.

ఈ యోగ క్రియలో అతి ప్రధానమైనది సమాధి. ఈ స్థితిని రాళ్లపల్లి వారు ఇంకా స్పష్టంగా వివరిస్తారు.

ఈ సమాధి సంప్రజ్ఞాతమని, అసంప్రజ్ఞాతమని రెండు విధములు.

మొదటిదానిలో కూర్చున్న సాధకునికి మొదట ధ్యేయ వస్తువు యొక్క స్థూలరూపము గోచరించి, క్రమముగా దాని సూక్ష్మరూపము గూడా స్పష్టమగును. ఆ మూల ప్రకృతి గోచరించినపుడు 'రుతంబర' అనునొక విధమైన ప్రజ్ఞ కలుగును. దానిచే యథార్థ జ్ఞానము కలిగి సందేహము లన్నియు నివృత్తియగును. శ్రుతి ప్రమాణము చేతను, అనుమాన ప్రమాణము చేతను కలుగు తెలివికన్న ఈ 'రుతాంబర' అను తెలివి గొప్పది. ప్రత్యక్షము, పరోక్షము, భూతము, వర్తమానము, భవిష్యత్తు అను భేదము లేక అన్ని విషయములును ఇందు సాక్షాత్తుగా గోచరించును. ఈ సంప్రజ్ఞాత సమాధిగూడ అభ్యాస బలముచే క్రమముగా నశించి అసంప్రజ్ఞాతి సమాధిగా మారును. ఈ అవస్థలో ఆ మిగిలిన ధ్యేయ వస్తువు స్పృహగూడా నశించి కేవల నిర్మల జ్ఞానముగా మాత్రము మిగిలియుండును. ఇదే కైవల్యావస్థ.

శారీరక మానసిక, సాంసారిక దుఃఖములు, వేదనలు తొలగి ఆనందదాయకమైన వాతావరణములో ప్రశాంతమైన జీవన స్థితియగు కైవల్యము సాధకునికి అనుభూతమగును.

ఈ కైవల్యమును శీలత మార్గమున సాధించుటకు చాల దినములు పట్టును. చాలామంది మన ఆయువు చాలదనియూ చెప్పియున్నారు. కావున సాధ్యమైనంత త్వరలో దానిని సాధించి ముక్తిని పొందాలనుకునేవారు శరీరాన్ని మనసును ఎక్కువగా బలవంతపెట్టి లొంగదీయుదురు. ఈ మార్గమునకే హఠయోగము అందురు. 'హ' కారమును ఊర్ధ్వగతియగు ప్రాణవాయువును – 'ఠ' కారమునకు అధోగతిగల అపానవాయువు అని అర్థము. ఈ రెంటికిని ఐక్యము సంపాదించి సాధించుటయే హఠయోగము.

ఈ క్రియలో సాధకుడికి దేహ మనస్సులను దండించు ఆసన ప్రాణాయామములు ముఖ్యములు. ఇదిగాక రోగాల్ని నశింపచేయుటకును, శ్వాసకోశములు, కడుపు, ముక్కు రంధ్రాలు మొదలగువానియందు కఫము మొదలయిన దోషములను పోగొట్టుటకును ధౌతి, నౌళి మొదలగు కర్మములును, బ్రహ్మచర్యమును సాధించుటకు వజ్రోళి మొదలగు యోగములను సాధింపవలసియున్నది.

ఈ మార్గంలో సాధకుడు నిరంతరము శ్రమిస్తూ ప్రయాణించిన మూలాధారమందు నిద్రావస్థలో ఉన్న 'కుండలిని'యను శక్తి పైకి లేచును. అప్పుడు కుడి ఎడమ ముక్కులందలి 'ఇడ', 'పింగళ' అను నాడులలో సహజముగా సంచరించు వాయువు ఈ రెంటి నడుమనున్న 'సుషమ్న' అను నాడి మూలంగా ప్రవహించును. శరీరమందు మూలాధార, స్వాధిష్టాన, మణిపూర, అనీహత, విశుద్ధి, ఆజ్ఞా అను షట్చక్రములుగలవు. కుండలి నీ శక్తి చలించి సాధన బలముచే పై చక్రములనన్నింటినీ క్రమక్రమంగా ఛేదించి కట్టకడపటిదగు సహసార చక్రమును చేరును. అప్పుడు అక్కడ బ్రహ్మసాక్షాత్కారమై అసంప్రజ్ఞత సమాధి కలుగును.

ఈ కుండలిని మేల్కొల్పనిది బ్రహ్మస్థానమును పొంద వీలు లేదు.

**"యేన మార్గేణ గంతవ్యం**
**బ్రహ్మస్థానం నిరామయం**
**ముఖేనాచ్ఛాద్యతద్వారం**
**ప్రసుప్తా పరమేశ్వరీ"**

– బ్రహ్మస్థానమును ఏ మార్గముతో చేరవలయునో ఆ మార్గపు ద్వారమును ముఖముతో అడ్డగించి మూసి ఆ పరమేశ్వరీ శక్తి, అంటే కుండలిని పరుండి ఉండును – అని చెప్తుంది హఠయోగము.

కావున కుండలినిని మేల్కొల్పుట ముఖ్యము. ఇట్లు హఠయోగము సాధనము, అసంప్రజ్ఞాత సమాధి సాధ్యము. దానినే రాజయోగము అందురు.

కానీ హఠయోగ పద్ధతియందు రాజయోగ సిద్ధికి ఆటంకము కలిగించు సన్నివేశములు అనేకములు గలవు – అంటారు రాళ్లపల్లివారు.

హఠయోగము కొన్ని సిద్ధులనిచ్చును. దానిని అభ్యసించువారికి చావుండదంటారు. అంతేగాక ఆకాశ సంచారము, కామరూపము, పరకాయ ప్రవేశము మొదలగు విచిత్ర సిద్ధులు లభిస్తాయి అంటారు. కావున సాధకులు ముఖ్యఫలమగు సమాధిని విడిచి నీటితోనే తృప్తిపడుట స్వాభావికము. అందువలన హఠయోగమును బాధించువారు దీనికి ఫలముల రాజయోగవే అని తలచి సాధింపవలయునని హెచ్చరిక చేస్తుంటారు.

ఈ హఠవిద్యకు సంబంధించినవే మంత్ర యోగము, లయ యోగము అను రెండు 'ఉప'యోగములు గలవు. మంత్రములు జపించుచు తన్మయుదగులు మొదటిది. ప్రాణాయామ ధ్యానములచే దేహము శుద్ధమైనప్పుడు లోపల ఒక విధమైన నాదము అఖండముగా వినబడుతుంది అంటారు. బైట మనము విను శబ్దము ఆహతము. అనగా దెబ్బగొట్టుటచే కలిగినది. కానీ ఈ నాదము అనాహతము. అనగా రెండు పదార్థముల యొరిపిడి లేకనే కలుగు శబ్దము. ఈ నాదమునే వినుచు అందు మనఃప్రాణములను లయింపచేయడమే లయ యోగము అందురు.

ఇవి అంచలంచలుగా అందుకోవలసిన యోగవిద్య లోని అంతస్తులు, రహస్యాలు.

శారీరక, మానసిక ఆరోగ్యముతో పరిపూర్ణ జీవితానందాన్ని అందిపుచ్చుకొనుటకు సాధనకు అనుకూలంగా, సరళంగా యోగవిద్యను విశదీకరించిన రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ గారు సదాస్మరణీయులు.

---

**నందవరం కేశవరెడ్డి**
**అనంతపురం జిల్లా**

# నెత్తుటి జల్లు రంగవల్లి




ఉద్యమాలకు పురిటి గడ్డ అయిన ఉస్మానియా విశ్వవిద్యాలయంలోంచి ఎగసి పడ్డ విప్లవ కెరటం రంగవల్లి. సంపన్న కుటుంబంలో పుట్టిన గారాల పట్టి. అగ్రవర్ణాల వారసురాలు. తండ్రి రాజకీయ దురంధరుడు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక నాయకుడు. శాసన సభలో ప్రాతినిధ్యం వహించిన ప్రజా ప్రతినిధి. రంగవల్లి తోబుట్టువులందరూ విదేశాలలో స్థిరపడ్డ విద్యాధికులు. రంగవల్లి మాత్రం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడి.ఎస్.యు)లో క్రియాశీలకమైన, సృజనాత్మకమైన నాయకురాలుగా ఎదిగి, ఎన్నో మహత్తర విద్యార్థి ఉద్యమాలకు నేతృత్వం వహించి సిపిఐ (ఎమ్.ఎల్) 'జనశక్తి' సిద్ధాంతాల పట్ల ఆకర్షితురాలై ఎమ్.ఏ. చదువును మధ్యలో ఒదిలేసి తుపాకీ ఎక్కుపెట్టడానికి అడవుల్లోకి... అజ్ఞాతంలోకి నడచి వెళ్ళిపోయింది. నాటి నుండి ఉద్యమమే ఊపిరిగా పీడిత జన ఉద్ధరణే లక్ష్యంగా, పెత్తందారీ వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా అనేక పోరాటాలకు సారథ్యం వహిస్తూ 1992 నుండి 1995 వరకు గుంటూరు జిల్లా జనశక్తి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించింది. తీవ్ర నిర్భంధానికి గురయి, పోలీస్ ఎదురుకాల్పుల్లో 39 ఏళ్ళ పిన్న వయస్సులోనే అశువులు బాసింది.

11.11.1999 నాడు మరణించిన తన కూతురు పేరిటి *రంగవల్లి మెమోరియల్ ట్రస్ట్* ప్రారంభించిన ఎస్.వి.ఎల్. నరసింహారావు, రంగవల్లి ఆచరణ, జీవితానికి సంబంధించిన సహచరుల, మిత్రుల, అభిమానుల వ్యాసాలను సేకరించి ట్రస్టు తరఫున *కామ్రేడ్ రంగవల్లి జ్ఞాపకం* మకుటంతో ఓ సంపుటాన్ని వెలువరించారు. ఇందులోని వ్యాస కర్తలందరూ రంగవల్లితో తమకు గల అనుబంధాల్నీ, జ్ఞాపకాల్నీ పంచుకున్నారు.

రాజ్యహింసకు బలయిన రంగవల్లి స్మృతిలో తడిసిన *కామ్రేడ్ రంగవల్లి జ్ఞాపకం* సంపుటిలోని వ్యాసాలు ప్రతిహింసను ప్రోత్సహించవు. వ్యాసాల్లో దుఃఖం అంతర్లీనంగా ప్రవహించినా కేవలం దుఃఖ ప్రకటనగా తోచదు. కర్తవ్య నిర్దేశం చేస్తూ ధ్యేయానికి పునరంకిత మవ్వడానికి, స్ఫూర్తినిస్తూ సాగిపోతాయి.

ఉద్యమాన్ని మధ్యలోనే వదిలేసి అడవిలోంచి వెనక్కి వచ్చేసిన భాస్కర్, తన వ్యాసంలో "కొందరు చనిపోయినా జీవిస్తూనే ఉంటారు. మరికొందరు బతికున్నా చనిపోయిన మృత విగతజీవుల్లా ఉంటారు. విప్లవోద్యమంలో పరిపూర్ణ ఆచరణాత్మక జీవితాన్ని గడిపి అమరత్వం పొందిన రంగవల్లక్క మొదటి కోవలోకి వస్తే, నాలాంటి వాళ్ళు రెండో కోవలోకి వస్తారు" – ఆయన ఆత్మ శోధనలోని నిజాయితీ ప్రస్ఫుటంగా గోచరిస్తుంది.

ఇలా వ్యాసకర్తలందరూ రంగవల్లి వ్యక్తిత్వంలోని వివిధ పార్శ్వాలనూ, కర్తవ్య నిర్వహణ పట్ల ఆమె దీక్షనూ, పీడిత వర్గ జనోద్ధరణకు ఆమె చూపిన చొరవనూ, కర్తవ్య నిర్వహణ పట్ల ఆమె దీక్షనూ, పీడిత వర్గ జనోద్ధరణకు ఆమె చూపిన చొరవనూ, ఉద్యమ లక్ష్యసాధన కోసం కన్నబిడ్డను సైతం విడనాడి, తనను నమ్ముకున్న జనంతో మమైకపోయి, అనారోగ్యాన్ని సైతం లెక్కచేయక అడవి పోరాటంలో ప్రాణాలను పణంగా ఒడ్డి అమరజీవిగా నేలకొరిగిన ధైర్య సాహసాలను కన్నులకు కడతారు. ఆమె ఎంచుకున్న లక్ష్యం, మార్గం కొందరికి సమంజసంగా తోచకపోయినా, ఆమె వ్యక్తిత్వంలోని మెరుపులు, ఉన్నతి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయనడంలో సందేహంలేదు. ముప్ఫయికి పైగా వ్యాసాలతో తీర్చి దిద్దిన ఈ సంపుటిలో మరో ఇరవై పాటలు, కవితలు, గేయాలు ఆమె స్మృతిలో రాసినవి పొందు పరిచారు.

శ్రీమిత్ర రచించిన – **"కొండలాలో కోనలాలో కొమ్మల్ల కూసేటి కోయిలాలో / రంగవల్లీ రాగమల్లి కనిపిస్తే చెప్పమ్మ కానలాలో"** అంటూ సాగిపోయే గేయం, గోరటి వెంకన్న రాసిన – **"మావిడాకుల చాటుకున్న ఓ పక్షి / మా అక్క జాడ తెలిసిందా / జువ్వి కొమ్మనెక్కి కూసే ఓ గువ్వా / మా అక్క అలికిడిన్నావా"** అంటూ పల్లవించిన గేయం కళ్ళను చెమరుస్తాయి.

*కామ్రేడ్ రంగవల్లి జ్ఞాపకం* సంపుటిలోని వ్యాసాలు, గేయాలు, ఉద్యమం పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరిలోనూ ఆలోచనలు రేకెత్తిస్తాయి.

- రమణ వెలమకన్నె

# అరసం వారి
# కథాస్రవంతి

1943వ సంవత్సరము, ఫిబ్రవరి మాసంలో తెనాలిలో ఆవిర్భవించిన అభ్యుదయ రచయితల సంఘం (అ.ర.సం.) సకల సాహిత్య ప్రక్రియలను ప్రభావితం చేసి సాహిత్యాన్ని ప్రజాపక్షం చేసింది. ప్రముఖ కథకుల ప్రసిద్ధ కథానికలను సమర్థులయిన సంపాదకుల చేత ఎంపిక చేయించి, విశ్లేషణాత్మక సంపాదకీయంతో ఈ తరానికి అందించే ప్రయత్నం జరిగింది. ఈ బృహత్ ప్రణాళికలో భాగంగా **కథాస్రవంతి** అనే మకుటంతో తెలుగు సాహిత్యంలో తమ రచనలతో తమదైన మూర్తిత్వాన్ని, విలక్షణమైన శైలితో రచనలు చేసిన పదిమంది రచయితలను (కేతువిశ్వనాథ రెడ్డి, అల్లం శేషగిరి రావు, మధురాంతకం రాజారాం, కొలకలూరి ఇనాక్, పెద్దిభొట్ల సుబ్బరామయ్య,































అల్లం రాజయ్య, పి. సత్యవతి, కొడవటిగంటి కుటుంబరావు, ఓల్గా, చాసోలను ఎంపిక చేసి వారి రచనలలో స్ఫూర్తిని కలిగిస్తూ చైతన్యాన్ని రగిలించే రచనలను ఎంపిక చేసి పుస్తక రూపంలో మన ముందుంచారు.

ఈ కథలన్నీ సామాజిక స్వభావం పట్ల, అంతరాలపట్ల, మనుషుల ప్రవర్తన వెనుక దాగున్న, సాంఘిక సూత్రాల పట్ల స్పృహను కలిగిస్తాయి. పాఠకుణ్ణి వినయశీలిని చేసి మరింత ఉన్నతంగా ఎదగడానికి ఈ కథలు ఉపకరిస్తాయి.

అ.ర.సం. వారి సాహిత్య సేవ ప్రశంసనీయం. ఇదే పంథాలో మరిన్ని పుస్తకాలు వారి ప్రచురణ సంస్థనుంచి రావాలని ఆశిద్దాం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారి బ్రాంచి ఆఫీసులన్నిటిలో ఈ పుస్తకాలు లభ్యమవుతాయి. ప్రతి సంపుటి సుమారు 100 పేజీలు కలిగి ఉంది. ఒకొక్క పుస్తకం విలువ రు. 50/- లు. ప్రతి పుస్తకానికి ఆ రచయితల చిత్రాలను ముఖచిత్రంగా ప్రచురించారు. రంగులలో ఈ చిత్రాలను వేసినవారు **పినిశెట్టి.**

# చదవండి...

- ఎన్నార్కె




✦ **కాలంతో కరచాలనం :** అయిదున్నర దశాబ్దాలుగా పత్రికా రచనలో విశేష అనుభవం గడించి, నిబద్ధత గల పాత్రికేయుడుగా పేరుగాంచిన ఎ.బి.కె. ప్రజాబాహుళ్యం యొక్క యోగక్షేమాలకు సద్వినియోగం కావలసిన ప్రకృతి ఉమ్మడి సహజ వనరులు ఎలా ధనస్వామ్య వ్యవస్థ అంచెలంచెలుగా కైవసం చేసుకుంటుందో సోదాహరణంగా విశ్లేషించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ పరిణామాలు, విభజన రాజకీయాలపై 30 వ్యాసాలు, జాతీయాంశాలపై 13, రాజ్యాంగము, చట్టాలు, సి.బి.ఐ లపై 29, అంతర్జాతీయం పై 12, విదేశాంగ నీతిపై 7, తెలుగు భాషపై 6, వాతావరణ సమస్యలు, పర్యావరణంపై 15, ఆర్థికాంశాలపై 13 ఇలా భిన్న విషయాలపై సాధికారతతో, సోదాహరణంగా విశ్లేషించబడ్డ వ్యాస సంపుటి. చారిత్రక, ఆర్థిక, రాజకీయ, శాస్త్ర, నిపుణులకు, విద్యార్థులకు ఇది కరదీపిక కాగలదు.

*పేజీలు : 500, వెల : ₹ 220/-, ప్రతులకు - విశాలాంధ్ర నవోదయ పుస్తక షాపులలో లభ్యం.*




✦ **ప్రసిద్ధ తెలుగు కవులు :** డాక్టర్ రామడుగు వేంకటేశ్వర శర్మ 19 మంది తెలుగు కవులకు సంబంధించిన రసవత్తర ఘట్టాలను కథల రూపంలో పిల్లలను ఆకట్టుకునేలా రచన సాగించారు. ఇది పిల్లలచేత చదివింప చేస్తే చిన్నతనం నుంచే తెలుగు సాహిత్యం పై మంచి అవగాహన పెంపొందించుకొంటారు. క్రౌన్ సైజులో వెలువడింది.

*పేజీలు : 100, వెల : ₹ 100/-, ప్రతులకు - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.*



✦ **అంతర్జ్వాల :** శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాదు వారిచే 2014వ సంవత్సరానికి గాను ఉత్తమ నవలగా ఎంపిక కాబడిన రచనలు. వర్తమాన కాలంలో పరిస్థితులకు ఎదురొడ్డి నిలిచిన ముగ్గురు కథానాయకుల కథ. రచయిత ఆదిరెడ్డి మావుళ్ళు.

*పేజీలు : 140, వెల : ₹ 80/-, ప్రతులకు - ఫోన్ : 9885114658*




✦ **చాట్ల శ్రీరాములు :** నట దర్శక ప్రస్థానం - ఒక పరిశీలన. 80 ఏళ్ళ వయసు పైబడినా తెలుగు నాటక రంగానికి విశిష్టమైన సేవలందిస్తున్న ఒక కళాజీవిపై డాక్టర్ వేమలి త్రినాథరావు విశ్లేషిస్తూ రాసిన పి.హెచ్.డి. సిద్ధాంత వ్యాసం. నాటకాభిమానులకు ఇదొక వెలలేని కానుక. ఈ పుస్తకంలో చాట్ల వారి ఫొటోలు, వారికి వచ్చిన బిరుదులు, సన్మానాలు అన్నిటినీ పేర్కొనటంతో, సంపూర్ణత ఏర్పడింది. చాట్ల చేసిన అనేక ప్రయోగాలను రచయిత కళ్ళకు కట్టినట్లు చెప్పుకొచ్చారు.

*పేజీలు : 340, వెల : ₹ 320/-, ప్రతులకు - విశాలాంధ్ర, నవోదయలలో.*




✦ **నెమరేసిన మెమరీస్ :** కోతి కొమ్మచ్చి 1, 2, 3లకు అనుసంధానం చేస్తూ ముళ్ళపూడి వారి శ్రీమతి, శ్రీదేవి వ్రాసిన జ్ఞాపకాలు, అనుభవాలు. రచన సాఫీగా సాగుతుంది. ఒకనాటి సాంఘిక జీవితానికి ఈ రచన అద్దం పడుతుంది. ముళ్ళపూడి వారి అభిమానులకు ఇదొక చిరుకానుక. వెల 100 రూపాయలు, పేజీలు 150, విశాలాంధ్ర నవోదయలలో ఈ పుస్తకం లభ్యం.



✦ **నరసింహావలోకనం :** యాదగిరి శ్రీరామ నరసింహారావు అనుభవాలు – జ్ఞాపకాలతో కూడిన స్వీయ చరిత్ర. తూర్పు గోదావరి జిల్లాలోని రాజమండ్రి, దాని పరిసర ప్రాంతాలు 20వ శతాబ్ద కాలంలో సాంఘిక రాజకీయ జీవనాలను అలరించిన అనేకమంది వ్యక్తులు వారితో రచయిత పరిచయాలు అనుభూతులను రచయిత వెల్లడించారు. కాలంలో కరిగి పోకుండా చారిత్రక విషయాలను రికార్డు చేసి వర్తమాన సాహిత్యానికి మహోపకారం చేశారు రచయిత. ఇటువంటి రచనలు మరిన్ని రావలసిన అవసరం ఉంది.

*పేజీలు : 370, వెల : ₹ 125/-, ప్రతులకు – ఎమెస్కో పుస్తకాల షాపు*



✦ **పోరాడి గెలిచిన తెలంగాణ :** తెలంగాణ ఉద్యమ కవితలతో పాటు కొన్ని ఇతర కవితలను కలిపి ప్రచురించిన పుస్తకం. ఓడింది నిజాం రాజు. మహ్మదీయ మతం కాదు అంటూ తెలంగాణ జనజీవన స్రవంతిని స్పృశించాడు తన గేయాలతో కవిగా రచయిత వేముల ప్రభాకర్.

*పేజీలు : 100, వెల : ₹ 100/-, ప్రతులకు – విశాలాంధ్ర నవోదయలలో ఈ పుస్తకం లభ్యం.*



✦ **రేణ :** గ్రామీణ సంస్కృతితో, వైవిధ్యంగా కూడిన కథలతో తెలంగాణ జనజీవితాన్ని ఒడిసి పట్టిన కథల సంపుటి. అందమైన అట్టమీద బొమ్మ, చిత్రకారుని పేరు పేర్కొనబడలేదు.

*పేజీలు : 138, వెల : ₹ 100/-, ప్రతులకు – పుస్తకాలు కావలసిన వారు చేయవలసిన సెల్ నెం : 9848015364*



ఈ మధ్యనే గుంటూరు మిత్రమండలి వారు మోదుగుల రవికృష్ణ వ్రాసిన రెండు పుస్తకాలను ప్రచురించారు. ఇవి వస్తురీత్యా, విషయ రీత్యా భాషకు, సంగీతానికి చెందినది. ఈ రెంటి విషయాలలో ఎంతో పరిశోధన చేసి స్వోత్కర్షతో మనల్ని విసిగించకుండా చెప్పవలసిన విషయాన్ని నిర్దిష్టంగా విషయనిర్ధారణ చేస్తూ రచన సాగింది. సాహితీ ప్రియుల లైబ్రరీలలో తప్పక ఉండవలసిన పుస్తకాలివి.



✦ **విఠల కీర్తనల అన్నమయ్యవా? :** మొత్తం 14 వ్యాసాలు. పేజీలు 128 వెల 80 రూపాయలు.

✦ **మనవి మాటలు :** 16 వ్యాసాలు, 150 పేజీలు, వెల 80 రూపాయలు

పై రెండు పుస్తకాలు నవోదయ వారి షాపులలో లభ్యమవుతాయి.



✦ **డాక్టరు వెలగా వారి వెలుగులు :** ఇటీవలనే కీర్తిశేషులయిన శ్రీ వెలగా వెంకటప్పయ్యగారి స్మృతులతో వెలువడిన పుస్తకం. సూక్ష్మంలో మోక్షంగా వారికి సంబంధించిన విషయాలను (చిత్రమాలికతో సహా) కుటుంబ సభ్యులు హృద్యంగా మనముందుంచారు. మూల్యం – అమూల్యం. కృష్ణా పబ్లికేషన్స్, ఐతానగరం, తెనాలి ప్రచురణ కర్తలు. సెల్ నెం : 9290538006.



✦ **ప్రయాణానికే జీవితం :** అజిత్ హరిసింఘాని ఆంగ్లంలో రాసిన ట్రావెలోగ్‌కు తెలుగు అనువాదం చేసినవారు కొల్లూరి సోమ శంకర్. పూనా నుంచి జమ్మూకి సింఘాని చేసిన మోటారు సైకిల్ యాత్రలో ఎదురైన అనుభవాలు. భ్రమణ కాంక్ష వున్న వారు తప్పక చదవవలసిన పుస్తకం. రచయితలో మంచి సెన్సాఫ్ హ్యూమర్ ఉంది. అనువాదకుని తెలుగు నుడికారంతో రచన పదును తీరింది. పేజీలు 170, వెల 120, అన్ని పుస్తక కేంద్రాలలో లభ్యం.

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా **₹300/-** తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా **₹30/-** కలపండి.

**1. పేరు :**..................................................

**2. చిరునామా :**

ఇం.నెం. ..................................................

వీధి ..................................................

పేట ..................................................

ఊరు ..................................................

పిన్ ..................................................

సెల్ ..................................................

**3. సంతకం :**..................................................

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |



★ నాలుగు సంవత్సరాల చందా దారులకు **నా కథ *చార్లీ చాప్లిన్* గ్రంథం బహుమతి.**

**మిసిమి** మాసపత్రిక

మీరు బహుమతిగా పంపండి.

**మీ** ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా.

మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు.

ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపిక చేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం.

మీ ఊరి గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా <u>**మిసిమి** పేర ₹ 300</u> పంపండి. వారి పూర్తి చిరునామా ఈ క్రింద గడులలో ఇవ్వండి.

మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

ఈ క్రింది పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి

1. అంతర్వీక్షణం, 2. దూర తీరాలలో,
3. అగాధం, 4. ఓ ఖైదీ వీరగాథ,
5. నాలో నేను, 6. మిసిమి వ్యాసాలు (డా॥ ఇన్నయ్య),

**చిరునామా :**

..................................................

..................................................

..................................................

..................................................

..................................................


**మిసిమి**
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com



దిల్వారా ఆలయం
గోపుర లోపలి భాగం

MISIMI / **మిసిమి** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2015-17
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.02.2015



మనసు తేలిక